ఈనాడు

కరీంనగర్ 23-3-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 222

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

TG

MADE EASY

India's Best Institute for IES, GATE & PSUs*

✓ Quality Teaching ✓ Well Planned Course Curriculum ✓ Professionally Managed ✓ Complete Guidance for Written & PI

"MADE EASY Top 100 Rankers in GATE 2018"



56 Selections in Top 10 | 98 Selections in Top 20 | 359 Selections in Top 100 | 1st Rankers in 5 Streams CE, ME, CS, IN, PI

Stream	Top 10	Top 100
CE	9	57
ME	10	69
EE	8	61
EC	5	52
CS	7	34
IN	10	58
PI	7	28

Note : Details of all MADE EASY students who have secured under 100 rank in GATE 2018 will be published on our website with their course(s) enrolled.

"MADE EASY Offers High Quality Courses for ESE 2019 & GATE 2019"

1 Year Classroom Course for ESE 2019 & GATE 2019

Classroom course is designed for comprehensive preparation. The main feature of the course is that all subjects are taught from basic to advance level. Due emphasis is given on solving objective and numerical questions in class. Separate batches are conducted for GATE exclusive courses and for ESE + GATE courses. MADE EASY team has developed very effective teaching methodology and advance techniques to face competitive examinations. The total teaching hours needed for comprehensive coverage of GATE exclusive batches is approximately 800 hrs and for GATE + ESE batches, it would be approximately 1100 Hrs.

- Classes are taken by highly experienced professors and ESE/GATE top rankers.
- Class tests are conducted separately based on GATE and ESE pattern which continues throughout the programme.
- Students are provided with updated study material.
- **Streams Offered :** CE, ME/PI, EE, EC/IN

New Batches from 15th March, 2018 and May, 2018

Admission Open

2 Years Classroom Course for ESE 2020 & GATE 2020

2 Years Classroom Course is exclusively designed for 2nd year and 3rd year college going students. Time table is suitable for college going students as well as working professionals. At MADE EASY we teach concepts from basic level hence, this programme offers the convenience of managing comprehensive syllabus without compromising the college curriculum and work schedule. This programme will help in better revision and gives more time for planned preparation of competitive examinations while having flexibility to opt for leaves during semester exams. We provide comprehensive coverage of syllabus supplemented by updated study material/books.

- All other features including total teaching hours is same as of 1 year programme.
- Daily classes of 3 to 4 hours only; on weekends and public holidays it may extend.
- **Streams Offered :** CE, ME/PI, EE, EC/IN

New Batches from 15th March, 2018 and May, 2018

Admission Open

Postal Study Package for ESE & GATE

It is distance learning program designed to meet the needs of the college going students and working professionals who are unable to join our classroom courses. The study material is compact, effective and easy to understand. MADE EASY has made all efforts to provide an error free material introducing smart and shortcut techniques for better understanding. The study material is authored by experienced faculties supported by R&D wing of MADE EASY, considering the syllabus and standards of the competitive examinations

- Content includes Theory books with solved examples with separate Objective Practice Sets and Conventional Practice Sets.
- Previous years' solved papers (15 to 31 years).
- General studies and engineering aptitude booklets (as per ESE 2019 syllabus).
- Get free Online Test Series of ESE / GATE / Both
- **Streams Offered :** CE, ME/PI, EE, EC/IN
- **Courses :** • GATE • GATE + PSUs • ESE • ESE, GATE & PSUs

Enrollment open for ESE 2019 & GATE 2019

Online purchase facility available at **www.madeeasy.in**

Test Series Online / Offline

MADE EASY Online Test Series is designed considering the current trend of actual examinations. The test papers are developed by R&D wing of MADE EASY which includes experienced faculties, professors from reputed colleges/ universities and GATE & ESE toppers. Subject-wise and Full syllabus tests are designed for thorough coverage of the entire syllabus in a systematic way. Online Test Series provides a platform for students to judge their performance being analyzed on all India basis.

- Video solutions by senior faculties.
- Quality Questions (From Basic to advanced Level).
- High level of accuracy, fully explained.
- Available on android, iOS, Desktop/Laptops.
- Detailed analysis report of test performance.
- **Streams Offered :** CE, ME, EE, EC, CS, IN, PI

> ESE 2018 Mains Test Series : Commenced from 18th March, 2018
> ESE Pre 2019 Online Test Series Commencing from 1st April, 2018
> GATE 2019 Online Test Series Commenced from 15th March, 2018

Admission Open

For online enrollments, batch schedule, fee structure and demo tests, visit: www.madeeasy.in

MADE EASY Hyderabad

Koti : 5-1-744, Bank Street, Koti , (Opp. Hotel Sitara Royal); Ph: 040-66774612, 040-24652324

Dilsukhnagar : 16-11-740/6, Gaddiannaram, Dilsukhnagar; Ph: 040-66904612

Delhi | Hyderabad | Noida | Jaipur | Bhopal | Lucknow | Indore | Bhubaneswar | Pune | Patna | Kolkata **www.madeeasy.in**

ఈనాడు

కరీంనగర్ 23-3-2018 శుక్రవారం సిటీ సంపుటి 44 సంచిక 222

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 20+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ!

- మహారాష్ట్ర డీజీపీకి దరఖాస్తు
- ఏడేళ్ల సర్వీసు ఉన్నా.. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేందుకే ఈ నిర్ణయం?
- ఉమ్మడి రాష్ట్రంలో పలు సంచలన కేసుల విచారణ

ఈనాడు, హైదరాబాద్- ముంబయి, న్యూస్‌టుడే: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మాజీ జేడీ, మహారాష్ట్ర అదనపు డైరెక్టర్ ఆఫ్ జనరల్ (ఏడీజీపీ) వి.వి.లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈయన సర్వీసు మరో ఏడేళ్లు ఉన్నప్పటికీ ఈ ముందస్తు నిర్ణయం తీసుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వీఆర్ఎస్‌కు అనుమతి కోరుతూ గురువారం మహారాష్ట్ర డీజీపీకి దరఖాస్తు చేసుకున్నారు. జగన్ అక్రమాస్తుల కేసులు, ఓబులాపురం మైనింగ్ కుంభకోణం, ఎమ్మార్ ప్రాపర్టీస్ వంటి సంచలనాత్మకమైన కేసులు దర్యాప్తు చేసిన ఆయన ప్రస్తుతం సేవా (మిగతా 6లో)

చేతులెత్తేసిన ఆన్‌రాక్



రుణాలు చెల్లించలేమని స్పష్టీకరణ

- దివాలా కుదరదన్న జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్
- ఓటీఎస్ బాట పట్టిన సంస్థ
- రూ. 2,905 కోట్ల నిరర్థక ఆస్తులు ప్రకటన
- బ్యాంకులకు రూ. 1630 కోట్ల నష్టం

ఈనాడు - హైదరాబాద్

పెన్నా గ్రూపు, రస్ అల్ ఖైమాల భాగస్వామ్యంతో విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ఆన్‌రాక్ అల్యూమినియం కంపెనీ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.3,461 కోట్ల రుణాన్ని చెల్లించలేమంటూ చేతులెత్తేసింది. ఏకకాల పరిష్కారం (వన్ టైమ్ సెటిల్‌మెంట్- ఓటీఎస్) బాట పట్టింది. దివాలా ప్రక్రియ చేపట్టాలంటూ ఆన్‌రాక్ కోరగా జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) నిరాకరించింది. రూ.వేల కోట్ల ప్రజాధనం, ప్రత్యక్షంగా 1000 మందికి పైగా ఉద్యోగ అవకాశాలున్న కంపెనీ దివాలా ప్రక్రియ ప్రకటించే పరిస్థితుల్లేవని స్పష్టం చేసింది. దీంతో ఆన్‌రాక్ యాజమాన్యం మరోసారి ఓటీఎస్‌ను తెరపైకి తీసుకువచ్చింది. 2014 మార్చి 31 నాటికే రూ.2905 కోట్ల నిరర్థక ఆస్తిగా ప్రకటించగా అందులో కేవలం రూ.1275 కోట్లు చెల్లిస్తానంటూ ముందుకు వచ్చింది. ప్రభుత్వం ఒప్పందం రద్దు చేసిందన్న కారణాన్ని చూపి ఓటీఎస్ పేరుతో బ్యాంకులకు రూ.1630 కోట్ల రుణాన్ని చెల్లించలేమని ఆన్‌రాక్ చేతులెత్తేస్తోంది. బ్యాంకుల కన్సార్టియానికి నేతృత్వం వహించే ఎస్‌బీఐతోపాటు పలు బ్యాంకులు ఈ ప్రతిపాదనకు అంగీకరించగా కొన్ని బ్యాంకులు తిరస్కరించాయి. మొత్తం మీద రూ.1630 కోట్ల సొమ్మును వదులుకోవడానికి బ్యాంకులు సిద్ధమైనట్లే కనిపిస్తోంది.

రూ. 5వేల కోట్ల ప్రాజెక్టు

విశాఖపట్నం మాకవరపాలెం మండలం రాచపల్లిలో ఏర్పాటైన ఆన్‌రాక్‌లో పి.ప్రతాప్‌రెడ్డికి చెందిన పెన్నా గ్రూపు వాటా 70 శాతం. అరబ్ ఎమిరేట్స్‌లోని రాకియాకు 30 శాతం వాటా ఉంది. ఎస్‌బీఐ నేతృత్వంలోని 23 బ్యాంకుల కన్సార్టియం ఆన్‌రాక్ ప్రాజెక్టు విలువను రూ. 4,608 కోట్లుగా అంచనా వేసింది. 2017 మార్చి 31 నాటికి ప్రాజెక్టు మీద రూ.5712 కోట్లు ఖర్చయింది. 2014 మార్చి 31 నాటికి రూ.2,905 కోట్లను నిరర్థక ఆస్తిగా బ్యాంకులు గుర్తించాయి.

దివాలా ప్రకటనకు తిరస్కారం

ఉత్పత్తి ప్రారంభం కాకపోవడంతో రుణం చెల్లించాలంటూ బ్యాంకులు డిమాండ్ నోటీసులు పంపాయి. దీంతో 2012లో (మిగతా 6లో)

బ్యాంకులకు హైదరాబాద్ సంస్థ రూ. 313 కోట్ల టోపీ

- టోటెం ఇన్‌ఫ్రాపై సీబీఐ కేసు

ఈనాడు, దిల్లీ: బ్యాంకులను మోసగించారన్న అభియోగాలపై- హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, దాని డైరెక్టర్లయిన తొట్టెంపూడి సలలిత్, కవితలపై సీబీఐ గురువారం కేసు నమోదు చేసింది. ఈ కంపెనీ తమను రూ.313.84 కోట్ల మేర మోసగించిందని హైదరాబాద్‌లోని యూనియన్ బ్యాంకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కంపెనీ, దాని ఇద్దరు డైరెక్టర్లు, గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర వ్యక్తులపై సీబీఐ కేసులు పెట్టింది. ఈ సంస్థ మొత్తం ఎనిమిది బ్యాంకులు, ఆర్థిక సంస్థల సమాఖ్యకు రూ.1,394.43 కోట్ల మేర బకాయి పడినట్లు సీబీఐ తెలిపింది. హైదరాబాద్ కేంద్రంగా పని చేసే టోటెం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈపీసీ కాంట్రాక్టు పనులు చేస్తోంది. ముఖ్యంగా (మిగతా 6లో)

క్షమించండి

ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాం

సమాచార భద్రతకు చర్యలు తీసుకుంటున్నాం

ఫేస్‌బుక్ సీఈవో జుకెర్‌బర్గ్ వెల్లడి

ఇదొక భారీ విశ్వాస ఘాతుకం. ఇలా జరిగినందుకు క్షమాపణలు. ఫేస్‌బుక్‌ను నేనే మొదలుపెట్టాను. ఈ వేదికపై ఏం జరిగినా చివరికి బాధ్యత వహించాల్సింది నేనే. ఖాతాదారుల సమాచారానికి భద్రత కల్పించడం మా బాధ్యత. దీనిలో విఫలమైతే.. మీకు సేవలు కల్పించే అర్హత కోల్పోయినట్లే. మేం చేయాల్సింది చాలా ఉందని అంగీకరిస్తున్నా.

-జుకెర్‌బర్గ్



వాషింగ్టన్

"సమాచార దుర్వినియోగం" సుడిగుండంలో చిక్కుకున్న సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకెర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. పొరపాటు జరిగిందని ఆయన అంగీకరించారు. రెండు వందల కోట్ల మంది ఖాతాదారుల వ్యక్తిగత వివరాల భద్రతకు తాము పటిష్ఠ చర్యలు తీసుకుంటామని నొక్కిచెప్పారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ కోసం పనిచేసిన బ్రిటన్ సంస్థ 'కేంబ్రిడ్జ్ అనలిటికా' ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ వివాదంపై జుకెర్‌బర్గ్ తొలిసారిగా మాట్లాడారు. 'ఇదొక భారీ విశ్వాస ఘాతుకం. ఇలా జరిగినందుకు క్షమాపణలు. దీనిపై వివరణ కోసం అమెరికా కాంగ్రెస్ ఎదుట హాజరయ్యేందుకు బాధపడటంలేదు. ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడటం మా బాధ్యత. దీని కోసం ఇప్పటికే చర్యలు మొదలుపెట్టాం'అని ఆయన తెలిపారు.

వేల యాప్‌లను జల్లెడ పడుతున్నాం

ఫేస్‌బుక్ సమాచారాన్ని పొందుతున్న వేల యాప్‌లను క్షుణ్నంగా పరిశీలిస్తున్నామని జుకెర్‌బర్గ్ తెలిపారు. వినియోగదారుల అనుమతిలేకుండా కోట్లాది మంది వ్యక్తిగత (మిగతా 6లో)

సామాజిక మాధ్యమం.. రాజకీయ యుద్ధం

- ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్న రాజకీయ పక్షాలు -14లో

గీత కార్మికులకు వరాలు

- చెట్లపై పన్ను విధానం రద్దు
- ఇకపై టీఎఫ్‌టీ కార్మికులకూ పింఛను ఇస్తాం
- ఈ నిర్ణయంతో 30 వేల మందికి లబ్ధి
- గౌడ భవనానికి 5 ఎకరాలు, రూ. 5 కోట్లు
- శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన

ఈనాడు - హైదరాబాద్

గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తెలంగాణలో చెట్లపై పన్ను వేసే విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. శాసనసభలో గురువారం ఆయన ఒక ప్రకటన చేశారు. ఇంకా పలు నిర్ణయాలను సభలో ప్రకటించారు. ఆయన మాటల్లోనే.. సమైక్య రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు తీవ్ర నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురయ్యారు. వారికి ఎలాంటి అండదండ లభించలేదు. తెలంగాణ ఉద్యమ సమయంలో గౌడ కులస్తులకు జరుగుతున్న అన్యాయాన్ని గురించి పలుమార్లు ప్రస్తావించాం. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత హైదరాబాద్‌లో కల్లు దుకాణాలను తెలిపించాం. చెట్టుపై



నుంచి పడి మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు ఇచ్చే పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచాం. రాష్ట్రం ఏర్పడే నాటికున్న మూడేళ్ల బకాయిలు మొత్తం రూ.6.38 కోట్లను చెల్లించాం. ఈరోజు (మిగతా 6లో)



చైనాపై ట్రంప్ సర్కారు వాణిజ్య ఆంక్షలు

చైనాపై ఆంక్షల ఉత్తర్వులను చూపిస్తున్న ట్రంప్ -10లో

తెరాస రోజురోజుకు బలోపేతం

- మరిన్ని స్థానాల్లో గెలుపు
- తాజా సర్వేలో వెల్లడి
- ఏప్రిల్‌లో పార్టీ కార్యకలాపాలపై పూర్తిస్థాయి దృష్టి
- తెలంగాణభవన్‌లో ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్ -6లో

ఇదీ సంగతి!



నేరగాళ్లు ఉన్న పార్టీలను రద్దు చేస్తే అసలీ దేశంలో రాజకీయ పార్టీలే ఉండవు, ప్రజాస్వామ్యమే బతకజాలదని గట్టిగా వాదించండి!

ఆసరా.. భేష్

- తెలంగాణ, కేరళ పింఛను పథకాలు ప్రశంసనీయం
- గుజరాత్‌లో అమలు ఘోరం
- క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసిన కేంద్ర కమిటీ
- కేంద్ర సహాయ కార్యక్రమంలో మార్పులు అవసరమని సిఫార్సు

తెలంగాణలో 'ఆసరా' పథకం పనితీరు బాగుంది. పింఛను అందరికీ క్రమం తప్పకుండా అందుతోంది. ఇక్కడ ఆసరా పింఛన్లకు 2017-18లో రూ.5,330 కోట్లను ఖర్చుపెట్టగా అందులో కేంద్రం నుంచి వచ్చింది కేవలం రూ.180 కోట్లు మాత్రమే.

-కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిటీ విశ్లేషణ



ఈనాడు-హైదరాబాద్: తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో అమలులో ఉన్న పింఛను పథకాలు.. అన్ని రాష్ట్రాలు అనుసరించదగినవని కామన్ రెవ్యూ మిషన్ (సీఆర్ఎం) చెప్పింది. దేశంలో తెలంగాణతో సహా ఎనిమిది రాష్ట్రాల్లో అమలవుతున్న పింఛను పథకంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన కామన్ రెవ్యూ మిషన్ (సీఆర్ఎం) ఇటీవల క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి కొన్ని సిఫార్సులు చేసింది. జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ)లో (మిగతా 6లో)

ఈ ప్రొటీన్‌తో కాలేయ క్యాన్సర్ కట్టడి



జెనీవా: కాలేయ క్యాన్సర్ వ్యాప్తిని కట్టడిచేసే కొత్త మాంసకృత్తు వెలుగులోకి వచ్చింది. స్విట్జర్లాండ్‌లోని బాసెల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు దీనిని కనుగొన్నారు. కాలేయ క్యాన్సర్‌ను వైద్య పరిభాషలో 'హెపటోసెల్యులార్ కార్సినోమా' అంటారు. ఓ మోస్తరు ముదిరిన తర్వాతగాని దీని లక్షణాలు బయటపడవు. ఆ దశలో వ్యాధికారక కణాలు నిరాటంకంగా విస్తరిస్తుంటాయి. దీంతో ఎన్నిరకాల చికిత్సలు చేసినా వ్యాధి లొంగడం కష్టమవుతుంది. అయితే... డా. మైకేల్ హాల్ నేతృత్వంలోని బృందం నాలుగు వేల రకాల క్యాన్సర్ వ్యతిరేక మాంసకృత్తులను పరిశీలించింది. 'ఎల్‌హెచ్‌పీపీ' అనే ప్రొటీన్ స్థాయులు తక్కువగా ఉండే రోగుల్లో కాలేయ క్యాన్సర్ ఉద్ధృతి ఎక్కువగా ఉంటున్నట్లు గుర్తించింది. ఈ మాంసకృత్తు స్థాయిని పరీక్షించడం ద్వారా వ్యాధి తీవ్రతను అంచనా వేయవచ్చని మైకేల్ తెలిపారు. బాధితుల్లో ఈ ప్రొటీన్ స్థాయిని పెంచడం ద్వారా వ్యాధి వ్యాప్తిని గణనీయంగా అరికట్టి, మంచి ఫలితాలను రాబట్టవచ్చనీ ఆశాభావం వ్యక్తం చేశారాయన.

ఇది మెదడును పరీక్షించే శిరస్త్రాణం!



లండన్: మెదడు పనితీరును పరీక్షించే సరికొత్త శిరస్త్రాణాన్ని బ్రిటన్ శాస్త్రవేత్తలు తయారుచేశారు. హెల్మెట్‌లాగే దీనిని ధరిస్తే చాలు! తినడం, తాగడం, మాట్లాడ్డం, ఆట్లాడ్డం... ఇలా మనపని మనం చేసుకుంటుండగానే మెదడు పనితీరును అది మదింపు చేసేస్తుందట.

మెదడు పనితీరును పరీక్షించేందుకు ప్రస్తుతం మాగ్నెటోయెన్సెఫాలోగ్రఫీ (ఎంఈజీ)లు ఉన్నాయి. కానీ, మూర్ఛ రోగులు, నాడీ సంబంధ పీడితులు, చిన్నారులు, వృద్ధులు ధరించడానికి ఇది సౌలభ్యంగా లేదు. దీంతో వ్యాధి నిర్ధారణ కష్టమవుతోంది. ఈ సమస్యపై దృష్టి సారించిన నటింగ్‌హమ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు- క్వాంటమ్ సెన్సర్లతో తేలికపాటి హెల్మెట్‌ను రూపొందించారు. సాధారణ గది ఉష్ణోగ్రతలో దీనిని తలపై ధరిస్తే సరిపోతుందని, ఇప్పటికే ప్రాథమిక పరీక్షలు విజయవంతంగా పూర్తయ్యాయని శాస్త్రవేత్తలు తెలిపారు. త్వరలోనే రకరకాల పరిమాణాల్లో ఈ స్కానర్ హెల్మెట్లు అందుబాటులోకి తెస్తామని వారు వెల్లడించారు.

మాంసం వేపుళ్లు ఎక్కువైతే అధిక రక్తపోటు!



బోస్టన్: తరచుగా మాంసాహారం తినేవారు.. వేపుళ్లను మరీ ఎక్కువగా తీసుకోకపోవడమే ఉత్తమం. మాంసం, చేపలను వేయించుకుని తినేవారు అధిక రక్తపోటుకు గురయ్యే ముప్పు ఉన్నట్లు తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలోని హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిశోధకులు దీన్ని నిర్వహించారు. మాంసం వండే పద్ధతులు రక్తపోటుపై చూపిస్తున్న ప్రభావాన్ని తెలుసుకునేందుకు.. దాదాపు లక్షకుపైగా వ్యక్తులపై సుదీర్ఘ కాలం అధ్యయనం జరిపారు. అధ్యయనం ఆరంభించిన సమయంలో ఇందులో పాల్గొన్న వ్యక్తులకు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి సమస్యలేవీ లేవు. అయితే 12 నుంచి 16 ఏళ్ల తర్వాత 37వేల మందిలో అధిక రక్తపోటు సమస్య తలెత్తినట్లు పరిశోధకులు గుర్తించారు. మాంసాన్ని అధిక ఉష్ణోగ్రతల వద్ద వేయించే సమయంలో ఉత్పత్తయ్యే హెటిరోసైక్లిక్ అరోమాటిక్ అమైన్లతో ఇన్సులిన్ నిరోధకతతోపాటు ఇతర సమస్యలు కలుగుతున్నాయని పరిశోధకులు తెలిపారు. అధిక రక్తపోటు ముప్పును ఇవి పెంచుతున్నాయని.. హృద్రోగ సమస్యలకు దారితీస్తున్నాయని హెచ్చరించారు.

మానసిక ఒత్తిళ్లతో.. స్మార్ట్‌ఫోన్లతో చెలిమి!



లండన్: భావోద్వేగాలు స్థిరంగా లేనివాళ్లు ఎక్కువగా స్మార్ట్‌ఫోన్‌ల వినియోగాన్ని వ్యసనంలా మార్చుకుంటున్నట్లు తాజాగా ఓ అధ్యయనం వెల్లడించింది. ఈమేరకు యూకేలోని డెర్బీ, నాటింగ్‌హామ్ ట్రెంట్ విశ్వవిద్యాలయాల పరిశోధకులు 13-69 ఏళ్ల వయసున్న 640మంది స్మార్ట్‌ఫోన్ వినియోగదారులపై ఆన్‌లైన్‌లో అధ్యయనం జరిపారు. ఒత్తిడి, ఆతురత, కుంగుబాటు, కుటుంబ సమస్యలు వంటివాటితో ఇబ్బందులు పడుతున్నవారంతా భావోద్వేగాలను స్థిరంగా ఉంచుకోలేక.. వాటి నుంచి ఉపశమనం కోసం స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తున్నట్లు పరిశోధకులు తెలిపారు. అలాగే మనసును నియంత్రించుకోలేని వారిలో కూడా ఎక్కువమంది వీటికి అలవాటు పడుతున్నట్లు వెల్లడించారు. ఇలాంటివారిలో ఆతురత ఎక్కువవుతున్న కొద్దీ స్మార్ట్‌ఫోన్ వినియోగం కూడా పెరుగుతున్నట్లు కనుగొన్నారు. ఈ పరిస్థితి పట్ల పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా భావోద్వేగాలు నియంత్రణలో ఉన్నవారు స్మార్ట్‌ఫోన్ వినియోగంలో ఇబ్బందులు పడుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 420 కోట్ల స్మార్ట్‌ఫోన్లు వినియోగంలో ఉన్నాయి. చాలామందికి ఇవి నిత్యావసర వస్తువుల్లా మారిపోయాయని డెర్బీ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు జహీర్ హుస్సేన్ తెలిపారు.

శంషాబాద్ విమానాశ్రయం సేవలకు పదేళ్లు

నేడు వార్షికోత్సవానికి హాజరుకానున్న సీఎం కేసీఆర్

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: శంషాబాద్ రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమై ఈనెల 23వ తేదీకి పదేళ్లు పూర్తవుతాయి. అంతర్జాతీయ స్థాయి భద్రతా ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకొని అనతి కాలంలోనే అగ్రదేశాల విమానాశ్రయాలకు దీటుగా మెరుగైన సేవలందిస్తూ పలు పురస్కారాలు అందుకొంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్న పదో వార్షికోత్సవానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా, రాష్ట్ర మంత్రులు కేటీఆర్, పి.మహేందర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.ప్రకాష్‌గౌడ్, తీగల కృష్ణారెడ్డి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పాల్గొంటున్నట్లు విమానాశ్రయం అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఆరొందల ఎకరాల్లో..: శంషాబాద్ విమానాశ్రయం ప్రాంగణంలో దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంలో సకల సౌకర్యాలతో నిర్మించనున్న ఎయిర్‌పోర్ట్ సిటీ పనులకు సీఎం కేసీఆర్ భూమి పూజ చేయనున్నారు.

పారిశ్రామికవాడకు 14 ఎకరాల కేటాయింపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారంలో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడకు ప్రభుత్వం 14 ఎకరాలను కేటాయించింది. ఎకరా రూ.60 లక్షలు చొప్పున సర్వే సంఖ్య 10/1లో 14 ఎకరాల విస్తీర్ణం ఉన్న ప్రభుత్వ భూమిని టీఎస్ఐఐసీకి కేటాయిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

భూసేకరణ అథారిటీ ప్రిసైడింగ్ అధికారి పోస్టు మంజూరు

ఈనాడు, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, సహాయ పునరావాస అథారిటీ ప్రిసైడింగ్ అధికారి పోస్టును సృష్టిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల రెవెన్యూ శాఖ భూసేకరణ, సహాయ పునరావాస అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ అథారిటీ ప్రిసైడింగ్ అధికారిగా విశ్రాంత జిల్లా జడ్జి బి.నాగమారుతిశర్మను ప్రభుత్వం నియమించింది.

'భాజపాను ఓడించడానికి అవసరమైతే కాంగ్రెస్‌కు ఓటు'

తిరువనంతపురం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను దూరంగా ఉంచడానికి అవసరమైతే తమ ప్రత్యర్థి కాంగ్రెస్‌కు ఓటేస్తామని కేరళ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్ పేర్కొన్నారు. స్థానిక వామపక్షాల సంప్రదాయ వైఖరిలో మార్పునకు సంకేతంగా ఈ ప్రకటనను భావిస్తున్నారు. భాజపాను గద్దెదించడానికి కాంగ్రెస్‌తో చేతులు కలపాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి చేసిన ప్రతిపాదనను పార్టీ కేరళవిభాగం గతంలో తోసిపుచ్చింది.

నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- మంత్రి కేటీఆర్
- సర్వీస్ నౌ ప్రతినిధి బృందం భేటీ

ఈనాడు - హైదరాబాద్

దేశంలో తెలంగాణ నూతన ఆవిష్కరణలకు కేంద్రస్థానంగా మారిందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. ఐటీ, పరిశ్రమలు, జీవశాస్త్రాలు తదితర రంగాల్లో ఆవిష్కరణలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తామని చెప్పారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి చెందిన క్లౌడ్ కంప్యూటింగ్, ఐటీ సేవల సంస్థ సర్వీస్ నౌ సీఈవో జాన్ దోనాహ్ ఇతర ప్రతినిధులు గురువారం శాసనసభా ప్రాంగణంలో మంత్రితో భేటీ అయ్యారు. తెలంగాణ పరిశ్రమల ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్వీసు నౌ సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిని చూపింది. త్వరలోనే తమ ప్రణాళికను అమలు చేస్తామని జాన్ చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ఐటీ రంగంలో పురోగమిస్తోందని, ఎగుమతులు, వృద్ధి రేటులోనూ ముందడుగు వేస్తోందని అన్నారు. ఐటీ రంగంలో కొత్త ఆవిష్కరణల ద్వారా ఉపాధికి బాటలు వేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అన్ని విధాలా అనుకూలమని చెప్పారు. అమెరికాకు చెందిన పలు సంస్థలు హైదరాబాద్‌లో తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నాయని, హైదరాబాద్ భారత్‌లో అత్యుత్తమ నివాస నగరంగా మెర్సెల్ సంస్థ అధ్యయనంలో వరసగా నాలుగోసారి ఎంపికైందని అన్నారు. సర్వీసు నౌ సంస్థ తెలంగాణలో పెట్టుబడులకు ముందుకు రావడం అభినందనీయమని, రాష్ట్రంలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో పరిశ్రమలు స్థాపించాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జాన్ దోనాహ్‌ను కేటీఆర్ సత్కరించారు.



అమెరికాకు చెందిన సర్వీస్ నౌ సంస్థ సీఈవో జాన్ దోనాహ్‌ను శాసనసభ కమిటీ హాలులో సత్కరిస్తున్న మంత్రి కేటీఆర్

శాసనసభలో సంక్షేమ పద్దులకు ఆమోదం

తెలంగాణ శాసనసభ గురువారం తొమ్మిది సంక్షేమ పద్దులకు ఆమోదం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, స్త్రీ శిశు, యువజన సంక్షేమం, గృహ నిర్మాణం, విద్య, వైద్య ఆరోగ్య శాఖల బిల్లులు ఇందులో ఉన్నాయి. సాయంత్రం ఆరున్నర గంటల వరకు వీటిపై చర్చించిన అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మైనారిటీ సంక్షేమ సంచాలకునిగా ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసీం

తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ సంచాలకునిగా 2003 బ్యాచ్ ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసీంను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం సైబరాబాద్ సంయుక్త కమిషనర్‌గా ఉన్న ఆయనను కొత్త స్థానానికి బదిలీ చేసింది. ఇప్పటికే ఐపీఎస్‌లు సీవీ ఆనంద్ పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ వ్యవహారాలు అస్తవ్యస్తంగా ఉండడంతో వాటిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

భాజపాకు నాగం రాజీనామా

- అవినీతిపై పోరాటానికి పార్టీ సహకరించడం లేదు
- త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడి

నాగర్‌కర్నూలు, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ(భాజపా)కి రాజీనామా చేస్తున్నట్లుగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. గురువారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 2013 జూన్‌లో ఆ పార్టీలో చేరానని చెప్పారు. రాష్ట్రంలో అవినీతికి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటానికి పార్టీ నుంచి ఎలాంటి సహకారం లభించకపోగా భాజపా రాష్ట్ర నాయకత్వం నిరాశపరిచేవిధంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న లూటీని అరికట్టేందుకే భాజపాకు రాజీనామా చేస్తున్నట్లు నాగం చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణను నియోజకవర్గ ముఖ్యులతో చర్చించి త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు. రాజీనామా లేఖను మెయిల్ ద్వారా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షాకు పంపారు. నాగంతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కాశన్న, పార్టీ ప్రధాన కార్యదర్శి రవి, 4 మండలాల పార్టీ అధ్యక్షులు, అనుచరులు భాజపాకి రాజీనామా చేశారు.



రాజీనామా లేఖను చూపుతున్న నాగం

వచ్చినా.. టికెట్ కావాలంటే ఊరుకోం: దామోదర్‌రెడ్డి

నాగం జనార్దన్‌రెడ్డి ఇటీవల తమ అనుచరులకు ఫోన్లు చేసి గందరగోళం సృష్టిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి సేవ చేస్తామంటే ఆహ్వానిస్తాం కానీ.. వచ్చిన వెంటనే టికెటంటే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం నాగర్‌కర్నూల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక్క సమస్యనో, ఎవరో ఒకరు కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమవుతున్నారన్నారు. పార్టీకి మూడేళ్లు సేవ చేసి టికెటు అడగాలని, అప్పటిదాకా ఆయనకు మద్దతు ఇవ్వడానికి ఎవరూ సుముఖంగా లేరన్నారు.

నాగం పార్టీని వీడితే నష్టమేమి లేదు: లక్ష్మణ్

గన్‌ఫౌండ్రి(హైదరాబాద్), న్యూస్‌టుడే: మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి భాజపాని వీడితే వచ్చే నష్టమేమి లేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. పార్టీ ఆయనను గౌరవించి సముచిత ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజీనామా చేశారన్నారు. గురువారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తెరాస ప్రభుత్వ అవినీతిపై పోరాడేందుకు నాగం జనార్దన్‌రెడ్డి ఛైర్మన్‌గా కమిటీ వేసి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ.. ఏ విషయంలోనూ పోరాడలేదని దీనిపై ఆయన వివరణ ఇవ్వాలన్నారు.

వీడియో ఫుటేజి సమర్పణకు 27 వరకు గడువు

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌ల కేసు విషయంలో..

హైదరాబాద్, న్యూస్‌టుడే: శాసనసభలో బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన వీడియో ఫుటేజిని సమర్పించడానికి ఈ నెల 27 వరకు గడువిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శాసనసభ నుంచి బహిష్కరణ, సభ్యత్వం రద్దు నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి.. పిటీషనర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ, అలంపూర్ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ విషయంలో ఆరు వారాలపాటు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించారు. ఈ నెల 12న జరిగిన గవర్నర్ ప్రసంగం వీడియో ఫుటేజీని ఈ నెల 22 నాటికి సీల్డ్ కవర్లో సమర్పించాలని శాసనసభ కార్యదర్శిని ఆదేశించారు. కాగా వీడియో ఫుటేజీ సమర్పించేందుకు మరికొంత గడువు కావాలని తెలంగాణ అదనపు అడ్వొకేట్ జనరల్(ఏఏజీ) జె.రామచందర్‌రావు గురువారం హైకోర్టును కోరారు. ఫుటేజి తీసుకోవాలంటే సభ తీర్మానం అవసరం ఉందని ఇందు కోసం ఇప్పటికే అడ్వొకేట్ జనరల్(ఏజీ) డి.ప్రకాష్‌రెడ్డి.. శాసనసభ కార్యదర్శికి లేఖ రాశారన్నారు. ఈ నేపథ్యంలో మరి కొంత గడువు కావాలని కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శివశంకరరావు ఈ నెల 27 వరకు సమయమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెరాస వైఫల్యాలపై ప్రజాక్షేత్రంలోకి: వీహెచ్

కేసీఆర్ సర్కారు ప్రజావ్యతిరేక, నిరంకుశ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హన్మంతరావు అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో తెరాసను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు పార్టీ సీనియర్ నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సూచించారు. దీనిపై పార్టీ తెలంగాణ బాధ్యుడు రామచంద్ర కుంతియాకు లేఖ రాస్తానని వీహెచ్ తెలిపారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్న కేసీఆర్ తీరుపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలన్నారు.

వడ్డీమాఫీని వెంటనే ప్రకటించాలి: ఎం.కోదండరెడ్డి

రైతులకు రూ.లక్ష రుణమాఫీ అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని టీపీసీసీ కిసాన్ సెల్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి విమర్శించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా రుణమాఫీకి సంబంధించిన వడ్డీ మాఫీని ప్రకటించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ విప్ టి.రాంమోహన్‌రెడ్డితో కలిసి కోదండరెడ్డి గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం

రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గురువారం రాత్రి సమావేశమయ్యారు. ఓటింగ్ సందర్భంగా ఎమ్మెల్యేలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీనియర్ నేతలు వివరించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత జానారెడ్డి, మండలిలో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్ అలీ, రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థి పి.బలరాంనాయక్‌తో బాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సభ్యత్వం రద్దయిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు దిల్లీలో ఉండటంతో ఈ సమావేశంలో పాల్గొనలేకపోయారని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

ప్రతిపక్షాలపై ప్రభుత్వ కుట్ర: భట్టి

ఖమ్మం (కమాన్‌బజార్), న్యూస్‌టుడే: శాసనసభలో ప్రతిపక్ష పార్టీలు లేకుండా అధికార తెరాస కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. ఖమ్మంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాసనసభ చరిత్రలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యులను సస్పెండ్ చేసి బడ్జెట్ సమావేశాలు నిర్వహించడం దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. సస్పెన్షన్‌తో పాటు ఇద్దరు శాసనసభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. బడ్జెట్‌ను మెజార్టీ సభ్యులు ఆమోదించారని చెప్పుకోవడంలో అర్థం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం దళితులకు మూడెకరాల భూపంపిణీ పథకంలో 4939 మందికి 12,745 ఎకరాలు మాత్రమే పంపిణీ చేశారని చెప్పారు.

24 నుంచి సీపీఎం బస్ జాతాలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఏప్రిల్ 18-24 వరకు నిర్వహించే సీపీఎం అఖిల భారత మహాసభలకు ప్రచారం కోసం ఈనెల 24 నుంచి రెండు బస్ జాతాలు నిర్వహించనున్నారు. తొలి జాతాను రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ప్రారంభిస్తారు. ఇది రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటిస్తుంది.

శాసనసభ్యుడి ఇంటి ఎదుటే మహిళ ఆత్మహత్య

బాగల్‌కోట, న్యూస్‌టుడే: న్యాయం చేయాలని శాసనసభ్యుడి నివాసం ముందు ఆందోళన చేస్తూ.. ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. కర్ణాటకలోని బాదామి పట్టణంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతురాలిని శాంతవ్వ (46)గా గుర్తించారు. ఆమె మృతికి శాసనసభ్యుడు బి.బి.చిమ్మనకట్టి కారణమని శాంతవ్వ కుటుంబ సభ్యులు ఆరోపించారు.

ప్రజాసంఘాలను అణచివేస్తున్నారు

కేంద్ర మంత్రులకు జీకేఎన్ఎస్ ఫిర్యాదు

ఈనాడు, దిల్లీ: గొల్లకురుములకు 1955-1971 వరకు అమలులో ఉన్న అర్ధ సంచార జాతుల రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని గొల్లకురుమ నవనిర్మాణ సమితి(జీకేఎన్ఎస్) డిమాండ్ చేసింది. రిజర్వేషన్ సాధన కోసం పోరాడుతున్న ప్రజాసంఘాలను తెలంగాణలో అణచివేతకు గురి చేస్తున్నారని ఆరోపించింది. ఈమేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్‌యాదవ్, సమితి యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధి రమేష్‌యాదవ్ గురువారం దిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిసి ఫిర్యాదు చేశారు. ప్రజాసంఘాలకు మద్దతుగా నిలవాలని గొల్లకురుమలకు రిజర్వేషన్ కల్పించేందుకు సహకరించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ అహిర్, కేంద్ర సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్, కేంద్ర మాజీ సహాయమంత్రి హకుందేవ్‌లను కలిసినట్లు పేర్కొన్నారు.

నీటి పొదుపుపై నిబద్ధతను పునరుద్ఘాటిద్దాం

ప్రధాని మోదీ పిలుపు

దిల్లీ: ప్రాణ కోటికి జీవనాధారమైన నీటిని సంరక్షించుకొనే మహా యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవటంతో పాటు జలవనరులను రక్షించుకొనేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాలని సూచించారు. "మనం పొదుపు చేసే ప్రతి నీటి బొట్టూ మన నగరాలు, గ్రామాలు, అహర్నిశలు కష్టించే రైతన్నలకు ఎంతో ఉపయోగపడుతుంది" అని గురువారం ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'జలశక్తి'ని గుర్తించేందుకు లభించిన అవకాశంగా ఈ సందర్భాన్ని అభివర్ణించారు.





ఈనాడు

జాతికి జలగండం

గుక్కెడు గంగ లేకుండా మనిషి ప్రాణాలు ఎన్నో రోజులు నిలవవు. మానవకోటికే కాదు- చెట్లు చేమలకు, పశుసంతతికి సైతం జీవనదాత అయిన నీరు, అమూల్య ప్రకృతి వనరు. నిన్న ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని వెలుగుచూసిన విశ్లేషణలు, కథనాలు, అధ్యయన నివేదికలు విశ్వవ్యాప్తంగా ఆ సహజ వనరుకు దూరమైన కోట్లాది దాహార్తుల దుర్భర అవస్థల్ని కళ్లకు కట్టాయి. ఇప్పటికే దేశదేశాల్లో 84 కోట్ల మందికిపైగా ప్రజానీకం తీవ్ర నీటి కటకటతో సతమతమవుతున్నట్లు గణాంకాలు చాటుతున్నాయి. వాస్తవానికి మూడింట రెండొంతుల ప్రపంచ జనాభా ఏడాదిలో కొన్నాళ్లపాటు నీటి కొరత ఎదుర్కొంటున్నట్లు ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) సారథి స్పష్టీకరిస్తున్నారు. 2050 సంవత్సరం నాటికి ఎకాయెకి 570కోట్ల మందికి చుక్కనీరైనా దొరక్కపోవచ్చునని ఐక్యరాజ్యసమితి పెనుప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రక్షిత జలాలకు నోచని అభాగ్యుల్లో అత్యధికులకు నెలవైన భారత్ 2030నాటికి 50శాతం దాకా నీటి కొరతను ఎదుర్కోనుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటివి గతంలోనే హెచ్చరించాయి. దేశంలో స్వచ్ఛమైన నీటికి నోచనివారి సంఖ్య ఏటికేడాది పెరుగుతుండటం, తక్షణ దిద్దుబాటు చర్యల అత్యావశ్యకతను సూచిస్తోంది. పరాయి పాలన చెర వీడేనాటికి దేశంలో నమోదైన తలసరి నీటి లభ్యత ఇన్నేళ్లలో నాలుగోవంతుకు కుంగిపోయింది. గత్యంతరం లేక అందుబాటులో ఉన్న నీటినే సేవించక తప్పని దురవస్థ కోట్లాది పౌరుల ఆయురారోగ్యాల్ని చెండుకుతింటోంది. తెలుగు రాష్ట్రాలతోపాటు పశ్చిమ్ బంగ, తమిళనాడు, యూపీ, బిహార్ వంటిచోట్ల 230 జిల్లాల్లో ఫ్లోరైడ్ రక్కసి కోరచాస్తోంది. నీటి వినియోగంలో జవాబుదారీతనం మృగ్యమై, ఉన్న వనరుల్ని సద్వినియోగపరచుకోవడంలో అసమర్థత పెచ్చరిల్లి- ప్రాణాధార జలసిరులు చేజారిపోతున్నాయి.

పోనుపోను నీటి కొరత ముమ్మరించనుందన్న అంచనాల వెలుగులో- ఉన్న జలవనరుల్ని కంటికి రెప్పలా సంరక్షించుకోవడం, సరఫరా వ్యవస్థల్ని పటిష్ఠీకరించడం ప్రజాప్రభుత్వాలు నిష్ఠగా నిర్వర్తించాల్సిన కనీస విధులు. వాస్తవిక కార్యాచరణలో అంతెత్తున మేటవేసిన నిర్లక్ష్యం నివ్వెరపరచక మానదు. దేశంలో దాదాపు 450 నదులు ప్రవహిస్తున్నాయన్న మాటేగాని- అందులో నాలుగోవంతు స్నానాలకు, సగానికి పైగా తాగడానికి పనికిరానివే. ఆ మేరకు పార్లమెంటు ప్రజాపద్దుల సంఘం లోగడే హెచ్చరించినా- పూర్తిస్థాయిలో సరైన దిద్దుబాటు చర్యలు ఇప్పటికీ పట్టాలకెక్కలేదు. దేశవ్యాప్తంగా వివిధ నదులు రోజూ మూడువేల ఆరువందల కోట్ల లీటర్లకు పైగా కలుషిత వ్యర్థాల తాకిడితో కృశించిపోతున్నాయి. గడచిన అయిదేళ్ల కాలంలోనే దేశంలో కలుషిత నదుల సంఖ్య 121 నుంచి 275కి విస్తరించినట్లు కేంద్ర కాలుష్య మండలి ధ్రువీకరిస్తోంది. రకరకాల హింసోన్మాదాల పాలబడి హతమారిపోయేవారికన్నా ఎక్కువమంది ఏటా కలుషిత జలాలు తాగి విగతజీవులవుతున్నారన్న 'కాగ్' నిర్ధారణ- పర్యవేక్షణ బాధ్యతలు నిభాయించాల్సిన ప్రత్యేక యంత్రాంగం నిష్ప్రాచీతనం పట్ల సూటి అభిశంసన. ఉపరితల నీటి వసతులు విషకాలుష్యం బారిన పడుతున్నా, భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయికి దిగజారుతున్నా లక్ష్యపెట్టనంతగా కాలుష్య నియంత్రణ మండళ్లు తరతమ భేదాలతో అవినీతి మడుగులో ఈదులాడుతున్నాయి! ప్రస్తుతం గ్రామీణ భారతంలో 16 శాతానికే పరిమితమైన గొట్టపు నీటి సరఫరాను ఇంకో నాలుగేళ్లలో 90 శాతానికి విస్తరిస్తామన్న ఆశయ ప్రకటనలు ఒకవంక మోతెక్కుతున్నాయి. మరోవైపు ఇళ్లకు వెళ్లే పైపుల్లో మురుగునీరు కలిసి అతిసారం ప్రబలి పదుల సంఖ్యలో ప్రాణాల్ని కబళిస్తున్న ఉదంతాలు నిశ్చేష్టపరుస్తున్నాయి. జల సంరక్షణ, సరఫరాలు కదం తొక్కాలనడంలో మరోమాట లేదు. జిల్లాలవారీగా తాగునీటి సమస్యను పరిష్కరించి కరవును శాశ్వతంగా పారదోలాలన్న ఆంధ్రప్రదేశ్ పట్టుదల, కేసీఆర్ మానస పుత్రికగా తెలంగాణలో సాకారమవుతున్న 'భగీరథ' స్వప్నం- తక్కిన రాష్ట్రాల్లోనూ ఉద్యమ స్ఫూర్తి రగిలించినప్పుడే, దేశం దిద్దుబాట పట్టినట్లు!

వ్యవసాయ ప్రధాన దేశమైన భారత్‌లో నేటికీ 65 శాతానికి పైగా సేద్యం వర్షాధారమే. దాదాపు ప్రతి సంవత్సరం 70 శాతం వానలు వందరోజుల్లోనే కురిసిపోతున్న కారణంగా వరదల రూపేణా అపార జలరాశి వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. పర్యవసానంగా 80 శాతం తాగునీటి అవసరాలకు, 60 శాతం సేద్యానికి భూగర్భ జలాల్ని ఎడాపెడా తోడేస్తున్నారు. నీటిమట్టాలు పడిపోయే కొద్దీ వెలికివస్తున్న సీసం, ఆర్సెనిక్, నైట్రేట్లు వంటివి జనారోగ్యాన్ని కసిగా కాటేస్తున్నాయి. అందుబాటులోని జలవనరుల్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలే తప్ప, మానవమాత్రులెవరూ నీటిని సృష్టించలేరు. పరిమిత వనరుల్ని గరిష్ఠ ప్రయోజన సాధకాలుగా మలచుకోవడంలో ఆరితేరిన ఇజ్రాయెల్- ఎడారి నేలల్లోనూ పంటసిరుల్ని ఒడిసిపడుతోంది. వృథాజలాల్ని శుద్ధి చేసి పునర్వినియోగిస్తూ అద్భుతాలు సృష్టిస్తోంది. ఒక్క నీటిబొట్టునూ వృథా పోనివ్వని సింగపూర్ జల సంరక్షణ, జలాశయాల పరిరక్షణ, మేలిమి పారిశుద్ధ్య వ్యవస్థలతో తనదైన ఒరవడి దిద్దుతోంది. తెలుగు గడ్డపై నమోదయ్యే 900 మిల్లీమీటర్ల సగటు వర్షపాతంలో సగమైనా లేకున్నా, ఆ వాననీటితోనే ప్రజావసరాలన్నీ తీరుస్తున్న ఆస్ట్రేలియా- పకడ్బందీ ప్రణాళికకు భాష్యం చెబుతోంది. అదే ఇక్కడ 90 శాతం దాకా వాననీరు సముద్రంలో కలిసిపోవడమో, ఆవిరైపోవడం వల్లనో ఎందుకూ కొరగానిదవుతోంది. భద్రపరచుకున్న, పరిరక్షించుకున్న జలాలు జాతికి హరిత శోభను ప్రసాదిస్తాయి. అందువల్ల వాననీటి సద్వినియోగం, అనర్థక వరదల్ని నివారించేలా నదుల అనుసంధానం, పరిశుద్ధీకరణ, నిర్లవణీకరణల ద్వారా గరిష్ఠ వినియోగాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణబద్ధం కావాలి. వృథాను అరికట్టడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమైనది. ఆ మేరకు ఏకోన్ముఖ కార్యాచరణే జలగండం నుంచి జాతిని తెప్పరిల్లజేసేది!



బ్యాంకు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నియంత్రణ సంస్థలపై ఎంతో కీలక బాధ్యత ఉంది. నియంత్రణ సంస్థలు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. మనదేశంలో ఏ కుంభకోణం వెలుగు చూసినా ముందుగా వేలెత్తి చూపేది రాజకీయ పార్టీల వైపేగాని నియంత్రణ సంస్థల జవాబుదారీతనాన్ని గుర్తించడం లేదు. ఇది దురదృష్టకరం.

– అరుణ్ జైట్లీ (కేంద్ర ఆర్థిక మంత్రి)

ఏ బ్యాంకింగ్ నియంత్రణ వ్యవస్థ అయినా అన్ని మోసాలను ముందుగా గుర్తించడం సాధ్యం కాదు. కార్యకలాపాల నిర్వహణలో లోపాలవల్లే పీఎన్‌బీ మోసం జరిగింది. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఇలాంటి అవకతవకలను అరికట్టడానికి రిజర్వుబ్యాంకుకు మరిన్ని అధికారాలు ఉండాలి. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలో మార్పుల ద్వారా ఆర్‌బీఐకి మరిన్ని నియంత్రణాధికారాలు కల్పించాలి.

– ఉర్జిత్ పటేల్ (రిజర్వుబ్యాంకు గవర్నరు)



వ్యవస్థలు డొల్ల... బ్యాంకులు గుల్ల



తుమ్మల కిశోర్

పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)లో జరిగిన భారీ కుంభకోణం దేశ బ్యాంకింగ్ రంగంలో ప్రకంపనలు రేపింది. ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)లపై దేశ ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసింది. తొలుత రూ.11,400 కోట్లుగా వెల్లడైన ఈ ఎల్ఓయూ (లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్)ల కుంభకోణం క్రమంగా రూ.12,967 కోట్లకు, ఆపైన తాజాగా రూ.13,923 కోట్లకు చేరి దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణంగా రికార్డు సృష్టించింది. ఈ భారీ కుంభకోణం తీవ్రత, లోతుపాతులు ఇంకా పూర్తిస్థాయిలో నిగ్గుతేలాల్సి ఉంది. దేశంలో రెండో అతిపెద్ద పీఎస్‌బీగా ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఈ స్థాయి ఆర్థిక మోసాలు వెలుగు చూడటంతో దేశ ప్రజానీకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కొన్నేళ్లుగా కొంతమంది బ్యాంకు సిబ్బంది జరుపుతున్న మోసపూరిత ఎల్ఓయూ లావాదేవీలు బ్యాంకుల నిఘా, నియంత్రణ యంత్రాంగాల వైఫల్యాలను ఎండగడుతున్నాయి. ఈ భారీ కుంభకోణం దేశ బ్యాంకింగ్ రంగ చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోతుంది. ఇప్పటికే నిరర్థక ఆస్తుల భారంతో పీకల్లోతు మునిగిన పీఎస్‌బీలు నష్టాలబారిన పడి దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. కొత్తగా బయటపడుతున్న కుంభకోణాలు దేశ బ్యాంకింగ్ రంగ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. పీఎన్‌బీలో కొందరు ఉద్యోగులు, ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీతో కుమ్మక్కై కొన్నేళ్లుగా సాగించిన మోసపూరిత కార్యకలాపాలు దేశ ప్రజానీకాన్ని నివ్వెరపరచాయి.

అందరూ బాధ్యులే

కుంభకోణంపై అటు ప్రభుత్వం, ఇటు రిజర్వు బ్యాంకు, పీఎన్‌బీ యాజమాన్యం, ఆడిట్ సంస్థలు భిన్నరీతిలో స్పందిస్తున్నాయి. ఎవరి బాధ్యత ఎంతవరకన్న అంశంపై లోతైన విచారణ నిర్వహించాల్సిన అవసరం ఉంది. మోసపూరిత ఎల్ఓయూల జారీ 2011 నుంచి జరుగుతున్నా, దాన్ని గుర్తించడంలో బ్యాంకు యాజమాన్యం ఘోరంగా విఫలమైందన్నది నిర్వివాదం. ముఖ్యంగా దేశ విదేశాల్లో బ్యాంకుల మధ్య వ్యాపార లావాదేవీల సంక్షిప్త సమాచార మార్పిడికి ఉపయోగించే స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలికమ్యూనికేషన్) వ్యవస్థను దుర్వినియోగం చేయడం ద్వారా ఇంత భారీ కుంభకోణానికి పాల్పడ్డ వైనం ఆ బ్యాంకు అంతర్గత పర్యవేక్షణ యంత్రాంగ వైఫల్యానికి అద్దంపడుతోంది. తమ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ విధానంతో 'స్విఫ్ట్' అనుసంధానం కాకపోవడంవల్ల కుంభకోణాన్ని గుర్తించలేకపోయామన్న పీఎన్‌బీ వాదన క్షంతవ్యం కానిది. నిజానికి ప్రతి బ్యాంకులో దశలవారీగా అంతర్గత ఆడిట్ వ్యవస్థ ఉంటుంది. కొన్ని వెలుపలి ఆడిట్ సంస్థలూ శాఖల లావాదేవీలను తనిఖీ చేస్తాయి. వ్యాపార పరిమాణాన్ని బట్టి ఆయా శాఖలూ స్వీయ ఆడిట్ చేపడతాయి. ఎల్ఓయూల కుంభకోణం జరిగిన పీఎన్‌బీ శాఖలో మూడు రకాల ఆడిట్లు ఉన్నాయి. ఒకటి, 'కంకరెంట్ ఆడిట్'. ఇందులో రోజువారీ లావాదేవీలన్నింటినీ ఆడిటర్లు (బయటి ఆడిట్ సంస్థలు) క్షుణ్నంగా పరిశీలించి బ్యాంకు యాజమాన్యానికి ప్రతి నెలా నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఏవైనా అవకతవకలు గుర్తిస్తే వెంటనే బ్యాంకు యాజమాన్య దృష్టికి వారు తీసుకెళ్లాలి. రెండోది, 'స్టాట్యుటరీ ఆడిట్'. ఆయా శాఖల వ్యాపారం, వర్గీకరణలనుబట్టి ఎంపిక చేసిన శాఖల్లో ఇది ఉంటుంది. మూడోది, అంతర్గత ఆడిట్. ఈ ఆడిట్‌ను బ్యాంకు తనిఖీ విభాగ సిబ్బంది నిర్వహిస్తుంది. ఇవేవీ పీఎన్‌బీలో జరుగుతున్న కుంభకోణాన్ని గుర్తించలేకపోయాయి. ఇక బ్యాంకులు అంతర్గతంగా పలు తనిఖీలు నిర్వహిస్తుంటాయి. 'స్విఫ్ట్' తనిఖీలూ అందులో భాగమే. ఏటా నిర్వహించే ఈ తనిఖీల్లోనూ ఇంతటి భారీ కుంభకోణం బయటపడలేదంటే ఆయా వ్యవస్థలు ఎంతగా భ్రష్టుపట్టిపోయాయో బోధపడుతోంది. ఎంపిక చేసిన కొన్ని బ్యాంకు శాఖల్లో రిజర్వు బ్యాంకుఏటా తనిఖీలు నిర్వహిస్తుంది. వీటిలోనూ కుంభకోణం ఉనికిని పసిగట్టలేకపోవడం ఆశ్చర్యకరం. నిర్వహణ లోపాలు, అవకతవకలను గుర్తించి పనితీరు మెరుగుపరచేందుకు ప్రతి బ్యాంకులో ఉన్నతాధికారులతో కూడిన 'రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ'లు, 'ఆడిట్ కమిటీ'లు పనిచేస్తాయి. ఇన్నేళ్ళలో ఒక్కసారి కూడా అవి కుంభకోణాన్ని పసిగట్టలేకపోవడం- ముమ్మాటికీ బ్యాంకు యాజమాన్య వైఫల్యమే!

బ్యాంకింగ్ రంగంలో అవకతవకలను గుర్తించడంలో వైఫల్యానికి ఆడిట్ సంస్థలూ బాధ్యత వహించాలి. దేశంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల నియంత్రణ రిజర్వు బ్యాంకు బాధ్యత. వాటి పనితీరు మెరుగుపడేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు పర్యవేక్షణనూ ఆర్‌బీఐ చేపడుతుంది. దేశ ఆర్థిక సుస్థిరత కాపాడటంలో ఆర్‌బీఐ కీలకపాత్ర పోషిస్తుంది. అందువల్లే పీఎన్‌బీ కుంభకోణం విషయంలో ఆర్‌బీఐ కూడా బాధ్యత వహించాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై ఇటీవల తొలిసారి స్పందించిన ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ కుంభకోణానికి రిజర్వుబ్యాంకు బాధ్యత వహించదని స్పష్టీకరించారు. బ్యాంకులపై అటు ప్రభుత్వం ఇటు ఆర్‌బీఐల నియంత్రణ కొనసాగుతుండటమే ఈ అనర్థాలకు కారణమన్నారు. అంతేకాక 'స్విఫ్ట్' విధానంపై బ్యాంకులు అప్రమత్తంగా ఉండాలని 2016లోనే ఉత్తర్వులు జారీచేసినా బ్యాంకులు పట్టించుకొనకపోవడమే సమస్యకు కారణమని తేల్చిచెప్పారు. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలో మార్పుల ద్వారా దేశ బ్యాంకింగ్ వ్యవస్థ నియంత్రణ అధికారాలను పెంచాలని అభిప్రాయపడ్డారు. ఏదిఏమైనా ఆర్‌బీఐ తన బాధ్యతను విస్మరించి కేవలం కొన్ని ఉత్తర్వులు జారీచేసి చేతులు దులుపుకోవడం ఏ మేరకు సమర్థనీయమన్నది చర్చనీయాంశం. బ్యాంకులపై ద్వంద నియంత్రణ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. అదేదో కొత్తగా తెరపైకి వచ్చినది కాదు. అయినా బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంలో అవసరమైన మార్పులు చేయడానికి ప్రభుత్వం ఇప్పటికైనా సమాయత్తం కావాలి.



బాధ్యతారాహిత్యంతో అసలుకే ఎసరు

దిద్దుబాటు చర్యలు అవసరం

దేశ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం వెలుగులోకి వచ్చి నెలరోజులు దాటినా ప్రభుత్వం పీఎన్‌బీ యాజమాన్యంపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం తప్పుడు సంకేతాలు పంపిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సైతం బ్యాంకు యాజమాన్యాన్ని తప్పుపట్టి చేతులు దులుపుకొన్నారు. భవిష్యత్తులో ఈ తరహా కుంభకోణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడంతోపాటు బాధ్యతారహితంగా వ్యవహరించిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొన్ని విధానపరమైన మార్పులూ చేపట్టాలి. తద్వారా ప్రభుత్వరంగ బ్యాంకులపై సడలిన విశ్వాసాన్ని పునరుద్ధరించాలి. కొన్ని బ్యాంకు బోర్డులను ప్రక్షాళించాలి. డైరెక్టర్ల నియామకాల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. సమర్థులైన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు నిష్ణాతులైన మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈఓలు ఉన్న బ్యాంకులు మంచి ఫలితాలు సాధిస్తాయని వేరే చెప్పనక్కర్లేదు. బ్యాంకు డైరెక్టర్లు మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా విధులు నిర్వర్తిస్తే కుంభకోణాలకు తావుండదు. 'స్విఫ్ట్' లావాదేవీలను ఆయా బ్యాంకుల 'కోర్ బ్యాంకింగ్' వ్యవస్థకు అనుసంధానించే ప్రక్రియను వేగవంతం చేయాలి. అందుకోసం ప్రస్తుతం బ్యాంకుల్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంలో కొన్ని మార్పులు చేర్పులు చేయడంతోపాటు కొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉంది. బ్యాంకుల్లో ఈ అనుసంధాన ప్రక్రియ పూర్తయ్యేంతవరకు 'స్విఫ్ట్' లావాదేవీలపై ప్రత్యేక నిఘా ఉంచి, వీటి పర్యవేక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలి. విదేశ మారకద్రవ్య విభాగాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి. కీలక విభాగాల్లో సిబ్బందికి ఎక్కువకాలం పనిచేసే అవకాశం ఇవ్వరాదు. 'జాబ్ రొటేషన్' పద్ధతిని తప్పనిసరి చేయాలి.

మార్పులకు సమయం

పీఎస్‌బీల మానవ వనరుల విభాగాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పనితీరును మరింత మెరుగుపరచుకోవడంతోపాటు మానవ వనరుల విధానాల్లో కొన్ని విప్లవాత్మక మార్పులు తీసుకురావలసిన అవసరం ఉంది. సిబ్బంది నియామకం, పదోన్నతి, బదిలీవంటి విధానాలను సత్వరం పునస్సమీక్షించాలి. ప్రతిభ నిబద్ధతలకు పట్టం కట్టేలా మానవ వనరుల విభాగాల్లో సంస్కరణలు చేపట్టాలి. అవినీతిపరులు, మోసపూరిత సిబ్బందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోగల వ్యవస్థలు రావాలి. దేశ బ్యాంకింగ్ వ్యవస్థకు దిశానిర్దేశాలు ఇస్తూ బ్యాంకులను నియంత్రించాల్సిన బాధ్యత రిజర్వుబ్యాంకుపై ఉంది. అదే సమయంలో ఆర్‌బీఐ స్వయంప్రతిపత్తికి భంగం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు పాటించాలి. అంతర్జాతీయంగా పలు అభివృద్ధి చెందిన దేశాల సెంట్రల్ బ్యాంకులకు దీటుగా పనిచేయగల సత్తా రిజర్వుబ్యాంకుకు ఉంది. అటువంటి సంస్థను ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేయకుండా స్వయంప్రతిపత్తి స్ఫూర్తితో పనిచేసేందుకు దోహదపడాలి. ప్రభుత్వ రంగ బ్యాంకుల పని తీరును మెరుగుపరచి, వాటి నిర్వహణ సామర్థ్యాన్ని పెంచేందుకు రెండేళ్ల క్రితం బ్యాంక్స్ బోర్డ్ బ్యూరో (బీబీబీ)కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పీఎస్‌బీల అధిపతుల నియామకంతో పాటు బ్యాంకుల వ్యాపారాభివృద్ధికి దిశానిర్దేశాలనివ్వడం, మూలధన సమీకరణకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం వంటి లక్ష్యాలతో ప్రారంభమైన ఈ సంస్థ రెండేళ్లలో సాధించింది ఏమీలేదు. ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటమే దీనికి కారణం. ఇకనైనా బ్యాంకుల స్థిరీకరణ ప్రక్రియను వేగవంతం చేసి పీఎస్‌బీలను తిరిగి గాడిన పెట్టేదిశలో బీబీబీ కీలకపాత్ర పోషించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలి. ఆడిట్ విధి విధానాలను పకడ్బందీగా తీర్చిదిద్ది, అలసత్వానికి తావు లేకుండా కట్టుదిట్టమైన నియంత్రణ వ్యవస్థలను రూపొందించే దిశలో ప్రభుత్వం అడుగులు వేయాలి. ఆడిటింగ్‌లో నాణ్యత, ప్రక్రియల్లో సమూల దిశగా ప్రక్షాళన కోసం ప్రభుత్వం తలపెట్టిన నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ (ఎన్ఎఫ్ఆర్ఏ) స్థాపనను వేగవంతం చేయాలి!

(రచయిత– బ్యాంకింగ్ రంగ నిపుణులు)

పడిగాపులకు చెల్లుచీటీ

ఆధునిక యుగంలో విస్తృత రహదారి వ్యవస్థ లేకుండా ఏ దేశమూ ఆర్థికంగా పురోగమించజాలదు. 33 లక్షల కిలోమీటర్ల పొడవైన రహదారులతో భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద రోడ్డు వ్యవస్థను కలిగి ఉంది. సరకు రవాణాలో 60 శాతం, ప్రయాణికుల రవాణాలో 85 శాతం రహదారుల మీదే జరుగుతోంది. మొత్తం రోడ్లలో జాతీయ రహదారుల వాటా రెండు శాతంలోపే కాని, వాటి ద్వారానే 40 శాతం మేర రవాణా సాగుతోంది. దేశంలో నానాటికీ వాహనాల సంఖ్య పెరిగిపోతున్నందువల్ల రోడ్ల విస్తరణ, కొత్త రహదారుల నిర్మాణం, టోల్‌గేట్ల సమర్థ నిర్వహణలకు ప్రాధాన్యం ఏర్పడింది. కానీ, ప్రస్తుత సుంకం చావడి (టోల్‌గేట్) వ్యవస్థలో అనేక లోపాలున్నాయి. సుంక చావళ్ల సంఖ్య బాగా తక్కువ కావడంతోపాటు రహదారి సుంకం వసూలుకు ఎక్కువ సమయం పడుతోంది. సుంకం చెల్లించడానికి ప్రతి వాహనానికి సగటున 10 నిమిషాల సమయం పడుతోంది. నిరీక్షణలో ఇంధన నష్టం వందల కోట్ల రూపాయల్లో ఉంటోంది. ఈ ఆలస్యం వాహన యజమానుల్లో అసహనానికి కారణమవుతోంది. ఇలాంటి ఇబ్బందులు పరిహరించడానికి సుంక చావడి వ్యవస్థను పకడ్బందీగా నిర్వహించడం ముఖ్యం. అందుకోసం జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) సుంక చావళ్లలో ఎలక్ట్రానిక్ సుంక వసూలు (ఈటీసీ) కార్యక్రమాన్ని చేపట్టింది. అందుకోసం 'ఫాస్టాగ్' పథకాన్ని చేపట్టారు.

ఫాస్టాగ్ అనేది కారు ముందు అద్దానికి(విండ్‌షీల్డ్‌కు) అమర్చే రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) పట్టీ. ఇది వాహన యజమాని నగదు ఖాతాకు అనుసంధానమై ఉంటుంది. ఫాస్టాగ్ అమర్చిన వాహనం టోల్‌గేట్ ద్వారా వెళ్లేటప్పుడు ఈ ఖాతా నుంచి సుంకం మొత్తం దానంతట అదే టోల్‌గేట్ ఖాతాలోకి జమ అయిపోతుంది. వాహన ఉత్పత్తిదారులు ప్రతి వాహనం విండ్‌షీల్డ్ మీద విధిగా ఫాస్టాగ్‌ను అతికించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఆదేశించింది. 2017 డిసెంబరు ఒకటి నుంచి విపణిలోకి వచ్చే ప్రతి నాలుగు చక్రాల వాహనం ఈ నియమాన్ని పాటిస్తోంది. జాతీయ రహదారులపై సుంక చావళ్లన్నింటినీ ఆర్ఎఫ్ఐడీ సంకేతాలను చదవగలిగేలా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. టోల్‌ప్లాజాలలో ఒక వరసను పూర్తిగా ఫాస్టాగ్‌కు ప్రత్యేకిస్తున్నారు. ఈ వరసలో వెళ్లే వాహనాలు సుంకం చెల్లించడానికి ఆగనక్కర్లేదు. ఇప్పటికే దేశంలో ఏడు లక్షల మోటారు వాహనాలకు ఫాస్టాగ్‌లను అమర్చారు. 2016 నవంబరు నాటికి జాతీయ రహదారులపై 394 సుంక చావళ్లు ఉన్నాయి. 2015-16లో ప్రభుత్వానికి రహదారి సుంకాల ద్వారా రూ.6,700 కోట్లకుపైగా రాబడి వచ్చింది.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ఫాస్టాగ్ విధానాన్ని ప్రవేశపెడితే ఈ ఆదాయం మరింత పెరుగుతుంది. నగరాలు, పట్టణాల్లో పార్కింగ్ స్థలాల్లోనూ ఫాస్టాగ్ పద్ధతిని చేపట్టే యోచన ఉంది. ప్రస్తుతం ఫాస్టాగ్ స్వచ్ఛందమే అయినా మున్ముందు కొన్ని ప్రదేశాల్లోనైనా దాన్ని తప్పనిసరి చేయవచ్చు. ఫాస్టాగ్ లావాదేవీలన్నీ వాహన చోదకుల చరవాణులకు ఎప్పటికప్పుడు సంక్షిప్త సందేశాల (ఎస్ఎంఎస్) రూపంలో అందుతాయి. క్రెడిట్, డెబిట్, నెట్ బ్యాంకింగ్, నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల ద్వారా ఫాస్టాగ్‌కు ముందస్తు చెల్లింపులు జరపవచ్చు. ఫాస్టాగ్ వెబ్‌సైట్‌కు లాగాన్ కావడం ద్వారా తమ ఖాతా వివరాలు తెలుసుకోవచ్చు.



రహదారులపై 'ఫాస్టాగ్' వినియోగం

టోల్‌ప్లాజాల్లోని గుర్తింపు పరికరాలు వాహనాలపైని పట్టీల వివరాలను గ్రహిస్తాయి. ఫాస్టాగ్‌తో అనుసంధానించిన ఖాతాల నుంచి స్వయంచాలిత పద్ధతిలో అవే సుంకం వసూలు చేసుకుంటాయి. వాహనదారులు తమ ఖాతాల్లో తగినంత డబ్బు ఉండేలా చూసుకోవాలి. ప్రస్తుతం ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, యాక్సిస్ వంటి కొన్ని బ్యాంకుల నుంచి ఫాస్టాగ్‌లను కొనే సదుపాయం ఉంది. టోల్‌ప్లాజాల వద్దా కొనుగోలు చేయవచ్చు. ఎన్‌హెచ్ఏఐ సైతం ఆన్‌లైన్‌లో, టోల్ గేట్ల వద్ద ఏర్పాటు చేసే ఖాతాదారు సేవాకేంద్రాల్లో ఫాస్టాగ్‌లను విక్రయిస్తోంది. ప్రస్తుతం ఫాస్టాగ్ వినియోగం వాహన యజమానుల నిర్ణయానికే వదిలేశారు. మున్ముందు మాత్రం కొన్ని ముఖ్యమైన టోల్‌గేట్లలో దీన్ని తప్పనిసరి చేయవచ్చు. అప్పుడు విధిగా అందరూ ఫాస్టాగ్ కొనుగోలు చేయకతప్పదు. ఒక వాహనానికి తీసుకున్న ఫాస్టాగ్‌ను మరొకదానికి ఉపయోగించరాదు. అలా వాడిన వాహనాలపై ఆంక్షలు విధిస్తారు. వాహనదారులు ఒకవేళ తమ ఫాస్టాగ్‌లను బ్లాక్ చేయదలిస్తే ఖాతాదారు సేవా విభాగానికి ఫోన్ చేసి చెప్పవచ్చు.

ఫాస్టాగ్ అమర్చుకున్న వాహనాలు టోల్‌గేట్ల వద్ద ఎక్కువసేపు ఆగనక్కర్లేదు కాబట్టి ఇంధనం ఆదా అవుతుంది. లిఖితపూర్వక లావాదేవీలు ఉండవు కాబట్టి కాగితమూ ఆదా అవుతుంది. 2014 నుంచి అమలులోకి వచ్చిన ఫాస్టాగ్ నగదు రహిత డిజిటల్ లావాదేవీలను విస్తృతంగా ప్రాచుర్యంలోకి తెస్తోంది. మొత్తం దినసరి రాదారి సుంక వసూళ్లలో 50 శాతాన్ని ఫాస్టాగ్ తదితర ఎలక్ట్రానిక్ మార్గాల్లో రాబట్టాలని కేంద్ర ఉపరితల శాఖ లక్షిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వానికి జాతీయ రహదారులపై రోజుకు సగటున రూ.51 కోట్ల సుంకం లభిస్తుండగా, అందులో 20 శాతమే ఫాస్టాగ్‌ల ద్వారా వసూలవుతోంది. వచ్చే నెల నుంచి అన్ని టోల్ గేట్లూ అటు ఫాస్టాగ్‌ను, ఇటు మామూలు సుంక వసూలు పద్ధతులనూ అమలు చేస్తాయి. వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ) అమలులోకి వచ్చాక సరిహద్దు చెక్ పోస్టులను రద్దు చేసిన ప్రభుత్వం, ఫాస్టాగ్ విధానంతో రహదారులపై వాహన చలనాన్ని వేగవంతం చేయదలచింది. చెక్‌పోస్టుల రద్దుకు ముందు సరకుల ట్రక్కులు రోజుకు 200 కి.మీలు ప్రయాణించగా, జీఎస్‌టీ అమలు తరవాత అవి 325 కిలోమీటర్ల దూరం పయనించగలుగుతున్నాయి. ఫాస్టాగ్ కారణంగా ఇటు ఇంధనం పొదుపు ఇనుమడించి, అటు కాలహరణానికి కళ్లెం వేసి- వాహన యజమానులకు అసహనానికి తెరదించుతోంది!

– డాక్టర్ కె.బాలాజీరెడ్డి

ఈనాడు లేఖలు

పెట్రోలు బంకుల్లో కల్తీ

సమాజాన్ని కల్తీ మహమ్మారి పట్టి పీడిస్తోంది. ప్రధానంగా తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో పెట్రోలు, డీజిల్ ఆయిల్ అమ్మకాలు ఇష్టానుసారం సాగిపోతున్నాయి. పలు బంకుల ఇంధనాల్లో అనేక రసాయనాలు కలుపుతున్నారు. ఎవరికీ తెలియకుండా, గుట్టు చప్పుడు కాకుండా ఇంధన కల్తీ వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఎటువంటి అనుమానాలకూ ఆస్కారమివ్వని రీతిలో వినియోగదారులకు అంటగడుతున్నారు. ప్రశ్నించినవారికి మాయమాటలు చెప్పి తప్పించుకుంటున్నారు. నిలదీసి అడిగితే కొన్ని పెట్రోలు బంకుల యజమానులు, సిబ్బంది తెగించి దాడులకు దిగుతున్నారు. సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులకు బాధితులు ఎన్ని ఫిర్యాదులిచ్చినా, ఆలకించే నాథుడే లేడు. మరికొన్ని చోట్ల అధికారులే మామూళ్ల మత్తులో పడి, ఇంధనం కల్తీని చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఆకస్మిక తనిఖీల ద్వారా కల్తీని నియంత్రించాల్సినవారే బాధ్యతారహితంగా ఉంటే ఎలా? ఇంధనాల్లో కల్తీ కారణంగా ద్విచక్ర వాహనాలు సహా అనేక బండ్లు త్వరగా దెబ్బతింటున్నాయి. అంతటా నిఘా పెంచి, కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వపరంగా ప్రత్యేక కార్యాచరణ ఎంతైనా అవసరం.

- కె.సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్ జిల్లా

విద్యావ్యాపారాన్ని నియంత్రించాలి

రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల తీరుతెన్నులపై విద్యాశాఖ దృష్టి కేంద్రీకరించాలి. అక్కడ ఫీజుల నిర్ణయం, వసూళ్ల విధానం, బోధనా పద్ధతులు, తరగతి గదుల్లో సౌకర్యాల కల్పనను పూర్తిస్థాయిలో సమీక్షించాలి. వివిధ పాఠశాలలకు సంబంధించి, రుసుముల నియంత్రణ కలగా మారుతోంది. విద్యార్థుల, వారి తల్లిదండ్రుల స్థితిగతుల్ని ఆయా యాజమాన్యాలు ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు. దీన్ని చక్కదిద్దాలంటే- ప్రవేశాల మొదలు బోధన దశ వరకు అన్ని స్థాయుల్లోనూ కమిటీల ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. అవి ఎంత సమర్థంగా వ్యవహరిస్తే, పాఠశాల విద్య అంత బాగా మెరుగుపడుతుంది.

- అల్లాడి సంధ్య, నాగర్ కర్నూల్


రమణీయం

'నేను ఎవరు' అనే అంశాన్ని అవలోకించుకోవడమే ఆధ్యాత్మిక మార్గంలో మొదటి సోపానం. తాను ఎవరో ఏమిటో ప్రతి వ్యక్తీ తెలుసుకుంటే, మిగిలినదంతా దానికదే అవగతమవుతుంది. పరమాత్మ తత్వాన్ని అర్థం చేసుకోవాలనుకునేవారు, ముందుగా శాశ్వతమైన ఆత్మవస్తువుపై దృష్టి పెట్టాలి. 'నా శరీరం, నా మనసు, నా బుద్ధి' అనే అహంకారాన్ని వీడాలి. అప్పుడే అంతర్యామితో హృదయ అనుసంధానం ఏర్పడుతుందంటూ అద్వైత యోగాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించిన మహనీయులు- భగవాన్ రమణ మహర్షి. భక్తి, కర్మ, జ్ఞాన, రాజయోగాల ఏకీకృతం ద్వారా సాధకులకు మార్గదర్శనం చేసిన నిష్కామ కర్మయోగి ఆయన.

జగత్తును ఈశ్వర భావనతో దర్శించి, సేవించగలగడమే నిజమైన పూజ. అలాంటి పూజే పరిపూర్ణ స్థితికి చేరుతుంది. మనిషి 'లోచూపు' కలిగి ఉండాలి. తనను తాను ఉద్ధరించుకోవడానికి నిరంతరమూ ఆత్మపరిశీలన సాగించాలి. 'ప్రతి వస్తువులోనూ అంతర్భూతంగా ఉన్న దివ్యత్వాన్ని దర్శించడమే దివ్యదృష్టి' అని రమణులు బోధించారు. ఆధ్యాత్మిక భావదీప్తిని సరళతరం చేసిన ఆయన 'మౌన స్వామి'గా విశేష ఖ్యాతి పొందారు. పరబ్రహ్మ తత్వాన్ని సాకారం చేశారు. ఆ గురువు మౌనం శిష్యుల సంశయాల్ని తీర్చింది. స్థూలంగా 'దక్షిణామూర్తి స్తోత్రం' ఇదే అంశాన్ని వెల్లడిస్తుంది. ఈ స్తోత్ర సారాంశానికి ఆకృతిగా రమణ మహర్షిని పేర్కొంటారు. మౌన ఉపదేశంలోనే ఆయన ఎందరికో ధార్మిక స్ఫూర్తిని అందించారు.

రమణుల పూర్వనామం వెంకట్రామన్. ఆయన తమిళనాడులోని మదురై జిల్లా తిరుచూళిలో సుందరం అయ్యర్, అళగమ్మ దంపతులకు జన్మించారు. జ్ఞానాన్వేషణ, ఆధ్యాత్మిక చింతనలే తన జీవన పరమార్థమని రమణులు 17వ ఏట ప్రకటించారు. సమీప బంధువు కలిగించిన ప్రేరణతో అరుణాచల క్షేత్రం చేరుకున్నారు. జీవిత పర్యంతం ఆ దివ్యధామాన్నే శాశ్వత నివాసంగా చేసుకున్నారు.

'కావ్యకంఠ' బిరుదాంకితులైన గణపతి మహాముని అరుణాచలానికి చేరి, రమణుల్ని దర్శించుకున్నారు. ఆ సందర్భంలో 'తపస్సు' అంతర్యాన్ని మహర్షి ఆయనకు తేటతెల్లం చేశారు. 'నేను' అనే అహంభావం నిలువెల్లా నిండి, మనిషి జీవన లాలసలో కొట్టుమిట్టాడటమే తమస్సు. నా జీవనానికి గమ్యం ఏమిటి, 'నేను' ఎక్కడి నుంచి వచ్చాను, నా పయనానికి పరమార్థం ఏమిటి, నేనెలా సముద్ధరణ చెందాలి- అనే అంతర్మథనం మానవుడిలో మొదలుకావడమే ఉషస్సు. సృష్టికర్త అయిన సర్వాంతర్యామిలో మనసును సంలీనం చేయడం తపస్సు... ఇలా రమణుల ప్రబోధం గణపతి మహామునిని ఎంతో ఆకట్టుకుంది. మోక్షమార్గానికి మౌనస్వామి నూతన ద్వారాలు తెరిచారని, శివచైతన్యంతో వెలుగొందిన యోగిపుంగవులు ఆయనేనని అభివర్ణించారు. శ్రీరామనామ బీజాక్షరాల్ని సంపుటీకరించి, మొదటిసారిగా మహర్షికి 'శ్రీరమణ' అని నామకరణం చేశారు.



అంతర్యామి

భగవాన్ రమణుల మాటల్లో- అరుణాచలం ఓ శక్తిసంపన్న సుక్షేత్రం. అరుణాచలం అనే పేరే ఒక మహామంత్రం. 'నమశ్శివాయ' అనేది యోగ పంచాక్షరి. 'అరుణాచలం' జ్ఞాన పంచాక్షరి. అలాంటి అరుణాచలంలో జ్ఞాన యోగ మూర్తిగా, అతులిత ఆధ్యాత్మిక స్ఫూర్తిగా మహర్షి భాసిల్లారు. 'అనుభవ సారం' పేరుతో విశేష జ్ఞానామృతాన్ని 30 జంట పంక్తుల్లో రూపొందించారు.

భగవత్ సామీప్యానికి, ఆత్మఉద్ధరణకు ఏది కారకమవుతుందో- అదే ఉపదేశం. దాన్ని కరదీపికగా చేబూని ఆధ్యాత్మిక ప్రస్థానం కొనసాగించాలనేది రమణుల బోధ. మనసు అనే లాంతరుకు అరిషడ్వర్గాలు మసిపూతలు. అవి తొలగితేనే, మానవ హృదయదీపం దివ్యమణిలా ప్రకాశిస్తుంది. ఆ తేజస్సులో ఈశ్వర శక్తిని దర్శించవచ్చని మహర్షి సందేశమిచ్చారు.

రమణుల భవ్యసందేశ భావనా వైభవం- నిరంతర స్ఫూర్తిదాయకం, మానవాళికి సదా అనుసరణీయం!

– డాక్టర్ కావూరి రాజేశ్ పటేల్



అభిషేకానికి పుణ్యతీర్థాన్ని తీసుకొస్తున్న ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు

సీతారాముల కల్యాణానికి వైభవంగా అంకురార్పణ పూజలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి ఆలయంలో ఈనెల 26న శ్రీరామనవమిని పురస్కరించుకుని జగత్కల్యాణం, 27న పట్టాభిషేకం జరగనున్నందున ఇందుకు సంబంధించిన అంకురార్పణ పూజలను గురువారం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా పవిత్ర గోదావరి నదికి వెళ్లి బిందెలో పుణ్యతీర్థాన్ని తీసుకువచ్చి ఉత్సవానుజ్ఞతో దీక్షావస్త్రాలను అందించారు. స్వామికి అభిషేకం వైభవంగా జరిపి ఊరేగింపుగా తాతగుడికి వెళ్లి పుట్టమట్టిని పూజించి పాలికల్లో పోశారు. వేద మంత్రోచ్చరణలు మిన్నంటగా 'జై శ్రీరాం' అనే భక్తుల నీరాజనాల మధ్య అంకురార్పణ చేశారు. శుక్రవారం ధ్వజపట భద్రక మండల లేఖన పూజలు ఉంటాయని ఈవో ప్రభాకర శ్రీనివాస్ తెలిపారు.

పౌరసరఫరాలో సంస్కరణలు దేశానికే ఆదర్శం

జేసీలతో మంత్రి ఈటల దూర దృశ్య సమీక్ష

రైతులకు మద్దతు ధర అందేలా చూడాలని ఆదేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: పౌరసరఫరాల శాఖలో చేపట్టిన సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 2017-18 రబీ కార్యాచరణపై గురువారం మంత్రి, ఆ శాఖ కమిషనర్ సీవీ ఆనంద్‌తో కలిసి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లతో దూర దృశ్య సమీక్ష నిర్వహించారు. ఈపాస్ నెట్‌వర్క్ సమస్యలు, రేషన్ పోర్టబిలిటీ, గోదాముల్లో సీసీ కెమెరాల పనితీరు పరిశీలన, కిరోసిన్ బకాయిలు, దీపం కనెక్షన్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పుడూ లేనంతగా గతేడాది రబీలో పౌరసరఫరాల శాఖ 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందన్నారు. ఈ సీజన్‌లోనూ పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాలని, రైతులకు మద్దతుధర లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్, గోదాముల్లో సీసీ కెమెరాలు, రేషన్ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు వల్ల బియ్యం అక్రమ రవాణా పూర్తిగా తగ్గిందన్నారు. ఏప్రిల్‌లో కొత్త రేషన్ కార్డుల ముద్రణ ప్రారంభిస్తామన్నారు. సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ఈ రబీలో 36 లక్షల మెట్రిక్ టన్నులు కొనాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు.

వివాహమే విద్యకు అడ్డు



- అమ్మాయిల చదువుకు పెళ్లితోనే ఆటంకం
- ఆర్థిక ఇబ్బందులతోనే దేశంలో ఎక్కువ డ్రాపవుట్లు
- సంతాన నిరోధక శస్త్రచికిత్సలకు పురుషులు దూరం

ఈనాడు - హైదరాబాద్

దేశంలో చిన్నారులు పాఠశాలల్లో చేరకపోవడానికి, చాలామంది చదువు మధ్యలోనే మానేయడానికి ఆర్థిక ఇబ్బందులే ప్రధాన కారణమని స్త్రీ, పురుషుల నివేదిక- 2017 వెల్లడించింది. ఇంటి పనులు, వ్యాపార పనుల్లో సాయం చేయాల్సి రావడం, సరైన విద్యా సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో చదువుకోలేకపోతున్నారని తెలిసింది. మరోవైపు ఆడ పిల్లలకు పెళ్లీడు రాగానే చదువు మాన్పించి వివాహం చేసేస్తున్నారు. దీంతో చాలామంది అమ్మాయిలు కనీసం మాధ్యమిక విద్య కూడా పూర్తి చేయలేకపోతున్నారు. సంఖ్యలో కాస్త తేడాలున్నా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇవే పరిస్థితులున్నాయని నివేదిక వెల్లడించింది. చదువు, వివాహం, మాతృత్వంపై అవగాహన పెరగడంతో యువతుల వివాహ సగటు వయసు 23 ఏళ్లకు పెరగడం విశేషం. వివాహమైన మహిళల్లో ఎక్కువమంది 20- 29 ఏళ్ల మధ్య మాతృత్వపు అనుభూతిని పొందేందుకు ఇష్టపడుతున్నారు. ఒకరు లేదా ఇద్దరు పిల్లలు చాలనుకుంటున్నారు. అయితే కుటుంబనియంత్రణకు వేసెక్టమీ చేయించుకునే పురుషుల సంఖ్య స్వల్పంగా (10 శాతం లోపే) ఉంది. సగానికన్నా ఎక్కువగా మహిళలే ట్యూబెక్టమీ చేయించుకోవాల్సి వస్తోంది.

తెలంగాణలో ప్రైవేటు వైద్యమే

తెలుగు రాష్ట్రాల మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. తెలంగాణలో ఏదైనా జబ్బు వస్తే ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్తున్న పురుషులు 68.4 శాతం, మహిళలు 48.5 శాతం ఉన్నారని నివేదిక చెబుతోంది. ఏపీలో అత్యధిక మంది వైద్యం కోసం పీహెచ్‌సీలు, జనరల్ ఆసుపత్రులకు వెళ్తున్నారు.

సగం మంది చదువుకు దూరం

పురుషులతో పోలిస్తే మహిళలు అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యత్యాసం 15.5 శాతం ఉంటే పట్టణ ప్రాంతాల్లో 8.9 శాతంగా ఉంది. ఐదేళ్లు, ఆపైబడిన వారిని పరిగణనలోకి తీసుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో 17.9%, పట్టణాల్లో 10.1 శాతం తేడా కనిపిస్తోంది.

- ప్రాథమిక విద్య నుంచి మాధ్యమిక విద్యకు వచ్చేనాటికి విద్యార్థుల నమోదు పది శాతం తగ్గగా ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి నమోదు 50 శాతానికి పడిపోతోంది.
- ప్రతి వెయ్యి మంది జనాభాకు గ్రామీణ ప్రాంతాల్లో నలుగురు మహిళలు, 8 మంది పురుషులు పీజీ పూర్తి చేస్తున్నారు. పట్టణాల్లో పురుషులు 43 మంది, మహిళలు 35 మంది పీజీ చదువుతున్నారు.
- 5-29 ఏళ్ల వయసు ఉండి పాఠశాలల్లో చేరనివారిలో ఆర్థిక కారణాలతో చదువుకోలేకపోయామని చెబుతున్నవారే ఎక్కువ. నాణ్యమైన విద్య లేకపోవడం, పాఠశాలల్లో ఉపాధ్యాయులు రాకపోవడం, వేళలు అనుకూలించక ప్రతి వెయ్యి మందిలో 268 మంది చదువుకు దూరమవుతున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 24 ఏళ్లలోపు విద్యకు దూరమవుతున్నారు. 16- 24 ఏళ్లలోపు (ఇంటర్ ఆపై) చదువు మానేస్తున్నవారు సగం మంది ఉన్నారు. పట్టణాల్లో ప్రాథమిక విద్యకు సగటున రూ.10 వేలు వెచ్చిస్తున్నారు. ఇంటర్మీడియట్ వచ్చేనాటికి రూ.20 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఓట్లున్నా సీట్లు తక్కువే

పోలింగ్‌లో అత్యధికంగా పాల్గొంటున్నా కేంద్ర మంత్రి పదవుల్లో మహిళలకు 12 శాతానికి మించి పదవులు దక్కడం లేదు. దేశవ్యాప్తంగా 2014 ఎన్నికల్లో పోటీచేసిన మహిళల్లో 9.3 శాతం మంది గెలిస్తే.. పురుషుల గెలుపు శాతం 6.3 శాతమే.

- తెలంగాణలో 17 మంది ఎంపీల్లో ఒక్కరు, ఏపీలో 25 మంది ఎంపీల్లో ఇద్దరు మాత్రమే మహిళలున్నారు. ఏపీ శాసనసభలో 20 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉంటే తెలంగాణలో ఆ సంఖ్య తొమ్మిదే. జాతీయ సగటు కన్నా తెలంగాణ సగటు తక్కువగా ఉండగా ఏపీ కొంత మెరుగ్గా ఉంది.
- దేశవ్యాప్తంగా కొన్ని ఉన్నత న్యాయస్థానాల్లో మహిళా న్యాయమూర్తులకు ప్రాతినిధ్యం లభించడం లేదు. దిల్లీలో 27 శాతం మంది మహిళలు న్యాయమూర్తులుగా ఉన్నారు. ఆ తర్వాత మద్రాస్, కర్ణాటక, కోల్‌కత, ముంబయి, ఝార్ఖండ్, పంజాబ్, సిక్కిం రాష్ట్రాల హైకోర్టులున్నాయి. హైదరాబాద్ న్యాయస్థానంలో 10 శాతం మంది మహిళలు న్యాయమూర్తులుగా కొనసాగుతున్నారు.

రెండేళ్లలోపే తొలి సంతానం

తెలంగాణలో ప్రతి వెయ్యి మందికి సగటున **17.5** జననాలు ఉంటే, **6.1** శాతం మరణాలు ఉంటున్నాయి. ఏపీలో జననరేటు **16.4** శాతం, మరణాల రేటు **6.8**గా నమోదువుతోంది.

అంశం	మహిళలు	పురుషులు(శాతాల్లో)
* పెళ్లైన రెండేళ్లలో తొలి సంతానం కోరుకుంటున్నవారు	66.8	46.4
* పెళ్లైన రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం సంతానం వద్దనుకునేవారు	13.4	17.8
* రెండేళ్లలో రెండో సంతానం కావాలనుకుంటున్నవారు	22.5	24.8
* రెండో సంతానం కోసం మరికొంత కాలం ఆగుదామనేవారు	36	36

యజమానులు తక్కువే

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర సంస్థల్లో పనిచేస్తున్న మహిళల వాటా 26.09 శాతం అయితే పట్టణ ప్రాంతాల్లో 19.38 శాతంగా నమోదైంది. పరిశ్రమల్లో మహిళలు యజమానులుగా ఉన్నవి చాలా తక్కువ. విద్యా సంస్థల్లో 30 శాతం మంది మహిళా యజమానులున్నారు.

	ఏపీ	తెలంగాణ
గ్రామీణ ప్రాంతాల్లో మహిళా యజమానులు	30%	20%
పట్టణాల్లో మహిళా యజమానులు	21%	49%

బ్యాంకుల్లో మహిళలకు దక్కని ప్రాధాన్యం

తెలుగు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలిక ఉపాధి, స్వయం ఉపాధి ప్రధాన ఆదాయ వనరులు. పట్టణాల్లో వేతన జీవులు ఎక్కువ. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణ, ఏపీలో పనివారి సగటు ఎక్కువ.

- బ్యాంకు ఉద్యోగాల్లో మహిళలు 22%
- జాతీయ బ్యాంకుల్లో 24%
- ఎస్‌బీఐ, అనుబంధ బ్యాంకుల్లో 23%
- విదేశీ బ్యాంకుల్లో మహిళా ఉద్యోగుల వాటా 31%
- గ్రామీణ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకుల్లో మహిళా ఉద్యోగుల వాటా జాతీయ సగటుకున్నా తక్కువగా ఉంది.

బ్యాంకు ఉద్యోగులు

ఏపీలో	51,437
మహిళా ఉద్యోగులు	11,283
తెలంగాణలో	48,555
మహిళా ఉద్యోగులు	10,740

సివిల్ సర్వీసుల్లో 17 శాతమే

- కేంద్ర సివిల్ సర్వీసులకు వస్తున్నవారిలో మహిళల వాటా తక్కువే. 2016లో ఐఏఎస్‌లుగా ఎంపికైన వారిలో 17 శాతం మంది మహిళలు. ఐపీఎస్‌కు 9 శాతం, అటవీ సర్వీసులకు 4% మంది వెళుతున్నారు. ఎకనామిక్ సర్వీసెస్, స్టాటిస్టికల్ సర్వీసెస్‌కు ఎక్కువ మంది పరిమితమవుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలలు ఢమాల్

- 2017-18లో మూతపడిన 973 పాఠశాలలు
- గురుకులాలు పెరగడమే కారణమం
- అయినా వాటిల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది
- సర్కారు బడులు పెరిగినా పిల్లలు తగ్గారు
- తెలంగాణ పాఠశాల విద్యాశాఖ తాజా గణాంకాల్లో వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఒకవైపు సర్కారు బడుల సంఖ్య పెరుగుతున్నా వాటిల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. మరోవైపు ప్రైవేట్ పాఠశాలలు మూతపడుతున్నా వాటిల్లో చదువుతున్న పిల్లలు మాత్రం పెరుగుతూనే ఉన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రతి నియోజకవర్గంలో గురుకులాలను నెలకొల్పుతుండటంతో పెద్ద గ్రామాలు, మండల కేంద్రాల్లో వందల సంఖ్యలో ప్రైవేట్ బడులను మూసివేశారు. మొత్తం మీద రాష్ట్రంలో విద్యార్థుల సంఖ్య పడిపోగా అందుకు ఆధార్ సంఖ్య అనుసంధానమే కారణమని, ఒక్కో విద్యార్థి పేరు రెండు చోట్ల లేకుండా నిరోధించగలిగామని, దానివల్ల అసలు గణాంకాలు తేటతెల్లమయ్యాయని ప్రభుత్వం చెబుతోంది. పాఠశాల విద్యాశాఖ ఫలితాల బడ్జెట్ 2018-19ను ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టింది. గత రెండేళ్ల గణాంకాలను అందులో పొందుపరిచారు. వాటి ప్రకారం 2017-18 విద్యా సంవత్సరంలో 973 ప్రైవేట్ బడులు మూతపడగా... అదే సమయంలో వాటిలో పిల్లలు మాత్రం 41,832 మంది పెరగడం గమనార్హం.

రాష్ట్రంలో 2016-17, 2017-18 విద్యా సంవత్సరాల మధ్య వివిధ అంశాలను పోల్చి చూస్తే పలు ఆసక్తికర అంశాలు వెలుగుచూస్తున్నాయి. సర్కారు బడులు 2017లో 477 పెరిగాయి. మైనారిటీ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో గురుకులాలను(5-10) ప్రభుత్వం ప్రారంభించడమే కారణమని ప్రభుత్వం చెబుతోంది. వాటిల్లో పిల్లల సంఖ్య 28,33,069 నుంచి 27,60,761కి పడిపోయింది. అంటే 72,308 మంది తగ్గిపోయారు. అదే సమయంలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 11,732 నుంచి 10,759కు తగ్గింది. విద్యార్థులు మాత్రం 30,33,717 నుంచి 30,75,549కు పెరిగారు.

- ప్రైవేట్ పాఠశాలలు తగ్గిపోగా వాటిల్లో అత్యధికంగా ప్రాథమిక పాఠశాలలే ఉన్నాయి. 2016-17లో 1,666 ప్రాథమిక పాఠశాలలుండగా 2017-18కి ఏకంగా 815కి తగ్గిపోయాయి. ప్రాథమికోన్నతలో 41, ఉన్నత పాఠశాలల్లో 81 తగ్గాయి. పెరిగిన ప్రభుత్వ పాఠశాలల్లో 118 ప్రాథమిక, 373 ఉన్నత పాఠశాలలున్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలలు మాత్రం 14 తగ్గాయి.
- ప్రభుత్వ, ప్రైవేట్‌పాఠశాలల్లో బాలికల సంఖ్య28,42,978 నుంచి28,31,466కి తగ్గింది.
- పాఠశాలల సంఖ్య తగ్గినా ఉపాధ్యాయల సంఖ్య మాత్రం పెరిగింది. 2016-17లో ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో 2,21,2013 మంది ఉపాధ్యాయులుండగా 2017-18లో 27,456 మంది పెరిగి 2,48,659కి చేరుకున్నారు.
- ప్రాథమిక తరగతుల్లో(1-5) ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల సంఖ్య భారీగా తగ్గిపోయింది. సర్కారు బడుల్లో 72,657 మంది, ప్రైవేట్ బడుల్లో ఏకంగా 1,77,251 మంది తగ్గారు. జననాల రేటు పడిపోవడంతో పాఠశాలల్లో కొత్తగా చేరే వారి సంఖ్య తగ్గుతోందని ప్రభుత్వం విశ్లేషిస్తోంది. 2001 నుంచి 2011 వరకు దశాబ్ద కాలంలో 0-6 సంవత్సరాల వయసు పిల్లలు 15 లక్షలు తగ్గిపోయినట్లుగా 2011 జనాభా లెక్కలు ద్వారా స్పష్టమైందని విద్యాశాఖ పేర్కొంది.
- ఉన్నత పాఠశాలల్లో పిల్లలను పరిశీలిస్తే సర్కారు బడుల్లో 33,508 మంది పెరిగారు. అదే సమయంలో ప్రైవేట్‌లో 2,05,901 మంది పెరగడం గమనార్హం. అంటే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ వైపు భారీగా మొగ్గుచూపుతున్నట్లు స్పష్టమవుతోంది.

అమిత్‌షాను కాపాడేందుకే నయీం హత్య

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపణ

భువనగిరి అర్బన్ న్యూస్‌టుడే: వ్యాపారి సోహ్రాబుద్దీన్ హత్య కేసు నుంచి అమిత్‌షాను కాపాడటంలో భాగంగానే నయీంను ఎన్‌కౌంటర్ చేశారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1996 తర్వాత వచ్చిన ప్రతి ప్రభుత్వం, ఉన్నతస్థాయి పోలీసు అధికారులు నయీంను ఉపయోగించుకున్నారని చెప్పారు. కేసును విచారిస్తున్న సిట్ దర్యాప్తు వివరాలను బహిర్గతం చేయాలని, నయీం డైరీని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కింది స్థాయి అధికారులను నిందితులుగా చూపి ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తోందని విమర్శించారు. నయీంతో ప్రస్తుత ప్రభుత్వంలోని కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులకు సంబంధాలు ఉన్నాయని అందుకే ప్రభుత్వం కేసును నీరుగారుస్తోందన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. నయీం ప్రజల నుంచి అక్రమంగా దోచుకున్న ఆస్తులను, డబ్బును ప్రభుత్వం తిరిగి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నయీం బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాడుతుందన్నారు.

పక్కాగా ప్రాథమిక నివేదిక

- 15వ ఆర్థిక సంఘానికి ఇచ్చేందుకు తెలంగాణ కసరత్తు
- పథకాలను రాష్ట్రాలకు వదిలేయండి
- విద్య, వైద్య కార్యక్రమాలను మాకే అప్పగించండి
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెంచాలి
- అభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక నిధులివ్వాలని ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర నిధుల కేటాయింపులో ఆర్థిక సంఘానిది కీలకపాత్ర. 2020 నుంచి ఐదేళ్లపాటు కేంద్ర నిధుల కేటాయింపులో కీలకం కానున్న 15వ ఆర్థిక సంఘం ముందు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రతిపాదనలు ఉంచబోతోంది. కేంద్రం గుప్పిట్లోని పథకాలను పూర్తిగా రాష్ట్రాలకు అప్పగించాలని స్పష్టంగా చెప్పబోతోంది. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి కీలక కార్యక్రమాల అమలును పూర్తిగా రాష్ట్రాలకు ఇచ్చి కేంద్రం నిధులివ్వడానికే పరిమితం కావాలని కోరనుంది. ఏప్రిల్‌లో 15వ ఆర్థిక సంఘానికి సమర్పించే ప్రాథమిక నివేదికనే పకడ్బందీగా ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా కసరత్తు చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వివిధ అంశాలు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల ఆర్థిక స్థితిపై పూర్తి నివేదికలను రూపొందిస్తోంది. తెలంగాణలోని ప్రత్యేక పరిస్థితులనూ వీటిలో పొందుపరచబోతోంది.

అవసరాలకు అనుగుణంగా పథకాలు: విద్య, ఆరోగ్యం కోసం కేంద్రం వివిధ పథకాలను రూపొందించి, వాటి ద్వారా నిధులిస్తోంది. నిధుల కోసం కేంద్రంపై పూర్తిగా ఆధారపడాల్సి రావడం, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఆ పథకాలను అమలు చేయడంలో ఇబ్బందులు ఉన్నాయని.. ఆ నిధులను పూర్తిగా రాష్ట్రాలకే ఇస్తే వాటి అవసరాలకు తగినట్లు పథకాలను రూపొందించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలియజేయనుంది. గతంలో జిల్లాపరిషత్‌లు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు నిధులు అందేవి. 14వ ఆర్థిక సంఘం పంచాయతీలకే నిధులు ఇచ్చింది. ఈసారి జిల్లా, మండల పరిషత్‌లకూ నిధులివ్వాలని ప్రతిపాదించనుంది.

రుణభారంలో వెసులుబాటు: ఆర్థిక క్రమశిక్షణలో భాగంగా అమలవుతున్న ద్రవ్య నియంత్రణ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిమితిని పెంచాలని తెలంగాణ కోరనుంది. ప్రస్తుతం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మూడు శాతంగా ఉంది. ప్రత్యేక పరిస్థితుల్లో దీన్ని మరో0.5శాతం పెంచుకునే వెసులుబాటు కల్పించారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ మౌలికసదుపాయాల కల్పనసహా అనేక కార్యక్రమాలకు రుణాలు తీసుకోవాల్సి ఉంది. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెరిగితే తక్కువ భారంతో, చెల్లింపులకు వెసులుబాటుతో రుణాలు పొందేందుకు వీలవుతుందని వివరించనుంది.

అభివృద్ధి పనులకు సాయం: భారీగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చేపట్టిన మిషన్ భగీరథ, రైతు రుణమాఫీతోపాటు తాజాగా వ్యవసాయానికి అందజేయనున్న పెట్టుబడి ప్రోత్సాహం, గిడ్డంగులు, రహదారుల నిర్మాణం, పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దఎత్తున నిధులు అవసరమవుతాయని చెప్పనుంది. ఇప్పటికే రాష్ట్రానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అర్విండ్ మెహతా కాళేశ్వరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఇలాంటి భారీ ప్రాజెక్టులకు ఆర్థిక సంఘం నేరుగా సాయం చేయాలని సర్కారు కోరనుంది. నీతిఆయోగ్ ద్వారా కేంద్రానికి నివేదించినా ప్రత్యేకంగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో 15వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రాలకు ప్రత్యేక నిధుల కేటాయింపు ఉండాలనే వాదనను బలంగా వినిపించడానికి తెలంగాణ సిద్ధమవుతోంది.

అంతరాలు చూడాలి: తెలంగాణ ఆర్థికంగా పురోగమిస్తున్నా, మెరుగైన వృద్ధిరేటు కనబరుస్తున్నా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల మధ్య అంతులేని అంతరాలు ఉన్నాయి. తలసరి ఆదాయం రాష్ట్ర సగటు కంటే 28 జిల్లాల్లో తక్కువగా ఉండడం, జాతీయ సగటు కంటే కూడా పలు జిల్లాలు వెనకబడి ఉండటాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించనుంది. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన కార్యక్రమాల కింద ప్రత్యేక నిధులివ్వాలని ఆర్థిక సంఘానికి వివరించేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది.

ప్రగతి పథంలో తెలుగు రాష్ట్రాలు

జాతీయ రక్షణ కళాశాల అధికారులతో భేటీలో గవర్నర్ నరసింహన్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ అన్నారు. జాతీయ భద్రత కళాశాలలో శిక్షణ పొందుతున్న అధికారుల బృందం గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయింది. గవర్నర్ మాట్లాడుతూ రెండు రాష్ట్రాలు సరళతర వ్యాపార నిర్వహణలో అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. త్వరలో ప్రజలకు ఇంటింటికీ రక్షిత నీటిని అందించబోతున్నాయని చెప్పారు. ఇప్పటికే ఏపీ మిగులు విద్యుత్ రాష్ట్రంగా పేరొందగా త్వరలోనే తెలంగాణ ఈ ఘనత సాధించనుందని తెలిపారు. పేదలకు కనీస అవసరాలు తీర్చడంతోపాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ద్వారానే ప్రగతికి సార్థకత చేకూరుతుందని గవర్నర్ అన్నారు.

క్షమించండి

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను "అనలిటికా" సేకరించిందని ఓ ప్రజా వేగు వెల్లడించడంతో ఈ వివాదం రాజుకుంది. కేంబ్రిడ్జ్ పరిశోధకుడు అలెగ్జాండర్ కోగన్ అభివృద్ధి చేసిన "వ్యక్తిత్వం అంచనాల" యాప్ సాయంతో ఈ సమాచారాన్ని అనలిటికా కొల్లగొట్టింది. దీని సాయంతో ప్రత్యేక వ్యూహాలు, ప్రొఫైల్‌లు తయారు చేసి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటర్లకు ఎరవేసినట్లు అనలిటికా ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ అంశంపై తన ఫేస్‌బుక్‌పేజీపై జుకెర్‌బర్గ్ ఓ సుదీర్ఘ పోస్ట్ కూడా చేశారు. అంతేకాదు అనలిటికా సమాచారం సేకరించిన ఖాతాదారులందరినీ అప్రమత్తం చేయాలని ప్రణాళికలు రచిస్తున్నట్లు పేర్కొన్నారు.

చాలా ఆలస్యమైంది

అసలు ఏం జరిగిందో ప్రజలకు చెప్పడంలో ఇంత ఆలస్యం అయినందుకు ఆయన విచారం వ్యక్తంచేశారు. 'ఓసారి వెనక్కు చూసుకుంటే చాలా బాధనిపిస్తోంది. నిజంగా ఈ విషయంలో మేం తప్పటడుగు వేశామని అనిపిస్తోంది. మిగతా పొరపాట్లూ ఇలానే జరిగిపోయాయి'అని ఆయన వ్యాఖ్యానించారు. 'చాలా చిన్న వయసుతోపాటు ఎలాంటి అనుభవమూ లేనప్పుడే ఈ సంస్థను స్థాపించాను. సాంకేతిక తప్పిదాలు చేశాను. వాణిజ్య అంశాల్లోనూ తప్పటడుగులు వేశాను. తప్పుడు వ్యక్తుల్ని నమ్మాను'అని ఆయన వివరించారు. తమ ఒప్పందం ప్రకారం.. సమాచారాన్ని అనలిటికా డిలీట్ చేయలేదని గత వారమే తెలిసినట్లు పేర్కొన్నారు. 'అనలిటికా ధ్రువీకరణను మేం గుడ్డిగా నమ్మకుండా ఉండాల్సింది. ఇలాంటి తప్పులు మళ్లీ చేయబోం. ఇది కోగన్, అనలిటికా, ఫేస్‌బుక్‌ల మధ్య వెలుగుచూసిన భారీ విశ్వాస ఘాతుకం'అని ఆయన వ్యాఖ్యానించారు.

భారత్‌లో ఎన్నికల కోసం ప్రత్యేక సదుపాయాలు

మరోవైపు భారత్, బ్రెజిల్ సహా మరికొన్ని దేశాల్లో ఎన్నికల ప్రక్రియల్లో తమ వేదిక దుర్వినియోగం కాకుండా కొత్త భద్రతా సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నట్లు జుకెర్‌బర్గ్ ప్రకటించారు. నకిలీ ఖాతాలను గుర్తించేందుకు అభివృద్ధి చేసిన కృత్రిమ మేధస్సు (ఏఐ) గురించి ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. '2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో కొత్త కృత్రిమ మేధస్సు అస్త్రాలను అభివృద్ధి చేశాం. వీటిసాయంతో రష్యాతో సంబంధమున్న 30,000 నకిలీ ఖాతాలను గుర్తించాం. వీటిని పూర్తిస్థాయిలో ఫ్రాన్స్ ఎన్నికల్లో ఉపయోగించాం. బూటకపు వార్తలను భారీగా గుర్తించేందుకు ఇది తోడ్పడింది. వీటిని భారత్, బ్రెజిల్‌తోపాటు మరికొన్ని దేశాల్లో జరుగనున్న ఎన్నికల సమయంలో ఉపయోగిస్తాం'అని ఆయన తెలిపారు.

అమెరికా కాంగ్రెస్ ఎన్నికలను ప్రభావితం చేయాలనుకుంటున్నారు

ఈ ఏడాది నవంబరులో జరుగనున్న అమెరికా కాంగ్రెస్ ఎన్నికలను కొందరు ప్రభావితం చేసేందుకు ఫేస్‌బుక్‌ను ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు జుకెర్‌బర్గ్ చెప్పారు. 2016నాటి ఎన్నికల్లో రష్యా జోక్యంచేసుకుందనే ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. 'ఈ సారి వారు కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్నారు. వీటిని మేం సమర్థంగా గుర్తించి, అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాం'అని ఆయన చెప్పారు.

ఆ చర్యలు సరిపోవు: బ్రిటన్

సమాచార భద్రతకు ఫేస్‌బుక్ ప్రతిపాదించిన చర్యలు సరిపోవని బ్రిటన్ వ్యాఖ్యానించింది. ఈ అంశంపై దేశ మంత్రి మ్యాట్ హ్యాన్‌కాక్ మాట్లాడారు. "జుకెర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారు. కొన్ని కొత్త మార్పులు తీసుకొస్తామనీ అన్నారు. అయితే ఇవి సరిపోతాయని మేం భావించట్లేదు. సమాచార వినియోగం, ఆవిష్కరణలు, గోప్యతా హక్కుల మధ్య సమతౌల్యాన్ని ఓ సంస్థ నిర్ణయించకూడదు. ఈ నిబంధనలను పార్లమెంటు సిద్ధంచేయాలి. ప్రస్తుతమున్న చట్టాలను మేం పటిష్ఠం చేస్తున్నాం. వీటిని దిగ్గజ సంస్థలు తప్పకుండా అనుసరించాలి' అని ఆయన వ్యాఖ్యానించారు.

యాప్‌లకు ఇక మితంగానే

సమాచార దుర్వినియోగం వివాదం నడుమ వినియోగదారుల వివరాల పరిరక్షణకు ఫేస్‌బుక్ కొత్త అస్త్రాలను సిద్ధంచేస్తోంది. సరికొత్త సమాచార విధానాన్ని తీసుకురావడంతోపాటు తృతీయ పక్ష యాప్‌ల చేతుల్లోకి వీలైనన్ని తక్కువ వివరాలు వెళ్లేలా చూసేందుకు ప్రయత్నిస్తోంది. మొత్తంగా మూడు ప్రధాన చర్యలు వీటిలో కనిపిస్తున్నాయి.

1. భారీగా ఫేస్‌బుక్ సమాచారం పొందిన/పొందుతున్న యాప్‌ల వివరాలు క్షుణ్నంగా పరిశీలన. తనిఖీలకు అనుమతించని డెవలపర్లపై నిషేధం.
2. లాగ్‌ఇన్ సమయంలో తృతీయ పక్ష యాప్‌లు పొందుతున్న సమాచార పరిమితి కుదింపు. ఇకపై కేవలం పేరు, ఈ-మెయిల్, ప్రొఫైల్ చిత్రం మాత్రమే ఇచ్చేలా ఒప్పందం. ఒకవేళ ఫేస్‌బుక్ పోస్ట్, వ్యక్తిగత సమాచారం కావాలంటే ప్రత్యేక అనుమతులు/ఒప్పందాలు తప్పనిసరి.
3. సమాచారాన్ని యాప్‌లు పొందకుండా వినియోగదారులు అడ్డుకునే ఓ కొత్త సదుపాయం. దీన్ని న్యూస్‌ఫీడ్ పైభాగంలో త్వరలో ఏర్పాటు చేయనున్నారు.

గీత కార్మికులకు వరాలు

(మొదటి పేజీ తరువాయి)

వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న మరికొన్ని మానవీయ నిర్ణయాలను ప్రకటిస్తున్నాను.

- ఇప్పటికే పింఛను రూ.200 నుంచి రూ.వెయ్యికి పెంచాం. ఇప్పటి వరకు కల్లుగీత సొసైటీ సభ్యులకు మాత్రమే పింఛను చెల్లిస్తున్నాం. ఇక నుంచి టీఎఫ్‌టీ కార్మికులకు(లైసెన్స్ ఉన్న) కూడా పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల రాష్ట్రంలోని 30 వేల కుటుంబాలకు ఆసరా లభిస్తుంది. అనుమతి రెన్యువల్ గడువును ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచుతున్నాం.
- ఇప్పటి వరకు గీత కార్మికులకు ఉన్న చెట్ల పన్ను బకాయిలను పూర్తిగా మాఫీ చేస్తున్నాం. చెట్లపై పన్ను వేసే విధానాన్ని రద్దు చేస్తున్నాం. దానివల్ల ప్రభుత్వంపై ఏటా రూ.16 కోట్ల భారం పడుతుంది.
- హైదరాబాద్ నగరంలో గౌడ కులస్తుల అస్తిత్వాన్ని సమున్నతంగా చాటేలా రాష్ట్రస్థాయి గౌడ భవనం నిర్మిస్తాం. అందుకు 5 ఎకరాల స్థలాన్ని, రూ.5 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నాం. ఈ భవనం గౌడ్ల సామాజిక, ఆర్థిక, రాజకీయ వికాస కేంద్రంగా వెలుగొందాలని ఆశిస్తున్నాను.
- హరితహారంలో భాగంగా ఈత, ఖర్జూర మొక్కలను ఇప్పటికే 1.70 కోట్లు నాటాం. ఎక్సైజ్, అటవీశాఖల సమన్వయంతో రాబోయే రోజుల్లో చెరువు కట్టల మీద, చెరువు శిఖం వెంబడి, వాగులు, ఒర్రెల వెంట, నదీ ప్రవాహానికి ఇరువైపులా మొక్కల్ని విరివిగా నాటే కార్యక్రమం కొనసాగుతుంది.



గౌడ కులస్థులకు వరాల ప్రకటనపై ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు. చిత్రంలో మంత్రులు పద్మారావు, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, కొండాసురేఖ, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్

సీఎంకు ఎమ్మెల్యేల కృతజ్ఞతలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో వారి కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయని ఆ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం శాసనసభలో సీఎం గీతకార్మికుల సంక్షేమంపై కొత్త నిర్ణయాలను ప్రకటించిన వెంటనే మంత్రి పద్మారావు, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, వివేకానంద్, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్ ఆయన కార్యాలయానికి వెళ్లి ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్ణయాలు తీసుకున్నారని, గీత కార్మికులు ఆయనకు రుణపడి ఉన్నారని చెప్పారు.

బ్యాంకులకు హైదరాబాద్ సంస్థ రూ. 313 కోట్ల టోపీ

(మొదటి పేజీ తరువాయి)

రహదారులు, వాటర్‌వర్క్స్, స్ట్రక్చర్స్‌ను నిర్మిస్తోంది. వివిధ కంపెనీల ద్వారా సబ్-కాంట్రాక్టర్‌గా పనులు చేపట్టింది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల వడ్డీ, అసలు చెల్లించకపోవడంతో 2012 జూన్ 30నే ఈ కంపెనీ ఖాతా నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) జాబితాలో చేరిపోయింది. ఈ కంపెనీ బయటి బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి డబ్బును దారి మళ్లించినట్లు సీబీఐ ఆరోపించింది. వేతనాల చెల్లింపులు, అధిక ఖర్చులు, భారీ నిల్వల పేరుతో ఈ డబ్బును మళ్లించినట్లు తెలిపింది. హైదరాబాద్‌లో ఈ కంపెనీకి సంబంధించిన రెండు ప్రాంగణాలు, నిందితుల ఇళ్లు, కార్యాలయాల్లో గురువారం సోదాలు నిర్వహించినట్లు సీబీఐ వెల్లడించింది.

తెరాస రోజురోజుకు బలోపేతం

- రాజ్యసభ ఎన్నికల్లో సునాయాస విజయం
- బలం లేకున్నా కాంగ్రెస్ పోటీ
- మన ఎంపీల సంఖ్య పెరుగుతోంది
- అభివృద్ధి మరింత వేగవంతం
- అన్ని సామాజికవర్గాలకు భవనాలు
- ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన నమూనా పోలింగ్‌లో ఓటు వేస్తున్న సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెరాస రాష్ట్రంలో రోజురోజుకూ బలోపేతమవుతోందని, మంచి ప్రజాదరణతో వచ్చే ఎన్నికల్లో మరిన్ని స్థానాలు వస్తాయని తాజాగా వచ్చిన సర్వే ఫలితాల్లో వెల్లడైందని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో సునాయాసంగా గెలుస్తామని వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేస్తామని, రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు స్థలాలను కేటాయించి, భవనాలను నిర్మిస్తామని చెప్పారు. ఏప్రిల్ నుంచి పార్టీ కార్యకలాపాలపై పూర్తిస్థాయి దృష్టిని కేంద్రీకరిస్తామన్నారు. గురువారం రాత్రి ఆయన తెలంగాణభవన్‌లో తెరాస ఆధ్వర్యంలో జరిగిన నమూనా పోలింగుకు హాజరై ఓటు వేశారు. ఎమ్మెల్యేలంతా జాగ్రత్తగా ఓటేయాలని, ఏమాత్రం చిన్న తప్పు జరగొద్దన్నారు. ఎవరైనా పొరపాటు చేస్తే ఎమ్మెల్యేలకే నామోషీ అని, వీరికి కూడా ఓటేయడం తెలియదా అని నవ్వుకుంటారని అన్నారు. 'రాజ్యసభ ఎన్నికల్లో గెలుపు మనదే. కాంగ్రెస్‌కు బలం లేకపోయినా ఎందుకు పోటీ చేస్తుందో ఆ పార్టీకే తెలియాలి. భాజపా, తెదేపా, సీపీఎంలను చూసి అది నేర్చుకోవాలి. ఆ పార్టీ చేసే తప్పుల వల్లనే అది ప్రజల్లో చులకనవుతోంది. ఎన్నికల ద్వారా మరో మూడు ఎంపీ స్థానాలు మనకు వస్తాయి. దీంతో రాజ్యసభలో మన బలం ఆరుకు చేరుతుంది. లోక్‌సభ, రాజ్యసభలో కలిపి 20 మంది ఎంపీలుంటారు.

ప్రజలు మనవైపే

'ప్రజలంతా మనవైపే ఉన్నారు. మన పథకాలకు వారి నుంచి ఆదరణ లభిస్తోంది. అన్ని వర్గాలకు మేలు చేస్తున్నాం. ఈ రోజు గీతకార్మికులకు వరాలిచ్చాం. రాష్ట్రంలో అన్ని వర్గాల వారు సుఖసంతోషాలతో ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అన్ని సామాజిక వర్గాల వారికి భవనాలను కట్టించి ఇస్తాం. ఎవరికే సమస్యలున్నా పరిష్కరిస్తాం. ఇప్పటికే కార్మికులు, ఉద్యోగులకు వేతనాలు పెంచాం. 2018-19 ఆర్థిక సంవత్సరంలో నీటిపారుదల రంగానికి రూ.40 వేల కోట్లను కేటాయిస్తున్నాం. కాళేశ్వరం సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. కేంద్రం నుంచి నిధులు రాకున్నా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తాం. మిషన్ భగీరథ ఫలాలు అతి త్వరలో ఇంటింటికి వస్తాయి. మన విధానాల వల్ల రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు తగ్గాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు బాగా కష్టపడుతున్నారు. మన కార్యక్రమాలన్నీ ప్రజల్లోకి వెళితే ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తాం. వచ్చే నెల నుంచి పార్టీని మరింత బలోపేతం చేద్దాం. ఎమ్మెల్యేందరితో జిల్లాల వారిగా సమీక్ష సమావేశాలు నిర్వహించి, వారి సమస్యలను పరిష్కరిస్తా'అని సీఎం అన్నారు.

తెలంగాణ భవన్ నుంచి బయల్దేరనున్న ఎమ్మెల్యేలు

గురువారం రాత్రి జరిగిన నమూనా పోలింగులో మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటేశారు. దీనిని సీఎం స్వయంగా చూశారు. అనంతరం వారితో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 7.30కి ఎమ్మెల్యేలంతా తెలంగాణభవన్‌కు రావాలని, ఇక్కడ అల్పాహారం అనంతరం బస్సుల్లో శాసనసభకు బయల్దేరాలని సీఎం సూచించారు.

ఆసరా.. భేష్

(మొదటి పేజీ తరువాయి)

మార్పులు చేసి దేశంలో మరింత మంది అర్హులను గుర్తించాల్సిన అవసరం ఉన్నట్లు చెప్పింది. ఎన్ఎస్ఏపీ కింద కేంద్రం రాష్ట్రాలకిచ్చేది చాలా తక్కువని, తక్కువ మంది లబ్ధిదారులను గుర్తించి వారికి వయసును బట్టి రూ.200 మొదలుకొని రూ.500 వరకు మాత్రమే ఇస్తోందని సీఆర్ఎం వివరించింది.

తెలంగాణలోని అన్ని గ్రామాల్లో సంతృప్తికరం: తెలంగాణ గ్రామాల్లో పర్యటించినప్పుడు ఆసరా పింఛను అమలు తీరు సంతృప్తికరంగా ఉన్నట్లు తేలిందని సీఆర్ఎం పేర్కొంది. అర్హుల గుర్తింపు, నిర్ణీత వ్యవధిలోగా పింఛను ఇచ్చే విధానాలు బాగున్నాయని, పలు వర్గాలవారికి నెలకు రూ.1,000, దివ్యాంగులకు రూ.1,500 అందుతున్నాయని ప్రశంసించింది. బీడీ, కల్లుగీత, చేనేత కార్మికులకూ పింఛను ఇస్తున్నారని సీఆర్ఎం తెలిపింది. కేంద్రం ఇస్తున్న దానికంటే అసోంలో రూ.50 అదనంగా ఇస్తుండగా, బిహార్‌లో అర్హుల గుర్తింపు గందరగోళంగా ఉందని చెప్పింది. కేంద్రం ఇచ్చే పింఛనుకు.. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వృద్ధులకు రూ.150, వితంతువులకు రూ.50, దివ్యాంగులకు రూ.200 కలిపి ఇస్తోంది. గుజరాత్‌లో కేంద్రం ఇచ్చేదానికంటే వృద్ధులకు రూ.200, వితంతువులకు రూ.450, దివ్యాంగులకు రూ.200 అదనంగా ఇస్తున్నారు. ఈ రాష్ట్రంలో తాము సందర్శించిన ప్రతి గ్రామంలోనూ పింఛను ఆలస్యమవుతోందని, లేదా అందటంలేదనే ఫిర్యాదులు బాగా వచ్చాయని, అసలు పింఛనుదారుల జాబితాలే లేవని కమిటీ వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లో పింఛను దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే బాగా తక్కువ. కేరళలో నెలకు రూ.1,000 చొప్పున ఏడాదికి 4 నుంచి 8 విడతల్లో పింఛను ఇస్తున్నారు. ఇక్కడ వివాహం కాని 76,199 మంది మహిళలకు కూడా (50 ఏళ్ల వయస్సు వరకు) పింఛను అందుతోంది. తమిళనాడులో నెలకు రూ.1,000 పింఛను ఇస్తున్నారు. తెలంగాణ, కేరళ పింఛను విధానాలు మిగతా రాష్ట్రాలకు అనుసరణీయమని కమిటీ సిఫార్సు చేసింది. జాతీయ పింఛను పథకానికి సరైన విధానమంటూ లేకపోవటం వల్లనే దేశంలో 3.2 కోట్ల మందికి మాత్రమే అమలువుతోందని, 2011 జనాభా లెక్కలను అనుసరిస్తే మరెంతో మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు అర్హుల జాబితాల్లోకి వస్తారని, వారందరినీ గుర్తించాలని సిఫార్సు చేసింది. కేంద్ర వితంతు పింఛను పథకాన్ని లబ్ధిదారు కుమారుడి వయసు కనీసం 21 ఏళ్లు వచ్చేవరకైనా అమలు చేయాలని సూచించింది. లబ్ధిదారుల ఫిర్యాదులపై అప్పీలకు ప్రత్యేక విభాగాలుండాలని చెప్పింది.

నేడే రాజ్యసభ ఎన్నికలు

- బరిలో నలుగురు అభ్యర్థులు
- మూడు స్థానాలపై తెరాస ధీమా
- భాజపా, తెదేపా, సీపీఎం దూరం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మూడు రాజ్యసభ స్థానాలకు శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగింటి వరకు శాసనసభా కమిటీ హాలులోని కేంద్రంలో పోలింగు నిర్వహిస్తారు. సాయంత్రం ఐదింటి నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు. 3 స్థానాలకుగాను నలుగురు అభ్యర్థులు రంగంలో ఉన్నారు. 3 స్థానాలను గెలుస్తామని తెరాస ధీమాగా ఉంది. మొత్తం 90మంది సభ్యులు ఆ పార్టీకి ఉండగా, ఏడుగురు మజ్లిస్ సభ్యులు మద్దతు ప్రకటించారు. పార్టీ అభ్యర్థులైన బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు 33, బడుగుల లింగయ్యయాదవ్‌కు 32, జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు 32 చొప్పున ఓట్లను పార్టీ కేటాయించింది. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా తెరాస మూడు రోజుల పాటు నమూనా పోలింగును నిర్వహించింది. ఐదుగురు సభ్యులున్న భాజపా, ఇద్దరు సభ్యులున్న తెదేపా, ఒక సభ్యుడున్న సీపీఎంలు ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వం రద్దయింది. దీంతో మొత్తం పది ఓట్లు ఎన్నికల్లో తగ్గుతాయి. 109 మంది పోలింగులో పాల్గొనే అవకాశం ఉంది. ఇందులో 97 తెరాసకు మద్దతు ఇస్తుండగా 12మంది కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారు. ఇందులో తెదేపా నుంచి కాంగ్రెస్‌లో చేరిన రేవంత్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థి దొంతి మాధవరెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవ బలం 17కాగా ఇందులో ఏడుగురు తెరాసలో చేరారు. ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థి బలరామ్‌నాయక్‌కు ఓటు వేయాలని కాంగ్రెస్ విప్ జారీ చేసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం సభ్యులు ఎవరికి ఓటు వేస్తున్నారో పార్టీ పోలింగు ఏజెంటుకు చూపించాలి. పోలింగు కేంద్రంలో ఏర్పాట్లను ఎన్నికల ప్రధానాధికారి రజత్‌కుమార్, రిటర్నింగ్ అధికారి, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు గురువారం పర్యవేక్షించారు. శుక్రవారం శాసనసభ కార్యకలాపాలు యథాతథంగా సాగనున్నాయి. సభ్యులు సమావేశాలకు హాజరై ఓటుహక్కునువినియోగించుకుంటారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున జరిగిన పరిణామాలపై కాంగ్రెస్ సభ్యులను శాసనసభ సస్పెండ్ చేసింది. వీరికి సమావేశాలకు అనుమతి లేదు. శుక్రవారం వారంతాపోలింగు కేంద్రానికి హాజరవుతారు.

కేరళలో పరువు హత్య

పెళ్లికి ఒకరోజు ముందు కుమార్తెను చంపిన తండ్రి

మలప్పురం: కుమార్తె మరొక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ప్రేమించి పెళ్లిచేసుకోబోతుండటాన్ని సహించలేని ఆ తండ్రి... ఆమె పాలిట యముడయ్యాడు. మరో రోజులో వివాహం జరుగబోతుందనగా కుమార్తెపై పదునైన ఆయుధంతో దాడి చేసి హత్య చేశాడు. హృదయవిదారకమైన ఈ ఘటన కేరళలోని అరిక్కోడ్‌లో గురువారం చోటుచేసుకుంది. 21 ఏళ్ల అతిర.. ఒక సైనికుడిని ప్రేమించింది. అతడినే పెళ్లిచేసుకుంటానని పట్టుబట్టి కుటుంబ సభ్యులను ఒప్పించింది. దళితుడైన వ్యక్తి తనకు అల్లుడిగా రాబోతుండటాన్ని ఆమె తండ్రి అంగీకరించలేకపోయాడు. శుక్రవారం వివాహానికి ఏర్పాట్లు జరుగుతుండగా.. గురువారం సాయంత్రం తండ్రీ కుమార్తెల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్న రాజన్ (42).. కుమార్తెపై పదునైన ఆయుధంతో దాడి చేశాడు. రక్తమోడుతున్న బాధితురాలిని ఆస్పత్రికి తీసుకెళ్లగా ఈ లోపే మృతి చెందింది. పోలీసులు రాజన్‌ను అదుపులోకి తీసుకున్నారు.

లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ!

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించే ఉద్దేశంతోనే లక్ష్మీనారాయణ ముందస్తు రాజీనామా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారిగా..

కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ వరంగల్ ఆర్.ఇ.సి.లో ఇంజినీరింగ్, చెన్నై ఐఐటీలో ఎంటెక్ పూర్తి చేసి 1990లో సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యావత్‌మల్ సబ్‌డివిజన్ ఏఎస్పీగా మూడేళ్లు, నాందేడ్ ఎస్పీగా మూడేళ్లు పనిచేశారు. పుణేలోని సాయుధ పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. డీఐజీగా పదోన్నతి పొందిన తర్వాత కేంద్ర సర్వీసులకు వెళ్లి సీబీఐలో బాధ్యతలు స్వీకరించి హైదరాబాద్ విభాగానికి బదిలీ అయ్యారు.

ఏడేళ్ల పాటు హైదరాబాద్‌లో సేవలు

హైదరాబాద్‌లోని సీబీఐ విభాగానికి 2006 నుంచి ఏడేళ్లపాటు నేతృత్వం వహించారు. ఇక్కడ ఉన్నప్పుడు లక్ష్మీనారాయణ ఐజీగా పదోన్నతి పొందారు. ఏడేళ్లలో అక్రమాస్తుల కేసులో జగన్‌తోపాటు ఐఏఎస్ అధికారులు, మంత్రులను అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సత్యం కంప్యూటర్ కుంభకోణమూ ఆయన నేతృత్వంలోనే దర్యాప్తు సాగింది. ఓబులాపురం మైనింగ్ కుంభకోణంలో కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డిని అరెస్టు చేశారు.

మహారాష్ట్రలో కార్పొరేటర్ల అరెస్టు సంచలనం: థానే జాయింట్ కమిషనర్‌గా 2014లో లక్ష్మీనారాయణ పనిచేశారు. ఆ సమయంలో సురజ్ పర్మార్ అనే బిల్డర్ ఆత్మహత్య కేసులో కఠినంగా వ్యవహరించడంతో పాటు, వివిధ పార్టీలకు చెందిన కార్పొరేటర్లను అరెస్టు చేయడం మహారాష్ట్రలో సంచలనమైంది. 2016లో జనవరిలో లక్ష్మీనారాయణకు పదోన్నతి కల్పిస్తూ ఏడీజీపీ(అడ్మినిస్ట్రేషన్)గా బదిలీ చేశారు. ఈనేపథ్యంలో ఆయన వీఆర్ఎస్ దరఖాస్తు చేసిన వెంటనే రాష్ట్ర పరిపాలన విభాగ్ బాధ్యతలు తీసుకున్నట్లు తెలిసింది. మహారాష్ట్ర డీజీపీ సతీష్ మథూర్ ఐదురోజుల సెలవులో ఉన్నారు. ఆయన తిరిగి విధుల్లో చేరాక లక్ష్మీనారాయణ దరఖాస్తుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. తాను పదవీ విరమణ పొందిన అనంతరం ఓ ట్రస్ట్ ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు సేవలందిస్తానని లక్ష్మీనారాయణ పలుమార్లు వెల్లడించారు. వీఆర్ఎస్‌పై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.



బంధం విలసిల్లి.. భార్యకు ప్రణమిల్లి..

వరంగల్ అర్బన్ జిల్లా ధర్మసాగర్‌లోని పునీత ఆంథోని చర్చి ఆవరణలో గురువారం కుటుంబ జీవిత నూత్నీకరణ సదస్సు నిర్వహించారు. ఫాదర్ మారపల్లి ప్రవీణ్, కేరళ పాపులర్ మిషన్ ధ్యానం క్రైస్తవ సంస్థ మతగురువులు సమాజంలో భార్యాభర్తల బంధ పవిత్రతను వివరించారు. సదస్సు ముగింపు సమయంలో దంపతులు తమ జీవితం పవిత్రంగా, సాఫీగా సాగాలని ఒకరికొకరు మొక్కుకున్నారు.

– న్యూస్‌టుడే, ధర్మసాగర్

చేతులెత్తేసిన ఆన్‌రాక్

(మొదటి పేజీ తరువాయి)

రూ.1100 కోట్ల ఓటీఎస్‌కు ఆన్‌రాక్ ప్రతిపాదించగా బ్యాంకుల కన్సార్టియం తిరస్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్ణయంతో 2016లో ఈ కంపెనీకి బాక్సైట్ సరఫరా ఒప్పందాన్ని ఏపీఎండీసీ రద్దు చేసింది. బాక్సైట్ సరఫరా లేకపోవడంతో రుణాలు చెల్లించడానికి దివాలా పరిష్కార ప్రక్రియను ప్రారంభించాలంటూ ఆన్‌రాక్ దరఖాస్తు చేసింది. దీన్ని ట్రైబ్యునల్ తిరస్కరించింది. సమస్య పరిష్కారంలో శ్రద్ధ చూపలేదని తప్పుబట్టింది. గనులను కేటాయించడం గానీ, ఆన్‌రాక్‌ను ఏపీఎండీసీ స్వాధీనం చేసుకోవడానికి సమావేశాల్లో తీర్మానాలు చేశారని, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించింది. ఆ వివరాలతోపాటు ప్రస్తుతం చర్చలు ఏ దశలో ఉన్నాయో చెప్పాలని పలుమార్లు గడువిచ్చింది. అయినా ఆన్‌రాక్ కంపెనీ ట్రైబ్యునల్‌కు ఎలాంటి పత్రాలు సమర్పించలేదు. రూ.5,712 కోట్లతో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులో పలు సామాజికాంశాలు ముడిపడి ఉన్నాయని, జాతి ప్రయోజనాలకు చెందిందని, పలువురు నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని, ప్రజాధనం ముడిపడి ఉన్నందున దివాలాకు అనుమతించలేమని ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. దివాలా పరిష్కార ప్రక్రియ దరఖాస్తును అనుమతించడానికి ముందు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నించాలని బ్యాంకులతోపాటు ఆన్‌రాక్ యాజమాన్యానికి ట్రైబ్యునల్ సూచించింది.

బ్యాంకుల భిన్నాభిప్రాయాలు: ఆన్‌రాక్ దరఖాస్తును ఎన్‌సీఎల్‌టీ తిరస్కరించగా బ్యాంకుల కన్సార్టియం సెప్టెంబరులో సమావేశమైంది. ఆన్‌రాక్ రూ.1,250 కోట్లు ఓటీఎస్ కింద ప్రతిపాదించింది. దీనికి కన్సార్టియం అంగీకరించకపోవడంతో అక్టోబరులో మరోసారి సమావేశమయ్యారు. మరో రూ.25 కోట్లు చెల్లించడానికి వ్యవస్థాపకులు ఆమోదించారని ఆన్‌రాక్ ఫైనాన్స్ డైరెక్టర్ గణపతిరావు ఈ సందర్భంగా వెల్లడించారు. రుణానికి హామీదారుగా ఉన్న పి.ప్రతాప్‌రెడ్డి తన ఆస్తులను విక్రయించి ఈ మొత్తాన్ని చెల్లిస్తారని చెప్పారు. ప్రతాప్‌రెడ్డి హామీ రూ.560 కోట్లకే పరిమితమైనప్పటికీ రూ.1275 కోట్లు ఆస్తులను విక్రయించి చెల్లిస్తారని సమావేశంలో ప్రకటించారు. బ్యాంకు అధికారులు సుదీర్ఘంగా చర్చించి ఎన్‌సీఎల్‌టీ ద్వారా భూమి, ఇతర ఆస్తుల విక్రయంలో జాప్యం జరుగుతుందని, సులభమైన పరిష్కారాన్ని 2017 డిసెంబరు 13లోగా కనుగొనాలని నిర్ణయానికి వచ్చాయి. భవిష్యత్తులో ఏపీ ప్రభుత్వం ఒప్పందం పునరుద్ధరించడంపై అనిశ్చితి ఉండటంతో ఆన్‌రాక్ కంపెనీకి నిర్వహణ మూలధనం (వర్కింగ్ క్యాపిటల్) సమకూర్చడానికి బ్యాంకులు వెనుకంజ వేశాయి. ప్రతాప్‌రెడ్డి వ్యక్తిగత హామీతోపాటు ఫ్యాక్టరీ, ఇతర ఆస్తులుండటంతో ఓటీఎస్ మొత్తం పెంచమని డిమాండ్ చేయాలని ఐఓబీ డీజీఎం ప్రతిపాదించారు. ఈ విషయాన్ని వ్యవస్థాపకుల దృష్టికి తీసుకెళ్లగా నిస్సహాయత వ్యక్తం చేశారంటూ ఎస్‌బీఐతోపాటు మిగిలిన బ్యాంకులు వత్తాసు పలికి ఓటీఎస్‌కు అంగీకరిస్తున్నట్లుగా ప్రతిపాదన పంపారు. ఎస్‌బీఐ, పీఎన్‌బీ, యూబీఐ, యునైటెడ్ బ్యాంక్, యాక్సిస్, ఇండియన్, జేఎం ఫైనాన్షియల్, బరోడా, కెనరా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, లక్ష్మీ విలాస్ బ్యాంకులు ఓటీఎస్‌కు అంగీకరించాయి. యూకో బ్యాంకు, ఆంధ్ర బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, ఎల్ఐసీ, విజయ బ్యాంకుల ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐఓబీ బ్యాంకు జీఎం ఓటీఎస్ ప్రతిపాదనను తిరస్కరించారు. ఆన్‌రాక్ ప్రతిపాదించిన రూ.1275 కోట్లకంటే యంత్రాల ప్రస్తుత విలువ ఎక్కువగా ఉంటుందని, ఓటీఎస్ కాకుండా మరో విధంగా రుణాలను తిరిగి రాబట్టుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

ఆర్‌బీఐ ఆదేశాలతో కదిలిన ఎస్‌బీఐ

ఓవైపు ఓటీఎస్‌కు ఎస్‌బీఐ ఆమోదం తెలపగా.. మరోవైపు రుణాల వసూలకు చర్యలు చేపట్టాలని రిజర్వు బ్యాంక్ ఆదేశాలు జారీ చేసింది. రుణంలో 60 శాతం కంటే ఎక్కువ నిరర్థక ఆస్తులున్న కంపెనీలపై దివాలా కోడ్ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిసెంబరు 27న లేఖ రాసింది. దీంతో తనకు రావాల్సిన రూ.677.32 కోట్లను రాబట్టుకోవడానికి ఆన్‌రాక్‌పై దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కోరుతూ ఎన్‌సీఎల్‌టీలో ఎస్‌బీఐ దరఖాస్తు చేసింది. ఎస్‌బీఐ చర్యపై ఆన్‌రాక్.. హైకోర్టును ఆశ్రయించి ఎన్‌సీఎల్‌టీలో విచారణపై స్టే తెచ్చుకుంది. అయితే ఓటీఎస్ ప్రతిపాదనలో భాగంగా ఈ నెల 31లోగా రూ.275 కోట్లు చెల్లించాలని ఆన్‌రాక్‌కు హైకోర్టు స్పష్టం చేసింది.

వ్యక్తిత్వమున్న నాయకుల వెంట నిలవండి

ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపు



పట్నా: మంచి వ్యక్తిత్వం, నిజాయితీ, నైతిక విలువలు, సామర్థ్యం కలిగిన నాయకుల వెంట నిలవాలని ప్రజలను ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కోరారు. ఎన్నికల వ్యవస్థ నుంచి కులం, మతం, నగదులను కూకటివేళ్లతో పెకలించాలని పిలుపునిచ్చారు. మూడు రోజుల బిహార్ దివస్ ప్రారంభ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. మహిళా సాధికారత అనేది మన ప్రాచీన సంస్కృతుల్లో మిళితమైందని చెప్పారు. "భారత మాత అనే అంటాం కానీ భారత పిత కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. 'అన్ని రంగాల్లోనూ భారతీయులు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో తామేంటో నిరూపించుకున్నారు'అని వ్యాఖ్యానించారు. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, పెప్సికో సీఈవో ఇందిరా నూయిలను ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. అణు బాంబు కంటే అహింసే శక్తిమంతమైనదని మహాత్మా గాంధీ చెప్పిన వ్యాఖ్యలనూ వెంకయ్యనాయుడు గుర్తుచేసుకున్నారు.

గ్రహం అనుగ్రహం

23–3–2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
షష్ఠి: మ. 12-10 తదుపరి సప్తమి
రోహిణి నక్షత్రం: సా. 5-07 తదుపరి మృగశిర
అమృత ఘడియలు: మ. 2-05 నుంచి 3-36 వరకు
వర్జ్యం: ఉ. 9-32 నుంచి 11-03 వరకు
తిరిగి రా. 10-22 నుంచి 11-52 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-30 నుంచి 9-18 వరకు
తిరిగి మ. 12-31 నుంచి 1-19 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6-06; సూర్యాస్తమయం: సా.6-07

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	41.0	27.0
హన్మకొండ	40.0	23.0
మహబూబ్‌నగర్	39.5	24.5
రామగుండం	39.0	23.2
కరీంనగర్	38.5	23.0
ఆదిలాబాద్	38.3	18.5
మెదక్	37.9	20.9
హైదరాబాద్	37.8	23.3
సూర్యాపేట	37.0	27.0
నిజామాబాద్	37.0	25.0
ఖమ్మం	37.0	22.0

రైతులక్ష్మి కాదు.. 'రైతుబంధు'

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రైతులకు పెట్టుబడి సాయం అందించే పథకం పేరు గతంలో అనుకున్నట్లు 'రైతులక్ష్మి' కాదని ముఖ్యమంత్రి దాన్ని 'రైతుబంధు'గా మార్చారని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి స్పష్టం చేశారు. 'రైతుబంధు' పథకం అమలును బ్యాంకు, వ్యవసాయ శాఖ అధికారులు సవాలుగా తీసుకోవాలన్నారు. తెలంగాణ సచివాలయంలో గురువారం ఆయన పెట్టుబడి పథకంలో చెక్కుల పంపిణీలో ఎదురయ్యే సాంకేతిక అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రతి రైతుకు సహకారం అందించి తద్వారా వ్యవసాయ ఉత్పత్తిని పెంపొందించాలనేదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని వివరించారు. పథకానికి సంబంధించిన పోర్టల్‌లో అర్హులైన రైతుల వివరాలు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీలో ఎలాంటి పక్షపాతానికీ తావుండదన్నారు. బ్యాంకు అధికారులు క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ ఎం.జగన్‌మోహన్, పలువురు ఉన్నతాధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

జవాబులు రాసి విద్యార్థులకు చేరవేత!

- ఎంఈవో సహా పదిమందిపై క్రిమినల్ కేసులు
- ఏడుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

కొడిమ్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రంలో మాల్ ప్రాక్టీస్‌కు సహకరిస్తున్నారనే కారణంగా ఎంఈవో, నలుగురు ప్రభుత్వ, నలుగురు ఒప్పంద ఉపాధ్యాయులు, సీఆర్‌పీతో సహా పదిమందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఇదే ఘటనకు సంబంధించి ఏడుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం మండల కేంద్రంలోని కె.సతీష్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో కూర్చుని కొందరు పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నలను తెలుసుకుంటూ వాటికి సమాధానాలు రాసి పంపుతున్నారనే సమాచారంతో ఎస్సై సతీష్‌కుమార్ ఆ ఇంటిపై దాడి చేశారు. కొడిమ్యాల ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తిని సత్యనారాయణగౌడ్, కోనాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు వడ్లకొండ రమేష్, కస్తూర్బా బాలికల పాఠశాల ప్రత్యేకాధికారిణి లింగవ్వలను అదుపులోకి తీసుకోగా రాంసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ఒప్పంద ఉద్యోగులైన కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు జి.పద్మ, రాధ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆరుగురితో పాటు ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, కోనాపూర్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరావు, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, సీఆర్‌పీ చంద్రమోహన్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఇంటి యజమాని సతీష్ సహా పోలీసులకు పట్టుబడిన, పారిపోయిన ఏడుగురిని సస్పెండ్ చేస్తున్నామని డీఈవో తెలిపారు. ఇదిలా ఉండగా పరీక్ష కేంద్రం నుంచి ప్రశ్నపత్రంలోని ప్రశ్నలను బయటకు ఎవరు తెచ్చారనే అంశంపై విచారణ చేస్తున్నట్లు సీఐ నాగేందర్ తెలిపారు. జగిత్యాల డీఎస్పీ భద్రయ్య నిందితులను విచారించి వివరాలు తెలుసుకున్నారు.

పత్రికా స్వేచ్ఛ పారదర్శకంగా ఉండాలి: మన్మోహన్

కరణ్‌థాపర్‌కు జీకే రెడ్డి స్మారక పురస్కారం


కరణ్‌థాపర్‌కు జి.కె.రెడ్డి స్మారక జాతీయ అవార్డును బహూకరిస్తున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

ఈనాడు, దిల్లీ: పత్రికా స్వేచ్ఛ పారదర్శకంగా ఉండాలని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చెప్పారు. గురువారమిక్కడ టీఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ పాత్రికేయుడు జీకే రెడ్డి స్మారకార్థం ఏటా ఇచ్చే జాతీయ పురస్కార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టీఎస్సార్ ఫౌండేషన్ అధ్యక్షుడు, ఎంపీ సుబ్బరామిరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి కరణ్‌సింగ్, ఎంపీ ఆనంద్‌శర్మల సమక్షంలో ప్రముఖ పాత్రికేయుడు కరణ్ థాపర్‌కు అవార్డుతోపాటు రూ.5 లక్షల నగదు బహుమతి, బంగారు పతకం అందజేశారు. అనంతరం మన్మోహన్ మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడంలో పత్రికల పాత్ర ఎంతో ఉందన్నారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ పి.జె.కురియన్, ఎంపీలు- కేవీపీ రామచంద్రరావు, బుట్టా రేణుక, నటి షర్మిలా టాగోర్ తదితరులు హాజరయ్యారు.

జులై తర్వాత 'ఆయుష్మాన్ భారత్'

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన జాతీయ ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం-'ఆయుష్మాన్ భారత్ (ఏబీ-ఎన్‌హెచ్‌పీఎం)' అమలుకు రంగం సిద్ధమవుతోంది. ఈ పథకానికి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపిన నేపథ్యంలో- ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా గురువారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) వివరాలను వచ్చే నెలాఖరుకల్లా రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తామని తెలిపారు. ఆసుపత్రుల కేటాయింపు, ఐటీ వ్యవస్థల పరిశీలన జులై మాసాంతానికి పూర్తవుతుందన్నారు. ఆ తర్వాత ఎప్పుడైనా ఆయుష్మాన్ భారత్‌ను ప్రారంభించే అవకాశమున్నట్లు మంత్రి వెల్లడించారు. ఎస్ఈసీసీ వివరాలను ఆధారం చేసుకుని- సమాజంలో అట్టడుగు, అనారోగ్య ప్రభావిత వర్గాల వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి మొత్తం 50 కోట్ల మంది (10.36 కోట్ల కుటుంబాలు) దీని పరిధిలోకి వస్తారు. ఈ పథకం కింద ఒక్కో కుటుంబ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల వరకూ కేంద్రం భరిస్తుంది.

వచ్చేనెల 15 నాటికి ప్యాకేజీల ఖరారు

బీమా సంస్థలు, ట్రస్టులు, సొసైటీలు లేదా వీటి సమ్మిళిత సంస్థల ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేయాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ఆరోగ్య విపత్తు నుంచి అణగారిన వర్గాలను ఆదుకునేందుకు ఎంతో దార్శనికతతో మోదీ ఈ పథకాన్ని రూపొందించారని ఆయన చెప్పారు. ఏప్రిల్ 15 నాటికల్లా వైద్య ప్యాకేజీలను కేంద్రం ఖరారుచేసే అవకాశమున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ పథకం ప్రారంభ ఆర్థిక సంవత్సరాలకు (2018-20) సంబంధించి కేంద్రం రూ.10 వేల కోట్లు కేటాయించినట్లు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

పాక్‌కు శక్తిమంతమైన క్షిపణి గమన వ్యవస్థ

సరఫరా చేసిన చైనా

బీజింగ్: బహుళ అస్త్రముఖ(మల్టీ వార్‌హెడ్) క్షిపణుల అభివృద్ధిని వేగంపరిచేందుకు దోహదపడే శక్తిమంతమైన క్షిపణి గమన వ్యవస్థను పాకిస్థాన్ సొంతం చేసుకుంది. తనకు అతిపెద్ద ఆయుధ సరఫరాదారు అయినా చైనా నుంచి దీనిని పాక్ కొనుగోలు చేసింది. అత్యాధునికమైన గమన వ్యవస్థ (ట్రాకింగ్ సిస్టమ్)ను తమ మిత్ర దేశానికి అందించామని, కొత్త క్షిపణుల అభివృద్ధికి సంబంధించిన ప్రయోగాలను పాక్ సైన్యం ఇప్పటికే ప్రారంభించిందని చైనా అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్)కు చెందిన శాస్త్రవేత్త ఝెంగ్ మెంగ్వే వెల్లడించినట్లు హాంగ్‌కాంగ్ నుంచి వెలువడే సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పేర్కొంది. భారత్ వద్ద ఉన్న ఖండాంతర క్షిపణి అగ్ని-5ని సమర్థంగా ఎదుర్కోవాలంటే పాకిస్థాన్ వద్ద ఒకే సమయంలో బహుళ లక్ష్యాలను నిర్దేశించుకొని, స్వయంచాలితంగా గురిని నిర్దేశించుకోగల క్షిపణి గమన వ్యవస్థలు ఉండటం అవసరమేనని ఆ శాస్త్రవేత్త అభిప్రాయపడినట్లు తెలిపింది.

ఎల్ఎల్ఎం పరీక్ష రాసిన ఆర్మూర్ ఎమ్మెల్యే



సుబేదారి (వరంగల్), న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి వరంగల్ అర్బన్ జిల్లా సుబేదారిలోని న్యాయ కళాశాలలో జరుగుతున్న పీజీ (ఎల్ఎల్ఎం) పరీక్షను గురువారం రాశారు. ఆయన హన్మకొండ కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఆదర్శ కళాశాలలో ఎల్ఎల్ఎం చేస్తున్నారు. గురువారం మొదటి సంవత్సరం ప్రథమ సెమిస్టర్ రెండో పరీక్షకు హాజరయ్యారు.

ఆరు కోట్ల మీటర్లు.. ఆరునెలల ఉపాధి

- రాజన్న సిరిసిల్ల జిల్లాకు బతుకమ్మ చీరల ఆర్డర్లు
- బడ్జెట్‌లో రూ.250 కోట్ల కేటాయింపు

ఈనాడు డిజిటల్ - సిరిసిల్ల


మరమగ్గాల కార్ఖానాలో ఉత్పత్తవుతున్న బతుకమ్మ చీరలు

నిరుపేదలకు ప్రభుత్వం దసరా కానుకగా అందజేసే బతుకమ్మ చీరల వస్త్రోత్పత్తుల ఆర్డర్లు రాజన్నసిరిసిల్ల జిల్లాకు లభించాయి. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కార్మికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో రాష్ట్రానికి అవసరమైన వస్త్రాలను స్థానికంగానే కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.250 కోట్ల నిధులను కేటాయించింది. గతేడాది జులై చివర్లో బతుకమ్మ చీరల వస్త్రోత్పత్తికి ఆర్డర్లు ఇచ్చారు. జిల్లాలో 40శాతం ఉత్పత్తికాగా మిగతావి సూరత్ నుంచి కొనుగోలు చేశారు. గత అనుభవాల దృష్ట్యా మంత్రి కేటీఆర్ ప్రభుత్వ పథకాలకు అవసరమైన వస్త్రాలను రాష్ట్రంలోని చేనేత, జౌళిశాఖ ద్వారానే తయారుచేయించి.. కొనేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈమేరకు జనవరి నుంచే ఆర్వీఎం, అంగన్‌వాడీ చీరలు, గురుకులాలు, వసతిగృహాల వస్త్రోత్పత్తుల ఆర్డర్లు జిల్లాకు కేటాయించారు. వస్త్రోత్పత్తి దాదాపు పూర్తయింది. సోమవారం నుంచి బతుకమ్మ చీరలకు సంబంధించిన ఆరుకోట్ల మీటర్ల ఆర్డర్లను జిల్లాలోని వస్త్రోత్పత్తిదారులకు పంపిణీ ప్రారంభించనున్నారు.

వేలాది కార్మికులకు ఉపాధి

జిల్లాలోని వంద మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్(మ్యాక్స్) సొసైటీలు, 321 ఎస్ఎస్ఐ యూనిట్ల పరిధిలో 32వేల మరమగ్గాలున్నాయి. వీటిలో 25వేల మరమగ్గాలపై సెప్టెంబరు వరకు బతుకమ్మ చీరల ఉత్పత్తి జరుగుతుంది. 1200 మంది ఆసాములు, 28 వేల మంది కార్మికులు ఆర్నెల్లు ఉపాధి పొందుతారు. ఒక్కో చీరపై ప్రభుత్వం రూ.250 ఖర్చుచేసేలా నిర్ణయించారు. ఇక్కడ రెండురకాల వస్త్రోత్పత్తులు జరుగుతాయి. రెండు రకాల్లోను బంగారువర్ణంలో అంచు ఉంటుంది. ఒకరకం వివిధ వర్ణాల్లో ఉండగా.. మరొకటి తెలుపు రంగులో ఉంటుంది. దీనిపై వివిధ డిజైన్లు ముద్రిస్తారు. ఈసారి ప్రాసెసింగ్, రంగుల అద్దకం రంగారెడ్డి జిల్లాలోని 10 కంపెనీలకు అప్పగించారు.

600 రకాల ఆకర్షణీయ ముద్రణలు

ఇక్కడ తయారయ్యే చీర 5.5 మీటర్లుగా ఉంటుంది. చీరల రంగు.. కొంగుల్లో ఆకర్షణీయమైన ముద్రణలకు రాష్ట్రంలోని మహిళా ఐఏఎస్‌లు, మహిళా శాసనసభ్యులతో చేనేత, జౌళిశాఖ కమిటీని ఏర్పాటు చేసింది. సుమారు 600 రకాల ముద్రణలను చీరలపై అద్దనున్నారు. వీటితోపాటు రంజాన్ కానుకల వస్త్రోత్పత్తి ఆర్డర్లను ఇక్కడి టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు అందజేశారు. రూ.15కోట్ల విలువైన 40లక్షల బహుమతి ప్యాక్‌లలో చీరలు, కుర్తాపైజామా.. పంజాబీ దుస్తులు ఉంటాయి.

మేకు మింగి బాలుడి మృతి


రిశ్విత్ (పాత చిత్రం), బాలుడు మింగిన మేకు (అంతర చిత్రంలో)

గాంధారి, న్యూస్‌టుడే: ఇనుప మేకు మింగడంతో మూడేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని కరక్‌వాడిలో చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన భాస్కర్‌రావు, రాధబాయిల కుమారుడు రిశ్విత్ బుధవారం రాత్రి ఇనుప మేకు మింగడంతో అస్వస్థతకు గురయ్యాడు. గుర్తించిన కుటుంబీకులు మండల కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చూపించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మూడు రంగాల్లో పట్టణాభివృద్ధి జరగాలి

- కర్ణాటక మంత్రి రోషన్‌బేగ్


సమావేశంలో ప్రసంగిస్తున్న రోషన్‌బేగ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆకర్షణీయ నగరాల(స్మార్ట్ సిటీస్) లక్ష్యం నెరవేరాలంటే మూడు రంగాల్లో అభివృద్ధి సాధించాలని కర్ణాటక రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి రోషన్‌బేగ్ అభిప్రాయపడ్డారు. రైల్వే, సమాచార, రహదారి వ్యవస్థలను అత్యాధునిక పద్ధతుల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన స్మార్ట్ అర్బనైజేషన్ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగర ప్రజల జీవనప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా స్మార్ట్ సిటీస్ కార్యక్రమానికి రూపకల్పన జరిగిందన్నారు. 1950లో ప్రపంచవ్యాప్తంగా నగర జనాభా 40శాతం ఉంటే ప్రస్తుతం అది 50 శాతానికి చేరుకుందని చెప్పారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాలు విస్తరించాల్సిన అవసరముందన్నారు. పట్టణాభివృద్ధికి అడ్డుపడుతున్న పేదరికం, సాంకేతిక సమస్యలు, పర్యావరణ ఇబ్బందులు వంటి సవాళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎదుర్కోవాలని తెలిపారు. భద్రత, నాణ్యమైన విద్యకు స్మార్ట్ సిటీస్ మిషన్‌లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. కర్ణాటక పట్టణ అభివృద్ధిశాఖ అదనపు కార్యదర్శి మహేందర్‌జైన్ మాట్లాడుతూ.. కేంద్రం స్మార్ట్ సిటీస్ మిషన్ కోసం కేటాయించిన రూ.వంద కోట్లు సరిపోవడం లేదన్నారు. కార్యక్రమంలో స్మార్ట్ సిటీస్ కౌన్సిల్ ఇండియా వ్యవస్థాపక సంచాలకులు ప్రతాప్ పడోడె, చైనా చాంబర్ ఆఫ్ కామర్స్(సీసీపీఎంఈ) ఉపాధ్యక్షులు షి యోంగ్ హాంగ్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తు వ్యక్తిగత వివరాల్లో సవరణకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: మహిళాశిశు సంక్షేమ శాఖలో సూపర్‌వైజర్ గ్రేడ్-1, విస్తరణ అధికారుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వ్యక్తిగత వివరాల్లో మార్పులు చేసుకునేందుకు 'ఎడిట్' అవకాశమిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఈ నెల 24 నుంచి 27 వరకు వివరాలను ఎడిట్ చేసుకోవాలని పేర్కొన్నారు.

బాసర ఆలయంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బాసర, న్యూస్‌టుడే: నిజామాబాద్ పట్టణానికి చెందిన ప్రసాద్‌గౌడ్ అనే మతిస్థిమితం లేని వ్యక్తి గురువారం బాసర సరస్వతీ ఆలయంలో వీరంగం సృష్టించాడు. అమ్మవారి చెంత ఆత్మహత్యకు పాల్పడాలని భావించి కత్తితో గొంతు, చేయి కోసుకుని గర్భగుడిలో ప్రవేశించటానికి విఫలయత్నం చేశాడు. వేకువజామున ఆలయానికి వచ్చిన ప్రసాద్ ఆలయంలో అలజడి సృష్టించాడు. అంతరాలయంలో విధులు నిర్వర్తించే తాత్కాలిక ఉద్యోగి విశ్వనాథ్, ఇద్దరు అర్చకులు ప్రతిఘటించటంతో వారిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. చివరకు ఆలయ సిబ్బంది ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. ఏడాది క్రితం కూడా ప్రసాద్ ఇలాగే వ్యవహరించడం గమనార్హం.

ప్రమాదం బారిన పడినా.. పరీక్షకు!


అంబులెన్స్‌లో పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థి రవితేజ

ప్రమాదంలో కాలు విరిగినా మొక్కవోని సంకల్పంతో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడో విద్యార్థి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలకు చెందిన రవితేజ మంగళవారం రాత్రి పాఠశాలలో చదువుకొని తిరిగి వసతి గృహానికి వెళ్తుండగా ఓ వ్యక్తి నిర్లక్ష్యంగా వాహనం నడిపి అతన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతని కాలు విరగడంతో శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. అయితే ఇప్పుడు శస్త్రచికిత్స చేస్తే పరీక్షలు రాయలేనని పరీక్షల తర్వాత ఇబ్బంది లేదంటే అప్పుడే చేయాలని రవితేజ వైద్యులను కోరాడు. విద్యార్థి తపనను చూసి కొన్నిరోజుల తర్వాత శస్త్రచికిత్స చేసిన ఫరవాలేదని వైద్యులు పరీక్షలకు అనుమతించారు. దీంతో రోజూ ఆస్పత్రిలో చదువుకుంటున్న రవితేజను తల్లిదండ్రులు అంబులెన్స్‌లో పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చి రాయించి తీసుకెళ్తున్నారు.

- న్యూస్‌టుడే, వీరన్నపేట (మహబూబ్‌నగర్)

దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు బోగీ వద్ద పొగలు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో ఒక్కసారి పొగలు రావడంతో అప్రమత్తమైన సిబ్బంది వెంటనే స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. దిల్లీకి వెళ్లే హజ్రత్‌నిజాముద్దీన్ దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం మధ్యాహ్నం 1.25గంటల సమయంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతుండగా 3వ నెంబరు బోగీ నుంచి షార్ట్ సర్క్యూట్ కారణంగా దట్టమైన పొగలు వచ్చాయి.

అతిథి అధ్యాపకుల గౌరవ వేతనం పెంపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల గౌరవ వేతనాన్ని గంటకు రూ.100 నుంచి రూ.300కు పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వారిచే బోధన నెలకు 72 గంటలకు మించకూడదు. అంటే నెలకు వారికి గరిష్ఠ వేతనం రూ.21,600 దాటరాదు. తాజా నిర్ణయం వల్ల 184 మంది ప్రయోజనం పొందనున్నారు.

గ్రూప్-2 ఓఎంఆర్ షీట్ల పరిశీలనపై హైకోర్టుకు నివేదిక

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) చేపట్టిన గ్రూప్-2 రాతపరీక్షల్లో ఓఎంఆర్ షీట్లను పరిశీలించిన కమిటీ గురువారం హైకోర్టుకు సీల్డ్ కవర్లో నివేదిక సమర్పించింది. అధిక మార్కులు సాధించిన 5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ల పరిశీలనకు హైకోర్టు ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో కమిటీ ఏర్పాటు చేయడం తెలిసిందే. నివేదిక ప్రతులను వ్యాజ్యాల్లోని న్యాయవాదులకు అందజేసే నిమిత్తం న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. ఈ నెల 28న వ్యాజ్యాలపై విచారణ ఉంటుందని స్పష్టంచేశారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీచేశారు. గ్రూప్-2 పోస్టుల భర్తీ నిమిత్తం 2015 డిసెంబర్ 30న, 2016 సెప్టెంబర్లో అనుబంధ నోటిఫికేషన్లు జారీచేసి పరీక్ష నిర్వహించారు. ఓఎంఆర్ షీట్లలో బబ్లింగ్, వైట్నర్ వినియోగం, వ్యక్తిగత వివరాల నమోదులో తప్పులు చేసిన వారికి అవకాశం కల్పించడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే.

కర్ణాటక అనధికార ప్రాజెక్టులను నిలిపేయండి

కేంద్ర జలసంఘానికి తెలంగాణ లేఖ

ఈనాడు, హైదరాబాద్: కృష్ణా నదిపై కర్ణాటక అనధికారికంగా నిర్మిస్తున్న బ్యారేజీలను నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జలసంఘాన్ని కోరింది. గతంలోనూ ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకొచ్చినా పనులు ఆగలేదని పేర్కొంది. ఈ బ్యారేజీల వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లుతుందని, తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ కేంద్ర జలసంఘానికి గురువారం లేఖ రాశారు. కృష్ణా నదిపై కర్ణాటక నిర్మించిన గూగల్ బ్యారేజీలో నీటిని నిల్వ చేయవద్దని, గుర్జాపూర్ బ్యారేజి నిర్మాణాన్ని కొనసాగించవద్దని, దీనివల్ల దిగువన ఉన్న తెలంగాణకు నేరుగా నష్టం వాటిల్లుతుందని గత ఏడాదే జలసంఘం దృష్టికి తెచ్చామని లేఖలో పేర్కొన్నారు. ఈ బ్యారేజీల నిర్మాణం కృష్ణా జల వివాద ట్రైబ్యునల్ తీర్పును ఉల్లంఘించడమేనన్నారు. బ్యారేజీల నిర్మాణంతో కర్ణాటక కేటాయించిన నీటి కంటే ఎక్కువ వినియోగించుకోవడంతో ఇప్పటికే నష్టపోయిన తెలంగాణకు మరింత నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. నీటి నిల్వ, నిర్మాణాలను నిలిపివేయాలని పదేపదే కేంద్ర జలసంఘాన్ని, కర్ణాటక ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రధాన నదిపై ఇంత పెద్ద బ్యారేజీలు నిర్మిస్తే ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి తెలంగాణకు న్యాయంగా రావలసిన వాటా రాదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ సరిహద్దులో గుర్జాపూర్ వద్ద నిర్మిస్తోన్న బ్యారేజి వల్ల ప్రవాహం మరింత తగ్గిపోతుందన్నారు. బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కు సమర్పించిన డీపీఆర్ ప్రకారం గూగల్ బ్యారేజి అప్పర్ కృష్ణా మూడు దశల్లోనూ భాగం కాదన్నారు. ఈ నేపథ్యంలో నీటి లభ్యత అనుమతి లేకుండా గూగల్‌లో నిల్వ చేయడం కానీ, గుర్జాపూర్ నిర్మాణాన్ని కొనసాగించడం కానీ చేయరాదని కర్ణాటకకు సూచించాలని లేఖలో ఈఎన్‌సీ కోరారు.

ఎన్డీటీవీ నుంచి రావాల్సిన రూ.131 కోట్ల బకాయిని నిలుపుదల చేసేందుకు ఆదాయపు పన్ను శాఖ నిరాకరించింది. ఆంగ్ల టీవీ ఛానెల్ చేసుకున్న దరఖాస్తును గురువారం తిరస్కరించింది. బకాయిని మూడు వాయిదాల్లో చెల్లించాలని ఐ.టి.శాఖ ముఖ్య కమిషనర్ తన ఉత్తర్వులో స్పష్టం చేశారు.

ఉద్యోగ అవకాశాలు

సెన్సెక్స్ ▼ 130	నిఫ్టీ ▼ 41	డోజోన్స్ 24,419 ▼ 263	నాస్‌డాక్ 7,277 ▼ 68	రూపాయి 65.11 ▲ 10 పైసలు (ఒక అమెరికా డాలరుకు)	ముడి చమురు 69.06 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)
33006	10115				

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)


నిఫ్టీ	22న	మార్పు%
VEDANTA	291.80	2.12
ONGC	178.90	1.91
TATA MOTORS	338.20	1.30
INDUSIND BANK	1753.10	1.25
RELIANCE INDU	908.15	1.25
HINDALCO INDU	216.80	0.98
GAIL (INDIA)	438.40	0.77
SUN PHARMA	508.40	0.77

గ్రహణం (-)


నిఫ్టీ	22న	మార్పు%
BPCL	414.70	-3.70
HPC	342.85	-2.96
SBI	241.55	-2.60
WIPRO	288.45	-2.30
ICICI BANK	283.25	-2.06
MARUTI SUZUKI	8696.55	-2.01
M& M	730.85	-1.95
CIPLA	540.75	-1.87

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.27	68.72	బహ్రెయిన్ దీనార్	160.49	183.92
పౌండ్ స్టెర్లింగ్	83.91	97.31	కువైట్ దీనార్	179.57	223.54
యూరో	73.23	84.92	ఒమన్ రియాల్	157.17	179.81
జపనీస్ యెన్/100	56.05	65.02	సౌదీ రియాల్	15.76	18.67
ఆస్ట్రేలియా డాలరు	45.87	53.08	యూఏఈ దిర్హమ్	16.13	18.86
సింగపూర్ డాలరు	45.14	53.47	మలేషియా రింగిట్	14.84	18.25
థాయ్ బాత్/100	190.02	227.25	చైనీస్ యువాన్	7.29	11.83



చివర్లో బేజారు

- మళ్లీ వాణిజ్య యుద్ధ భయాలు
- సెన్సెక్స్‌కు 130 పాయింట్ల నష్టం

సమీక్ష

సూచీల పరుగుకు అడ్డుకట్ట పడింది. ఫెడ్ రేట్ల పెంపును పెద్దగా పట్టించుకోని మార్కెట్లు.. వాణిజ్య యుద్ధం విషయంలో మాత్రం కలవరపడ్డాయి. చైనాపై కొత్త ఆంక్షలు విధించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వెలువడటంతో ఆసియా, ఐరోపా మార్కెట్లు డీలాపడ్డాయి. ఫలితంగా స్థిరాస్తి, యంత్ర పరికరాలు, వాహన, బ్యాంకింగ్ షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ముడిచమురు ధరలు తిరిగి పుంజుకోవడం సైతం ఇందుకు తోడైంది.

సెన్సెక్స్ ఉదయం 33,206.99 పాయింట్ల వద్ద సానుకూలంగానే ప్రారంభమైంది. అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 33,281.77 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత నష్టాల్లోకి జారుకున్న సూచీ.. 32,963.31 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 129.91 పాయింట్ల నష్టంతో 33,006.27 దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 40.50 పాయింట్లు కోల్పోయి 10,114.75 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,105.40-10,207.85 పాయింట్ల మధ్య కదలాడింది.

■ బ్యాంక్ నిఫ్టీ వీక్లీ డెరివేటివ్ ముగింపు నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, యెస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు 2.62 శాతం వరకు నష్టపోయాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 22 నష్టాలు చవిచూశాయి. ఎస్‌బీఐ 2.46%, ఎం అండ్ ఎం 2.14%, విప్రో 2.13%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.09%, మారుతీ సుజుకీ 2.01%, డాక్టర్ రెడ్డీస్ 1.60%, అదానీ పోర్ట్స్ 1.58%, యాక్సిస్ బ్యాంక్ 1.34%, ఎల్ అండ్ టీ 1.06%, టీసీఎస్ 0.86% చొప్పున డీలాపడ్డాయి. ఓఎన్‌జీసీ 1.85%, టాటా మోటార్స్ 1.29%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.29%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.22%, సన్ ఫార్మా 0.64%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 1.28% కోల్పోయింది. యంత్ర పరికరాలు 1.07%, టెక్ 0.99%, వాహన 0.94%, పీఎస్‌యూ 0.93%, ఐటీ 0.91%, మౌలిక 0.69% మేర నష్టాలు నమోదు చేశాయి.



నేటి మార్కెట్

సూచీలు నేడు స్వల్ప శ్రేణికి లోబడి చలించే అవకాశం ఉంది. చెప్పుకోదగిన పరిణామాలేవీ లేకపోవడం ఇందుకు కారణం. నిఫ్టీకి 10040 పాయింట్ల వద్ద గట్టి మద్దతు కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ ఈ స్థాయి దిగువకు వస్తే మరింత కిందకు పడిపోవచ్చని అంచనా వేస్తున్నారు. అదే 10250 ఎగువకు వెళ్తే సూచీ తిరిగి పుంజుకుంటుందని భావించొచ్చు. అమెరికా ఫెడ్ వడ్డీ రేటును పెంచిన నేపథ్యంలో మున్ముందు వడ్డీ రేట్ల పెంపుపై దూకుడుగా వెళ్తే ఎలాంటి ప్రభావం పడుతుందోనని మదుపర్లు విశ్లేషించుకునే అవకాశం ఉంది. మేధో సంపత్తి ఉల్లంఘనల నేపథ్యంలో చైనా దిగుమతి టారీఫ్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ ప్రకటన చేయొచ్చన్న వార్తలతో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది. నిఫ్టీ ప్రస్తుత స్థాయిల నుంచి పుంజుకుంటే సిమెంటు, లోహ, ప్రైవేట్ రంగ బ్యాంకుల షేర్లు సానుకూలంగా కదలాడేందుకు ఆస్కారం ఉంది.



ఐడబ్ల్యూఎన్ తెలంగాణ చైర్ ఉమన్‌గా శోభా దీక్షిత్

ఈనాడు, హైదరాబాద్: భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) అనుబంధ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యూఎన్) తెలంగాణ విభాగం చైర్ ఉమన్‌గా శోభా దీక్షిత్ నియమితులయ్యారు. ఆల్ఫా ఇండియా డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె గత ఏడాది కూడా ఈ బాధ్యతలను నిర్వహించారు. వైస్ చైర్ ఉమన్‌గా ద ఎంట్రప్రెన్యూరర్ జోన్ వ్యవస్థాపకురాలు, ఎండీ నందితా సేథి ఎంపికయ్యారు.

రూ.18,990 నుంచీ 'రీకనెక్ట్' ఏసీలు



హైదరాబాద్: ఎక్కువ విద్యుత్ బిల్లులు రాకుండా వినూత్న సాంకేతికతతో తమ ఏసీలను తీసుకొచ్చినట్లు రీకనెక్ట్ వెల్లడించింది. అత్యాధునిక నాణ్యత కోసం మూడు స్థాయిల్లో పరీక్షలు, తనిఖీలు జరిపినట్లు తెలిపింది. అందుకే అయిదేళ్ల వారెంటీని ఇస్తున్నట్లు వివరించింది. 100 శాతం రాగి(కాపర్)తో తయారు చేసిన కారణంగా తమ ఏసీలు వేగంగా చల్లదనాన్ని అందిస్తాయని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఓల్టేజీ హెచ్చుతగ్గులను కూడా తట్టుకునే సాంకేతికత ఉండడంతో రీకనెక్ట్ ఏసీలకు స్టెబిలైజర్ అక్కర్లేదు. 130వీ నుంచి 265వీ వరకు ఓల్టేజీలను తట్టుకోగలవు. ప్రపంచస్థాయి డిజైన్లతో ఆకట్టుకునే ఈ ఏసీలకు విక్రయానంతర సేవలను ఆర్ఈఎస్‌క్యూతో అందించను'న్నట్లు ఆ ప్రకటనలో తెలిపింది. రూ.18,990 ధరతో మొదలయ్యే రీకనెక్ట్ ఏసీలు రిలయన్స్ డిజిటల్, జియో స్టోర్లలో లభ్యమవుతాయని వివరించింది.

మార్కెట్ కబుర్లు

- జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుబంధ సంస్థకు అనుబంధంగా ఉన్న జీవీకే ర్యాట్లే హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుకు ఇచ్చిన రూ.816 కోట్ల రుణాల వసూలుకు వన్-టైమ్ సెటిల్‌మెంట్ కుదుర్చుకోవడానికి **పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్** బోర్డు ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది.
- ఒక్కో షేరు రూ.71.18 చొప్పున మొత్తం 21.07 కోట్ల షేర్లను ప్రభుత్వానికి ప్రిఫరెన్షియల్ పద్ధతిలో కేటాయించి రూ.1500 కోట్ల నిధులను సమీకరించడానికి **అలహాబాద్ బ్యాంక్** వాటాదార్లు అంగీకారం తెలిపారు.
- **బినానీ సిమెంట్** దివాలా కేసుపై విచారణను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) పేర్కొంది. కాగా, దివాలా నిబంధనలను ఉల్లంఘించలేదని **అల్ట్రాటెక్ సిమెంట్** వెల్లడించింది. దాల్మియా భారత్ 1 బిలియన్ డాలర్ల బిడ్‌కు అప్పటికే రుణదాతలు అంగీకరించగా.. అల్ట్రాటెక్ సైతం బినానీ సిమెంట్‌లో 98.43 శాతం వాటా కొనుగోలుకు రూ.7270 కోట్లను ఆఫర్ చేసిన సంగతి తెలిసిందే.
- నరాల బలహీనతల చికిత్సలో ఉపయోగించే కొత్త రసాయన పదార్థాల(ఎన్‌సీఈలు)కు సంబంధించి నార్వే, దక్షిణ కొరియా, సింగపూర్‌ల నుంచి ఒక్కో పేటెంట్ చొప్పున పొందినట్లు **సువెన్ లైఫ్ సైన్సెస్** తెలిపింది. ఈ పేటెంట్లు వరుసగా 2027, 2034, 2036 వరకు చెల్లుబాటు అవుతాయి.
- అనుబంధ సంస్థ ప్రోమథాన్ హోల్డింగ్స్ యూకేలో 11.58 శాతం వాటాను ఎస్ఎస్‌జీ క్యాపిటల్‌కు రూ.450 కోట్లతో విక్రయించినట్లు **కాక్స్ అండ్ కింగ్స్** పేర్కొంది.
- ఉత్తరప్రదేశ్‌లో బాట్(నిర్మించి, నిర్వహించి, బదిలీచేసే) పద్ధతిలో రూ.3,400 కోట్ల రోడ్డు ప్రాజెక్టును ఎన్‌హెచ్ఏఐ నుంచి దక్కించుకున్నట్లు **ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్** పేర్కొంది.
- **డిష్ టీవీ ఇండియా, వీడియోకాన్ డీ2హెచ్** విలీనం పూర్తయింది. దీంతో 2.8 కోట్ల మంది వినియోగదార్లతో దేశంలోనే అతిపెద్ద డీటీహెచ్ సర్వీసు అందజేతదారుగా అవతరించింది.
- ఏప్రిల్ 13న జరగబోయే సమావేశంలో షేర్ల విభజన అంశాన్ని బోర్డు పరిశీలించనున్నట్లు **యునైటెడ్ స్పిరిట్స్** తెలిపింది.
- ఉత్తరప్రదేశ్‌లో కొత్త ఈపీసీ రోడ్డు ప్రాజెక్టు నిమిత్తం ఎన్‌హెచ్ఏఐ నుంచి రూ.677 కోట్ల ఆర్డరును **దిలీప్ బిల్డ్‌కాన్** దక్కించుకుంది.

మార్చి 31లోగా నిశ్చింతగా రిటర్న్‌లు దాఖలు చేయండి

- ఆదాయపు పన్ను విభాగం

దిల్లీ: మార్చి 31లోగా నిశ్చింతగా రిటర్న్‌లు దాఖలు చేయమని పన్ను చెల్లింపుదార్లకు ఆదాయపు పన్ను విభాగం తెలిపింది. 'మేం మిమ్మల్ని విశ్వసిస్తున్నాం. అలాంటప్పుడు మీకెందుకు భయం. అందుకే ఇప్పుడే రిటర్న్‌లను దాఖలు చేయండ'ని ఓ పత్రికా ప్రకటనలో పేర్కొంది. తనిఖీ లేదా దర్యాప్తు నిమిత్తం ఎంపిక చేసే రిటర్న్‌లు ఒక శాతం లోపే ఉంటాయని పేర్కొంది. మానవ ప్రమేయం లేకుండా ఈ ఎంపిక ప్రక్రియ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ ద్వారా జరుగుతుందని స్పష్టం చేసింది. 2017-18తో పాటు 2016-17 మదింపు సంవత్సరానికి ఆలస్యంగా లేదా సవరించిన రిటర్న్‌ల దాఖలుకు మార్చి 31 తుది గడువని పేర్కొంది. 'బ్యాంకు ఖాతాల్లో అధిక మొత్తంలో డిపాజిట్లు చేసినా, లావాదేవీలు నిర్వహించినా ఆ వివరాలను దయచేసి రిటర్న్‌ల్లో చూపించండ'ని తెలిపింది.

నగదు బదిలీ సంస్థలతో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: విదేశాల నుంచి వచ్చిన డబ్బును మన కరెన్సీలోకి మార్చుకునేందుకు వీలుగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు మూడు నగదు బదిలీ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. మనీగ్రామ్, ఆర్ఐఏ మనీ ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌ప్రెస్ మనీతో ఇక నుంచి బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందించనున్నాయి. ఇప్పటికే వెస్టర్న్ యూనియన్ బ్యాంకుతో కలిసి పనిచేస్తోంది. తెలంగాణలో 16 జిల్లాల్లో ఉన్న 404 శాఖల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్, క్రెడిట్) టి.యేసుపాదం తెలిపారు. నామమాత్రపు రుసుములతో ఈ నగదు బదిలీ సేవలను పొందవచ్చని చెప్పారు. బ్యాంకు ఛైర్మన్ వి.అరవింద్ తదితరుల సమక్షంలో ఈ ఒప్పందం కుదిరిందని తెలిపారు.

కో వర్కింగ్ స్పేస్‌కు పెరుగుతున్న ఆదరణ


- రీగస్ కంట్రీ మేనేజర్ హర్ష్ లాంబా

ఈనాడు, హైదరాబాద్: వ్యాపార సంస్థలు, అంకురాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కో వర్కింగ్ స్పేస్ కోసం చూస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోందని రీగస్ ఇండియా కంట్రీ మేనేజర్ హర్ష్ లాంబా అన్నారు. సంస్థలకు కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడంతోపాటు, వచ్చిన వెంటనే పని ప్రారంభించేందుకు వీలు ఉండటంతో వీటి వైపు మొగ్గు చూపిస్తున్నారని తెలిపారు. 2020 కల్లా దేశంలో కో వర్కింగ్ స్పేస్ మార్కెట్ కోటి చదరపు అడుగుల విస్తీర్ణానికి చేరే అవకాశముందన్నారు. దేశంలో ప్రస్తుతం 16 నగరాల్లో 104 రీగస్ కో వర్కింగ్ స్పేస్‌లు ఉన్నాయనీ, 24 నెలల్లో వీటి సంఖ్య రెట్టింపు చేసే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 8 కేంద్రాలున్నాయనీ, వీటి సంఖ్య కూడా పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. త్వరలో విశాఖపట్నం, విజయవాడలో కూడా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 1500 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రాంతాన్ని బట్టి ఒక్కో సీటుకు రూ.11,000-రూ.25,000 వరకూ వసూలు చేస్తున్నామనీ, కనీసం 5 సీట్లు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.



మహీంద్రా సమృద్ధి ఇండియా అగ్రి అవార్డుల ప్రదానం

దిల్లీ: మహీంద్రా అండ్ మహీంద్రాకు చెందిన వ్యవసాయ సామగ్రి విభాగం 2018గాను మహీంద్రా సమృద్ధి ఇండియా అగ్రి అవార్డు (ఎమ్ఎస్ఐఏఏ)లను ప్రకటించింది. వ్యవసాయం రంగానికి విలువైన సేవలందిస్తున్న రైతులు, సంస్థలను గుర్తించడం కోసం 2011లో ఎం అండ్ ఎం ఈ అవార్డులను ప్రవేశపెట్టింది. అవార్డుల కార్యక్రమానికి కేంద్ర వ్యవసాయ మంత్రి రాధా మోహన్ సింగ్ ముఖ్య అతిథిగా విచ్చేయగా.. వ్యవసాయ సహాయ మంత్రులు పర్షోత్తం రుపాలా, గజేంద్ర సింగ్ షెకావత్, క్రిష్ణ రాజ్‌లు అతిథులుగా హాజరయ్యారు. ఆవాలు, పత్తి పంటల విషయంలో పరిశోధన- అభివృద్ధి (ఆర్ అండ్ డీ) చేసినందుకు గాను మహీంద్రా సమృద్ధి కృషి శిరోమణి సమ్మాన్ (జీవన కాల సాఫల్య అవార్డు)ను డాక్టర్ దీపక్ పెంటాల్‌కు ప్రదానం చేశారు. 'నిజమైన హీరోలను గుర్తించడం కోసమే అవార్డులను ప్రవేశపెట్టాం. ప్రభుత్వం చేపడుతున్న వివిధ పథకాల్లో భాగస్వామ్యం కొనసాగించడం ద్వారా రైతులు ఆదాయానికి భద్రతనివ్వడమే మా లక్ష్యమ'ని మహీంద్రా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు.



కోడిగుడ్లు — 22న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	315	వరంగల్	317
చిల్లరగా (ఒక గుడ్డు)	3.75	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
23వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	315	నమక్కల్	360

ఆర్థిక పరిపుష్టితో సింగరేణి 'వెలుగు'

- అప్పులు లేని సంస్థగా అవతరణ
- రూ.6 వేల కోట్ల మిగులు

శ్రీరాంపూర్ (మంచిర్యాల), న్యూస్‌టుడే: దేశ ఆర్థికాభివృద్ధిలో తనదైన పాత్ర పోషిస్తున్న సింగరేణి గనులు, అప్పులు లేని సంస్థగా ఎదిగింది. నెలనెలా కార్మికుల జీతాల చెల్లింపునకు డబ్బుల కోసం తడుముకునే స్థితి నుంచి, మిగులు డబ్బున్న సంస్థగా ఎదిగింది. సింగరేణి బొగ్గును వినియోగించే పలు విద్యుదుత్పత్తి సంస్థల నుంచి దీర్ఘకాలిక బకాయిలు వసూలుతో పాటు బొగ్గు అమ్మకాలపై ఆదాయం, విద్యుత్తు కేంద్రం గడిస్తున్న లాభాలతో ఇది సాధ్యమైంది.

సింగరేణి నుంచి బొగ్గును కొనుగోలు చేసే ఏపీ జెన్‌కో, తెలంగాణ జెన్‌కో, కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీసీఎల్)ల నుంచి దీర్ఘకాలిక బకాయిలు సింగరేణికి అందడంతో, సంస్థ దాదాపు రూ.6 వేల కోట్ల మిగులు నిధులతో కళకళలాడుతోంది. సింగరేణి సంస్థ చరిత్రలో ఇంతటి ఆర్థిక పరిపుష్టి కలగడం ఇదే తొలిసారి. 1996-97 నాటికి రూ.1,219 కోట్ల సంచిత నష్టాలతో ఉన్న సింగరేణిలో యాజమాన్యం సంస్కరణలు చేపట్టింది. ఫలితంగా 2004 నాటికి నష్టాన్ని పూడ్చుకుని అప్పట్లో రికార్డు నెలకొల్పింది. సింగరేణి తీసుకున్న రూ.663 కోట్ల రుణంపై వడ్డీకి సంబంధించి 1999 జులైలో కేంద్రం మారటోరియం విధించింది. మారటోరియం ముగిశాక, వడ్డీ బకాయిలను సింగరేణి పూర్తిగా చెల్లించడంతో ఇప్పుడు ఎలాంటి అప్పులు లేని సంస్థగా రూపుదిద్దుకుంది.

మొండి బకాయిల వసూలు: సింగరేణికి బొగ్గు ఆధారిత విద్యుత్తు సంస్థల నుంచి బకాయిలు దాదాపుగా వసూలయ్యాయని అధికారవర్గాల సమాచారం. ఏపీ జెన్‌కో రూ.1,000 కోట్లు చెల్లించి, రూ.4 వేల కోట్లు సర్దుబాటు కింద చూపింది. తెలంగాణ జెన్‌కో రూ.1800 కోట్ల విలువైన రాయల్టీ, డివిడెండు, తదితరాలను సర్దుబాటు చేసినట్లు సమాచారం. కేపీసీఎల్, తమిళనాడు జెన్‌కో, తదితర సంస్థల నుంచి రూ.1000-1200 కోట్ల మేరకు సొమ్ము వసూలైంది. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గు అమ్మకాలు, విద్యుత్తు విక్రయం ద్వారా ఈ ఏడాది రూ.24 వేల కోట్లు లభించనుంది. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం రూ.1000 కోట్ల నుంచి రూ. 1100 కోట్ల మేరకు సింగరేణి లాభాలు గడించనుందని అంచనా.



మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ సింగరేణి భూగర్భగనిలో విధులు ముగించుకుని వస్తున్న కార్మికులు

భవిష్యత్తు మరింత ఆశాజనకం

రానున్న అయిదేళ్లలో సింగరేణి 6 భూగర్భ గనులు, మరో 6 ఉపరితల గనులు తవ్వడం ద్వారా అదనంగా ఏటా 21 మి. టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందించింది. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో ఉత్పత్తి చేస్తున్న 1200 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అదనంగా 800 మె.వా. విద్యుత్తు చేయనుంది. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని 500 మెగావాట్ల సౌర విద్యుత్తును ఉత్పత్తిచేయడానికి సింగరేణి కసరత్తు చేస్తోంది. 2022 నాటికి సింగరేణి మొత్తం 2,500 మె.వా. విద్యుత్తు ఉత్పత్తి చేయనుంది. అప్పుడు ఏటా రూ.34 వేల కోట్ల ఆదాయాన్ని విద్యుత్తు, బొగ్గు అమ్మకాల ద్వారా పొందుతుందని అంచనా. ఇది వాస్తవ రూపం దాల్చితే ఏటా సింగరేణికి రూ.2000 కోట్లు లాభం చేకూరనుంది.

ఎన్ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT &	358.25 (363.70) 3443184
AMBUJA CEMEN	228.25 (229.85) 3027467
ASIAN PAINTS	1107.10 (1103.55) 478426
AUROBIND PHA	557.40 (564.20) 1897302
AXIS BANK LT	518.20 (526.30) 7194256
BAJAJ AUTO L	2834.95 (2851.80) 325295
BAJAJ FINANC	1695.60 (1704.55) 1153716
BHARTI AIRTE	415.60 (418.20) 4850714
BHARTI INFRA	335.20 (337.15) 2264722
BOSCH LTD	17350.20 (17585.65) 15389
BPCL	414.70 (430.65) 4748632
CIPLA	540.75 (551.05) 1506405
COAL INDIA L	269.40 (270.90) 3383841
DR. REDDYS	2108.30 (2141.70) 410402
EICHER MOTOR	28030.50 (27980.85) 26132
GAIL	438.40 (435.05) 2574726
HCL TECH	930.55 (937.35) 1547643
HDFC	1809.55 (1817.85) 2664935
HDFC BANK	1867.75 (1858.90) 1668306
HERO MOTOCOR	3452.30 (3463.60) 482411
HINDALCO IND	216.80 (214.70) 8362938
HINDUSTAN UN	1311.85 (1315.60) 950972
HPCL	342.85 (353.30) 3811563
ICICI BANK	283.25 (289.20) 24593489
INDIABULLS H	1220.35 (1216.40) 1519284
INDIAN OIL	170.10 (172.45) 9690093
INDUSINDBANK	1753.10 (1731.45) 1549193
INFOSYS LTD	1161.30 (1167.50) 3406584
ITC	258.30 (259.05) 8011131
KOTAK MAHIND	1053.05 (1051.10) 1765315
LARSEN & TOU	1296.25 (1309.35) 1834024
LUPIN	758.50 (767.85) 729009
M&M	730.85 (745.35) 1877037
MARUTI SUZIK	8696.55 (8874.65) 471749
NTPC LTD	170.95 (170.35) 3726928
ONGC	178.90 (175.55) 8348549
POWER GRID C	192.70 (194.20) 6396662
RELIANCE IND	908.15 (896.90) 10116965
SBI	241.55 (248.00) 26828240
SUN PHARMA	508.40 (504.50) 8691889
TATA CONSULT	2831.35 (2856.75) 1163047
TATA MOTORS	338.20 (333.85) 9255091
TATA STEEL L	580.90 (582.25) 11486245
TECH MAHINDR	619.05 (625.85) 1785067
ULTRATECH	3925.15 (3999.20) 180643
UPL LIMITED	716.90 (714.90) 1437816
VEDANTA LIMI	291.80 (285.75) 12008468
WIPRO	288.45 (295.25) 1888816
YES BANK LTD	298.25 (300.75) 19356591
ZEE ENTERTAI	559.20 (566.85) 2725681

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB	1289.80 (1297.00) 55053
ACC	1549.40 (1558.40) 319159
ASHOK LEYLAN	142.00 (147.50) 12939722
AVENUE SUPER	1320.45 (1339.60) 501773
BAJAJ FINSER	5119.85 (5131.50) 73966
BANK OFBAROD	134.95 (135.60) 16863181
BEL	143.40 (148.35) 6454803
BHEL	81.40 (83.05) 6440184
BRITANNIA	4838.20 (4834.45) 88523
CADILA HEALT	377.30 (379.75) 432037
COLGATE PALM	1045.20 (1042.90) 496563
CONTAINER	1180.95 (1184.65) 304192
CUMMINS INDI	732.95 (742.80) 497158
DABUR INDIA	316.95 (322.45) 2546884
DLF LIMITED	213.20 (216.05) 4863917
EMAMI LIMITE	1056.85 (1056.10) 42310
GLAXOSMI CON	6426.10 (6492.80) 5537
GLAXOSMI PHA	2215.05 (2224.50) 9254
GLENMARK PHA	544.85 (545.10) 676044
GODREJ CONSU	1084.05 (1076.55) 568997
HAVELLS INDI	495.90 (498.80) 644334
HINDUSTAN ZI	312.75 (311.40) 2439322
ICICI PRU LI	378.05 (381.75) 913607
IDEA CELLULR	77.60 (79.15) 6576016
INTERGLOBE A	1258.70 (1267.05) 606017
JSW STEEL LT	286.00 (288.40) 3731255
LIC HOUS.FIN	525.25 (521.55) 1507385
MARICO LIMIT	322.95 (325.80) 1363825
MCDOWELL	3054.60 (3072.85) 254175
MOTHERSON	310.95 (308.85) 3539976
MRF	69489.30 (69966.45) 3754
NHPC LTD	26.20 (26.40) 2374808
NMDC LTD	121.00 (120.95) 3767362
OIL INDIA	341.35 (332.25) 1513899
ORACLE FIN S	3816.05 (3828.75) 21714
P&G HYG&HEAL	9320.10 (9200.90) 2856
PETRONET LNG	234.15 (235.50) 1319444
PIDILITE IND	908.10 (902.35) 535576
PIRAMAL ENTE	2477.70 (2477.75) 121666
PNB	96.55 (97.60) 16401398
POWER FIN CO	86.80 (89.00) 4815269
RURAL ELEC C	126.40 (130.10) 3903245
SAIL	73.70 (72.15) 13462988
SHREE CEMENT	16354.45 (16117.55) 21361
SHRIRAM TRAN	1401.10 (1396.95) 529677
SIEMENS	1095.55 (1104.55) 171888
SUN TV LTD	848.25 (872.85) 1767625
TATA POWER	80.00 (79.95) 3112967
TITAN IND	887.55 (872.25) 3186401
TORRENT PHAR	1247.80 (1238.70) 302298

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN	9.13 (8.70) 210
AISHWARYA TE	5.41 (5.51) 1795
ALPHAGEO	744.10 (743.70) 2318
AMAR RAJA BA	779.40 (790.95) 14119
ANDHRA BANK	42 (43.05) 407810
ANDHRA CEMEN	9.67 (10) 44435
ANDHRA PAPER	291.10 (294.90) 4873
ANDHRA PETRO	54 (56.80) 275661
ANDHRA SUGAR	428.90 (444.20) 3326
ANJANI PORTL	177.05 (182.45) 1150
ASTRA MICROW	80.45 (81.65) 35688
AUROBINDO PH	556.95 (562.65) 79170
AVANTEL SOFT	525.90 (539.95) 6565
AVANTI FEEDS	2246.30 (2269.85) 8179
AVON ORG	10.83 (11.39) 3300
BALAJI AMIN	572.40 (584.45) 4613
BARTRONICS	10.56 (11.11) 16845
BHAGYA NAG	44.85 (45.60) 30437
BN RATHI SEC	38.20 (39.50) 30415
BRILLIANT SE	9.59 (10.09) 311043
CAMBRIDGE TE	66.20 (67.45) 2171
CIL SECURI	26.55 (27.85) 1300
CONT COFFEE	275.90 (287.95) 5316
COROMAN FERT	519.85 (524.30) 10009
CUBEX TUB	21.40 (21) 5090
CYBERMATE	2.66 (2.88) 80983
CYIENT LIMIT	658.95 (651.80) 56239
DIVI'S LAB	1069.05 (1086.80) 19587
DR REDDY	2107.70 (2141.90) 40791
FOUR SOFT	68.25 (71.40) 2602
GATI CORPN	99.80 (101.10) 57150
GAYATRI PROJ	187.45 (189.30) 12728
GMR INFRASTR	17.50 (17.90) 2666570
GOLDST INFRA	186.20 (183.05) 96452
GOLDSTONE EN	12.57 (13.15) 7592
GRANULES (I)	104.60 (107.30) 113354
GSS AMERICA	57.20 (58.10) 211058
GVK POWER	14 (14.70) 1108885
HBL NIFE POW	46.65 (47.75) 72174
HERITAGE FOO	727.75 (725.75) 8825
HIL LTD	1569.05 (1566.45) 2541
HIND FLUROCA	9.61 (9.16) 300
IDL INDUSTRS	509.05 (527.10) 1345
IKF SOFT	0.57 (0.58) 53606
ILFS ENGINEE	32.50 (33.25) 176184
INCAP	82.80 (87.15) 1580
INNAREDY COM	2.81 (2.95) 152442
IVRCL INFRAS	3.55 (3.57) 88890
JEEVAN SCIEN	42.05 (40.50) 1595
KAKATIYA CEM	243.35 (250.50) 6813
KALLAM SPG	30.65 (31.50) 193148
KARAN WOO-SN	1.91 (1.91) 2300
KAVERI SEED	484.25 (475.30) 21513
KCP LTD	113.25 (114.50) 12990
KERNEX MICRO	39.45 (41.50) 3448
KNR CONSTRUC	291.20 (296.35) 6650
KREBS BIO	167 (167.45) 1001
LANCO INDUS	315.65 (321.40) 19733
LANCO INFRAT	1.12 (1.17) 501533
LAURUS LABS	506.60 (511.95) 12095
LOKESH MACH	52.60 (55.55) 13181
MADHUCON PRO	21.35 (22.25) 19932
MEGA SOFT	12.63 (12.78) 6251
MIC ELECTRON	4.99 (5.25) 79531
MOLD-TEK.TEC	50.55 (52.05) 51712
MOLDTK PLA	314.40 (311.70) 2347
MSR INDIA LT	41.55 (41.55) 4886
NAGARJAGRICH	41.55 (41.65) 21776
NATCO PHARMA	781.85 (781.40) 28084
NAVA BH VENT	136 (135.60) 53271
NCC	118.90 (121.05) 282153
NCL IND	222.75 (222.80) 14303
NEHA INTER	6.40 (6.50) 29607
NETTLINX	79.40 (71.75) 24708
NEULAND LAB	709.90 (717.30) 4490
NIHAR INFO	14.50 (14.10) 2355
NILE	710.65 (710.85) 16599
OIL COUNTRY	33.80 (36.30) 267689
PANYAM CEMEN	41 (41.65) 59764
PENNER IND	53.45 (53.85) 48638
PHYTOCHEM I	62.30 (63.55) 2490
PITTI LAMIN	82.65 (84.85) 13190
POKARNA	198.45 (194.05) 3541
PRAJAY ENGS	12.01 (12.16) 13719
PREMIER EXPL	336.65 (344.75) 6004
PRISM CEMENT	114.30 (115.40) 81190
PRUDENTL PHA	3.87 (3.82) 79550
RAIN INDUSTR	380.65 (387.95) 211029
RAJ PACKAGIN	36 (37.25) 2666
RAJVIR INDUS	39.20 (41.15) 200
RAM INFORMAT	38.70 (41.40) 7700
SAGAR CEM	883.90 (896) 318
SAMKRG PIST	279.05 (282.70) 3495
SAMPRE NUTRI	50 (48.60) 714
SATVAH. ISPA	19.50 (19.65) 38536
SMS PHARMA	75.95 (76.15) 15343
SOUTH BIO TE	2.25 (2.36) 46569
SPHERE GLOBA	32.25 (33.60) 84883
SREE RAYAL A	52.05 (52.10) 247264
SRINIVASA SH	52.35 (56.70) 44664
STARCHIK SP	21.25 (20.25) 2670
STEEL EXCHAN	26 (26.15) 21330
SUJANA METAL	1.05 (1.10) 30624
SUJANA TOWER	3.42 (3.60) 6820
SUJANA UNIVE	0.74 (0.77) 82060
SURANA TELE	4.76 (4.85) 26569
SURYALAKSH.C	67.20 (69.60) 17556
SURYAVA SPIN	6.26 (6.58) 800
SUVEN PHARMA	169.95 (169.20) 47501
TAJ GVK HOTE	158.85 (160.40) 8208
TANLA	33 (33.20) 180808
TERA SOFTWAR	42.70 (42.60) 10539
TRANS BIOTEK	2.19 (2.10) 13210
VICEROY HOTE	14.70 (14.95) 60362
VIJAY TEXTIL	41.50 (42) 1938
VIMTA LABS	190.40 (191.95) 2002
VISAKA IND	666.25 (674.75) 2088
VISTA PHARMA	39 (39.95) 27846
VIVIMED LABS	76.70 (76.60) 85613
VJIL CONSULT	16.35 (17.20) 2321
XL TELENE	2.12 (2.23) 25802
YBRANT DIGIT	4.62 (4.82) 345794
ZENOTECH LAB	40 (40.50) 6335
ZENTECH	116.40 (118.85) 19416

ఈనాడు బిజినెస్

నగదు రహిత లావాదేవీలు పెంచేందుకు ఒక పక్కన ప్రభుత్వం ప్రోత్సాహక చర్యలు చేపడుతుంటే, వినియోగదారులను మరింత బెంబేలెత్తించేలా బ్యాంకులు జరిమానాలు విధిస్తున్నాయి. బ్యాంక్ ఖాతాలో సరిపడా నిల్వ లేకుండా, పొరపాటున పాయింట్ ఆఫ్ సేల్ (పాస్) యంత్రం వద్ద చెల్లింపునకు డెబిట్ కార్డు స్వైప్ చేస్తే, లావాదేవీ కనుక తిరస్కరించినట్లు (డిక్లైన్డ్) సందేశం వస్తే, బ్యాంకులు రూ.17-25 వరకు జరిమానా విధిస్తున్నాయి.

సొమ్ముల్లేకుండా కార్డు వాడితే వాతే



- రూ.17-25 వసూలు చేస్తున్న బ్యాంకులు
- దీనికి జీఎస్‌టీ అదనం కూడా
- చెక్‌ల తరహాలోనే ఈ బాదుడు
- రెండేళ్లలో 3 రెట్లు పెరిగిన కార్డు చెల్లింపులు
- జరిమానాలతో కార్డుదారుల ఆందోళన

ఈనాడు వాణిజ్య విభాగం

పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాల్లోనే కాదు.. ఇంటి పక్కన ఉండే కిరాణా దుకాణాల్లోనూ, డెబిట్ కార్డు, భీమ్ యాప్, యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) ద్వారా చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.2,000 వరకు వినియోగదారులు జరిపే చెల్లింపులకు సంబంధించి, ఆయా వ్యవస్థల నిర్వహణకు వ్యాపారి నుంచి వసూలు చేసే ఛార్జీ (ఎండీఆర్)ను రెండేళ్ల పాటు రద్దు చేస్తూ, ఈ ఏడాది జనవరి 1 నుంచి అమల్లోకి తెచ్చింది. ఇందువల్ల బ్యాంకులకు ఆదాయం తగ్గుతుంది కనుక, తాము రెండేళ్ల పాటు పరిహారం ఇస్తామని ఇస్తామని ప్రభుత్వం బ్యాంకులకు తెలిపింది. అంటే దుకాణం, హోటల్.. ఎక్కడైనా పీఓఎస్ ద్వారా రూ.2,000 వరకు చెల్లింపులు జరిపేందుకు కార్డును వినియోగదారులు వినియోగించినా, వ్యాపారులకు అదనపు భారం పడదు. ఇందువల్ల చిల్లర దుకాణాలు, బడ్డీకొట్లలోనూ నగదు రహిత లావాదేవీలు పెరుగుతాయని, ఆర్థిక వ్యవస్థ పారదర్శకంగా మారుతుందన్నది ప్రభుత్వ యోచన. ఇది నిజం కూడా. పెద్దనోట్ల రద్దు తరవాత డెబిట్‌కార్డ్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. 2014-15లో 80 కోట్ల లావాదేవీల్లో రూ.1.2 లక్షల కోట్ల చెల్లింపులు జరగ్గా, 2016-17లో 240 కోట్ల లావాదేవీల ద్వారా రూ.3.3 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. లావాదేవీల సంఖ్యతో పాటు, చెల్లింపు మొత్తం కూడా అంతకంతకూ పెరుగుతోంది. అయితే ఎండీఆర్ ఛార్జీలను రద్దు చేసినందున, బ్యాంకులకు పరిహారంగా ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం 2018-19లో రూ.1050 కోట్లు, 2019-20లో రూ.1462 కోట్లకు చేరుతుందని అంచనా.

ఇప్పుడీ బాదుడు ఎందుకో..

బ్యాంక్ ఖాతాలో సరిపడా నగదు లేకుండా చెక్ జారీ చేసినపుడు, తిరస్కరణకు గురవుతుంటాయి. ఈ సమయంలో బ్యాంకులు రూ. వందల్లో జరిమానాలు విధిస్తున్నాయి. అదే తరహాలో ఖాతాలో సరిపడా నగదు లేకుండా డెబిట్‌కార్డు నుపయోగించి ఏటీఎంలో నగదు తీసేందుకు ప్రయత్నించినా, పీఓఎస్‌లో చెల్లింపు చేయాలనుకున్నా, లావాదేవీ తిరస్కరించినట్లు సందేశం వస్తుంది. ఇలా జరిగితే జరిమానాలు విధిస్తూ బ్యాంకులు నిర్ణయం తీసుకున్నాయి. ఎన్నిసార్లు ఇలా జరిగితే, అన్నిసార్లు జరిమానా చెల్లించాల్సి వస్తుంది. ఖాతాలో నగదు పడినపుడు, ఈ మొత్తాన్ని బ్యాంక్ మినహాయించుకుంటుంది. తిరస్కరణకు గురైన ప్రతి లావాదేవీకి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.17, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.25 చొప్పున విధిస్తున్నాయి. దీనికి జీఎస్‌టీ అదనం. ఈ విషయాన్ని ఎస్‌బీఐ డీజీఎం ఒకరు ధ్రువీకరించారు.

ఏటీఎం లావాదేవీలపై పరిమితి వల్లే ఇబ్బంది

నెల మొత్తంమీద ఖాతా నిర్వహిస్తున్న బ్యాంక్ ఏటీఎంలు, ఇతర ఏటీఎంలలో కలిపి 8 వరకు మాత్రమే ఉచిత లావాదేవీలను అనుమతిస్తున్నారు. ఏటీఎంల నుంచి నగదు తీసుకోవడంతో పాటు ఖాతాలో నగదు ఎంత ఉందో పరిశీలించుకున్నా, ఒక లావాదేవీ పూర్తయినట్లుగా బ్యాంకులు పరిగణిస్తున్నాయి. ఇందువల్లే ఖాతాలో నగదు ఎంత ఉందో ప్రత్యేకంగా ఖాతాదారులు పరిశీలించడం లేదు. ఏటీఎంకు వెళ్లి కార్డుతో నగదు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నగదు ఉంటే వస్తుంది, లేకపోతే, సరిపడా నిల్వ లేదని సందేశం వస్తోంది. ఇకపై ఇలా చేసేందుకూ వెనకాడాల్సిందే. లేకపోతే తగిన నిల్వ లేకుండా నగదు తీసేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ జరిమానా పడుతుంది. నెలవారీ తక్కువ ఆదాయం పొందేవారు, ఇందువల్ల తీవ్రంగా ఇబ్బంది పడతారు. డిజిటల్/కార్డ్ లావాదేవీలు ఎందుకులే.. ఖాతాలో ఉన్న నగదు అంతా ఒకేసారి తీసుకుని, నగదుతో లావాదేవీలకు ప్రయత్నించవచ్చు. ఇది నగదు రహిత లావాదేవీల లక్ష్యాన్నే దెబ్బతీస్తుంది.

ఖాతాదారులు ఇలా చేస్తే మంచిది

☛ ఖాతాదారులు బ్యాంకుకు ఇచ్చిన మొబైల్ నెంబరును, కార్డుతో ఆర్థిక లావాదేవీలు జరిపేప్పుడు తప్పనిసరిగా చెంత ఉంచుకోవాలి.

☛ పాస్ వద్ద కొనుగోలు చేసినా, ఏటీఎంలో నగదు ఉపసంహరించినా, మొబైల్‌కు సంక్షిప్త సందేశం వస్తుంది. ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతి లావాదేవీలో ఎంత మొత్తం వెచ్చించింది, ఇంకా ఖాతాలో ఎంత నిల్వ ఉందో ఈ సందేశంలో తెలుపుతోంది. ఈ సందేశాలు చూసుకుని, తదుపరి చెల్లింపులు, నగదు ఉపసంహరణకు ప్రయత్నించవచ్చు.

ఎస్‌బీఐ తీరు మారాలి

5 అనుబంధ బ్యాంకులు, భారతీయ మహిళా బ్యాంక్‌ను కూడా జతచేసుకున్నాక, 50 కోట్ల మంది ఖాతాదారులు, రూ.41 లక్షల కోట్ల ఆస్తులతో ప్రపంచంలోనే 45వ అతిపెద్ద బ్యాంకుగా అవతరించిన ఎస్‌బీఐ మాత్రం భిన్నంగా వ్యవహరిస్తోంది. తమ ఖాతాదారు నగదును వేరే ఖాతాలకు బదిలీ చేసినపుడు , ఇంకా ఎంత నిల్వ ఉందో తెలుపుతూ మొబైల్‌కు సందేశం (ఎస్ఎంఎస్) పంపుతోంది. పాస్ వద్ద కార్డ్ స్వైప్ చేసినపుడు, ఎంత చెల్లించామో చూపుతోంది కానీ, ఖాతాలో నగదు ఎంత నిల్వ ఉందో ఆ ఎస్ఎంఎస్‌లో ఉండటం లేదు. ఇది కూడా ఉంటే ఖాతాదారులకు తమ ఖాతాలో ఇంకా ఎంత మిగులు ఉందో తెలుసుకుని, అందుకనుగుణంగా ఖర్చు చేసేందుకు ప్రయత్నిస్తారు.

ఎస్‌బీఐ అనుబంధ బ్యాంకుల చెక్కులు 1 నుంచి చెల్లవు!

ఎస్‌బీఐలో విలీనం అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్), స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కోర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపుర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ పటియాలా, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ రాయపూర్‌తో పాటు భారతీయ మహిళా బ్యాంక్ ఖాతాదారులు తమ చెక్‌బుక్‌లను పరిశీలించుకోవాల్సి ఉంది. విలీనమైన బ్యాంకుల చెక్‌లు ఇప్పటివరకు చెల్లుతూ వచ్చాయి. ఏప్రిల్ 1 నుంచి అవి చెల్లవని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. అందువల్ల వీరు తమ ఎస్‌బీఐ శాఖకు లేదా ఏటీఎం కేంద్రానికి వెళ్లి, ఆన్‌లైన్‌లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

దుబాయ్‌లో ఇల్లు కొందాం

- భారతీయుల ఆసక్తి
- 2017లో రూ.30,000 కోట్ల గృహాల కొనుగోలు
- ఆకర్షణీయ ప్రతిఫలం.. ఆమోదయోగ్యమైన ధరలు!

ఈనాడు - హైదరాబాద్

భారత్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, సినీ, క్రీడా రంగంలోని ప్రముఖులు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు (హెచ్ఎన్ఐ) దుబాయిలో ఇల్లు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. దుబాయ్‌లో ఇళ్లను కొనుగోలు చేస్తున్న వారిలో అత్యధిక మంది భారతీయులు, భారత సంతతికి చెందిన వారే. పర్యాటకుల పరంగా కూడా భారతీయులదే అగ్రస్థానం. దుబాయ్ వాణిజ్యానికే కాక ఆరోగ్య సంరక్షణకు, పర్యటనకు కేంద్రంగా ఉంది. దుబాయ్ సిటీ జనాభా 28 లక్షలు ఉంటే.. ఏడాదికి 1.52 కోట్ల మంది పర్యాటకులు వస్తున్నారు. కేవలం 7 గంటల ప్రయాణంతో ప్రపంచంలోని మూడింట రెండు వంతుల ప్రాంతాలకు చేరొచ్చు. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులు ఇక్కడకు వస్తున్నారు. దుబాయిలో నివసిస్తున్న వారిలో 85 శాతం మంది బయట దేశాల నుంచి వచ్చిన వారే. వీరిలో సగానికి సగం మంది భారతీయులు, భారత సంతతికి చెందిన వారే ఉంటారు. వీటితోపాటు ప్రభుత్వ విధానం వల్ల దుబాయ్‌లో స్థిరాస్తి రంగంలో ఆస్తుల విలువ ఆమోదయోగ్యంగా ఉండడం భారతీయులను, భారత సంతతికి చెందిన వారిని ఇక్కడ ఇళ్ల కొనుగోలుకు పురిగొల్పుతోంది. ఉండేందుకే కాక పెట్టుబడి దృక్పథంతో కూడా దుబాయ్ స్థిరాస్తి రంగంలో పెట్టుబడులు పెట్టడానికి భారతీయులు ఆసక్తి చూపుతున్నారు. భారత జాతీయతకు చెందిన వారు 2017లో 7,000 ఇళ్లను కొనుగోలు చేశారు. వీటి విలువ రూ.30,000 కోట్లు. 7 వేల ఇళ్లను కొనుగోలు చేసిన వారిలో సగానికి సగం మంది దుబాయ్‌కి బయట ఉన్న భారతీయులే. 2016లో రూ.22,000 కోట్ల విలువైన గృహాలను కొనుగోలు చేశారు.

అనుకూల అంశాలు ఇవే..

దుబాయ్‌లో ఇల్లు కొనుగోలు చేస్తే అద్దె ద్వారా 8 శాతానికి పైగా ప్రతిఫలాన్ని పొందొచ్చు. అనవసరమైన పన్నుల భారం చాలా తక్కువ. రిజిస్ట్రేషన్‌కు కేవలం 4 శాతం మాత్రమే పన్ను వసూలు ఉంటుంది. కొనుగోలు, విక్రయ ప్రక్రియ చాలా సులభం. ఇల్లు అద్దెకు ఇవ్వడం తేలిక. కేవలం రూ.1.7 కోట్ల విలువైన ఇంటిని కొనుగోలు చేస్తే దుబాయ్‌లో ఉండేందుకు వీలుగా వీసా పొందొచ్చు. విదేశీ మారకద్రవ్య ఒడిదొడుకుల నష్టభయం తక్కువ. ఇటువంటి అంశాలు దుబాయ్‌లో ఇళ్ల కొనుగోలుకు భారతీయులను పురిగొల్పుతున్నాయి. దుబాయ్ ప్రపంచ స్థాయి వాణిజ్యానికి కేంద్రంగా ఉన్నప్పటికీ.. బెంగళూరు వంటి నగరాలతో పోలిస్తే ఆమోదయోగ్యమైన ధరకు 'విలువైన' గృహాన్ని కొనుగోలు చేయడానికి అవకాశం ఉండడానికి కారణం అక్కడి మొదటి 10 అతిపెద్ద స్థిరాస్తి కంపెనీలు ప్రభుత్వ రంగానికి చెందినవే. పూర్తిగా లేదా పాక్షికంగా ఈ కంపెనీలు ప్రభుత్వం చేతిలోనే ఉన్నాయి. రూ.50 లక్షలు వెచ్చించ గలిగిన ఎవరైనా దుబాయ్‌లో అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేయడానికి అవకాశం ఉంది.

2030 నాటికి 50 లక్షల జనాభా..

ప్రస్తుతం 28 లక్షలున్న దుబాయ్ నగర జనాభా 2030 నాటికి 50 లక్షలకు చేరుతుందని అంచనా. ఇందుకు తగ్గట్లుగా హోటళ్లు, నివాస గృహాలు, ఇతర అన్ని రకాల సదుపాయాలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. పాత దుబాయ్‌లో గల్ఫ్ దేశాలకు చెందిన వారు మాత్రమే కొనుగోలు చేయడానికి పరిమితులు ఉన్నప్పటికీ. . కొత్త దుబాయ్ ప్రాంతం (ఫ్రీ హోల్డ్ ఏరియా) ప్రస్తుతం 2.5 లక్షల గృహాలు ఉన్నాయి. వచ్చే ఏడేళ్లలో 1.7 లక్షల గృహాలు మార్కెట్‌లోకి అందుబాటులోకి వస్తాయని అంచనా. దుబాయ్ వృద్ధిని పరిగణనలోకి తీసుకుంటే అద్దెకు ఎటువంటి ఢోకా ఉండదని భావిస్తున్నారు.




'బ్లూవాటర్స్' ద్వీపం విహంగ వీక్షణం

'బ్లూవాటర్స్' ద్వీపంలో ఇళ్లు అమ్మకానికి

దుబాయ్ సముద్రంలో కృత్రిమంగా అభివృద్ధి చేసిన 'బ్లూవాటర్స్' ద్వీపంలోని గృహాలను విక్రయించడానికి 'మీరాస్' కంపెనీ ముందుకు వచ్చింది. మీరాస్ దుబాయ్ హోల్డింగ్ కంపెనీ. బ్లూవాటర్స్ ద్వీపంలో హోటళ్లు, వినోద పార్కు తదితరాలతోపాటు పది నివాస గృహ భవనాలను నిర్మించింది. ఇందులో 5 భవనాల్లోని 698 గృహాలను రిటైల్ విక్రయానికి ఉంచింది. ఈ గృహాల మార్కెటింగ్‌కు సేవల కంపెనీ రైన్ అండ్ ఆర్నేతో చేతులు కలిపింది. భారత్‌లో 100 గృహాలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, కనీసం 50 గృహాలను విక్రయించగలమని భావిస్తున్నామని రైన్ అండ్ ఆర్నే దుబాయ్ మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ చిమ్నాని తెలిపారు. హైదరాబాద్, ముంబయి, దిల్లీలనే లక్ష్యంగా పెట్టుకుని మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు అధికంగా ఉన్నారని.. ఇక్కడ స్థిరాస్తి మార్కెట్ బాగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని వారికి కనీసం 15 గృహాలను విక్రయించే లక్ష్యంతో తొలి రోడ్‌షోను హైదరాబాద్‌లో ప్రారంభించామన్నారు. ఒక బెడ్ రూమ్ ఉన్న 1,050 చదరపు అడుగుల గృహం ధర రూ.3.6 కోట్లు. పెంట్ హౌస్ విలువ రూ.70 కోట్లు ఉంటుంది. అక్టోబరు నెలలో గృహాలను అప్పగిస్తారు. ముందుగా 10 శాతాన్ని, గృహాన్ని తీసుకునే టప్పుడు 10 శాతాన్ని చెల్లిస్తే సరిపోతుందని, ఆ తర్వాత నాలుగు నెలలకు ఒక సారి 5 శాతం చొప్పున చెల్లించొచ్చని సంజయ్ తెలిపారు. జూన్ నాటికి మొత్తం గృహాలను విక్రయించాలని భావిస్తున్నట్లు చెప్పారు.

ఆగస్టు 31 కల్లా ఆస్తులు విక్రయిస్తాం

సుప్రీం కోర్టు వ్యాఖ్యల నేపథ్యంలోనూ ఆర్‌కామ్ ధీమా



దిల్లీ: ఆర్‌బీఐ విధించిన ఆగస్టు 31 గడువులోపే ఆస్తుల విక్రయాన్ని పూర్తి చేయగలమని రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) విశ్వాసం వ్యక్తం చేస్తోంది. అయితే రిలయన్స్ జియోకు ఆర్‌కామ్ తన ఆస్తులను విక్రయించకుండా ఉండేలా ఇచ్చిన బాంబే హైకోర్టు ఆదేశాల విషయంలో జోక్యం కలగజేసుకోబోమని, స్టేను ఎత్తివేయడానికి సుప్రీం కోర్టు గురువారం నిరాకరించినప్పటికీ.. ఆర్‌కామ్ పై విధంగా ధీమా వ్యక్తం చేయడం విశేషం. 'రుణాలిచ్చిన బ్యాంకుల ప్రయోజనాలను కాపాడేందు కోసం ఆస్తుల నగదీకరణ పథకాన్ని పూర్తి చేయగలమన్న విశ్వాసం ఆర్‌కామ్‌కు ఉంద'ని కంపెనీ ఎక్స్ఛేంజీలకిచ్చిన ఒక సమాచారంలో పేర్కొంది. ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని 25 బ్యాంకుల కన్సార్షియానికి రూ.45,000 కోట్ల బకాయిలు ఆర్‌కామ్ చెల్లించాల్సి ఉంది. ఆస్తుల విక్రయం ద్వారా ఆ బకాయిల్లో ఎక్కువ భాగాన్ని తగ్గించుకోవాలని భావిస్తోంది. కొన్ని ఆస్తులను రూ.24,500 కోట్లకు విక్రయించడానికి రిలయన్స్ జియోతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. అయితే ఆస్తుల విక్రయం జరిగితే కంపెనీ తనకు బకాయి పడ్డ రూ.1100 కోట్లను రాబట్టుకోవడం సాధ్యం కాదని చెబుతూ ఎరిక్‌సన్ ఇండియా ఒక మధ్యవర్తిత్వ కోర్టు నుంచి స్టే తెచ్చుకుంది. మార్చి 8న బాంబే హైకోర్టు సైతం మధ్యవర్తిత్వ కోర్టు ఆదేశాలను సమర్థించింది. ఆర్‌కామ్ పిటిషన్‌ను పక్కనపెట్టింది. దీంతో ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఎస్‌బీఐతో కలిసి ఆర్‌కామ్ సుప్రీం కోర్టు చెంతకు వెళ్లింది. కాగా, విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు గురువారం యథాపూర్వ స్థితికి ఆదేశాలిస్తూ తదుపరి విచారణను ఏప్రిల్ 5కు వాయిదా వేసింది. 'మార్చి 28, 2018లోగా ఏవైన అఫిడవిట్లు, రాతపూర్వక వివరాలను ఇవ్వడానికి కక్షిదార్లకు స్వేచ్ఛనిస్తున్నామని.. అంత వరకు యథాపూర్వ స్థితి కొనసాగుతుంద'ని న్యాయమూర్తులు జస్టిస్ ఆదర్శ్ గోయెల్, యు.యు. లలిత్, ఆర్.ఎఫ్. నారిమన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

ఏ ఆస్తులు విక్రయించాలనుకుందంటే: ఆర్‌కామ్‌కు చెందిన స్పెక్ట్రమ్, ఇతర మౌలిక వసతుల(రూ.17,300 కోట్ల విలువైన 1.78 లక్షల కి.మీ. ఫైబర్ ఆప్టిక్ లైను సహా)ను కొనుగోలు చేయడానికి జియో అంగీకరించిన విషయం తెలిసిందే. మార్చి 31లోగా ఈ విక్రయం పూర్తి కావాల్సి ఉండగా.. ఎరిక్‌సన్ ఆర్బిట్రల్ ట్రైబ్యునల్‌కు వెళ్లడంతో ఆలస్యం అవుతోంది.

ఎన్ఎస్ఈలో ఆర్‌కామ్ షేర్లు 5.9 శాతం నష్టంతో రూ.23.80 వద్ద ముగిసింది.

మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు డ్రోన్ల రక్షణ

- పరిశీలిస్తున్న తెలంగాణ ప్రభుత్వం
- జెన్‌క్యూ కొత్త ప్రాంగణం ప్రారంభం


ఈనాడు, హైదరాబాద్: మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల రక్షణకు డ్రోన్‌లను వినియోగించాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల ప్రాంతం (ఐటీ కారిడార్)లో మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల రక్షణకు డ్రోన్‌లను వినియోగించడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన టెస్టింగ్ సేవల కంపెనీ జెన్‌క్యూ కొత్త ప్రాంగణాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్రోన్‌లను సైబరాబాద్ ప్రాంతంలోని పోలీస్ స్టేషన్లు నిర్వహిస్తాయి. 'ఆపదలో ఉన్న మహిళ ఎస్ఓఎస్‌కు కాల్ చేస్తే.. జీపీఎస్ సాంకేతిక పరిజ్ఞానం సాయంతో క్షణాల్లో బాధితురాలు ఉన్న ప్రాంతానికి డ్రోన్ చేరుతుంది. పెద్దగా శబ్దం చేసి చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేస్తుంద'ని జయేశ్ అన్నారు. ఇటీవల ఒక హేకథాన్‌లో ఈ ఆలోచన ప్రాణం పోసుకుందని, ప్రస్తుతం ఈ ఆలోచన ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ.. ఏడాదిలో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చే వీలుందని వివరించారు. మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని చెప్పారు.

మూడేళ్లలో వెయ్యి మంది ఉద్యోగులు..: జెన్‌క్యూకు హైదరాబాద్‌లో మూడు కార్యాలయాలు ఉన్నాయి. వీటన్నింటిని కలిపి 1.09 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాదాపూర్‌లోని యాట్రియా బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన కొత్త ప్రాంగణంలోకి మారుస్తామని జెన్‌క్యూ సీఈఓ మురళీ బొల్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 1,000 మందికి పెంచుకోవాలని, రూ.100 కోట్ల టర్నోవరును సాధించాలని భావిస్తున్నామన్నారు. పన్నెండేళ్ల క్రితం 5 మంది ఉద్యోగులతో కంపెనీ ప్రారంభమైందని, ప్రస్తుతం 400 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. మొత్తం ఉద్యోగుల్లో 46.5 శాతం మంది మహిళ ఉద్యోగులేనన్నారు. ఈ కార్యక్రమానికి హైసియా ప్రెసిడెంట్ రంగా పోతుల తదితరులు హాజరయ్యారు.

వొడాఫోన్-ఐడియా విలీన సంస్థకు

కుమార మంగళమే ఛైర్మన్!

జూన్ కల్లా ప్రక్రియ పూర్తి



దిల్లీ: వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులార్ విలీన ప్రక్రియ తుది అంకానికి చేరింది. ఈ నేపథ్యంలోనే, విలీన సంస్థకు నాన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కుమార మంగళం బిర్లా వ్యవహరిస్తారని ఐడియా సెల్యులార్, వొడాఫోన్ గ్రూప్ గురువారం ప్రకటించాయి. విలీన సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా బాలేశ్ శర్మ ఉంటారు. ఈయన ప్రస్తుతం వొడాఫోన్ ఇండియా ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఓఓ)గా ఉన్నారు. విలీన సంస్థ వ్యాపార వ్యూహాలను ఈయనే రూపొందించనున్నారు. విలీన వ్యవహారం సాఫీగా జరిగేలా పర్యవేక్షిస్తారు. ఐడియా సెల్యులార్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ అక్షయా మూంద్రానే విలీనసంస్థకు సీఎఫ్ఓగా వ్యవహరిస్తారు. ఐడియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ అమ్రిష్ జైన్ కొత్త సంస్థకు సీఓఓగా ఉంటారు. ఐడియా ఎండీ హిమాన్షు కపానియా విలీనసంస్థలో నాన్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ సభ్యుడిగా ఉంటారు. ఆయనకు ముఖ్య బాధ్యతలు అప్పగిస్తారు. జూన్‌కల్లా విలీనం పూర్తవుతుందని అంచనా.

ప్రస్తుతం ఐడియా సెల్యులార్, వొడాఫోన్ ఇండియాల్లో, వివిధ వ్యాపార విభాగాలను నిర్వహిస్తున్న వారు అదేవిధంగా కొనసాగుతారు. విలీనం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చేవరకు తమ తమ కంపెనీల నిర్వహణ సామర్థ్యానికి వీరే బాధ్యత వహిస్తారని ఐడియా సెల్యులార్ వెల్లడించింది. వొడాఫోన్ ఇండియా సీఈఓ సునీల్ సూద్, వొడాఫోన్ గ్రూప్ (ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆసియా పసిఫిక్) నాయకత్వ బృందంలో చేరతారు. వొడాఫోన్ ఇండియా సీఎఫ్ఓ మనీశ్ దావర్ విలీన ప్రక్రియ ప్రణాళిక బాధ్యత వహిస్తారు.

✦ వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులార్ కార్యకలాపాలు విలీనం చేస్తామని 2017లో ఇరు సంస్థలు ప్రకటించాయి. విలీన సంస్థ విలువ 23 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.లక్షన్నర కోట్లు) ఉంటుందని, చందాదార్ల సంఖ్యా పరంగా 35 శాతం మార్కెట్ వాటాతో, ఆదాయపరంగానూ దేశీయంగా అగ్రస్థానం పొందుతుందని వివరించాయి.

భాజపా వ్యతిరేక ఓట్లను కూడగట్టడం అవసరం

- ప్రత్యామ్నాయ కూటమి ఏర్పాటు యత్నాలు విఫలమవుతాయి
- సీపీఎం నేత ప్రకాశ్ కారాట్ వెల్లడి

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించాలంటే.. రాష్ట్రాలవారీగా ఆ పార్టీ వ్యతిరేక ఓట్లనన్నింటినీ కూడగట్టడం అవసరమని సీపీఎం నాయకుడు ప్రకాశ్ కారాట్ అభిప్రాయపడ్డారు. భాజపా, కాంగ్రెస్‌యేతర కూటమి ఏర్పాటు కోసం చేసే ప్రయత్నాలన్నీ విఫలమవుతాయని ఆయన వ్యాఖ్యానించారు. తమ పార్టీ పత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ'కి రాసిన సంపాదకీయంలో ఆయన ఈ మేరకు పేర్కొన్నారు. "తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపాదించిన 'ఫెడరల్ ఫ్రంట్' వంటి వేదికల ఏర్పాటు ప్రయత్నాలు విఫలమవ్వకతప్పదు. డీఎంకే, ఆర్జేడీ లాంటి ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి ఉన్నాయి. ప్రాంతీయ ప్రయోజనాలు అలాంటి పార్టీలను ఏకం కాకుండా అడ్డుకుంటున్నాయి. ఎన్నికల్లో భాజపాను దెబ్బ తీయాలంటే రాష్ట్రాల వారీగా ఆ పార్టీ వ్యతిరేక ఓట్లను కూడగట్టడమే మంచి వ్యూహం" అని కారాట్ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల జీవితాలను సులభతరం చేయండి

- పింఛను నిబంధనలను సరళతరం చేయాలి
- ప్రయోజన ప్రక్రియ 'కిచిడీ'లా ఉండకూడదు
- కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: సరళమైన పింఛను నిబంధనలను తీసుకురావడం ద్వారా- ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవితాలను సులభతరం చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు సూచించింది. పదవీ విరమణ ప్రయోజనాలను పొందే ప్రక్రియ 'కిచిడీ' మాదిరిగా ఉండకూడదంది. 1991లో రైలు ఎగ్జామినర్‌గా పదవీ విరమణ పొందిన సేతురామన్... 1996 నాటి ఐదో వేతన సవరణ సంఘం ప్రతిపాదనల ప్రకారం తన పింఛను మొత్తాన్ని పెంచాలని 2011లో కేంద్ర పాలక ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. దీనిని ఆ కోర్టు కొట్టివేయడంతో 2013లో రామన్ మద్రాస్ హైకోర్టుకు వెళ్లారు. అక్కడ 2016లో ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనిని సవాలుచేస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. జస్టిస్ ఎంబీ లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తల ధర్మాసనం గురువారం ఈ కేసును విచారించి, క్యాట్ తీర్పు సరైనదేనని చెప్పింది. రైలు ఎగ్జామినర్ పోస్టు... జూనియర్ ఇంజినీర్ గ్రేడ్-2గా మారినట్లు మద్రాస్ హైకోర్టు పొరపడిందని పేర్కొంది. ఈ క్రమంలోనే కేంద్ర సిబ్బంది, శిక్షణశాఖకు ధర్మాసనం పలు సూచనలు చేసింది. పార్లమెంటులో తగిన చట్టం తీసుకురావడం లేదా పింఛను నిబంధనలను సరళతరం చేయడం ద్వారా... విశ్రాంత ఉద్యోగుల జీవితాలను సులభతరం చేయాలని సూచించింది. కార్యాలయ నివేదికలు, వివరణలు, తప్పుల సవరణ తదితర నిబంధనలతో ప్రయోజన ప్రక్రియ సంక్లిష్టంగా ఉండకూడదని పేర్కొంది.

చైనాపై ట్రంప్ సర్కారు వాణిజ్య ఆంక్షలు

వాషింగ్టన్: చైనాపై ట్రంప్ సర్కారు వాణిజ్య ఆంక్షలు విధించింది. ఆ దేశ దిగుమతులపై 60 బిలియన్ డాలర్ల వార్షిక సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గురువారం కార్యనిర్వాహక ఉత్తర్వులను జారీచేశారు. ఏ వస్తువు మీద ఎంత సుంకం విధించాలనేది పక్షం రోజుల్లో నిర్ణయిస్తామన్నారు. చైనా కారణంగా అమెరికాలో 60 వేల కర్మాగారాలు మూతపడ్డాయనీ, 60 లక్షల ఉద్యోగాలు పోయాయని ఆర్థిక వేత్తలు చెప్పినట్లు ట్రంప్ ఆరోపించారు. అమెరికా చరిత్రలోనే చైనాతో వాణిజ్యలోటు రికార్డు స్థాయిలో 375 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ తాజా నిర్ణయంతో- చైనా నుంచి దిగుమతి అయ్యే దాదాపు 1,300 వస్తువుల ధరలు పెరిగే అవకాశముందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. చైనాపై వాణిజ్య ఆంక్షలు విధించడం సహేతుకమేనని ట్రంప్ సమర్థించుకున్నారు. "అమెరికా కార్లపై చైనా 25% పన్ను విధిస్తోంది. అదే చైనా కార్లపై అమెరికాలో 2.5% పన్ను మాత్రమే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో దీర్ఘకాలంగా చైనాతో సంప్రదింపులు సాగించినా ఫలితం లేకపోయిందనీ, దీంతో ఆంక్షలు విధించక తప్పలేదని ట్రంప్ అన్నారు. ఉభయ దేశాలకు చేటుచేసే చర్యలపై న్యాయపరంగా పోరాటం చేస్తామని చైనా విదేశాంగశాఖ స్పందించింది.

సికింద్రాబాద్ - కాకినాడటౌన్ మధ్య ప్రత్యేక రైలు

విజయవాడ, న్యూస్‌టుడే: ప్రయాణికుల సౌకర్యార్థం సికింద్రాబాద్ - కాకినాడటౌన్‌ల మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నెంబరు 07075 ప్రత్యేక రైలు ఈ నెల 29వ తేదీన సికింద్రాబాద్‌లో రాత్రి 7.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.10కి కాకినాడటౌన్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు 07076 నెంబరుతో ఏప్రిల్ ఒకటో తేదీన కాకినాడటౌన్‌లో రాత్రి 9.25కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.35కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరంటౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో ఆగుతుంది.

సూర్యకాంతి పరిమాణం గుర్తింపు

పూర్తి స్థాయిలో పనిచేస్తున్న 'నాసా' సరికొత్త సాధనం

వాషింగ్టన్: సూర్యుడి నుంచి వెలువడే కాంతిశక్తి పరిమాణాన్ని గుర్తించడానికి తమ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)పై 'నాసా' సరికొత్త సాధనాన్ని అమర్చింది. 'టోటల్ అండ్ స్పెక్ట్రల్ సోలార్ ఇర్రేడియన్స్ సెన్సర్' (టీఎస్ఐఎస్-1)గా పేర్కొంటున్న ఈ సాధనం ఇప్పుడు సంపూర్ణంగా పనిచేయడం మొదలైంది. నిర్దేశిత వివరాల సేకరణలో నిమగ్నమై ఉందని 'నాసా' వెల్లడించింది. భూగోళ రేడియో ధార్మికతపై సూర్యుడి ప్రభావం, ఓజోన్ పొర, పర్యావరణ వ్యవస్థలపై సూర్యుడి ప్రభావంపై అవగాహనకు ఈ సాధనం పంపే వివరాలు ప్రాతిపదికగా ఉపయోగపడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే...భూ వ్యవస్థలు, వాతావరణ మార్పులపై సౌరవైరుధ్య ప్రభావాలను తెలుసుకోవడానికి ఈ వివరాలు కీలకమని ఓ శాస్త్రవేత్త వెల్లడించారు. గత డిసెంబరు 15న 'టీఎస్ఐఎస్-1'ను ప్రయోగించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం.

ఆవిష్కరణలు.. ఉపాధి.. టీ హబ్ లక్ష్యాలు

- మున్సిపల్ బాండ్ల జారీని ప్రధాని అభినందించారు: మంత్రి కేటీఆర్
- రైతులను సంఘటితం చేసేందుకే రైససలు: పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేసేందుకు అంకుర పరిశ్రమలకు టీ హబ్ ప్రోత్సాహం అందిస్తోందని సాంకేతిక, పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో సభ్యులు గణేష్ గుప్తా, పువ్వాడ అజయ్‌కుమార్ అడిగిన ప్రశ్నలపై ఆయన మాట్లాడారు. గోవా, అసోం, దిల్లీ ప్రభుత్వాలకు టీ హబ్ మార్గదర్శిగా సేవలు అందిస్తోందని తెలిపారు. 346 అంకుర పరిశ్రమలు, 835 అసోసియేట్ అంకురాలకు టీ హబ్ వేదికగా నిలిచిందన్నారు. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ కేంద్రాలుగా టీ హబ్‌ను విస్తరిస్తున్నామని చెప్పారు. కళాశాల విద్యార్థులకు రాష్ట్ర నూతన ఆవిష్కరణ విభాగం(స్టేట్ ఇన్నోవేషన్ సెల్)ను ఏర్పాటు చేశామన్నారు. నగరంలో రాకపోకలు క్రమబద్ధీకరించేందుకు ఆర్థిక వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం చేపట్టినట్లు మంత్రి కేటీఆర్.. సభ్యులు ప్రకాశ్‌గౌడ్, మాగంటి గోపినాథ్ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. సగటు ప్రయాణ వేగాన్ని గంటకు 15నుంచి 35 కిలోమీటర్లకు పెంచడం అమలు చేస్తున్నామన్నారు.



మెట్రో ప్రారంభానికి హాజరైన ప్రధాని మోదీ మున్సిపల్ బాండ్ల జారీని అభినందించారని, జీహెచ్ఎంసీ రూ.200 కోట్ల విలువైన బాండ్లు జారీచేసిందన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపు దిశగా..

ఆర్టీసీకి చెందిన 31 స్థలాల్లో 54.39 ఎకరాలను గుర్తించి వివిధ సంస్థలకు వాణిజ్య కార్యకలాపాలకు లీజుకు ఇస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నపై మంత్రి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు బస్సులపై చర్యలకు కమిటీ వేశామని, ఆర్టీసీ సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు ఖమ్మం, కరీంనగర్‌లలో థియేటర్లు నిర్మిస్తున్నామన్నారు.

ఏప్రిల్ 20న పెట్టుబడి సాయం

రైతులను సంఘటితం చేసేందుకు రైతు సమన్వయ సమితులు తోడ్పాటునందిస్తాయని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సభ్యులు చెన్నమనేని రమేష్, చింతా ప్రభాకర్, వేముల వీరేశం, జలగం వెంకట్రావ్, కిషన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలపై మాట్లాడుతూ.. గతంలో ఆదర్శ రైతుల పేరున కారు డ్రైవర్‌కూ గౌరవ వేతనం ఇచ్చారని, తమ ప్రభుత్వం గ్రామంలో పొలం ఉండి, సాగుచేస్తున్న వారికి స్థానం కల్పించిందన్నారు. ఏప్రిల్ 20 నుంచి పెట్టుబడి సాయం చెక్కులు పంపిణీ చేస్తామని వివరించారు.

డిసెంబరు నాటికి రెండు లక్షల ఇళ్లు: ఇంద్రకరణ్‌రెడ్డి

డిసెంబరు నాటికి రెండు లక్షల రెండుపడక గదుల ఇళ్లను నిర్మిస్తామని గృహనిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. 2.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా..2.19 లక్షల ఇళ్లకు టెండర్లు ఆహ్వానించామని.. హైదరాబాద్‌లో నిర్మించే లక్ష ఇళ్లు కూడా డిసెంబరు నాటికి పూర్తవుతాయన్నారు. గృహనిర్మాణ పద్దుపై అసెంబ్లీలో జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గానికి 1,400 ఇళ్లు మంజూరుచేశామని చెప్పారు. గత ప్రభుత్వహయాంలో చేపట్టిన నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 1.29 లక్షల ఇళ్లను ఆమోదం లేకుండా నిర్మించినవిగా గుర్తించామన్నారు. రెండుపడక గదుల ఇళ్లకు రూ.1,277 కోట్లు ఖర్చుచేశామన్నారు. తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇది మంచి పథకమేనని, రాష్ట్రంలో 22 లక్షల కుటుంబాలకు ఇళ్లు లేదని సమగ్రకుటుంబ సర్వేలో తేలిందని.. అందరికి కట్టించి ఇవ్వాలని కోరారు. సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య మాట్లాడుతూ నియోజకవర్గానికి 10 వేల ఇళ్లు మంజూరుచేయాలన్నారు.

దళిత సంక్షేమంపై కేసీఆర్‌కు విజన్: జగదీశ్‌రెడ్డి

దళితుల సంక్షేమంపై కేసీఆర్‌కు విజన్‌ఉందని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్థికపద్దులపై జరిగిన చర్చ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో దళిత సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్లు ఖర్చుచేసిందని..వచ్చే ఆర్థికసంవత్సరానికి రూ.12,800 కోట్లు కేటాయించిందన్నారు. దళితులకు మూడు ఎకరాలభూమి పథకానికి రూ.554 కోట్లు ఖర్చుచేశామని.. నియోజకవర్గాల్లో భూములు అందుబాటులో ఉంటే కొనుగోలుచేసి దళితులకు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఎమ్మెల్యేలు చొరవతీసుకోవాలని కోరారు.

ఎంబీసీలకు అతి త్వరలో రుణాలిస్తాం: జోగు



అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ)కు అతి త్వరలోనే రుణాలిస్తామని బీసీ సంక్షేమశాఖమంత్రి జోగురామన్న తెలిపారు. ఎంబీసీల్ని గుర్తించేందుకు నియమించిన బీసీ కమిషన్ నివేదిక రావల్సి ఉందన్నారు. ఎంబీసీలకు గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.వెయ్యి కోట్లలో రజకులు, నాయి బ్రాహ్మణులకు రూ.250కోట్లు విడుదలచేసి పీడీఖాతాలో పెడతామని చెప్పారు. బీసీల పద్దుపై జరిగిన చర్చలో మాట్లాడుతూ భాజపా పాలిత రాష్ట్రాల్లోనూ లేనివిధంగా జనాభా ప్రాతిపదికన బీసీలకు తెరాస ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందన్నారు.

అజ్మీర్ దర్గాకు సీఎం చాదర్



ఈనాడు, హైదరాబాద్ :అజ్మీర్ దర్గాలో ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ చాదర్‌ను పంపించారు. ప్రగతిభవన్‌లో ప్రార్థనల మధ్య సీఎం చాదర్‌ను కొంతసేపు మోసి, దానిని మత పెద్దలకు అందజేశారు. ఉపముఖ్యమంత్రి మహమూద్‌అలీ, మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్, ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీలు ఫరీదుద్దీన్, ఫారూఖ్ హుస్సేన్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సలీం, మక్కామసీదు ఇమాం ఉస్మాన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిధులిచ్చి ఉంటే ముక్కు నేలకు రాస్తా

- రహదారుల మరమ్మతులపై తెరాస ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి
- కాంగ్రెస్ నుంచి వచ్చామని నిర్లక్ష్యమా: భాస్కర్‌రావు
- చర్చనీయాంశమైన అధికార పార్టీ సభ్యుల ప్రశ్నలు

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ ప్రశ్నోత్తరాల్లో గురువారం అధికార పార్టీ తెరాస ఎమ్మెల్యేలు సంధించిన ప్రశ్నలు చర్చనీయాంశమయ్యాయి. నియోజకవర్గాల్లో సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వానికి చెప్పినా పరిష్కారం కాలేదని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. రహదారి సమస్యలపై సభలో ముప్పావు భాగం మంది తమ నియోజకవర్గాల్లో సమస్య ఉందంటూ మాట్లాడేందుకు అనుమతి కోరాఉ. సభాపతి మధుసూదనచారి స్పందిస్తూ.. రోడ్ల సమస్య సభలోని వారందరికీ ఉన్నట్లు కనిపిస్తోంది. నేనూ సమస్య ఎదుర్కొంటున్నా.. మంత్రి స్పందించాలని సూచించారు. సభ్యులు ఏమన్నారంటే..

- ◆ మోకాళ్లలోతు గుంతలు ఉన్న రోడ్లపై ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాన్ని తిట్టుకుంటూ పోతున్నారు. రోడ్ల మరమ్మతు చేయమంటే పట్టించుకోవడం లేదు. దుబ్బాక నియోజకవర్గంలో రోడ్లకు నిధులిచ్చి ఉంటే ముక్కు నేలకు రాస్తా.. అంటూ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్, ర.భ.శా. రోడ్లకు బీటీ పునరుద్ధరణపై మంత్రి జూపల్లి కృష్ణారావుకు పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. గతంలో వేయని, పునరుద్ధరణ పనులు చేపట్టని వాటిని ఏప్రాతిపదికన ఎంపిక చేస్తారు, దుబ్బాక నియోజకవర్గంలో పలు రోడ్లకు బీటీ వేయకపోవడంతో దారుణస్థితిలో ఉన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందా, వస్తే తీసుకున్న చర్యలు ఏంటో తెలపాలని మంత్రిని ప్రశ్నించారు. నార్సింగ్-నర్సంపల్లితో పాటు సిరిసిల్లను కలిపే పలు రహదారులు ఛిద్రమై పోయాయన్నారు. మంత్రి కేటీఆర్ అవే రోడ్లపై ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. 2014లో చేపట్టిన బీటీ రెన్యువల్స్‌లో దుబ్బాక నియోజకవర్గంలో కొన్ని రోడ్లను తప్పించారని తెలిపారు.
- ◆ మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ.. రోడ్ల మరమ్మతులపై ర.భశాఖను అడిగితే పంచాయతీరాజ్ శాఖ పేరు చెబుతున్నారు. రోడ్లకు పైసలు లేవంటున్నారు. కాంగ్రెస్ నుంచి తెరాసలోకి వచ్చామని మాపై నిర్లక్ష్యం చూపుతున్నారా.. రోడ్లను రెన్యువల్స్ గురించి పట్టించుకోవడం లేదని వాపోయారు.
- ◆ ఆంథోల్ ఎమ్మెల్యే బాబూమోహన్ మాట్లాడుతూ.. రోడ్ల మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలిచ్చాను. ఎమ్మెల్యే నిధులనుంచైనా పనులకు అనుమతి కోరాను. నియోజకవర్గ రహదారుల్లో నడవలేనిపరిస్థితి ఉందన్నారు.
- ◆ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమాధానమిస్తూ..2004-2014 మధ్య రోడ్లకు అప్పటి పాలకులు రూ.416 కోట్లు కేటాయించారని, తెలంగాణ వచ్చాక మూడున్నరేళ్లలో రూ.2246 కోట్లు కేటాయించామన్నారు. వాటిలో రూ.1500 కోట్లు వ్యయం చేశామని వివరించారు. రాష్ట్రంలో 4695 కిలోమీటర్ల రోడ్లను రెన్యువల్స్ చేయాల్సి ఉందని, రూ.900 కోట్లు అవసరముండగా ప్రభుత్వ పరిశీలనలో ఉందని, సభ్యులు అడిగిన రోడ్లను పరిశీలన చేస్తామన్నారు. ఇంకా 358 గ్రామ పంచాయతీ కేంద్రాలకు బీటీ రోడ్లు లేవన్నారు.

ఎన్నికల హామీ తీర్చండి: తాటి వెంకటేశ్వర్లు

గత ఎన్నికల్లో నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి శాసనసభకు వచ్చానని అశ్వారావుపేట ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు(తెరాస) తెలిపారు. ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న తన నియోజకవర్గంలో రెండు మండలాలు ఆంధ్రలో కలిశాయని అక్కడి విద్యార్థులు జంగారెడ్డిగూడెం, ఏలూరుకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందన్నారు. గిరిజన ప్రాంతమైన తన నియోజకవర్గంలో డిగ్రీ కళాశాల వెంటనే ఏర్పాటు చేయాలని కోరగా.. విద్యాశాఖా మంత్రి కడియం శ్రీహరి స్పందిస్తూ సమస్యను పరిశీలిస్తామన్నారు.

నిధులు చాలడంలేదు: వెంకట్రావు

ఎమ్మెల్యే క్యాంపు, నివాస భవన నిర్మాణానికి నిధులు చాలడం లేదని, గుత్తేదారు వేసిన లెస్ టెండర్ నిధులను వినియోగించుకునే అనుమతివ్వాలని సభ్యుడు జలగం వెంకట్రావు కోరారు. స్థలవివాదంతో తన నియోజకవర్గంలో భవన నిర్మాణం ప్రారంభించడం లేదని చెబుతున్నారని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ర.భ.శా. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 119 భవనాల్లో 50 పూర్తయ్యాయని, నిధులు చాలనిచోట సీడీపీ నిధులు వినియోగించుకోవచ్చని సూచించారు.

రేవంత్‌వన్నీ నిరాధార ఆరోపణలు

- పెద్ద హీరోననుకుంటున్నారు
- మంత్రి ఈటల రాజేందర్ ధ్వజం

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలోకి తెదేపా ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఉడుములా వచ్చారని, తనకు తాను పెద్ద హీరోగా ఊహించుకొంటున్నారని, జైపాల్‌రెడ్డి, జానారెడ్డి లాంటి వాళ్లను వెనక్కినెట్టి ముందుకెళ్లాలనుకుంటున్నారని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు. ఇష్టం వచ్చినట్లు విమర్శిస్తున్నారని, స్థాయిని మరిచి అందరినీ దూషిస్తూ చప్పట్లు కొట్టించుకుంటున్నారని పేర్కొన్నారు. గురువారం శాసనసభా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'నేను భారీగా ముడుపులు తీసుకున్నానని రేవంత్ అసత్య ఆరోపణలు చేశారు. పౌరసరఫరాల శాఖను ప్రక్షాళన చేసి, అవినీతి రహితంగా తీర్చిదిద్దాం. రేషన్‌కార్డుల ముద్రణ చేపట్టాక కొత్త జిల్లాలు రావడంతో వాటిని నిలిపివేశాం. అన్నింటా పారదర్శకంగా ఉన్నాం. రేవంత్ అడ్డగోలుగా మాట్లాడి తన నైజాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దుపై కాంగ్రెస్ నేతలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. శాసనసభ సమావేశాల సందర్భంగా ఆ పార్టీ అనుసరిస్తున్న వ్యూహం దానికే నష్టంగా మారింది' అన్నారు.

ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కలిగించేందుకు కృషి

- మే నెల నాటికి ఉపాధ్యాయుల ఎంపిక పూర్తి
- బేటీ బచావో-బేటీ పడావో అమలు కావడం లేదు
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

ఈనాడు, హైదరాబాద్ : ప్రభుత్వ విద్యాసంస్థల పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా, ఇక్కడ చదువుతున్న విద్యార్థుల ఆత్మగౌరవం పెంపొందించేలా అనేక చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ ఎంపిక పరీక్షల ఫలితాలు విడుదల చేసి మే నెలలో ఎంపిక పూర్తిచేస్తామని, వచ్చే విద్యా సంవత్సరం నాటికి వీరంతా విధుల్లో చేరేలా చూస్తామన్నారు. వివిధ పద్దులపై గురువారం శాసనసభలో జరిగిన చర్చలో ఆయన సమాధానమిచ్చారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులకు రూ.1500 కోట్లు ఖర్చుపెడుతున్నామన్నారు. అన్ని వసతిగృహాల్లో కామన్‌మెనూ అమలు చేస్తున్నామని, సన్నబియ్యంతోనే భోజనం పెడుతున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడ్డప్పుడు 391 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ఉంటే కేంద్రం మరో 84 మంజూరు చేసిందని, రూ.100 కోట్లు ఖర్చు పెట్టి ఇక్కడ వసతులు సమకూర్చుతున్నామన్నారు.



రాష్ట్రంలో జూనియర్ కళాశాలలకు రూ.315 కోట్లతో సొంత భవనాలు కడుతున్నామని, రూ.10 కోట్లతో డిగ్రీ కళాశాలలకు భవనాలు, ల్యాబ్‌లు నిర్మించామన్నారు. 1202 జూనియర్ కళాశాల, 1,384 డిగ్రీ కళాశాల, 519 పాలిటెక్నిక్ లెక్చరర్లు, 1,551 యూనివర్సిటీ ప్రొఫెసర్ల పోస్టులు మంజూరు చేశామన్నారు. విద్యాసంస్థల్లో ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ జి.ఒ.నెం. 16 తీసుకొస్తే దాన్ని న్యాయస్థానంలో సవాలు చేయడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. అయితే ఒప్పంద అధ్యాపకుల గౌరవ వేతనాలు గణనీయంగా పెంచామన్నారు. కేంద్రం నుంచి సరైన సహకారం లభించడంలేదని, 2015 ఆగస్టు 15న ప్రధాని బేటీ బచావో-బేటీ పడావో అనే పథకాన్ని ప్రకటించారని, కాని ఈ పథకం ఎక్కడా అమలు కావడంలేదన్నారు. బాలికలను పై చదువులకు ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన సబ్‌కమిటీకి తాను నేతృత్వం వహించానని, కాని తాను చేసిన ఏ ప్రతిపాదన కూడా అమలు కాలేదన్నారు. మోడల్ పాఠశాలకు ఇస్తున్న నిధులు ఆపేశారని, రాష్ట్రానికి ఒక ఐఐఎం, ఎయిమ్స్ ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. అంతకు ముందు తెదేపా సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన తరగతులు (ఎంబీసీ) వారికి గత బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లు, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.వెయ్యికోట్లు మంజూరు చేశారని, కాని ఈ ఎంబీసీ కిందికి ఎవరెవరు వస్తారో ఇంకా గుర్తించలేదని, నిధులెలా ఖర్చవుతాయని ప్రశ్నించారు. బీసీ స్టడీసర్కిల్‌కు రూ.200 కోట్లు మంజూరు చేయాలని, బీసీల నుంచి తొలగించిన 26 కులాలను మళ్లీ కలపాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలని డిమాండు చేశారు. సీపీఎం సభ్యులు సున్నం రాజయ్య మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని, గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహించాలని కోరారు. తెరాస సభ్యులు యాదగిరిరెడ్డి, విఠల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి చర్చలో పాల్గొన్నారు.

కొత్త మండలాల్లో గోదాముల నిర్మాణం

- మార్కెటింగ్ శాఖమంత్రి హరీశ్‌రావు



ఈనాడు, హైదరాబాద్:తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గోదాంల నిర్వహణ సామర్థ్యం గణనీయంగా పెరిగిందని.. ఎరువులు, విత్తనాల కొరత లేకుండా నివారించేందుకు కూడా ఇవి దోహదపడ్డాయని మార్కెటింగ్‌శాఖమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గతంలో కేవలం 4 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములే ఉన్నాయని.. తెరాస అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1,024 కోట్ల వ్యయంతో 18.34లక్షల మెట్రిక్‌టన్నుల సామర్థ్యం ఉన్న 364 గోదాంలు నిర్మిస్తున్నామని, రూ.818.14 కోట్లు ఖర్చుచేశామని చెప్పారు. శాసనసమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ 164 కొత్త మండలాల్లోనూ గోదాంలు నిర్మించనున్నామన్నారు. ఇంకా ఎక్కడెక్కడ అవసరమన్నదానిపై నివేదిక ఇవ్వాలని నాబార్డ్‌ను కోరినట్లు చెప్పారు. మార్క్‌ఫెడ్, పౌరసరఫరాలశాఖలకు ప్రైవేటు గోదాంల కంటే తక్కువ అద్దెకే ఇచ్చామని..ఫలితంగా వాటికి రూ. 8 కోట్లు ఆదా అయ్యిందని వివరించారు. అందరికీ అందుబాటులో ఉండేలా పట్టణాల్లో స్థలాలు దొరికితే సిద్దిపేటతరహా ఆధునిక రైతు బజార్లను రాష్ట్రంలో ఎక్కడైనా ఏర్పాటుచేస్తామని హరీశ్‌రావుస్పష్టంచేశారు.

రూ.5 వేల కోట్ల నగదు ఇవ్వమని కేంద్రాన్ని కోరాం: ఈటల



ఏటీఎం కేంద్రాలు, బ్యాంకుల్లో నగదు కొరత ఉన్న మాట వాస్తవమేనని, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఈ విషయాన్ని నిర్ధారించిందని..రిజర్వుబ్యాంకు నుంచి సరిపడినంత కరెన్సీ రాష్ట్రానికి రావడం లేదని ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. రైతులకు ఎకరాకి రూ.నాలుగువేల చొప్పున పంటపెట్టుబడి సాయాన్ని అందించనున్న నేపథ్యంలో ఎరువుల కొనుగోలు, ఇతర అవసరాలకు నగదు ఇబ్బందులు లేకుండా రూ.5 వేల కోట్ల కరెన్సీ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని తెలిపారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల్లో మాట్లాడుతూ.. జీఎస్టీ తర్వాత బ్యాంకు ఖాతాల్ని ఆధార్‌తో అనుసంధానం తర్వాతా ఆదాయపు పన్ను నిఘాతో ఖాతాదారుల్లో భయాందోళన నెలకొందని, వారినుంచి బ్యాంకుల్లో నగదు జమ కావడం లేదన్నారు.

కేసీఆర్ కిట్ విజయవంతం: లక్ష్మారెడ్డి

'కేసీఆర్ కిట్' ప్రారంభించిన తర్వాత మాతా, శిశుమరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఈపథకం దోహదం చేస్తోందని ఆరోగ్యశాఖమంత్రి కె.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఇది ప్రారంభించిన 9నెలల్లోనే ప్రభుత్వాసుపత్రుల్లో దాదాపు 2లక్షల ప్రసవాలు జరిగాయన్నారు. 'కేసీఆర్ కిట్'పై శాసనమండలిలో గురువారం జరిగిన లఘుచర్చలో మంత్రి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంతో పాటు విద్య,వైద్య రంగాలకూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాధాన్యమిస్తున్నారని.. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓట్లకోసం పథకాలు తీసుకువస్తే కేసీఆర్ ముందుచూపుతో ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం ఈపథకం తెచ్చారన్నారు. కేసీఆర్ కిట్ కోసం 4.6 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. 2017 జూన్‌లో ప్రజారోగ్య సంస్థల్లో ప్రసవాల శాతం 41.47 శాతం ఉంటే.. కేసీఆర్ కిట్ ప్రభావంతో 2017 అక్టోబరు నాటికి 52 శాతానికి పెరిగాయన్నారు.

మంచి పథకం: రామచంద్రరావు

కేసీఆర్ కిట్ మంచి పథకమని.. ప్రభుత్వాసుపత్రుల్లో పెరుగుతున్న ప్రసవాలకు అనుగుణంగా సదుపాయాల్ని మెరుగుపర్చాలని భాజపా ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. ప్రధాని మోదీ ఇలాంటి పథకాన్ని ప్రకటించారని.. ఆ పథకం ద్వారా వచ్చే రూ.ఆరువేలను కేసీఆర్ కిట్‌లో కలిపి ఇస్తారా? అని ప్రశ్నించారు.

శిశు, మాతామరణాల్ని గణనీయంగా తగ్గించడంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉందని..'కేసీఆర్ కిట్' దోహదం చేసిందని.. చీఫ్‌విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కిట్‌తో అవగాహన పెరిగి గిరిజనులు సర్కారు ఆసుపత్రులకు వరుస కడుతున్నారని రాములునాయక్ అన్నారు.

అర్హతలేని వైద్యులపై చర్యలేం తీసుకుంటున్నారు?

మండలిలో నిలదీసిన ఎమ్మెల్సీలు

గ్రామీణప్రాంతాల్లో అర్హతలేని వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని..నగరాల్లో కొన్ని ఆసుపత్రులు ఇష్టారాజ్యంగా శస్త్రచికిత్సలు చేసి రూ.లక్షలు దండుకుంటున్నాయని.. వీరిపై చర్యలు తీసుకోవాలని శాసనమండలిలో ఎమ్మెల్సీలు డిమాండ్‌చేశారు. హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో నూర్జహాన్ అనే మహిళకు జబ్బును సరిగా గుర్తించకుండా 15 రోజులవ్యవధిలో మూడు సర్జరీలు చేశారని.. తర్వాత ఆమె మరణించిందని.. ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినా చర్యలు లేవని ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి చెప్పారు. కాంపౌండర్లు, వార్డ్‌బాయ్‌లు ఆర్ఎంపీలుగా చలామణి అవుతున్నారని వీరిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని ఎంఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. నకిలీ వైద్యులపైకేసులు పెడుతున్నామని.. ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం మాత్రమే చేయాలని ఆరోగ్యశాఖమంతి లక్ష్మారెడ్డి స్పష్టంచేశారు.

క్వింటాలు మిరప రూ.15,400

ఎనుమాములలో అత్యధిక ధర

వరంగల్ మార్కెట్, న్యూస్‌టుడే: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్లో సింగిల్ పట్టీ రకం మిరపకు గురువారం అత్యధికంగా క్వింటాలుకు రూ.15,400 ధర లభించింది. ఈ రకం మిరపకు మంచి నాణ్యత గలదిగా పేరుంది. వివిధ రకాల మొత్తం 35వేల బస్తాలు అమ్మకానికి రాగా సింగిల్ పట్టీ రకం 2500 బస్తాలున్నాయి. క్వింటాలు మిరప రూ.15400 లభించింది. రెండు రోజుల క్రితం ఈ మిరప ధర కేవలం రూ.12 వేలు మాత్రమే పలకడం గమనార్హం.

రాష్ట్ర జలవిధానాన్ని ప్రకటించాలి

రైతు, ప్రజాసంఘాల డిమాండ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రభుత్వం రాష్ట్ర జలవిధానాన్ని ప్రకటించాలని రైతు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐకాస ఛైర్మన్ కోదండరాం, మాజీ ఎమ్మెల్యే గుర్రం యాదగిరిరెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త అరబండి ప్రసాద్, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, కార్యదర్శి సాగర్, అఖిల భారత రైతు కూలీ సంఘం నుంచి కె.రంగయ్య, అచ్చుత రామారావు పాల్గొన్నారు. ప్రాజెక్టుల బడ్జెట్, పెట్టిన ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. ఈనెల 24నుంచి జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని, డిమాండ్ల సాధనకు ధర్నాలు చేయాలని తీర్మానించారు.

ప్రజాస్వామ్య విరుద్ధంగా రైతు సమన్వయ సమితులు

- భాజపా శాసనసభాపక్షా నేత కిషన్‌రెడ్డి

ఈనాడు - హైదరాబాద్

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా రైతు సమన్వయ సమితు(రైసస)లను ఏర్పాటు చేస్తున్నారని భాజపా సభ్యులు కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రశ్నోత్తరాల సందర్భంగా రైససల అంశంపై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నామినేటెడ్ విధానంలో రైసస సభ్యులను నియమిస్తోందని ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతమన్నారు. గతంలో జన్మభూమి కమిటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన ఆదర్శరైతులపై వ్యతిరేకత వచ్చిన విషయాన్ని అర్థం చేసుకోవాలన్నారు. పంట కొనుగోళ్లకు మహిళా సమాఖ్యలుండగా రైసస సభ్యులు ఎందుకన్నారు. వచ్చే ఏడాది లేదా ఆరునెలల తర్వాత అయినా సభ్యుల నియామకం సందర్భంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. రైతుల్లో అన్ని వర్గాల వారుండగా ఒకేపార్టీ వారికి అవకాశం కల్పించడం సరికాదన్నారు. దీనిపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి నేరుగా తెరాస కార్యకర్తలు, నాయకులను సభ్యులుగా నియమిస్తున్నామని ప్రకటించిన తీరు మంచి సంప్రదాయం కాదన్నారు. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళాసమాఖ్యలు, సహకార సంఘాలు పంటల కొనుగోళ్లు ఇతర కార్యక్రమాలను మానుకోబోవన్నారు. రైసస సభ్యులు కేవలం గిట్టుబాటు ధరలు, మార్కెట్లకు పంటలు ఏకకాలంలో రాకుండా సమన్వయం చేసి రైతులను సంఘటిత పరిచేందుకు మాత్రమే కృషిచేస్తారని తెలిపారు.



మరోమారు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కిషన్‌రెడ్డి సభాపతినికోరగా ఆయన నిరాకరించడంతో నిరసనగా సభ నుంచి భాజపా సభ్యులు వెళ్లిపోయారు.

వాయిదా తీర్మానాల తిరస్కరణ: జీహెచ్ఎంసీకి బడ్జెట్‌లో సరైన నిధులు కేటాయించలేదని అంతకు ముందు కిషన్‌రెడ్డి, ఒప్పంద ఉద్యోగులు, స్కీం కార్మికులను క్రమబద్ధీకరించాలని కృష్ణయ్య, సున్నం రాజయ్య వేర్వేరుగా ఇచ్చిన వాయిదా తీర్మానాలను సభాపతి తిరస్కరించారు. శూన్యగంటలో పలువురు సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు.

ఉద్యమానికి ఊపిరిపోసిన వర్సిటీల పరిస్థితి దారుణం: ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

'తెలంగాణ ఉద్యమానికి విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఊపిరిపోశారు.అలాంటి వర్సిటీల పరిస్థితి దారుణంగా ఉంది. తెలంగాణ వచ్చినా మార్పు రాలేదు. మరో ఉద్యమం అక్కడి నుంచే మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి' అని భాజపా సభ్యుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ వ్యాఖ్యానించారు. శాసనసభలో గురువారం పలు పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలకు రూ.420 కోట్లు కేటాయించి, సగం కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. ఓయూకు రూ.200 కోట్లు కేటాయించి రూ.50 కోట్లు ఇచ్చారన్నారు. తెలంగాణ వస్తే తమ ఉద్యోగాలకు భద్రత లభిస్తుందని ఆశించిన ఓయూలోని బోధనేతర సిబ్బంది జీవితంలో మార్పు రాలేదన్నారు. మహిళా సిబ్బందికి కనీసం మెటర్నిటీ సెలవులు కూడా లేవన్నారు. ప్రభుత్వ ముద్రణాలయంలో సిబ్బందికి 9 నెలలుగా వేతనాలివ్వలేదని.. తాను ఫోన్ చేస్తే అప్పటికప్పుడు ఉత్తర్వులిచ్చారన్నారు. ఉద్యమానికి వెన్నంటి ఉన్న ఉద్యోగులు ముక్తకంఠంతో సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. బీసీ ఉప ప్రణాళిక ఏమైందని ప్రశ్నించారు. కొత్తగూడెంలో కళాశాలను మైనింగ్ విశ్వవిద్యాలయంగా మారుస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని తెరాస సభ్యుడు జలగం వెంకట్రావు కోరారు. ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ వరకు తరగతులుంటే 10వ తరగతి వరకే మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నారని, దాన్ని ఇంటర్‌కూ వర్తింపజేయాలన్నారు. మరో సభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ పాత జిల్లాల్లో విశ్వవిద్యాలయం లేని ఒకే ఒక జిల్లా ఖమ్మం అని, స్తంభాద్రి పేరిట వర్సిటీ నెలకొల్పాలని కోరారు. ఎంఐఎం సభ్యుడు జాఫర్ హుస్సేన్ మాట్లాడుతూ నీలోఫర్ ఆసుపత్రిలో వెంటిలేటర్లు పెంచాలన్నారు. తెరాస సభ్యుడు వేముల వీరేశం తదితరులు మాట్లాడారు.

రాజ్యసభ ఎన్నికలకు భాజపా దూరం

కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నేడు చలో అసెంబ్లీ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎమ్మెల్యేలతో చర్చించి వారి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకున్నాక.. అధిష్ఠానం ఆదేశాల మేరకు రాజ్యసభ ఎన్నికలకు దూరంగా ఉండాలని భాజపా నిర్ణయించుకుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ తెరాస ఎంపీలు పార్లమెంట్‌ను స్తంభింపచేయడం పూర్తిగా అసంబద్ధమన్నారు. కేసీఆర్‌కు రిజర్వేషన్లపై నిజమైన చిత్తశుద్ధి లేదన్నారు. రైతుల పక్షాన రుణమాఫీ, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ నేడు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 'చలో అసెంబ్లీ' నిర్వహిస్తున్నామన్నారు. రాత్రి అయినా సభ నిర్వహిస్తామని చెప్పి ఇప్పుడు 10 పద్దులపై మాట్లాడేందుకు కేవలం 20 నిమిషాల సమయమే ఇవ్వడం దారుణమని కిషన్‌రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణపై తీర్మానం చేయాలి: ఆర్.కృష్ణయ్య

న్యాయ పరమైన చిక్కులు రాకుండా ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులు, కార్మికుల క్రమబద్ధీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయాలని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. లేదంటే లక్షలమందితో హైదరాబాద్‌ను చుట్టుముడతామని హెచ్చరించారు.

కులాలకు భరోసా ఇచ్చిన రోజు: తెరాస ఎమ్మెల్యేలు


నేడు అసెంబ్లీలో లక్షలాది మంది గౌడ కులస్థులు, కోట్లాది వృత్తి కులాలకు భరోసా ఇచ్చిన రోజు అని తెరాస ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి ప్రకటన ముగిసిన వెంటనే ఆయన ఎమ్మెల్యేలు వివేకానంద, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో కులవృత్తులకు పూర్వవైభవం తీసుకువస్తామని ఇచ్చిన మాటను సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారన్నారు.

ఆత్మహత్యలు తగ్గినందుకా చలో అసెంబ్లీ: పల్లా

రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు తగ్గినందుకా భాజపా నేడు 'చలో అసెంబ్లీ' నిర్వహించేది అని తెరాస ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. నిన్న పార్లమెంట్‌లో 12 మంది ఎంపీలు అడిగిన ప్రశ్నకు తెలంగాణలో రైతు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు 53.9శాతం తగ్గాయని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ స్వయంగా ప్రకటించారన్నారన్నారు.

కనిష్క్ డైరెక్టర్ భూపేష్ అరెస్టు!

- భార్య నీతజైన్, ఆడిటర్లను విచారించిన అధికారులు
- కార్యాలయం, ఇళ్లల్లో సోదాలు



నుంగంబాక్కంలో కనిష్క్ జ్యుయలరీ యజమాని ఇల్లు

ఈనాడు డిజిటల్, చెన్నై: రుణ బకాయిలు చెల్లించకుండా బ్యాంకులను మోసగించిన కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ భూపేష్ కుమార్‌ను సీబీఐ అరెస్టు చేసింది. 14 బ్యాంకుల నుంచి రూ.824 కోట్ల రుణాలు తీసుకుని బకాయిలు చెల్లించడం లేదనే ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత సదరు బంగారు నగల సంస్థ యజమాని పరారీలో ఉన్నారు. ఆయన దేశం విడిచి వెళ్లారన్న కోణంపై కూడా సీబీఐ దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఆయన చెన్నైలోనే ఉన్నట్లు అందుకున్న సమాచారంతో సీబీఐ వలపన్ని భూపేష్ కుమార్ జైన్‌ను నగరంలోనే అరెస్టు చేసింది. అలానే ఈ కేసులో భాగంగా ఆడిటర్లు తేజ్‌రాజ్, అజయ్‌కుమార్ జైన్, సుమిత్‌తోపాటు భూపేష్ భార్య నీతజైన్‌ను కూడా అధికారులు ప్రశ్నించారు. భూపేష్, నీతజైన్‌లను విచారణ నిమిత్తం దిల్లీకి తరలించే అవకాశముందని సీబీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. చెన్నై, కాంచీపురంలోని భూపేష్‌కు చెందిన ఇళ్లు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. నుంగంబాక్కంలోని కొఠారి రోడ్డులోని భూపేష్ ఇంటిని వేలం వేయడానికి ఎస్‌బీఐ చర్యలు చేపట్టింది. భూపేష్ ఇంటికి నోటీసులు అంటించింది.

‘వ్యాపం’ కేసులో వైద్యకళాశాల ఛైర్మన్ అరెస్టు

దిల్లీ: సంచలన ‘వ్యాపం’ కుంభకోణం కేసులో మధ్యప్రదేశ్‌లోని ఓ వైద్య కళాశాల ఛైర్మన్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అరెస్టు చేసింది. 2012లో రాష్ట్ర పరీక్షల బోర్డు వ్యాపం నిర్వహించిన వైద్య విద్య ప్రవేశాల పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై ఈ కేసు నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి భోపాల్‌లోని ఎల్ఎన్ వైద్య కళాశాల అధిపతి జేఎన్ ఛోస్కీని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. గత నవంబరులో సీబీఐ మధ్యంతర అభియోగపత్రం దాఖలు చేయడంతో.. కొందరు నిందితులపై భోపాల్‌లోని ప్రత్యేక కోర్టు బెయిల్‌కు వీల్లేని అరెస్టు వారెంట్లు జారీ చేసింది. వైద్య విద్య డైరెక్టర్‌కు ఎల్ఎన్ వైద్య కళాశాల ఖాళీ సీట్లకు సంబంధించి తప్పుడు సమాచారం సమర్పించినట్లు సీబీఐ ఆరోపించింది. సీట్ల భర్తీ ప్రక్రియలోనూ అక్రమాలకు పాల్పడినట్లు పేర్కొంది.

భారతీయ భాషల ద్వారా డిజిటల్‌లోకి 20కోట్ల మంది!

దిల్లీ: ఎంపిక చేసుకున్న భాషల్లో ఇంటర్నెట్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంటే.. దాదాపు 20 కోట్ల మంది భారతీయులు కొత్తగా డిజిటల్‌లోకి మళ్లుతారని ఓ నివేదిక పేర్కొంది. గత ఏడాది డిసెంబర్ నాటికి భారత్‌లో 48.1 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని తెలిపింది. చైనా తర్వాత ఇది రెండో స్థానమని వివరించింది. 2018 జూన్ నాటికి ఇది 50 కోట్లకు చేరుతుందని పేర్కొంది. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐఏఎంఏఐ), మార్కెట్ పరిశోధన సంస్థ కంతర్ ఐఎంఆర్‌బీలు ఈ నివేదికను రూపొందించాయి.

- భారతీయ భాషల్లో ఇంటర్నెట్ ఉంటే.. ఈ మాధ్యమాన్ని ఉపయోగించని 23 శాతం మందిలో ప్రేరణ నింపుతుంది. * ఎంపిక చేసిన భాషలో కార్యకలాపాలు సాగించడానికి అవకాశం లేకపోవడం వల్లే డిజిటల్ చెల్లింపులు, ప్రాథమిక ఈ-కామర్స్, ఆన్‌లైన్ ఉద్యోగాన్వేషణ వంటి కీలక ఇంటర్నెట్ సేవల వినియోగం చాలా పరిమితంగా సాగుతోంది.
- మాండరిన్ లిపిని ఉపయోగించడం వల్ల ప్రపంచంలోనే అత్యధిక ఇంటర్నెట్ వినియోగ స్థాయిని చైనా అందుకోగలిగింది. ఈ మాధ్యమంలో ఇంగ్లిష్ తర్వాత అత్యంత ఆదరణ కలిగిన భాషగా మాండరిన్ ఎదిగింది.
- ప్రపంచవ్యాప్త ఇంటర్నెట్ అంశాల్లో భారతీయ భాషల వాటా 0.1 శాతం.

సమాచార చౌర్యాన్ని నిరోధించే పెన్‌డ్రైవ్!

తమిళనాడు విద్యార్థుల సృష్టి: జావడేకర్

దిల్లీ: సమాచారాన్ని(డేటా) ఇతరులెవరూ చౌర్యం చేయడానికి వీల్లేని రీతిలో.. ఇస్రో కోసం సురక్షితమైన పెన్‌డ్రైవ్‌ను తమిళనాడు విద్యార్థులు రూపొందించినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ఇది ఒకేఒక్క కంప్యూటర్‌లో తప్ప మరెక్కడ వినియోగించినా పనిచేయదని, సమాచారం మాత్రం భద్రంగా ఉంటుందని వివరించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రోత్సాహంతో ‘స్మార్ట్ ఇండియా హాకథాన్’ తుదిపోటీలో నిలిచిన విద్యార్థులు దీన్ని అభివృద్ధి చేసినట్లు వెల్లడించారు. హాకథాన్ రెండోసంచిక వివరాలను మంత్రి ప్రకటించారు. పరిశోధనలను ప్రోత్సహిస్తూ.. వివిధ రంగాల్లో సమస్యల పరిష్కారానికి, నిరంతరం డిజిటల్ ఉత్పత్తుల అభివృద్ధికి ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. గతేడాదిలా కాకుండా ఈసారి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో పోటీలుంటాయని మంత్రి తెలిపారు. 27 కేంద్ర శాఖలు/విభాగాలు, 17 రాష్ట్ర ప్రభుత్వాలు 900కు పైగా సమస్యలను పంపించినట్లు తెలిపారు. వీటిలో 340 సాఫ్ట్‌వేర్, 68 హార్డ్‌వేర్ అంశాలు హాకథాన్‌కు ఎంపికయ్యాయి. ఇంజినీరింగ్, మేనేజిమెంట్, ఎంసీఏ విద్యార్థులు దాదాపు లక్ష మంది (17,400 బృందాలు) పాల్గొన్నారు. వీటిలో 1296 బృందాలు తుదిపోటీ (గ్రాండ్ ఫినాలే)కి ఎంపికైనట్లు వెల్లడించారు. 30, 31 తేదీల్లో సాఫ్ట్‌వేర్, జూన్‌లో హార్డ్‌వేర్ హాకథాన్‌లను నిర్వహించనున్నట్లు తెలిపారు. సాంకేతిక, వాణిజ్యం, వ్యవసాయం, విద్యుత్తు రంగాలకు సంబంధించిన అంశాలు తుదిపోటీకి ఎంపికయ్యాయి.

హుందాగా ఉండే దుస్తుల్లో కోర్టుకు రండి

అధికారులకు సుప్రీంకోర్టు సూచన

దిల్లీ: న్యాయస్థానాలకు హాజరయ్యే ప్రభుత్వాధికారులు హుందాగా ఉండే దుస్తులను ధరించి రావాలని గురువారం సుప్రీంకోర్టు సూచించింది. రాజస్థాన్ ప్రభుత్వానికి సంబంధించిన ఓ కేసు విషయమై ఆ రాష్ట్ర పట్టణాభివృద్ధిశాఖ అదనపు ముఖ్య కార్యదర్శి మంజిత్‌సింగ్ సాధారణ షర్టు, ప్యాంటు ధరించి బుధవారం సుప్రీంకోర్టుకు హాజరయ్యారు. విచారణను చేపట్టిన జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌ల ధర్మాసనం- ఆయన ధరించిన దుస్తుల పట్ల అభ్యంతరం వ్యక్తం చేసింది. “మీరు వేసుకున్న బట్టలేంటి? ఉన్నతాధికారులు ధరించాల్సిన దుస్తుల నియమావళి గురించి మీకు తెలుసా? కోర్టులకు హాజరయ్యేటప్పుడు అధికారులు ఎలాంటి దుస్తులు వేసుకోవాలో మీకు తెలియకపోతే... అసలు మీరు అదనపు ముఖ్య కార్యదర్శి పదవికి సరిపోరు. పంచె కట్టుకుని, చెప్పులేసుకుని వచ్చే వ్యక్తిని మీ కార్యాలయంలోకి అనుమతిస్తారా?” అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. రాజస్థాన్ తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ కలుగజేసుకుని.. అధికారుల వస్త్రధారణకు సంబంధించి ప్రత్యేకంగా నియమావళి ఏమీ లేదన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో కొన్ని నియమాలు ఉన్నాయనీ, ఇదే విషయమై ఓ హైకోర్టు గతంలో తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ- వస్త్రధారణకు సంబంధించి నియమాలు ఉన్నా, లేకపోయినా... ప్రభుత్వ ఉన్నతాధికారులు కోర్టుకు హాజరయ్యేటప్పుడు హుందాగా ఉండే దుస్తులను ధరించి రావడం సముచితమని సూచించింది. దీంతో సదరు అధికారి ధర్మాసనానికి భేషరతుగా క్షమాపణ చెప్పారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు మలి విచారణ సందర్భంగా అధికారుల వస్త్రధారణపై సూచనలు చేసింది.

ఆ ట్వీట్ నాది కాదు...నకిలీ: క్రికెటర్ హార్దిక్ పాండ్యా

జోధ్‌పుర్: భారత రాజ్యాంగ నిర్మాత బీ.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించేలా ట్విటర్‌లో వ్యాఖ్యలు చేశారంటూ తనపై వచ్చిన ఆరోపణలను క్రికెటర్ హార్దిక్ పాండ్యా తోసిపుచ్చారు. తన పేరుతో ఉన్న ట్విటర్ ఖాతాలోని ఆ వ్యాఖ్యలు తనవి కాదని... నకిలీ ట్విటర్ ఖాతా సృష్టించి ఎవరో వాటిని పోస్ట్ చేశారన్నారు. పాండ్యా పేరుతో ఉన్న ట్విటర్ ఖాతాలో అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా పోస్ట్ చేసిన ఆ వాఖ్యలపై ఓ న్యాయవాది ఫిర్యాదుతో జోద్‌పుర్‌లోని ఎస్సీ/ఎస్టీ ప్రత్యేక కోర్టు నిందితుడిపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యా వివరణ ఇచ్చారు. తన పేరుతో నకిలీ ట్విటర్ ఖాతాను సృష్టించిన ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్తీ బెయిల్‌పై నేడు నిర్ణయం

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా అవినీతి కేసులో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం దాఖలు చేసుకున్న బెయిల్ అభ్యర్థనపై దిల్లీ హైకోర్టు శుక్రవారం తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం ఉంది. కార్తీకి బెయిల్ మంజూరు చేయవద్దని సీబీఐ ఈ నెల 16న న్యాయస్థానంలో వాదించిన మీదట తీర్పును వాయిదా వేశారు. మరోపక్క ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ అక్రమ నగదు చలామణి కేసులో నేరపూరిత సొమ్ము పాత్ర ఉందని సంబంధిత ప్రత్యేక న్యాయస్థానం పేర్కొంది. దీనికి తగినన్ని ఆధారాలున్నాయని భావిస్తూ, కార్తీ పేరుతో ఉన్న రూ.1.16 కోట్ల ఆస్తుల్ని ఈడీ జప్తు చేయడం సబబేనని ప్రకటించింది. ఇవి అక్రమ సొమ్ముతో సముపార్జించినవి కావని రుజువు చేసుకోవడంలో కార్తీ విఫలమయ్యారని పేర్కొంది.

అయిదోరోజూ అదేవరస

- బుట్టదాఖలైన అవిశ్వాస నోటీసులు
- వెల్‌లోకి వచ్చిన తెరాస, అన్నాడీఎంకే సభ్యులు
- సభ సజావుగా లేదంటూ నేటికి వాయిదా వేసిన స్పీకర్
- తెదేపా, కాంగ్రెస్, అన్నాడీఎంకే ఎంపీల ఆందోళనలతో రాజ్యసభ వాయిదా



రాజ్యసభలో ఆందోళన చేస్తున్న సభ్యులను సముదాయిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు - దిల్లీ

లోక్‌సభ వాయిదాల పర్వం కొనసాగుతోంది. తెరాస, అన్నాడీఎంకే సభ్యుల ఆందోళనల సాకుతో స్పీకర్ సభను వాయిదా వేసుకుంటూ పోతున్నారు. దీంతో అవిశ్వాస తీర్మానం నోటీసులు బుట్టదాఖలు అవుతూనే ఉన్నాయి. మరోపక్క ‘అవిశ్వాసం’పై తెదేపా, వైకాపా తమ పట్టును కొనసాగిస్తూ పోతున్నాయి.

లోక్‌సభలో గురువారం కూడా గత నాలుగురోజుల తరహా దృశ్యాలే ఆవిష్కృతమయ్యాయి. అన్నాడీఎంకే, తెరాస సభ్యులు వెల్‌లోకి రావడం, సభ సజావుగా లేదని స్పీకర్ సుమిత్రామహాజన్ వాయిదా వేయడం జరిగిపోయింది. ఫలితంగా తెదేపా, వైకాపాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు అయిదోసారీ చర్చకు రాలేదు. ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన నిమిషం వ్యవధిలోనే వాయిదాపడింది. తెరాస, అన్నాడీఎంకే సభ్యులు వెల్‌లోకి వచ్చి ఆందోళనచేయడం, ప్రశ్నోత్తరాలు సాగే అవకాశం లేకపోవడంతో స్పీకర్ కేవలం నిమిషంలోనే సభను 12 గంటలకు వాయిదావేసి వెళ్లిపోయారు. పునఃప్రారంభమైన వెంటనే సభావ్యవహారాల కాగితాల సమర్పణకు స్పీకర్ మంత్రులు, ఇతర సభ్యులకు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ లేచి అన్ని అంశాలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున వెల్‌లో ఉన్న సభ్యులు వెనక్కు వెళ్లి చర్చకు అవకాశం కల్పించాలని సూచించారు. విపక్ష సభ్యులు పదేపదే అవిశ్వాస తీర్మానాలు ఇస్తున్నారని, దానిపైకూడా చర్చకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ప్రతి అంశానికీ సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దాని తర్వాత స్పీకర్ సుమిత్రామహాజన్ తోట నరసింహం(తెదేపా), వైవీ సుబ్బారెడ్డి(వైకాపా)ల అవిశ్వాస తీర్మానాలను సభముందుకు తెచ్చారు. ఆ సమయంలో అన్నాడీఎంకే, తెరాస సభ్యులు మరింత గట్టిగా నినాదాలుచేస్తూ ఆందోళనను హోరెత్తించారు. దీంతో సభలో ఏదీ వినపడని పరిస్థితి నెలకొంది. ఆహోరులోనే స్పీకర్ ఎప్పటిలాగే తీర్మానాలను సభముందుకు తేవడం తన విధి అని, సభ సజావుగా లేనంతవరకూ 50 మంది సభ్యులను లెక్కించడం సాధ్యంకావడంలేదన్నారు. సభ్యులంతా సీట్ల వద్ద నిల్చుంటే తాను తలలు లెక్కించి నిర్ధారించుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. అందరూ వెళ్లి సీట్ల వద్ద నిల్చోవాలని, ఇక్కడనుంచి తానేమీ చూడలేకపోతున్నానని పేర్కొన్నారు. సభ సజావుగా లేనందున తాను నోటీసులను సభముందుంచలేకపోతున్నట్లు పేర్కొన్నారు. చివరకు స్పీకర్ సభను శుక్రవారానికి వాయిదావేశారు. దీంతో ఇప్పటి వరకూ వరసగా 14 రోజులపాటు లోక్‌సభ ఎటువంటి కార్యకలాపాలు చేపట్టకుండానే వాయిదా బాట పట్టినట్లైంది. మరోపక్క తోట నరసింహం, వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం కోసం మరోసారి వాయిదా తీర్మానాలను స్పీకర్ కార్యాలయానికి అందించారు.

ప్రజలు చూడకూడదనే వాయిదా: వెంకయ్యనాయుడు

పెద్దల సభలో కనిపించే అసహ్యకరమైన దృశ్యాలను ప్రజలు చూడకూడదనే సభను వాయిదా వేస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు గురువారం ఉదయం సభలో వ్యాఖ్యానించారు. వెల్‌లోకి వచ్చి తెదేపా, అన్నాడీఎంకే, కాంగ్రెస్ సభ్యులు వివిధ అంశాలపై ఆందోళన మొదలుపెట్టడంతో వారినుద్దేశించి మాట్లాడుతూ ఈ అసహ్యకరమైన దృశ్యాలను ప్రజలు చూస్తున్నారని, అందువల్ల అందరూ సీట్లలోకి వెళ్లాలన్నారు. అంతకుముందు తెదేపా సభ్యుడు సీఎం రమేష్ మాట్లాడుతూ 2014 ఫిబ్రవరి 20న ఇదే సభలో విభజన బిల్లు పాస్ అయ్యేటప్పుడు కొన్ని వాగ్దానాలు చేశారని, మీరుకూడా ప్రత్యేకహోదా పదేళ్ల ఇవ్వాలని డిమాండ్ చేశారని సభాపతిస్థానంలో ఉన్న వెంకయ్యనాయుడిని ఉద్దేశించి అన్నారు. రాజధానిలేని ఏపీని ఆదుకోవాలని కోరారు. అనంతరం అన్నాడీఎంకే సభ్యుడు మైత్రేయన్ లేచి అంతర్జాతీయ జలదినోత్సవం సందర్భంగా కావేరి జలబోర్డుపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. అదే సమయంలో కేవీపీ రామచంద్రరావు తనకూ మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని కోరారు. గ్రాట్యుటీ బిల్లు పాస్ తర్వాత అవకాశం ఇస్తానని వెంకయ్య చెప్పడంతో కేవీపీ సీట్లోకి వెళ్లి కూర్చున్నారు. ఇంతలో గ్రాట్యుటీ బిల్లుపై చర్చ లేకుండానే సభ్యుల సహకారంతో మూజువాణిఓటుతో ఆమోదించారు. ఆ వెంటనే ముందుగా చెప్పినట్లుగానే కేవీపీకి మాట్లాడే అవకాశం ఇవ్వగానే అన్నాడీఎంకే, తెదేపా సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చారు. దాంతో కేవీపీ ప్లకార్డు చేతబట్టుకొని వెల్‌లోకి వచ్చి ఆందోళన కొనసాగించారు. దీంతో చివరకు సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు వెంకయ్యనాయుడు ప్రకటించారు.

రిజర్వేషన్లపై వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు

- తెరాస ఎంపీల స్పష్టీకరణ
- సభ సాగనివ్వాలని అడ్వాణీ సూచన
- డిమాండు ఆవశ్యకత వివరించిన ఎంపీలు



అడ్వాణీతో పార్లమెంటు సెంట్రల్‌హాల్‌లో మాట్లాడుతున్న తెరాస ఎంపీలు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని వెనకబడిన వర్గాలు, ఎస్సీ ఎస్టీల కోసం తాము చేస్తున్న పోరాటంపై వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని తెరాస ఎంపీలు పేర్కొన్నారు. తమ డిమాండుపై కేంద్రం మాట్లాడి సమస్య పరిష్కరించాలని స్పష్టం చేశారు. గురువారం లోక్‌సభ వెల్‌లోకి వచ్చిన ఎంపీలు ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. సభ సజావుగా సాగడం లేదని, అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చే ఎంపీలను లెక్కించేందుకు వీలు కావడం లేదంటూ సభాపతి సుమిత్రా మహాజన్ సభను శుక్రవారానికి వాయిదా వేశారు. అనంతరం భాజపా అగ్రనేత అడ్వాణీ.తెలంగాణ ఎంపీల మధ్య ఆసక్తికర సంభాషణ సాగింది. అడ్వాణీ తన సీటు వద్దకు వస్తున్న సమయంలో ఎంపీ ప్రభాకర్ రెడ్డి ప్లకార్డుతో కనిపించారు. ఎందుకు రోజూ ఆందోళన చేస్తున్నారంటూ అడ్వాణీ ఒకింత ఆగ్రహంగా ప్రభాకర్‌రెడ్డిని ప్రశ్నించారు. సభ సజావుగా సాగనివ్వాలని సూచించారు. సభ వాయిదా పడ్డ తర్వాత తెరాస ఎంపీలందరూ అడ్వాణీ వద్దకు చేరుకొని ఆయనకు నచ్చజెప్పే యత్నం చేశారు. విభజన అనంతరం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందనీ తదనుగుణంగా రిజర్వేషన్లు పెంచాల్సి ఉందని వివరించారు. రిజర్వేషన్లు పెంచుకొనే హక్కు రాష్ట్రాలకు ఇవ్వాలంటూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మీరు ఎవరినైనా సంప్రదించారా అని ఆయన ప్రశ్నించగా, హోంమంత్రి, స్పీకర్‌ను కలిసి రిజర్వేషన్ల పెంపు గురించి వివరించామన్నారు. హోంమంత్రి చేతిలో ఏముంటుంది.. ప్రధాని మోదీని కలిశారా అని అడ్వాణీ వారిని ప్రశ్నించారు. రిజర్వేషన్ల పెంపు అంశంపై సీఎం కేసీఆర్ ఇప్పటికే ప్రధానితో చర్చించారని ఎంపీలు తెలిపారు. కేంద్రానికి దిశానిర్దేశం చేయాలని స్పీకర్‌కు చెప్పామన్నారు. ‘స్పీకర్ కార్యాలయంలోనే ఉన్నారా? నేను వెళ్లి మాట్లాడతా’ అని అడ్వాణీ వారికి తెలిపారు. సుమారు 20 నిమిషాలపాటు సుమిత్రా మహాజన్‌తో చర్చించిన అడ్వాణీ తిరిగి తెరాస ఎంపీలతో మాట్లాడారు. ఈ అంశంపై తాను ప్రభుత్వానికి సూచన చేస్తానని స్పీకర్ చెప్పినట్లు అడ్వాణీ పేర్కొన్నారని ఎంపీలు జితేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్‌లు మీడియాకు తెలిపారు. రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసినా కాలక్షేపం చేస్తున్నారే తప్ప సమస్యకు పరిష్కారం లభించడం లేదని ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. తాము సమావేశాల ప్రారంభం నుంచే రిజర్వేషన్లపై ఆందోళన చేస్తున్నామన్నారు. తమపై ఎన్ని అభాండాలు వేసినా ప్రజల ఆకాంక్షల మేరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఏపీ సోదరులు వారి సమస్యపై ఎలా పోరాడుతున్నారో రాష్ట్రానికి సంబంధించిన సమస్యపై పోరాడుతున్నామని ఎంపీ సుమన్ తెలిపారు. సీతారాం నాయక్ మాట్లాడుతూ.. సభ సజావుగా ఎందుకు సాగడం లేదో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలన్నారు. కేంద్రం వైఖరి స్పష్టంగా చెప్పాలని డిమాండు చేశారు.

బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతం

దిల్లీ/పోఖ్రాన్: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని భారత్ గురువారం విజయవంతంగా పరీక్షించింది. దేశీయంగా రూపొందించిన ‘సీకర్’తో దీన్ని తొలిసారిగా పరీక్షించడం విశేషం. లక్ష్యం చేరేవరకూ క్షిపణికి అత్యంత కచ్చితత్వంతో మార్గనిర్దేశం చేయడంలో ఈ సీకర్ కీలక పాత్ర పోషిస్తుంది. రాజస్థాన్‌లోని పోఖ్రాన్ వద్ద ఉదయం 8.42గంటలకు ఈ అస్త్ర ప్రయోగం జరిగింది. బ్రహ్మోస్ అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించిందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దేశ భద్రతను ఇది మరింత ఇనుమడింపచేస్తుందన్నారు. బ్రహ్మోస్‌ను భారత్, రష్యాలు సంయుక్తంగా రూపొందించాయి. ధ్వని కన్నా మూడు రెట్లు ఎక్కువ వేగంతో ఇది దూసుకెళ్లగలదు. క్షిపణి పరిజ్ఞాన నియంత్రణ సంస్థ (ఎంటీసీఆర్)లో పూర్తిస్థాయి సభ్యత్వాన్ని భారత్ పొందిన నేపథ్యంలో ఈ అస్త్రం పరిధిని 400 కిలోమీటర్ల వరకూ పొడిగించుకునే అవకాశం లభించింది. బ్రహ్మోస్‌ను మూడు నెలల కిందట వైమానిక దళంలోని సుఖోయ్-30ఎంకేఐ యుద్ధవిమానం నుంచి విజయవంతంగా పరీక్షించారు. ఈ యుద్ధవిమానంపై మోహరించిన భారీ అస్త్రం ఇదే. దీనివల్ల వైమానిక దళానికి అదనపు బలం సమకూరింది.

ఆధార్‌లో చొరబడడం సూపర్ కంప్యూటర్‌కీ అసాధ్యం

- అలా చేయాలంటే 1300 కోట్ల ఏళ్లు పడుతుంది
- 100% ధ్రువీకరణ సాధ్యపడదు
- అయినా అందరికీ ప్రయోజనాలు అందుతాయి
- సుప్రీంకోర్టుకు ఉడాయ్ వివరణ

దిల్లీ: ఆధార్ సమాచారం రహస్య రూపంలో నిక్షిప్తమవుతుందని.. దానిలో చొరబడాలంటే ప్రపంచంలో శక్తిమంతమైన సూపర్ కంప్యూటర్‌కైనా విశ్వం వయసంత సమయం (సుమారు 1300 కోట్ల సంవత్సరాలు) పడుతుందని ‘భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ’ (ఉడాయ్) సుప్రీంకోర్టుకు వివరించింది. ఎవరూ చొరబడేందుకు వీల్లేని రీతిలో డేటాకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్లు పేర్కొంది. ఆధార్ చట్టబద్ధతపై విచారణ జరుపుతున్న రాజ్యాంగ ధర్మాసనానికి.. ఈ మేరకు అరుదైన రీతిలో ఉడాయ్ సీఈఓ అజయ్ భూషణ్ పాండే గురువారం 80 నిమిషాల పాటు దృశ్యాత్మక వివరణ (పవర్‌పాయింట్ ప్రజెంటేషన్) ఇచ్చారు. ఆధార్ బయోమెట్రిక్ ధ్రువీకరణ లేదన్న కారణంతో పౌరులెవరినీ ప్రభుత్వ ప్రయోజనాలకు దూరం చేయబోమని ఆధార్‌తో 100% ధ్రువీకరణ చేయాలంటే సాధ్యపడదని.. అయితే బయోమెట్రిక్ ధ్రువీకరణ విఫలమైన సమయాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని తెలిపింది. బయోమెట్రిక్ ధ్రువీకరణ విఫలమైన పక్షంలో వినియోగదారుడిని ఓటీపీ ద్వారానూ ధ్రువీకరించవచ్చని.. అర్హులెవరినీ సేవలకు దూరం చేయబోమని కోర్టుకు భూషణ్ తెలిపారు. ధ్రువీకరణ విఫలమైన వారి జాబితాను ప్రత్యేకంగా రూపొందించి.. తదనంతర కాలంలో సమాచారాన్ని సమర్పించాల్సిందిగా కోరుతామని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనానికి వివరించారు. జులై 1 నుంచి ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) సాంకేతికతతోనూ ధ్రువీకరణ జరుపుతామని భూషణ్ చెప్పారు.

‘శక్తిమంతమైన, జీవితకాల, పునర్వినియోగ, ధ్రువీకరించే వీలున్న జాతీయ ఆన్‌లైన్ గుర్తింపు’గా ఆధార్‌ను ఆయన అభివర్ణించారు. నకిలీ పాన్ కార్డులు, డొల్ల కంపెనీలను.. సంక్షేమ పథకాల ఫలాలను అక్రమంగా పొందుతున్నవారినీ గుర్తించడంలో ఆధార్ గొప్పగా ఉపయోగపడుతోందని వివరించారు.

సమాచార భద్రతపై ఆందోళన అనవసరం: ఆధార్ సమాచార భద్రత విషయంలో ఆందోళన అవసరం లేదని భూషణ్ అన్నారు. ఇటు ఆధార్ పొందాలంటే ఏం చేయాలన్నది మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఉండే నిరక్షరాస్యులైన ప్రజలకు తెలియకపోవచ్చని జస్టిస్ ఏకే సిక్రీ సందేహం వ్యక్తం చేశారు. ఆధార్ ధ్రువీకరణ పూర్తయ్యాక కూడా ప్రయోజనాలు అందని వ్యక్తులు ఉంటారని జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రస్తావించారు. అన్ని సమస్యలనూ ఆధార్‌తో పరిష్కరించడం కుదరదని.. సంబంధిత మంత్రిత్వశాఖలు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని భూషణ్ దీనికి బదులిచ్చారు. ఉడాయ్ సర్వర్ అంతర్జాలంతో అనుసంధానమై ఉండదని.. ఫలితంగా ఆధార్ సమాచారం ఇతర సంస్థలకు చేరడం వీలుపడదని తెలిపారు.

ప్రజలపై నిఘా కుదరదు: ఆధార్‌తో ప్రజలపై నిఘా పెట్టొచ్చని ఆరోపణలపైనా భూషణ్ స్పందించారు. ఆధార్‌తో లావాదేవీలు చోటుచేసుకున్నప్పుడు.. అవి జరిగిన స్థలం, లావాదేవీ స్వభావం వంటి వివరాలను ఉడాయ్ సేకరించదని పేర్కొన్నారు. ఆధార్‌తో బ్యాంకు ఖాతా తెరిచినా, మొబైల్ నెంబర్ పొందినా.. ఆ ఖాతా వివరాలు గానీ, ఫోన్ నెంబర్ సమాచారం కానీ ఉడాయ్‌కు తెలిసే వీలులేదని తెలిపారు. గతంలో ఓ కేసులో సీబీఐకి బయోమెట్రిక్ సమాచారం ఇచ్చేందుకూ ఉడాయ్ నిరాకరించినట్లు ఆయన వివరించారు.

గనుల రంగంలోనూ మహిళలకు అవకాశమివ్వాలి

కార్మికమంత్రి గంగ్వార్‌కు ఎంపీ వినోద్ విజ్ఞప్తి

ఈనాడు, దిల్లీ: గనుల రంగంలోనూ మహిళలకు అవకాశం ఇవ్వాలని కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ గంగ్వార్‌కు ఎంపీ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారమిక్కడ కేంద్రమంత్రి గంగ్వార్‌తో ఎంపీ వినోద్ భేటీ అయ్యారు. భూగర్భ గనుల్లో పని చేయడానికి మహిళలకు అవకాశం ఇవ్వడం లేదని తద్వారా వారి డిగ్రీలు, డిప్లొమాలు వృథా అవుతున్నాయన్నారు. మంథని జేఎన్‌టీయూలో మైనింగ్ డిగ్రీ చేసి ఉపాధి దొరక్క ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎంపీ విజ్ఞప్తిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి మైనింగ్ చట్టాన్ని సవరించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. గనుల రంగంలో మహిళలకు సమాన అవకాశాలు దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రాజ్యసభలో పెరగనున్న భాజపా బలం

- తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో నేడు పోలింగ్
- యూపీలో ఆసక్తి రేకెత్తిస్తున్న సమరం

ఈనాడు, దిల్లీ: రాజ్యసభ స్థానాల కోసం శుక్రవారం తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల తర్వాత భాజపా, కాంగ్రెస్ బలాబలాలు కొంతమేర మారనున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం 59 స్థానాలు ఖాళీకాగా వాటిలో 33 చోట్ల ఎన్నికలు ఈ నెల 15నే ఏకగ్రీవంగా పూర్తయ్యాయి. వీటిలో భాజపాకి 16, కాంగ్రెస్‌కి 5 చొప్పున రాగా తెదేపా, వైకాపా సహా ఇతర పార్టీలకు మిగిలిన 12 లభించాయి. ఎన్నికలు అవసరమైన ఇతర 26 స్థానాల ఫలితాలూ వెల్లడయ్యాక ఎగువసభలో భాజపా బలం ఇప్పుడున్న 58 నుంచి కనీసం 70కి చేరనుంది. అదే సమయంలో కాంగ్రెస్ బలం 54 నుంచి 45కి తగ్గనుంది. రాజ్యసభలో విపక్ష బలం ఎక్కువగా ఉన్నందువల్ల ఎన్డీఏ సర్కారు ప్రతిపాదించే అనేక బిల్లులకు అక్కడ అవరోధాలు ఎదురవుతున్న విషయం తెలిసిందే. యూపీ సహా వివిధ రాష్ట్రాల్లో శాసనసభల ఎన్నికల్లో గెలుపొందుతూ వస్తున్న భాజపా... ఆ బలంతో క్రమంగా రాజ్యసభ స్థానాలను పెంచుకొంటోంది. శుక్రవారం నాటి ఎన్నికల్లో యూపీలోని 10 స్థానాల్లో ఎనిమిదింటిని ఆ పార్టీ ఖాయంగా గెలుచుకోనుంది. ఆ రాష్ట్రం నుంచి పోటీ చేస్తున్నవారిలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ, భాజపా అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ఉన్నారు. యూపీలో 10 సీట్ల కోసం 11 మంది మధ్య పోటీ నెలకొంది. భాజపాకి వాస్తవంగా 8 సీట్లకు సరిపడే బలం ఉన్నా తొమ్మిదో అభ్యర్థినీ నిలబెట్టడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. పశ్చిమ బెంగాల్ నుంచి కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి పోటీ చేస్తున్నారు.

తాజా ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక కూడా ఎన్డీఏకి రాజ్యసభలో ఆధిక్యం రాదు. కాకపోతే ఇప్పటికే ఏకైక అతిపెద్ద పార్టీగా ఉన్న భాజపా బలం 70కి చేరనుండడం ఆ పార్టీ సహా ఎన్డీఏ సభ్యులకు నైతికంగా బలాన్నిస్తుంది. సోమవారం నుంచి పార్లమెంటు సమావేశాల్లో ఆ మేరకు తమ దూకుడు కనిపిస్తుందని భాజపా నేత ఒకరు చెప్పారు. ముమ్మారు తలాక్ నిషేధం, ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడం వంటి బిల్లుల ఆమోదానికి ఒత్తిడి మరింత పెంచుతామని తెలిపారు. కాంగ్రెస్‌కు 8-9 స్థానాలు తగ్గిపోనుండడం ఆ పార్టీ స్థైర్యాన్ని సడలింపజేస్తుందనీ, 2019 సార్వత్రిక ఎన్నికల దిశగా విపక్షాలను కూడగట్టే ప్రయత్నాల్లోనూ ఆ పార్టీకి కొన్ని ఇబ్బందులు తప్పకపోవచ్చని స్వతంత్ర విశ్లేషకుడొకరు అభిప్రాయపడ్డారు.

రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీపై ఆదాయపు పన్ను మినహాయింపు

దిల్లీ: పదవీవిరమణ అనంతరం ఉద్యోగులు పొందే గ్రాట్యుటీపై ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని. . రెండింతలు చేసేందుకు కేంద్రానికి మార్గం సుగమమైంది. ఈ మినహాయింపు వర్తించే మొత్తాన్ని రూ.20 లక్షల వరకూ పెంచేందుకు పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లు గురువారం ఆమోదం పొందింది. దీంతో పరిమితిని కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా మార్చే అధికారం కేంద్రానికి కలిగింది. ఈ బిల్లుకు రాజ్యసభ పచ్చజెండా ఊపింది. మార్చి 15న లోక్‌సభ దీన్ని ఆమోదించింది. కార్యనిర్వాహక ఉత్తర్వు ద్వారా మాతృత్వ సెలవు వ్యవధిలో మార్పులు చేసే అధికారం ప్రభుత్వానికి ఈ బిల్లుతో కలిగింది. బిల్లు ప్రవేశపెట్టడానికి ముందు.. ఉదయం వివిధ పార్టీల నాయకులను కలిశానని రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు వెల్లడించారు. ఉద్యోగులకు ముఖ్యమైన ఈ బిల్లును సభ స్వీకరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. కేంద్ర కార్మికశాఖ మంత్రి సంతోష్‌కుమార్ బిల్లును ప్రవేశపెట్టారు.

సుష్మాస్వరాజ్‌పై సభాహక్కుల తీర్మానం: కాంగ్రెస్

దిల్లీ: ఇరాక్‌లో 39 మంది భారతీయుల మృతిపై విదేశీవ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ సభను తప్పుతోవ పట్టించారని ఆరోపిస్తూ.. ఆమెపై రాజ్యసభలో సభాహక్కుల తీర్మానం ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ నిర్ణయించింది. సమగ్ర సమాచారంతో పత్రాలు సిద్ధమైన అనంతరం తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు కాంగ్రెస్ ఎంపీలు అంబికా సోనీ, ప్రతాప్ బజ్వా, షంషేర్ సింగ్ దుల్లో గురువారం తెలిపారు. నాలుగేళ్లుగా సుష్మాస్వరాజ్ సభను తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. ఇరాక్‌లోని మోసుల్‌లో అపహరణకు గురైనవారు సజీవంగా ఉన్నట్లు సభలో మంత్రి చెబుతూ వచ్చారన్నారు. అయితే ఆమెకున్న విశ్వసనీయ సమాచారం తప్పని.. తమ ఆధారాలే సరైనవని తేలినట్లు అంబికా సోని విలేకర్లకు తెలిపారు. తాము నిరంతరం ఈ అంశాన్ని లేవనెత్తుతున్నా.. తాను ఎలాంటి ఆధారాలు, పత్రాలు చూపలేనంటూ సుష్మాస్వరాజ్ చెబుతూ వచ్చారన్నారు. బాధిత కుటుంబాలకు కనీసం నష్టపరిహారం కూడా ప్రకటించలేదని బజ్వా విమర్శించారు.

కాంగ్రెస్‌పై ప్రభుత్వం కట్టుకథ.. రాహుల్: ఇరాక్‌లో భారతీయుల మృతి అంశం నుంచి దృష్టిని మరల్చేందుకు కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్‌పై డేటాచౌర్యం కథను అల్లిందని పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. మీడియా దృష్టిని కూడా ప్రభుత్వం మరల్చిందని ఆరోపించారు. ఈమేరకు ట్విట్టర్‌లో తనదైన శైలిలో మరోసారి విమర్శలు చేశారు. “సమస్య - 39 మంది భారతీయుల మృతి, ప్రభుత్వం అసత్యాలు చెబుతూ దొరికిపోయింది. పరిష్కారం - కాంగ్రెస్, డేటా చౌర్యం అంటూ కథ అల్లింది. ఫలితం - మీడియా సంస్థల దృష్టి మరలింది. భారతీయుల మృతి అంశం కనుమరుగైంది. . సమస్య పరిష్కారమైంది..” అని పేర్కొన్నారు. ఇరాక్‌లో అపహరణకు గురైనవారు ఏడాది క్రితమే మృతి చెందినట్లు ఆధారాలు కనిపిస్తున్నా వారి కుటుంబాలకు ప్రభుత్వం అసత్యాలు చెబుతూ వచ్చిందని కాంగ్రెస్ సమాచార ఇన్‌ఛార్జి రణదీప్ సుర్జేవాలా విమర్శించారు.

శవరాజకీయాలు వద్దు రాహుల్!

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: ఇరాక్‌లో ఐసిస్ చేతిలో దారుణహత్యకు గురైన 39 మంది భారతీయ వలస కార్మికుల శవాలపై... కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. అత్యంత దురదృష్టకరమైన ఈ అంశాన్ని రాజకీయం చేయడం ఆయనకు తగదన్నారు. గురువారమిక్కడ మంత్రి విలేకరులతో మాట్లాడారు. భారతీయుల హత్యపై విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌ను వివరణ ఇవ్వనీయకుండా లోక్‌సభలో కాంగ్రెస్ గందరగోళం సృష్టించిందన్నారు. అంతకుముందు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ- కార్మికుల హత్య విషయం నుంచి మీడియా దృష్టిని మళ్లించేందుకే... వివాదాస్పద సంస్థలతో కాంగ్రెస్‌కు సంబంధాలున్నట్లు భాజపా చెబుతోందని విమర్శించారు. దీనిని రవిశంకర్‌ప్రసాద్ తోసిపుచ్చారు. ఫేస్‌బుక్‌లో వ్యక్తుల సమాచారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంబ్రిడ్జ్ అనలిటికాతో తమ పార్టీకి ఎలాంటి సంబంధాలూ లేవని ఆయన కొట్టిపారేశారు. అనలిటికా భారతీయ భాగస్వామి సంస్థతో భాజపాకు ఒప్పందాలు ఉన్నాయనడం నిరాధారమన్నారు.

ఛాంపియన్

> "మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలతో తీవ్ర ఒత్తిడికి గురయ్యా. నేను ఏ తప్పూ చేయలేదని బీసీసీఐ తేల్చడం నాకు ఉపశమనం. దేశం పట్ల నా అంకితభావంపై ప్రశ్నలు తలెత్తడం నన్ను బాధించింది. ఐతే బీసీసీఐ విచారణ ప్రక్రియపై నాకు పూర్తి నమ్మకముంది. తిరిగి మైదానంలో అడుగుపెట్టాలని ఉవ్విళ్లూరుతున్నా. బీసీసీఐ నిర్ణయం నాకు ధైర్యాన్ని, బాగా ఆడేందుకు ప్రేరణను ఇచ్చింది. రానున్న రోజుల్లో నా బౌలింగే మాట్లాడుతుంది"
>
> – మహ్మద్ షమి



షమికి సెంట్రల్ కాంట్రాక్టు

అతడు ఫిక్సింగ్‌కు పాల్పడలేదని తేల్చిన బీసీసీఐ

దిల్లీ: ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమికి ఎట్టకేలకు బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు దక్కింది. షమి ఎలాంటి ఫిక్సింగ్‌కు పాల్పడలేదని బోర్డు అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) తేల్చడంతో అతడికి మార్గం సుగమమైంది. షమికి బోర్డు గ్రేడ్ 'బి' వార్షిక కాంట్రాక్టు ఇచ్చింది. దీని కింద అతడికి రూ.3 కోట్లు అందుతాయి. అతడు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లోనూ ఆడొచ్చు. గృహహింస, అక్రమ సంబంధాలు సహా షమిపై అతడి భార్య హసీన్ జహాన్ అనేక ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో షమి కాంట్రాక్టును బీసీసీఐ నిలిపి ఉంచింది. ఐతే పాకిస్థాన్‌కు చెందిన మహిళ అలిష్బా నుంచి అతడు డబ్బులు తీసుకున్నాడన్న ఆరోపణలపై విచారణ జరపాల్సిందిగా ఏసీయూను ఆదేశించింది. "ఏసీయూ అధినేత నీరజ్ కుమార్ పరిపాలకుల కమిటీ (సీఓఏ)కి నివేదిక అందించాడు. ఆ నివేదిక ఆధారంగానే.. బీసీసీఐ అవినీతి నిరోధక నియమావళి కింద షమిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అవసరం లేదని సీఓఏ నిర్ణయించింది. బీసీసీఐ ఇక అతడికి ఇవ్వాల్సిన గ్రేడ్ 'బి' కాంట్రాక్టును ఇవ్వొచ్చు" అని ఓ ప్రకటనలో సీఓఏ చెప్పింది. షమి వ్యక్తిగత జీవితం జోలికి పోమని బోర్డు ముందు నుంచీ చెబుతూ వస్తోంది. "ఇది షమికి, భారత క్రికెట్‌కు శుభవార్త. అతడిపై అవినీతి మచ్చ తొలగింది. అతడు అంకితభావం ఉన్న ఆటగాడు. షమి ఎలాంటి తప్పూ చేయలేదని విచారణలో తేలడం బీసీసీఐకి సంతోషాన్నిస్తోంది" అని బీసీసీఐ అధ్యక్షుడు సీకే ఖన్నా అన్నాడు. క్లీన్‌చిట్ లభించగానే షమికి ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతి లభిస్తుందని ఇంతకుముందే చెప్పానని ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా చెప్పాడు. షమి ఐపీఎల్‌లో దిల్లీ డేర్‌డెవిల్స్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.

ఒలింపిక్స్‌లో పతకాలకు ముఖం వాచే భారత్‌కు కామన్వెల్త్ క్రీడలు పండుగే. ఒలింపిక్స్‌తో పోల్చుకుంటే బరిలో దిగే దేశాల సంఖ్య తక్కువగా ఉండటం.. పోటీ పెద్దగా లేకపోవడంతో కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు ఎప్పుడూ పతకాల పంటే. 1930లో ప్రారంభమైన కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 438 పతకాలు సాధించింది. 14 మార్లు ఈ క్రీడల్లో పాల్గొన్న భారత్‌కు.. 2010 దిల్లీలో 101 పతకాలతో రెండో స్థానంలో నిలవడమే అత్యుత్తమ ప్రదర్శన. 2014లో 64 పతకాలు గెల్చుకున్న భారత్.. ఈసారి మరిన్ని పతకాలపై దృష్టిసారించింది. ఏప్రిల్ 4న ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఆరంభంకానున్న మెగా ఈవెంట్లో 15 క్రీడాంశాల్లో 222 మంది క్రీడాకారులతో భారత్ బరిలో దిగుతుంది. అందులో మన తెలుగు సైన్యం.. 13 మంది! రాశిలో తక్కువే అనిపిస్తున్నా పతకాలు గెలవగలిగిన ప్రధాన క్రీడాకారులు మనోళ్లే కావడం విశేషం. ఇక కామన్వెల్త్ కదనంలో తెలుగు వెలుగులు ఖాయమన్నది విశ్లేషకుల అంచనా!




కామన్వెల్త్‌లో మన మెరుపులు..

జోరుమీదున్న రాకెట్లు

కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు కచ్చితంగా పతకాలు వచ్చే క్రీడ.. బ్యాడ్మింటన్. అత్యుత్తమ క్రీడాకారులు మనోళ్ళే కావడం ఇందుకు ఒక కారణం కాగా.. బ్యాడ్మింటన్ అగ్ర దేశాలు చైనా, జపాన్ కామన్వెల్త్ క్రీడల్లో బరిలో లేకపోవడం మరో కారణం. 70 దేశాలు పాల్గొంటున్న ఈ క్రీడల్లో బ్యాడ్మింటన్ ఆడే ప్రధాన దేశాలు భారత్, మలేసియా, సింగపూర్ మాత్రమే! క్రీడాకారుల ర్యాంకింగ్.. ఇటీవలి ఫలితాల ప్రకారం ఈ మూడు దేశాల్లో భారత్ నంబర్‌వన్. కాబట్టి 6 స్వర్ణ పతకాలున్న బ్యాడ్మింటన్‌లో సింహభాగం భారత్ ఖాతాలోనే చేరొచ్చు. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్.. మహిళల సింగిల్స్‌లో సింధు, సైనా, రుత్విక శివాని.. డబుల్స్‌లో సిక్కిరెడ్డి, సాత్విక్ సాయిరాజు తెలుగు 'వాడి' చూపేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇటీవలి ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్ చేరుకున్న శ్రీకాంత్‌కు కామన్వెల్త్ క్రీడల సింగిల్స్‌లో ఎదురేలేకపోవచ్చు. ఇక మహిళల సింగిల్స్‌లో మనోళ్ళకు తిరుగేలేదు. ఒకే పార్శ్వంలో లేకపోతే స్వర్ణం కోసం సింధు, సైనా పోటీపడినా ఆశ్చర్యపోనవసరం లేదు. మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి- అశ్విని పొన్నప్ప, పురుషుల డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కిరెడ్డి-ప్రణవ్‌ల జోడీలకు పతకాలు ఖాయం. టీమ్ ఈవెంట్లోనూ భారత్‌ను ఆపడం మిగతా జట్లకు కష్టమే.

ఇటు అరుణ.. అటు మేఘన

రియో ఒలింపిక్స్ జిమ్నాస్టిక్స్‌లో దీపా కర్మాకర్ పోరాటం చూసి ఉప్పొంగిన మనకు ఇప్పుడు అరుణరెడ్డి, మేఘనారెడ్డిల రూపంలో మరో ఇద్దరు అగ్రశ్రేణి జిమ్నాస్ట్‌లు దొరికారు. ఆస్ట్రేలియాలో జరిగిన ప్రపంచ కప్‌లో కాంస్య పతకంతో మెరిసిన అరుణ.. కామన్వెల్త్ క్రీడల్లోనూ జోరు కొనసాగించడం ఖాయం. ఆర్టిస్టిక్‌లో వ్యక్తిగత, టీమ్ ఈవెంట్లలో బరిలో ఉన్న అరుణ పతకం సాధించొచ్చన్నది విశ్లేషకుల అంచనా. ఇక చివరి నిమిషంలో కామన్వెల్త్ క్రీడలకు అర్హత సాధించిన మేఘనారెడ్డికి రిథమిక్ జిమ్నాస్టిక్స్‌లో పతకం గెలిచే అవకాశముంది. పట్టుబట్టి మరీ సెలెక్షన్స్ పెట్టించుకుని.. అర్హత ప్రమాణాల్ని అందుకుని కామన్వెల్త్ క్రీడలకు వెళ్తున్న మేఘన రిథమిక్‌లో మెరుపు తీగలా మెరవడం ఖాయం.


మేఘనారెడ్డి

– ఈనాడు, హైదరాబాద్

రాహుల్.. రాహుల్

ఈసారి కామన్వెల్త్ క్రీడల వెయిట్ లిఫ్టింగ్‌లో కచ్చితంగా స్వర్ణం సాధించగల క్రీడాకారుల్లో రాగాల వెంకట రాహుల్ ముందుంటాడు. పురుషుల 85 కేజీల విభాగంలో అతడే ప్రధాన ఫేవరెట్. అద్భుత ఫామ్‌లో ఉన్న అతడిదే పసిడి అన్నది విశ్లేషకుల మాట. జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డుతో ఛాంపియన్‌గా నిలిచాడు రాహుల్. సీనియర్ కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్, జూనియర్ కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లోనూ రాహుల్‌వే బంగారు పతకాలు. ఒక్కో ఈవెంట్లో మూడేసి స్వర్ణాలు సాధించిన రాహుల్.. రెండు టోర్నీల్లోనూ ఉత్తమ లిఫ్టర్ అవార్డులు దక్కించుకున్నాడు. రెండింట్లోనూ కొత్త రికార్డులు నెలకొల్పాడు. సీనియర్ టోర్నీలో స్నాచ్‌లో 149 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 196 కిలోలు.. మొత్తంగా 345 కిలోల బరువులెత్తి రికార్డు నెలకొల్పాడు. కామన్వెల్త్ క్రీడల్లో అదే ప్రదర్శన పునరావృతం చేసినా అతనివే 3 స్వర్ణాలు. ప్రస్తుతం ప్రాక్టీసులో స్నాచ్‌లో 158 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 205 కిలోలు ఎత్తుతున్న రాహుల్‌ను కామన్వెల్త్ క్రీడల్లో ఎవరు ఆపగలరు!

షూటర్లు ఏం చేస్తారో

19 స్వర్ణ పతకాలున్న షూటింగ్‌లో భారత్ నుంచి 27 మంది బరిలో ఉన్నారు. మన దగ్గర నుంచి గగన్ నారంగ్ (50 మీటర్ల రైఫిల్ ప్రోన్), కైనన్ షెనాయ్ (ట్రాప్)లు తమ అదృష్టం పరీక్షించుకోనున్నారు. 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో ఒక రజతం, ఒక కాంస్యం సాధించిన నారంగ్ నుంచి ఆ తర్వాత మెరుపులు లేవనే చెప్పాలి! ఐతే అర్హత పోటీల్లో మెరుగ్గా రాణించిన నారంగ్.. కామన్వెల్త్ బెర్తు దక్కించుకున్నాడు. నిరుడు ఆసియా షాట్‌గన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసిన కైనన్ నుంచి మెరుగైన ప్రదర్శన ఆశించొచ్చు.

బాక్సింగ్ కెరటం

కామన్వెల్త్ క్రీడలకు వెళ్తున్న భారత బాక్సింగ్ బృందంలో యువ ఆటగాడు మహ్మద్ హుసాముద్దీన్ ఇప్పుడు కీలక ఆటగాడు. బల్గేరియాలో రజతం, మంగోలియాలో కాంస్యం, స్ట్రాంజా కప్‌లో కాంస్య పతకాలతో మెరిసిన హుసాముద్దీన్ 56 కేజీల విభాగంలో బరిలో దిగుతున్నాడు. మంచి ఫామ్‌లో ఉన్న హుసాముద్దీన్ పతకం గెలవడం లాంఛనమే!

హాకీ ఆణిముత్యం

2016 రియో ఒలింపిక్స్‌లో బరిలో దిగిన భారత జట్టులో రజని సభ్యురాలు. మరో గోల్ కీపర్ సవితతో కలిసి రజని భారత జట్టు విజయాల్లో తమ వంతు పాత్ర పోషిస్తోంది. కామన్వెల్త్ క్రీడల్లోనూ రజని భాగస్వామ్యం జట్టుకు కీలకమే.

బ్యాడ్మింటన్: సింధు, సైనా, సిక్కిరెడ్డి, రుత్విక శివాని, శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజు, **బాక్సింగ్:** మహ్మద్ హుసాముద్దీన్, **జిమ్నాస్టిక్స్:** అరుణరెడ్డి, మేఘనారెడ్డి, **షూటింగ్:** గగన్ నారంగ్, కైనన్ షెనాయ్, **వెయిట్ లిఫ్టింగ్:** రాగాల వెంకట రాహుల్, **హాకీ:** ఎతిమరుపు రజని

సచిన్, విరాట్‌లైతే వద్దంటారా?

సింధు, సైనా కుటుంబ సభ్యుల ఖర్చు ప్రభుత్వానిది కాదు: బత్రా


గురువారం దిల్లీలో జరిగిన కామన్వెల్త్ క్రీడాకారుల వీడ్కోలు కార్యక్రమంలో భారత బృందంతో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

దిల్లీ: కామన్వెల్త్ క్రీడలకు క్రీడాకారుల వెంట కుటుంబ సభ్యులు వెళ్లడం సరికాదన్న క్రీడా మంత్రిత్వ శాఖపై భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షుడు నరిందర్ బత్రా ఆగ్రహం వ్యక్తంజేశాడు. అగ్రశ్రేణి షట్లర్లు పి.వి.సింధు, సైనా నెహ్వాల్‌ల కుటుంబ సభ్యులు ఆస్ట్రేలియా వెళ్ళడంలో తప్పేముందని ప్రశ్నించాడు. వారి ఖర్చు ప్రభుత్వం భరించట్లేదని స్పష్టంచేశాడు. "సింధు, సైనాల వెంట వారి తల్లిదండ్రులు వెళ్లడానికి క్రీడా మంత్రిత్వ శాఖ ఎందుకు అనుమతించట్లేదో అర్థం కావడం లేదు. వారి ఖర్చులు ప్రభుత్వం భరించట్లేదు. అయినా సింధు, సైనాల మాదిరి కోహ్లి, సచిన్ కోరుంటే క్రీడా శాఖ వద్దనేదా?" అని బత్రా మండిపడ్డాడు. సింధు తల్లి విజయ, సైనా తండ్రి హర్‌వీర్‌సింగ్ కామన్వెల్త్ క్రీడలకు వెళ్తున్నట్లు క్రీడా శాఖకు పంపించిన జాబితాలో ఐఓఏ పేర్కొంది. అందులో 222 మంది క్రీడాకారులు.. 106 మంది కోచ్‌లు, మేనేజర్లు, ఇతర సహాయ సిబ్బంది ఉన్నారు. వీరిలో 41 మందికి క్రీడా శాఖ నుంచి అనుమతి రాలేదు. మరోవైపు క్రీడా శాఖ తీరుపై సింధు, సైనాల తల్లిదండ్రులు అభ్యంతరం తెలిపారు. "చాలా టోర్నీలకు సొంత డబ్బులతో సింధుతో కలిసి వెళ్లా. ఈసారి కూడా సింధుతో కలిసి వెళ్ళేందుకు విజయకు అనుమతివ్వాల్సిందిగా బాయ్‌ను కోరాం. కొందరు తప్పుడు ప్రచారం చేస్తుండటం బాధ కలిగిస్తుంది" అని సింధు తండ్రి పి.వి.రమణ ఆవేదన వ్యక్తంజేశాడు. "నా సొంత ఖర్చులతో వెళ్తున్నా. గోల్డ్‌కోస్ట్‌లో నాకు తెలిసిన ప్రొఫెసర్ ఉన్నాడు. ఓ ప్రేక్షకుడిలా అక్కడికి వెళ్ళి క్రీడల్ని చూస్తా. రియో ఒలింపిక్స్‌కు వెళ్ళినప్పుడు కూడా అద్దె గదిలో ఉన్నా. మరి ఎందుకు ఇలాంటి వార్తలు వస్తున్నాయో అర్థంకావడం లేదు" అని సైనా తండ్రి హర్‌వీర్ తెలిపాడు. ఈ వివాదం మరింత ముదరక ముందే క్రీడా శాఖ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఆ 41 మంది కామన్వెల్త్ క్రీడలకు వెళ్ళడానికి అనుమతిచ్చేందుకు క్రీడల మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ హామీ ఇచ్చినట్లు బత్రా తెలిపాడు.


చెన్నై సూపర్ కింగ్స్ ప్రాక్టీస్ సందర్భంగా బీసీసీఐ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసన్‌తో ధోని

సౌమ్యజిత్‌పై అత్యాచారం కేసు

దిల్లీ: టేబుల్ టెన్నిస్ ఆటగాడు, అర్జున అవార్డీ సౌమ్యజిత్ ఘోష్ చిక్కుల్లో పడ్డాడు. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడు కామన్వెల్త్ క్రీడల భారత బృందం నుంచి సస్పెండ్ కావడం ఖాయంగా కనిపిస్తోంది. సౌమ్యజిత్ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ యువతి బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాలో, బారాసత్ మహిళల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతడిపై ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఐతే కామన్వెల్త్ క్రీడల కోసం ప్రస్తుతం జర్మనీలో శిక్షణ పొందుతున్న ఘోష్.. తనపై వచ్చిన ఆరోపణలు కొట్టిపారేశాడు. గతంలో ఆమెతో తాను కొంతకాలం బంధంలో ఉన్నానని, అది ముగిసిన వెంటనే ఆమె బ్లాక్‌మెయిలింగ్ చేస్తోందని అన్నాడు. ఐతే అతణ్ని జాతీయ జట్టు నుంచి తప్పించడం తప్ప తమకు మరో మార్గం లేదని భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య (టీటీఎఫ్ఐ) కార్యదర్శి ఎంపీ సింగ్ చెప్పాడు.

ఓటమితో షురూ

ముక్కోణపు సిరీస్‌లో భారత జట్టు పరాజయం

ముంబయి: ఫార్మాట్ మారినా ఫలితం మారలేదు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఒక్క విజయమైనా సాధించని భారత మహిళల జట్టు ముక్కోణపు టీ20 సిరీస్‌నూ ఓటమితో ఆరంభించింది. గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన తొలి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. స్మృతి మంధాన (67; 41 బంతుల్లో 11×4, 2×6) చెలరేగి ఆడటంతో మొదట భారత్ 152 (5 వికెట్లకు) పరుగులు చేసింది. లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. బెత్ మూనీ (45), విలాని (39) రాణించారు.


మంధాన (67)



ఎలవెనిల్ రికార్డు పసిడి

సిడ్నీ: జూనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ ఎలవెనిల్ వలరివన్ చరిత్ర సృష్టించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ప్రపంచ రికార్డును తిరగరాస్తూ స్వర్ణాన్ని ఎగరేసుకుపోయింది. పద్దెనిమిదేళ్ల ఎలవెనిల్ ఫైనల్లో 249.8 పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది. క్వాలిఫయింగ్‌లో ఆమె 631.4 పాయింట్లతో ప్రపంచ రికార్డును తిరగరాసింది.

ఎల్గర్ అజేయ శతకం

మూడో టెస్టులో దక్షిణాఫ్రికా 266/8

కేప్‌టౌన్: ఆతిథ్య దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టు ఆసక్తికరంగా ఆరంభమైంది. ఎల్గర్ (121 బ్యాటింగ్) అజేయ శతకం సాధించడంతో తొలి రోజు, గురువారం ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 266 పరుగులు సాధించింది. డివిలియర్స్ (64) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఎల్గర్, డివిలియర్స్ మూడో వికెట్‌కు 128 పరుగులు జోడించడంతో దక్షిణాఫ్రికా ఓ దశలో 220/2తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. కానీ కమిన్స్ (4/64) విజృంభించడంతో ఆసీస్‌ను గట్టిగా పోటీలోకి వచ్చింది. దక్షిణాఫ్రికా 37 పరుగుల వ్యవధిలో ఆరు వికెట్లు చేజార్చుకుంది. ఎల్గర్‌తో పాటు రబాడ (6) క్రీజులో ఉన్నాడు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు జట్లు 1-1తో సమంగా ఉన్న సంగతి తెలిసిందే.

ఇంగ్లాండ్.. 58కే ఢమాల్

న్యూజిలాండ్‌తో తొలి టెస్టు • నిప్పులు చెరిగిన బౌల్ట్, సౌథీ

ఆక్లాండ్: ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు (డే/నైట్) సంచలనాత్మకంగా మొదలైంది. గులాబి బంతికి ఇంగ్లాండ్ విలవిల్లాడింది. ట్రెంట్ బౌల్ట్ (6/32), సౌథీ (4/25) ధాటికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 20.4 ఓవర్లలో 58 పరుగులకే కుప్పకూలింది. నలుగురు బ్యాట్స్‌మెన్ డకౌట్ కాగా.. ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు. ఓవర్టన్ 33 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆట ముగిసే సమయానికి న్యూజిలాండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసి పట్టు బిగించింది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (91 బ్యాటింగ్) సెంచరీ దిశగా సాగుతున్నాడు. టెస్టు చరిత్రలో ఆరో అత్యల్ప స్కోరు నమోదు చేసిన ఇంగ్లాండ్ కేవలం 94 నిమిషాల్లోనే చేతులెత్తేసింది. బౌల్ట్, సౌథీ స్వింగ్, సీమ్ బౌలింగ్‌కు బెంబేలెత్తిపోయింది. ఐదో ఓవర్లో కుక్ (5) రూపంలో తొలి వికెట్‌ను కోల్పోయిన ఇంగ్లాండ్. అక్కడి నుంచి పేకమేడను తలపించింది. ఓ దశలో 23/8తో టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యల్ప స్కోరు రికార్డు (26, ఇంగ్లాండ్‌పై న్యూజిలాండ్ 1955లో)ను తుడిచిపెట్టే ప్రమాదంలో పడింది. ఐతే ఓవర్టన్ ఓ బౌండరీతో ఆ ప్రమాదం తప్పించాడు. ఐతే అదే స్కోరు వద్ద బ్రాడ్ (0) ఔటయ్యాడు. కానీ అండర్సన్ (1)తో ఆఖరి వికెట్‌కు ఓవర్టన్ 31 పరుగులు జోడించాడు. బౌల్ట్‌కు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన. మరోవైపు టెస్టుల్లో 400 వికెట్లు సాధించిన రెండో ఇంగ్లాండ్ బౌలర్‌గా స్టువర్ట్ బ్రాడ్ ఘనత సాధించాడు.


బౌల్ట్ (6/32)




రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అవార్డును స్వీకరిస్తున్న పరిశోధక విద్యార్థి శిబు ★ మలేరియాను గుర్తించే పరికరాన్ని చూపుతున్న సహాయ ఆచార్యులు శివగోవింద్‌సింగ్

కార్నియాకు ప్రాణం.. ఆవిష్కరణకు పురస్కారం

- **జీవైటీఐ-2018 అవార్డుల్ని సాధించిన హైదరాబాద్ ఐఐటీ పరిశోధకులు**
- **మలేరియాను తొలిదశలో గుర్తించే పరికరానికీ పురస్కారం**

ఈనాడు, సంగారెడ్డి: హైదరాబాద్ ఐఐటీకి చెందిన యువ పరిశోధకులు సరికొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోశారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 23 ఆవిష్కరణల్లో రెండు ఇక్కడి ఐఐటీవే కావడం విశేషం. దిల్లీలోని శాస్త్ర, సాంకేతిక విభాగం, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఏటా 'గాంధీయన్ యంగ్ టెక్నలాజికల్ ఇన్నోవేషన్ (జీవైటీఐ)' అవార్డులను అందిస్తుంటారు. ఇంజినీరింగ్, సైన్స్, టెక్నాలజీ, డిజైన్ తదితర రంగాల్లో యువ పరిశోధకులను ప్రోత్సహించడమే ఈ అవార్డుల లక్ష్యం. ఈనెల 19న దిల్లీ రాష్ట్రపతి భవన్‌లో విజేతలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్నియాను హైడ్రోజెల్‌గా మార్చి అవసరమైనప్పుడు వాడుకునేలా చేసిన ఆవిష్కరణతోపాటు, మలేరియాని ప్రాథమిక దశలోనే గుర్తించే పరికరాలకు ఇందులో గుర్తింపు దక్కింది. మొత్తం 23 ఆవిష్కరణల్లో తొలి పదిహేనింటికి రూ.15 లక్షలు అందించనుండగా.. ఐఐటీహెచ్‌కు చెందిన రెండు ఆవిష్కరణలూ చోటు దక్కించుకున్నాయి.

★ కార్నియాకు సంబంధించి హైదరాబాద్ ఐఐటీలోని బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగం సరికొత్త ఆవిష్కరణతో ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రి నేత్ర వైద్య విభాగాధిపతి డా.ఎంఎస్ శ్రీధర్, ఐఐటీహెచ్ సహాయ ఆచార్యుడు డా.ఫాల్గుణి పాటి సహకారంతో పరిశోధక విద్యార్థి శిబు అధ్యయనం చేపట్టారు. వీరు కార్నియా నుంచి కణాలను సేకరించి దానిని హైడ్రోజెల్‌గా మార్చి.. భద్రపర్చడంతోపాటు అవసరమైనప్పుడు పీహెచ్ విలువను మార్చి డిస్క్‌లా మారేలా చేశారు. దీనిని వాడటం ద్వారా కార్నియల్ కెరటోకోనస్ వ్యాధిగ్రస్థులకు మళ్లీ చూపు తెప్పించొచ్చని నిరూపించారు. ఈ దిశగా మరిన్ని పరిశోధనలు చేయనున్నట్లు డా.ఎంఎస్ శ్రీధర్ వివరించారు.

★ ఐఐటీహెచ్‌లోని ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు శివగోవింద్ సింగ్ పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులు బ్రిన్స్ పాల్, అసిసాకుమార్ పాణిగ్రహి సంయుక్తంగా.. మలేరియా సోకిన వెంటనే గుర్తించే పరికరాన్ని రూపొందించారు. మలేరియా సోకిన వారి రక్తంలో ఉండే.. హెచ్‌పీఆర్-2 ప్రతిజనకాల్ని తొలిదశలోనే గుర్తించేలా వీరు బయోచిప్, జింక్ ఆక్సైడ్‌లను ఉపయోగించి సరికొత్త పరికరానికి రూపమిచ్చారు. నమూనా పరికరాన్ని రూపొందించిన వీరు త్వరలోనే పూర్తిస్థాయి ఉత్పత్తిగా మార్కెట్లోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు.

★ ఐఐటీహెచ్‌లోని బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థులు పానూప్ ప్రసాద్ పాత్రో, అభిషేక్ కుమార్, నరేందర్‌కొలిమిల ఆవిష్కరణకు ప్రోత్సాహక బహుమతి దక్కింది. వీరు న్యూక్లిక్ ఆమ్ల సంక్లిష్ట నిర్మాణాలను కంప్యూటర్ ద్వారా సులభంగా తెలుసుకునేలా వెబ్‌సర్వర్‌కు రూపమిచ్చారు. వీరికి రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.

ప్రతిపక్ష నేతలతో కేంద్రమంత్రి గోయెల్ భేటీ

దిల్లీ: వివిధ పార్టీల నిరసనలు, ఆందోళనలతో పార్లమెంటు సమావేశాల్లో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర రైల్వే మంత్రి విజయ్ గోయెల్ ప్రతిపక్ష నేతలతో సమావేశమయ్యారు. రాజ్యసభలోని కాంగ్రెస్ నాయకుడు గులాం నబీ ఆజాద్, తెదేపా నాయకుడు సుజనా చౌదరీ, అన్నాడీఎమ్‌కే నాయకుడు వి. మైత్రేయన్‌లతో గురువారం భేటీ అయ్యారు. లోక్‌సభలో అవిశ్వాస తీర్మానంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని గోయెల్ పాత్రికేయ సమావేశంలో ప్రకటించిన అనంతరం వీరి భేటీ జరిగింది. తెరాస, టీఎంసీ సహా వివిధ పార్టీల కీలకనేతలను కలిసి.. నిరసనలను విరమించాలని కోరుతానని గోయెల్ వెల్లడించారు. బడ్జెట్ సమావేశాల రెండో దశలో మొత్తం 23 రోజులుండగా.. ఇప్పటికి 14 రోజులు వృథాగా పోయయాని ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం.. రాజకీయ యుద్ధం



మనదేశంలో వంద కోట్లకు పైగా సెల్‌ఫోన్లు. అందులో సగం స్మార్ట్‌ఫోన్లే. స్క్రీన్ మీదే సామాజిక మాధ్యమాల యాప్‌లు. ఇంకేముంది... నొక్కగానే స్నేహితులు, సన్నిహితులతో పాటు ఎవరో తెలియని వారు పంపిన పోస్ట్‌లన్నీ కనిపిస్తాయి. అందులో నిజమెంతో, అబద్ధమెంతో చెప్పలేని పరిస్థితి. కానీ అన్నింటినీ చూడటం, ఒక అభిప్రాయానికి రావడం మాత్రం జరుగుతుంది. ఈ పరిస్థితిని వినియోగించుకుంటూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు రాజకీయ పార్టీలు ప్రయత్నించటం విదేశాల్లోనే కాదు, మనదేశంలోనూ జరుగుతోంది. అందుకే ఎక్కడో యూఎస్‌ఏ, యూకేలో ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారం లీక్ అయితే, దానిపై మనదేశంలో ప్రధాన రాజకీయ పక్షాలు ఒకదానిపై మరొకటి విరుచుకుపడుతున్నాయి. ఎన్నికల్లో లబ్ధికోసం సామాజిక మాధ్యమం (సోషల్ మీడియా) వేదికగా తప్పుడు ప్రచారానికి సిద్ధపడుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీ పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి.

ఎన్నో రకాలుగా ఉపయోగించుకోవచ్చు

- ప్రచారానికి ప్రస్తుతం సామాజిక మాధ్యమానికి మించిన సాధనం లేదు. అరచేతిలో ఉండే సెల్‌ఫోన్, ఆఫీసు-ఇంట్లో ఉండే డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్‌ను ఆన్‌చేయగానే ఎక్కువ మంది తప్పనిసరిగా చేసే పని ఒకసారి తమ సామాజిక మాధ్యమంలోని అకౌంట్లలో అప్‌డేట్‌లను చూడటం.
- ప్రచారం ఏదైనా కావచ్చు. అది నిజమైంది అయితే ఇబ్బంది లేదు. కానీ ఉద్దేశపూర్వకంగా అసత్యాలు/ అర్ధసత్యాలతో కూడిన ప్రచారంతోనే సమస్య.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించే వ్యవస్థ ఏదీ లేదు. అందువల్ల దేన్నైనా, ఎటువంటి విషయాన్ని అయినా తమకు తోచినట్లు, అర్థమైనట్లు 'పోస్ట్' చేయవచ్చు. ఇక్కడే తప్పుడు ప్రచారానికి వీలుకులుగుతుంది.
- ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయటానికి సామాజిక మాధ్యమం పదునైన సాధనమని మనదేశంలోని రాజకీయ పార్టీలు సైతం గుర్తించాయి. అందుకే ఒక్కో పార్టీ ఒక్కో సామాజిక మాధ్యమ విభాగాన్ని పెట్టుకొని ఫేస్‌బుక్ పోస్టులు, ట్విట్టర్ కామెంట్లు, వాట్సాప్ సందేశాలు జోరుగా పంపుతున్నారు. తద్వారా ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.
- భవిష్యత్తులో ఎన్నికల పోరాటం వాట్సాప్, ఫేస్‌బుక్‌లోనే జరుగుతుందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారంటే, దీని ప్రభావం ఏవిధంగా ఉందో స్పష్టమవుతుంది.

ఎవరు, ఎక్కడి నుంచి పంపారు?

ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, రాజకీయ పార్టీలకు వ్యతిరేకంగా ప్రత్యర్థులు పంపే పోస్టులు ఎక్కడి నుంచి వస్తుందో బయటకు తెలియదు. ఒకవేళ తెలిసినా అది పార్టీల పేరు మీద ఉండదు. ఏదో ఒక స్వతంత్ర సంస్థ, ఆన్‌లైన్ మీడియా సంస్థ నుంచి వచ్చినట్లుగా ఉంటుంది. అందువల్ల అటువంటి పోస్టుల ఉద్దేశం ఏమిటి? వాటి వెనుక ఎవరున్నారనేది తెలిసే అవకాశం లేదు. నిజమైన సమాచారం మాదిరిగా సామాజిక మాధ్యమ వినియోగదారుడిని నమ్మించేందుకు ఇటువంటి మార్గాన్ని 'కేంబ్రిడ్జి అనలిటికా' వంటి సంస్థలు అనుసరిస్తారు. ఈ అవకాశం ఉండటం వల్ల ప్రత్యర్థుల మీద దుమ్మెత్తిపోస్తూ ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు వీలు కలుగుతోంది.

'ఫేస్‌బుక్' భారత్!

2018 జనవరి నాటికి ఫేస్‌బుక్ వినియోగదారులు మనదేశంలోనే అధికంగా ఉంది. ద్వితీయ స్థానంలో అమెరికా, ఆ తర్వాత బ్రెజిల్ దేశాలు ఉన్నాయి.

దేశం	ఫేస్‌బుక్ వినియోగదార్ల సంఖ్య (కోట్లలో)
భారతదేశం	25
అమెరికా	23
బ్రెజిల్	13
ఇండోనేషియా	13
మెక్సికో	8.3
ఫిలిప్పీన్స్	6.7
వియత్నాం	5.5
థాయ్‌లాండ్	5.1
టర్కీ	5.1
యూకే	4.4

ఎన్ని'కదన' క్షేత్రంలో...

- 2014 సాధారణ ఎన్నికల్లో సామాజిక మాధ్యమాన్ని బీజేపీ, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వినియోగించుకున్నాయి. బీజేపీ ఈ విషయంలో క్రియాశీలకంగా వ్యవహరించినట్లు, కాంగ్రెస్ పార్టీ వెనుకబడిపోయిందనే అభిప్రాయం వ్యక్తమైంది.
- 2014 ఎన్నికల్లో 'డిజిటల్ వార్ రూమ్'ను బీజేపీ నెలకొల్పింది. దీన్లో దాదాపు 40 మంది నిపుణులు పనిచేశారు.
- దీన్ని దృష్టిలో పెట్టుకొని 2019 ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తన సామాజిక మాధ్యమ విభాగాన్ని బలోపేతం చేసింది.
- 2019 ఎన్నికల్లో తాము సేవలు అందించటానికి సిద్ధమంటూ... కేంబ్రిడ్జి అనలిటికా ప్రతినిధులు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలను కలిసినట్లు ప్రచారం జరుగుతోంది.
- 2010 బిహార్ ఎన్నికల్లో బీజేపీ- జేడీయూ కూటమి..., కేంబ్రిడ్జి అనలిటికా మాతృ సంస్థ అయిన స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ ల్యాబరేటరీస్‌కు భారతీయ అనుబంధ సంస్థ ఒవెలినా బిజినెస్ ఇంటిలిజెన్స్ (ఓబీఐ) సహకారం తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దీన్ని బీజేపీ కొట్టివేసింది.

ఇదీ సోషల్ మీడియా

ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కల సోషల్ మీడియా సైట్లలో ఫేస్‌బుక్‌దే అగ్రస్థానం. దీనికి ప్రపంచ వ్యాప్తంగా 216 కోట్ల మంది వినియోగదారులున్నారు. తర్వాత స్థానాల్లో యూట్యూబ్, వాట్సాప్ ఉన్నాయి

సామాజిక మాధ్యమాలు	వినియోగదారులు (కోట్లలో)
ఫేస్‌బుక్	216
యూట్యూబ్	150
వాట్సాప్	130
మెసెంజర్	130
వుయ్‌ఛాట్	98
క్యూక్యూ	84
ఇన్‌స్టాగ్రామ్	80
తుంబ్లర్	79
క్యూజోన్	56
సినా వైబో	37
ట్విట్టర్	33
బైదు	30
స్కైప్	30

- తాజా పరిణామాల నేపథ్యంలో కేంబ్రిడ్జి అనలిటికాతో సంబంధాలు తెంచుకునే ఆలోచన చేస్తున్నట్లు ఓబీఐ స్పష్టం చేసింది.

అగ్రస్థానంలో చైనా.. రెండో స్థానంలో ఇండియా

- సామాజిక మాధ్యమ వినియోగదారుల సంఖ్య చైనాలో అత్యధికంగా ఉంది. 2017 నాటికి ఆ దేశంలో 59 కోట్ల మంది సోషల్ మీడియా వినియోగదారులున్నాయి. ఈ సంఖ్య 2022 నాటికి 72 కోట్లకు చేరుకుంటుందని అంచనా.
- ఆ తర్వాత స్థానంలో భారతదేశం ఉంది. మనదేశంలో 2022 నాటికి సోషల్ మీడియా వినియోగదార్ల సంఖ్య 37 కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు.
- తదుపరి స్థానాల్లో యూఎస్‌ఏ, ఇండోనేషియా, బ్రెజిల్, రష్యా, మెక్సికో, జపాన్ తదితర దేశాలు ఉన్నాయి.

అనలిటికా వల... ఫేస్‌బుక్ విలవిల!

ఎన్నికల్లో విజయం సాధించటానికి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకోవాలని, తద్వారా ఓటర్లకు చేరువ కావచ్చునే ఆలోచన రాజకీయ పార్టీలన్నింటికీ ఉంటుంది. ప్రచారం చేసుకోవటానికి బదులు, 'ప్రభావితం' చేయగలిగితే... మంచి ఫలితాలు సాధించవచ్చు కదా? ఎలా ఉంది ఈ ఆలోచన? ఆ దిశగా ఆలోచించటమే కాదు, ఆచరించారనే ఆరోపణలు సామాజిక మాధ్యమ దిగ్గజమైన ఫేస్‌బుక్‌ను ముంచెత్తుతున్నాయి. దాదాపు 5 కోట్ల మంది ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచారం ఫేస్‌బుక్ నుంచి బ్రిటిష్ డేటా మైనింగ్, అనలిటిక్స్ సంస్థ అయిన కేంబ్రిడ్జి అనలైటికా చేతికి చిక్కింది. ఆ సమాచారాన్ని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో, రాష్ట్రాల గవర్నర్ల ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయటానికి కేంబ్రిడ్జి అనలైటికా వినియోగించుకొని ఉంటుందనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో అటు అమెరికాలో, ఇటు బ్రిటన్, ఐరోపాలో సమగ్ర దర్యాప్తునకు ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. ఇప్పటికే ఫేస్‌బుక్, కేంబ్రిడ్జి అనలిటిక్స్‌కు తగిన వివరాలు అందించాల్సిందిగా ఆయా దేశాల దర్యాప్తు సంస్థలు కోరిన విషయం గమనార్హం. వీటన్నింటికీ మించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు 2016 ఎన్నికల్లో సేవలు అందించిన సంస్థల్లో కేంబ్రిడ్జి అనలిటిక్స్ ఉండటం ఇంకా కలకలం రేకెత్తిస్తోంది.

అసలేం జరిగింది?

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఓట్లు రాబట్టేందుకు తాము ఓటర్లను ఏవిధంగా 'ప్రభావితం' చేసేదీ బ్రిటన్‌కు చెందిన ఛానల్ 4 న్యూస్ ప్రతినిధికి సవివరంగా చెప్పి దొరికిపోయారు కేంబ్రిడ్జి అనలిటికా సంస్థ సీఈఓ అలెగ్జాండర్ నిక్స్.



- ఓటర్లకు తాము తప్పుడు సమాచారాన్ని పంపుతామని, తద్వారా తమ క్లయింట్లు వైపు వారు మొగ్గుచూపే విధంగా ప్రభావితం చేస్తామని అలెగ్జాండర్ నిక్స్ చెప్పారు.
- కేంబ్రిడ్జి అనలిటికా తన ఎన్నికల సేవల్లో భాగంగా డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష ఎన్నికల్లో, బ్రెగ్జిట్ ఓట్‌లో ఈ సంస్థ క్రియాశీలకంగా వ్యవహరించినట్లు ఇప్పుడు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఫేస్ బుక్కయిందిలా...

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం పరిశోధకుడైన అలెగ్జాండర్ కోగన్, గ్లోబల్ సైన్స్ రీసెర్చ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు కూడా. ఈ సంస్థ 'దిస్ ఈజ్ మై డిజిటల్ లైఫ్' అనే యాప్‌ను రూపొందించింది. దీనిద్వారా ఫేస్‌బుక్ నుంచి 5 కోట్ల మంది సమాచారాన్ని సేకరించారు.

- ఈ సమాచారాన్ని కోగన్, కేంబ్రిడ్జి అనలిటికాకు అందించారు. వారి ప్రొఫైల్స్‌ను పరిశీలించి వారిపై ఎన్నికల్లో ప్రభావం చూపే సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌ను కేంబ్రిడ్జి అనలిటికా తయారుచేసింది.
- దీంతో ఈ వివాదానికి ఫేస్‌బుక్, కేంబ్రిడ్జి అనలిటికా కేంద్ర బిందువు అయ్యాయి.
- ఎన్నికల ప్రచారాన్ని, ఓటర్లను మలుపు తిప్పేందుకు కేంబ్రిడ్జి అనలిటికా ఎటువంటి వ్యూహాలు పన్నుతుందనే విషయాన్ని ఆ సంస్థ మాజీ ఉద్యోగి అయిన క్రిష్టఫర్ వైలీ వెలుగులోకి తెచ్చారు.

2013లోనే ఏర్పాటు

కేంబ్రిడ్జి అనలిటికా అమెరికా అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సేవలు అందించే లక్ష్యంతో 2013లోనే ఏర్పాటైంది. రిపబ్లికన్ దాత, అత్యంత ధనికుడైన రాబర్ట్ మెర్సెర్ దీనికి 15 మిలియన్ డాలర్లు సమకూర్చారు. ఓటర్ల మనోగతాన్ని తెలుసుకునేందుకు, వారిని ప్రభావితం చేయటానికి, తద్వారా అభ్యర్థులు ఎన్నికల్లో గెలిచేందుకు తాము సహకరిస్తామని ఈ సంస్థ చెప్పుకుంటుంది. కానీ అది అనుసరించే పద్ధతులే అక్రమంగా ఉన్నాయనే విషయం.. సంచలనాత్మకమైంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

అనలిటికాతో సంబంధాలపై ఆరోపణల పర్వం

- **పరస్పరం విమర్శలు కొనసాగించుకున్న భాజపా, కాంగ్రెస్**
- **"నిక్స్"తో నీతీశ్ భేటీకాలేదు: జేడీయూ**

దిల్లీ: ఫేస్‌బుక్ సమాచార దుర్వినియోగం వివాదానికి కేంద్ర బిందువైన ' 'కేంబ్రిడ్జ్ అనలిటికా'' సంస్థ రాజకీయ పార్టీల్లో రేపిన చిచ్చు చల్లారడం లేదు. భాజపా, కాంగ్రెస్ గురువారమూ పరస్పరం ఆరోపణాస్త్రాలు సంధించుకున్నాయి. మరోవైపు అనలిటికాతో భారతీయ సంస్థ ఒవెలినా బిజినెస్ ఇంటెలిజెన్స్(వోబీఐ)కు సంబంధముందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. జేడీయూ సీనియర్ నాయకుడు కేసీ త్యాగి తనయుడు అమ్రీష్.. వోబీఐ అధిపతి. ఈ అంశంపై జేడీయూ స్పందించాలని ఆర్జేడీ డిమాండ్‌చేసింది. అయితే తాము అనలిటికా సేవలు ఉపయోగించుకోలేదని త్యాగి పునరుద్ఘాటించారు. అంతేకాదు అనలిటికా మాజీ సీఈవో అలెగ్జాండెర్ నిక్స్‌తో బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ భేటీ అయ్యారన్న వార్తలనూ ఆయన ఖండించారు. 2010 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూ-భాజపా కూటమి అనలిటికా సేవలు వినియోగించుకుందన్న వార్తలనూ ఆయన తోసిపుచ్చారు. మరోవైపు తమ పార్టీపై వచ్చిన ఆరోపణలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. మోదీ ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు గుప్పిస్తోందని వ్యాఖ్యానించారు. అయితే గుజరాత్ ఎన్నికల సమయంలో అనలిటికాతో కాంగ్రెస్ మంతనాలు జరిపిందనే చెప్పే మూడు వార్తలను కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ విలేకరులకు చూపించారు. ఈ మూడు వార్తలు 2017 అక్టోబరు, నవంబరుల్లో ప్రచురించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ అన్నీ అబద్ధాలే చెబుతోందని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాదు రాహుల్ సోషల్ మీడియా ప్రచారం మొత్తాన్నీ నడిపించింది అనలిటికానే అంటూ ఆయన ధ్వజమెత్తారు. వీటిపై కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ విభాగం సారథి రణ్‌దీప్ సుర్జేవాలా స్పందించారు. రవిశంకర్‌ను న్యాయశాఖ మంత్రి అని పిలిచే కంటే అబద్ధాల మంత్రి అనడం మంచిదని వ్యాఖ్యానించారు. 2017లో అనలిటికాపై ప్రశంసలు కురిపిస్తూ భాజపా అప్పటి ఐటీ విభాగం అధిపతి అరవింద్ గుప్తా ట్వీట్‌చేశారని ఆరోపించారు. మరోవైపు ట్విటర్‌లో అనలిటికా సంస్థను కేంద్ర మంత్రి స్మృతి అనుసరిస్తున్నారనీ చెప్పారు.

అమెరికా చుట్టూ ట్రంప్ 'అదృశ్య గోడ'

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. తన దేశం చుట్టూ ఒక 'అదృశ్య గోడ'ను నిర్మించారని, ఫలితంగా నిపుణులైన విదేశీ ఉద్యోగులను నియమించుకోవడంలో కంపెనీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతిభ ఆధారిత వలస చట్టం ఉండాలని ట్రంప్ చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అలా జరగడంలేదని వలస అంశాల్లో నిపుణులైన అమెరికా న్యాయవాదులు వెలువరించిన ఒక నివేదిక పేర్కొంది. ★ ట్రంప్ వలస విధానం వల్ల విదేశీ ఉద్యోగులు అమెరికాలో ఉద్యోగాల కోసం ఆసక్తి చూపడం తగ్గిపోయింది. ★ 'అత్యంత నైపుణ్య'మున్న హెచ్-1బీ వీసాల కోసం అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగానికి అందిన దరఖాస్తుల సంఖ్య.. ఐదేళ్లలో తొలిసారిగా పడిపోయింది. ★ నైపుణ్య కార్మికులు, మేనేజర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, ఇతరుల కోసం ఉద్దేశించిన వలసేతర దరఖాస్తులపై అధికారులు కనీవినీ ఎరుగని స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ★ హెచ్-1బీ వీసా దరఖాస్తుల పరిశీలనలో అదనపు ఆధారాలు అడగడం, ఇంటర్వ్యూలు; అధునాతన పరిశోధనల్లో నిమగ్నమైన వలసదారుల్లో వ్యాపారాపేక్షను ప్రోత్సహించేందుకు ఒబామా తెచ్చిన నిబంధనలను రద్దు చేయడం, అత్యంత నిపుణులైన ఉద్యోగుల జీవిత భాగస్వాములకు ఇచ్చే పని అనుమతిని రద్దుచేయడం వంటివి వలసదారులకు, కంపెనీలకు ఇబ్బందులను సృష్టిస్తున్నాయి. ★ యాజమాన్య ప్రాయోజిత వీసాలకు సంబంధించిన కొత్త విధానాల వల్ల వ్యాపారాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సరైన నైపుణ్యం ఉన్న విదేశీ కార్మికులను నియమించుకోవడానికి గణనీయస్థాయిలో డబ్బు, సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది.

భారత్ చేరుకున్న జర్మన్ అధ్యక్షుడు

- **తొలిరోజు వారణాసిలో పర్యటన**

దిల్లీ: భారత్‌లో 5 రోజుల పర్యటనకు గాను జర్మన్ అధ్యక్షుడు ఫ్రాంక్‌వాల్టర్ స్టైన్‌మేయర్ గురువారం దిల్లీకి చేరుకున్నారు. తన సతీమణి ఎల్కే బుడెన్‌బెండర్‌తో సహా వచ్చిన ఆయనకు ఇక్కడి విమానాశ్రయంలో కేంద్ర మంత్రి ఎస్.ఎస్.అహ్లూవాలియా స్వాగతం పలికారు. జర్మన్ అధ్యక్షుడి హోదాలో తొలిసారి పర్యటిస్తున్న ఆయన గురువారం వారణాసిలో వివిధ ప్రాంతాలను సందర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీతో దిల్లీలో శనివారం భేటీ అవుతారు. 90 ఎకరాల్లో ఆధునికీకరించిన సుందర్ నర్సరీలో నేతలిద్దరూ వివిధ అంశాలపై చర్చిస్తారు. అలాగే ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్‌తో కూడా సమావేశమవుతారు. స్టైన్‌మేయర్ శుక్రవారం జమామసీదును సందర్శించి.. దిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తారు.

జర్మన్ అధ్యక్షుడు స్టైన్‌మేయర్‌వారణాసిలో గురువారం పర్యటించారు. సారనాథ్ ఆలయాన్ని దర్శించి.. పూజలు చేసిన అనంతరం మ్యూజియంను తిలకించారు. అనంతరం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి వెళ్లి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. సాయంత్రం అస్సీ నుంచి దశాశ్వమేధ్ ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గంగాహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. దిల్లీ నుంచి ఇక్కడికి చేరుకున్న ఆయనకు జర్మన్, భారత్ జెండాలతో పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.



సార్‌నాథ్‌లో జర్మనీ అధ్యక్షుడు ఫ్రాంక్ వాల్టర్ పర్యటన

అమరవీరుల పిల్లలకు విద్యాసాయంపై పరిమితి ఎత్తివేత

దిల్లీ: పోరాటంలో మరణించిన లేదా వైకల్యం పొందిన సైనికుల పిల్లలకు విద్యాసాయం కింద ఇచ్చే మొత్తంపై ఉన్న పరిమితిని కేంద్ర ప్రభుత్వం తొలగించింది. ఒక్కో విద్యార్థికి ఇచ్చే మొత్తాన్ని నెలకు రూ.10వేలకు పరిమితం చేస్తూ గత ఏడాది జులైలో ఆదేశాలు జారీ చేసింది. దీనిపై త్రివిధ దళాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో పరిమితి లేకుండానే విద్యా రాయితీ కొనసాగుతుందని కేంద్ర ఆర్థికశాఖ పేర్కొంది. అయితే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, విద్యా సంస్థలు లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన సంస్థల్లో విద్యాభ్యాసం చేసేటప్పుడే ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00

రయ్ రయ్

ఈనాడు
కరీంనగర్, శుక్రవారం
23 మార్చి, 2018
15

మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501512

autopage@eenadu.in

వాహన బీమా.. ఆన్‌లైనా? ఆఫ్‌లైనా?

వాహన సురక్ష

నా కారుకి వాహన బీమా చేయించాలనుకుంటున్నాను. ఆన్‌లైన్‌లో కొంటే మంచిదా? నేరుగా బీమా కంపెనీకి వెళ్లి తీసుకోవాలా? సలహా ఇవ్వండి.

- గణేశ్, గాజువాక



వాహనానికి బీమా తీసుకునేటప్పుడు ముందు బీమా సౌకర్యాల గురించి తెలుసుకోవాలి. బీమా నిబంధనలన్నీ ఆంగ్లంలో ఉంటాయి. పేజీలకొద్దీ ఉండే వాటిని అర్థం చేసుకోవడం సామాన్యులకు కష్టం. ఐఆర్‌డీఏ (బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ) రూపొందించిన ధరల ప్రకారం వాహన బీమా ప్రీమియం చెల్లించాలి. వీటిని ఇండియన్ మోటార్ టారిఫ్ (ఐఎంటీ) అంటారు. వాహన యజమాని ఏఏ ఐఎంటీ కింద ఎంత చెల్లిస్తారో ఆ నిబంధనల మేరకు పాలసీ ఇస్తారు. ఇంగ్లిష్‌లో ఉన్న నిబంధనలు, ఐఎంటీ సమచార వివరాలు ఆన్‌లైన్‌లో చదివి తెలుసుకోవడం కష్టమైన విషయమే. అందుకే ఆన్‌లైన్‌లో పాలసీ తీసుకోవడం కన్నా నేరుగా కంపెనీ దగ్గరికి వెళ్లి, ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకొని మనకు సరిపోయే పాలసీ ఎంచుకోవడం శ్రేయస్కరం. ముఖ్యమైన విషయం ఏమిటంటే కంపెనీ నుంచి నేరుగా పాలసీ పొందుతున్నాం కాబట్టి అన్ని రక్షణలు ఉంటాయనుకుంటే పొరపాటే. మనకు ఏఏ రక్షణలు కావాలో ముందుగానే బీమా కంపెనీ ప్రతినిధిని సంప్రదించి దానికి తగిన రుసుం చెల్లించి బీమా పాలసీ పొందండి.

- నరేశ్ భైరపనేని, అడ్వొకేట్

ఇంటింటికీ ఇంధనం

నయా ట్రెండ్



పాత మోపెడ్ అయినా.. కొత్త బెంజి కారైనా వాహనం కదలాలంటే ట్యాంకులో ఇంధనం ఉండాల్సిందే. దానికోసం ఎవరైనా బంక్‌లకి వెళ్లాల్సిందే. ఒక్కోసారి అక్కడ చాంతాడంత వరుస. సమయం వృథా, అదనపు ప్రయాస. ఇలాంటి కష్టాలకు చెక్ పెట్టేలా మీ ఇంటికే ఇంధనం తీసుకొచ్చి మీ వాహనంలో పోస్తాం అంటోంది ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కంపెనీ. అంటే హోమ్ డెలివరీ అన్నమాట. పుణేలో మొదలైన ఈ కార్యక్రమాన్ని త్వరలోనే దేశమంతా విస్తరించబోతున్నారు. అయితే ప్రస్తుతానికి ఇది డీజిల్‌కే పరిమితం. గతంలో బెంగళూరులో ఇలాంటి ట్రెండే మొదలుపెట్టినా పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పెసో) ప్రమాద హెచ్చరికలతో ఆ కార్యక్రమాన్ని నిలిపేశారు. ఇప్పుడు అన్నిరకాల జాగ్రత్తలు తీసుకొని మళ్లీ ప్రారంభించారు. కాబట్టి.. ఒక ఫోన్‌కాల్‌తో లేదా యాప్‌లోని క్లిక్‌తో మన వాహనం ఫుల్‌ట్యాంక్ అయ్యే రోజులు ముందున్నాయన్నమాట.

వాయిదాల కారు

మొదటి సవారీ



అక్షయ్‌కుమార్ ఇప్పుడంటే బాలీవుడ్ స్టార్ కానీ ఒకప్పుడు ఇరుకిరుకు గదుల్లో సర్దుకుంటూ.. కష్టాలపై పంచ్‌లు విసురుతూ పైకొచ్చినవాడే. ముంబయిలో అడుగుపెట్టేనాటికి అప్పులు తప్ప ఆస్తుల్లేవ్, అవకాశాల్లేవ్. సినిమా వాళ్లను కలవాలంటే కాస్త దర్పం ఉండాలనే ఉద్దేశంతో ఓ మిత్రుడి దగ్గర 28వేల రూపాయలతో సెకండ్‌హ్యాండ్ కారు కొన్నాడు. అదీ ఏడాది వాయిదాల రూపంలో. తర్వాత ఆ కారుతో తొలిసారి షిర్డీ లాంగ్‌టూర్‌కి వెళ్లాడు. అంతకుముందే కారు డ్రైవింగ్ వచ్చినా.. సొంతకారులో తొలిసవారీ మాత్రం అదేనట. ప్రస్తుతం అక్షయ్ షెడ్డులో బెంజ్‌లు, ఆడీల పక్కనే ఫియట్ కూడా ఇప్పటికీ దర్జాగా ఉంది.



పక్కాగా పార్కింగ్

చిట్కా



ఎంత పక్కాగా డ్రైవింగ్ చేసేవారైనా కారుని షెడ్‌లోనో, ఇంట్లోనో పార్కింగ్ చేస్తున్నపుడు ఒక్కోసారి దేనికైనా తగిలిస్తూ ఉంటాం. అంతంతమాత్రం డ్రైవింగ్ వచ్చినవారైతే ఇక అంతే సంగతి. మరి ఉపద్రవం తప్పాలంటే ఏం చేయాలి? దానికో చిట్కా ఉంది బాస్. ముందు ఏదైనా ఒక పాత టెన్నిస్‌బాల్‌కి తాడు కట్టి వేలాడదీయాలి. కారుని సరిగ్గా పార్కింగ్ చేసినపుడు అది కారు విండ్‌షీల్డ్ (ముందు అద్దం) తాకేలా ఉండాలి. ఇక మనం మన వాహనాన్ని బయటినుంచి లోపలికి తీసుకొచ్చినపుడు విండ్‌షీల్డ్ ఆనుకొని ఉండేలా పార్క్ చేస్తే ఎలాంటి సమస్యా ఉండదు.



బీఎస్ 4 ప్రమాణాలతో దూసుకొచ్చిన సీబీఆర్ 250ఆర్...
మిడ్ సెగ్మెంట్‌లో నేనే ఛాంపియన్ అంటున్న అపాచీ...
వారంలోనే వేల ఆర్డర్లు కొల్లగొట్టిన ఇంట్రూడర్...
యువత మనసు మెచ్చేలా వచ్చిన సూపర్ స్ప్లెండర్...
రేసింగ్ రేసులోకి వచ్చిన ఆర్ 15 వీ3...
గత మోడళ్లకే మరిన్ని సొబగులద్ది కొత్తగా వచ్చిన బైక్‌లివి...
వాటి ప్రత్యేకతల జోరు.. మార్కెట్లోకి వచ్చిన తీరు.. ఆ విశేషాల సమాహారం.

మెరుగులు దిద్ది.. మెరుపులు అద్ది!

మోజు పడి కొన్న స్మార్ట్‌ఫోన్ ఓ నెల వాడగానే బోర్ కొట్టేస్తుంది. మరి ఏళ్లకొద్దీ ఒకే బైక్ మోడల్ కనిపిస్తుంటే ఆ సూత్రం వర్తించకుండా ఉంటుందా? మరి అప్పుడేం చేయాలి? ఏదైనా కొత్తదనం చూపించాలి. కొత్త ఫీచర్లు జత చేయాలి. ఆధునిక టెక్నాలజీ అద్దాలి. అలా దూసుకొచ్చినవే ఈ బైక్‌లు.

వస్తూనే టాప్‌గేర్

విడుదలైన వారం తిరక్కుండానే పదిహేనువేల ఆర్డర్లు వచ్చాయంటే **సుజుకీ ఇంట్రూడర్ ఎఫ్ఐ** ఎంత జోరు మీదుందో అర్థమవుతుంది. పాత ఇంట్రూడర్‌కి మరిన్ని మెరుగులద్ది ఎఫ్ఐ అనే కొత్త మోడల్‌గా తీసుకొచ్చారు.

ప్రత్యేకతలు: క్రూయిజర్ విభాగం బైక్ ఇది. దూరప్రయాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాం అంటోంది కంపెనీ. రెండు రంగుల్లో దొరుకుతోంది. డిజిట్ స్పీడోమీటర్, ఏబీఎస్, తక్కువ ఎత్తులో సీటు, అలాయ్ చక్రాలు, ఒక టైరుకి ఏబీఎస్, స్మూత్ ఫినిషింగ్.. బండిని సౌకర్యవంతంగా, స్టైలిష్‌గా కనిపించేలా చేస్తున్నాయి. డిజైన్ విషయంలో ఇంట్రూడర్ టాప్‌లో ఉందంటున్నారు ఆటోమొబైల్ రంగ నిపుణులు.

ఇంజిన్: 154.99సీసీ సామర్థ్యం, 14.6బీహెచ్‌పీ ఎట్ 8000ఆర్‌పీఎం

అత్యధిక వేగం: 135కిమీ/గంటకి **మైలేజీ:** 47కిమీ/లీ **పోటీ:** బజాజ్ అవెంజర్ 220 **ధర:** రూ.1.07లక్షలు

మరింత సూపర్‌గా



ఇండియాలో అత్యధికంగా అమ్ముడయ్యే బైక్ ఏది అంటే అందరూ ఠక్కున చెప్పే పేరు స్ప్లెండర్. దానికి తాజాగా తళుకులద్ది **సూపర్ స్ప్లెండర్** తీసుకొచ్చారు. యువ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా రూపొందించాం అంటోంది హీరో మోటోకార్ప్.

ప్రత్యేకతలు: ఒక్క మీటతో ఇంజిన్ ఆన్/ఆఫ్ అయ్యేలా ఐ3ఎస్ టెక్నాలజీ అదనంగా జత చేర్చారు. ఈ సాంకేతికత కార్లలో మాత్రమే ఉంటుందంటోంది కంపెనీ. పాత మోడల్‌కన్నా 27శాతం అధిక శక్తి, 6శాతం టార్క్ విడుదల చేస్తుందీ బైక్. ఆటోమేటెడ్ హెడ్‌లాంప్ ఆన్ (ఏహెచ్ఏ), సైడ్ యుటిలిటీ బాక్స్ అదనపు హంగులు. క్రోమ్ ఫినిషింగ్‌తో తీర్చిదిద్దడంతో డిజైన్ ఆకర్షణీయంగా ఉంది. ఐదురకాల రంగుల్లో దొరుకుతోంది.

ఇంజిన్: 124.7 సీసీ సామర్థ్యం, ఎయిర్‌కూల్డ్ సింగిల్ సిలిండర్ **అత్యధిక వేగం:** 94కిమీలు/గం **మైలేజీ:** 60కిమీ/లీ **పోటీ:** హోండా సీబీ షైన్, బజాజ్ డిస్కవర్, యమహా సెల్యూటో **ధర:** రూ.57,190

రేసింగ్ సిద్ధం



పదేళ్ల కిందట ఆర్15 పేరుతో విడుదలైన బైక్ యమహా అత్యధిక బైక్ మోడళ్లలో ఒకటిగా నిలిచింది. ఈ దూకుడు నిలబెట్టుకోవడానికి మరిన్ని కొత్త ఫీచర్లు జోడించి **ఆర్15 వీ3** పేరుతో కొత్త మోడల్ తీసుకొచ్చింది యమహా.

ప్రత్యేకతలు: గత మోడల్‌తో పోలిస్తే ఈ బైక్ వీల్‌బేస్‌ని కొద్దిగా కురచగా రూపొందించారు. పూర్తి ఎల్ఈడీ లైట్లు.. వెడల్పాటి టైర్లు, ఆకట్టుకునే డిజైన్.. డిజిటల్ కన్సోల్.. సెల్‌ఫోన్ ఛార్జింగ్ చేసుకునేలా యూఎస్‌బీ కనెక్టర్.. ఇలా ఎన్నో హంగులు అదనంగా చేర్చారు. అత్యధిక పికప్ ఉండటంతో ఇది రేస్‌బైక్‌గా కూడా ఉపయోగపడుతుంది, పర్వతప్రాంత రోడ్లలో సైతం దూసుకెళ్తుంది అంటోంది యమహా యాజమాన్యం.

ఇంజిన్: 155సీసీ సామర్థ్యం, సిక్స్ స్పీడ్ గేర్‌బాక్స్ **అత్యధిక వేగం** 144కిమీ/గంటకి **మైలేజీ:** 40కిమీ/లీటరుకి **పోటీ:** హోండా సీబీఆర్ 150ఆర్, ఏప్రిలియా ఆర్ఎస్ 150 **ధర:** రూ.1.25లక్షలు

బీఎస్ 4తో సిద్ధం

బీఎస్ 4 ప్రమాణాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సిద్ధమైన బైక్ **సీబీఆర్ 250ఆర్**నే అంటోంది హోండా మోటార్స్ అండ్ స్కూటర్ ఇండియా. తొలిసారి 2018 ఆటోఎక్స్‌పోలో తళుక్కుమంది.

ప్రత్యేకతలు: స్పోర్ట్స్ బైక్. రెండు చక్రాలకు పూర్తి రక్షణగా ఏబీఎస్ (యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్) ఉంది. ముందూ, వెనకా పూర్తి ఎల్ఈడీ లైట్లు అమర్చారు. నలుపురంగు అలాయ్ చక్రాలు, గ్రాఫిక్స్‌తో కూడిన డిజైన్, వెనక టైర్లు వెడల్పుగా ఉండటంతో చూడ్డానికి ఆకర్షణీయంగా, సౌకర్యవంతంగా ఉంది. ఐదు రంగుల్లో దొరుకుతోంది.

ఇంజిన్: 249.6సీసీ సామర్థ్యం **అత్యధిక వేగం:** 135కిమీ/గం

మైలేజీ: 40-45కిమీ/లీ

పోటీ: టీవీఎస్ అపాచీ ఆర్ఆర్ 310, యమహా ఫేజర్ 25, బజాజ్ పల్సర్ ఆర్ఎస్ 200 **ధర:** రూ.1.93లక్షలు



వచ్చేసింది ఛాంపియన్



మార్కెట్లోకి రావడానికి ముందే సామాజిక మాధ్యమాల్లో సందడి చేసింది అపాచీ **ఆర్‌టీఆర్ 160 4వీ.** అమ్మకాల్లో దుమ్మురేపుతున్న అపాచీ ఆర్‌టీఆర్ 200 స్ఫూర్తితో తయారైందీ బైక్. హెడ్‌లైట్, టెయిల్‌లైట్, ఇండికేటర్లతో సహా డిజైన్ అచ్చంగా ఆర్‌టీఆర్ 200ని పోలి ఉంది.

ప్రత్యేకతలు: 150-160సీసీ విభాగంలో వేగవంతమైన, స్పోర్టీ బైక్ ఇదేనంటోంది టీవీఎస్. ఎల్ఈడీ డీఆర్ఎల్ (డేటైమ్ రన్నింగ్ లైట్లు), తక్కువ ఎత్తులో సీటు.. అదీ వెడల్పుగా ఉండటం, కిందికి దిగిన వెనక ఫ్రేమ్, సమాంతరంగా హ్యాండిల్.. ఆకట్టుకునేలా ఉంది. ఈ బండికి వాడిన ఇంజినే నాలుగుసార్లు ఇండియన్ మోటార్‌సైకిల్ రేసింగ్ ఛాంపియన్‌షిప్ గెల్చుకుంది.

ఇంజిన్: 159.7 సీసీ సామర్థ్యం, సింగిల్‌సిలిండర్, **పోటీ:** హోండా హార్నెట్ 160ఆర్, బజాజ్ పల్సర్ ఎన్ఎస్ 160 **అత్యధిక వేగం:** 114కిమీ/గం **మైలేజీ:** 45కిమీలు/లీటరుకి **ధర:** రూ.80వేలు

సొగసుగా.. డాట్సన్ గో

రెండు మోడళ్లు.. రెండు రంగుల రీమిక్స్ లిమిటెడ్ ఎడిషన్ సంగతులు.

◆ **యాంబియెంట్ లైటింగ్ యాప్**
మన మూడ్‌కి అనుగుణంగా లైటింగ్ మార్చుకునే సదుపాయం

ఓనిక్స్ బ్లాక్, ఆరెంజ్, బ్లూ, మెరుపు తెలుపు, సిల్వర్ కారు రంగులు

◆ **1,461సీసీ**
ఇంజిన్ సామర్థ్యం

◆ **బాడీ గ్రాఫిక్స్**
కారు రూఫ్, వెనకాల స్టైలిష్ డిజైన్లు

◆ **రూ.4,21,000**
డాట్సన్ గో ధర

◆ **రూ.4,99,000**
డాట్సన్ గో ప్లస్ ధర



లోపలి వేడి తగ్గిద్దాం

మెకానిక్ గురూ

వేసవికాలంలో ఎండ నుంచి రక్షణ పొందడానికి మనం ఇంటి పైకప్పుకి హీట్‌ప్రూఫ్ పెయింట్స్ వేసుకుంటాం కదా.. అలాగే కారుకి వేసుకునే పెయింట్స్ ఏమైనా అందుబాటులో ఉన్నాయా? తెలుపగలరు.

- దామెర వెంకటరాంబాబు, ఈమెయిల్

ప్రస్తుతానికి అలాంటి పెయింట్స్ ఎక్కడా లేవు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే కారు అద్దాల (విండ్‌షీల్డ్‌లు, సైడ్ డోరు గ్లాసులు) ద్వారానే లోపలికి వేడి ప్రవేశిస్తుంది. ఆ అద్దాలపై ఎండ పడ్డప్పుడు వేడి మరింత అధికమవుతుంది. కారుని లోహంతో తయారు చేస్తారు కాబట్టి అది ఉష్ణాన్ని గ్రహించి వేడిని ఎక్కువ చేస్తుంది. ఆ వేడి తగ్గాలంటే కారు స్టార్ట్ చేసే ఐదు నిమిషాల ముందే అద్దాలన్నీ దించేయాలి. మనం లోపల కూర్చోగానే బ్లోయర్ ఫ్యాన్‌ని రెండుమూడు నిమిషాలపాటు ఆన్ చేయాలి. దీంతో



ఆటోమేటిగ్గా లోపల ఉన్న వేడి సగానికిపైగా తగ్గిపోతుంది. ఏసీ ఆన్ చేయగానే మిగతా వేడి పోయి లోపలంతా చల్లదనం పరుచుకుంటుంది.

- సాయిభరత్ బొప్పరాజు, www.motofix.in

ఈనాడు సినిమా



ఒక్క సినిమా చేస్తే చాలనుకున్నా!

'ఎం.ఎల్.ఎ' అంటే మంచి లక్షణాలున్న అబ్బాయి మాత్రమే కాదు. మంచి లక్షణాలున్న 'అమ్మాయి' కూడా. కాజల్ అలాంటి కథానాయికే. అందం, అభినయాల కలబోత కాజల్. 'లక్ష్మీ కల్యాణం' నుంచి మొన్నొచ్చిన 'అ..!' వరకూ తన దగ్గరకు వచ్చిన ప్రతి పాత్రకూ న్యాయం చేసింది. అందాల ప్రదర్శన హద్దుల్లోనే ఉంచుతూ ఊరించింది. కమర్షియల్ కథానాయికగా గుర్తింపు పొందింది. అగ్ర కథానాయకులందరితోనూ జోడీ కట్టింది. ఈ ప్రయాణంలో యాభై చిత్రాల్ని పూర్తి చేసింది. తన తొలి కథానాయకుడు కల్యాణ్ రామ్‌తో మరోసారి నటించిన చిత్రం 'ఎం.ఎల్.ఎ'. ఈరోజు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా కాజల్‌తో బాతాఖానీ!

యాభై చిత్రాల మైలు రాయిని దాటేశారు... సెంచరీ కొట్టే ఆలోచనలు ఉన్నాయా?

(నవ్వుతూ) అసలు ఇన్ని సినిమాలు చేస్తానని అస్సలు అనుకోలేదు. 'లక్ష్మీ కల్యాణం' రోజులు నాకింకా గుర్తు. 'ఈ ఒక్క సినిమా చేస్తే చాలు భగవంతుడా' అనుకున్నా. ఆ సినిమా వీలైనంత త్వరగా పూర్తి చేసి, మళ్లీ నా చదువులు నేను చదువుకుందామనుకున్నా. కానీ.. అక్కడి నుంచి వరుసగా అవకాశాలు వచ్చాయి. ఇదిగో.. వెనక్కి తిరిగి చూసుకుంటే యాభై సినిమాలు పూర్తయ్యాయి.

'కథానాయికగా నేను స్థిరపడినట్టే' అని ఎప్పుడు అనిపించింది..?

'మగధీర'తో ఆ నమ్మకం వచ్చింది. అంతకు ముందు కూడా కొన్ని సినిమాలు చేసినా ఎక్కడో చిన్న బెరుకు ఉండేది. 'నాకూ సినిమాకూ సెట్ అవ్వదేమో' అనిపించేది. కానీ 'మగధీర' విజయం నాపై నాకు నమ్మకాన్ని కలిగించింది.

ఈ ప్రయాణంలో కథానాయకుల ఆధిపత్య ధోరణి ఎప్పుడూ ఎదురవ్వలేదా?

లేదు. నన్ను చాలా బాగా చూసుకున్నారు. 'సినిమా అంటే నా ఒక్కడి వల్ల కాదు.. అది సమష్టి బాధ్యత' అనే విషయం నేను పనిచేసిన కథానాయకులందరికీ తెలుసు. కాబట్టి నాకు గౌరవం ఇచ్చారు. మంచి పాత్రలు దక్కాయి. కొన్నిసార్లు వాళ్లతో సమానమైన పాత్రలు లభించాయి.

మీరు నటించిన సినిమాలు చూస్తే మీకేమనిపిస్తుంది? 'ఇంకొంచెం బాగా నటిస్తే బాగుణ్ను' అనుకుంటారా?

నాకే కాదు.. నటీనటులు ఎవరికైనా అలానే అనిపిస్తుంది. నాకైతే ఇంకొంచెం ఎక్కువ అనిపిస్తుంది. నా కుటుంబంలో సినీ పరిశ్రమకు చెందిన వాళ్లెవరూ లేరు. నాకు దగ్గరుండి నేర్పించే గురువులూ లేరు. నాకు నేనే నేర్చుకుంటూ వెళ్లాలి. అందుకే కెరీర్ ఆరంభంలో కొన్ని తప్పులు చేసి ఉండొచ్చు. కొన్ని సినిమాలు చూస్తుంటే.. 'అలా ఎందుకు నిలబడ్డాను? డైలాగ్ ఇలానే ఎందుకు చెప్పాను?' అనిపిస్తుంటుంది. మరో పదేళ్ల తరవాత ఇప్పటి సినిమాలు చూస్తే.. అలాంటి భావనే కలుగుతుందేమో?

కథానాయకులందరితోనూ నటించారు... 'ఫలానా వాళ్లతో నటించాలి' అనే కోరికలు మిగిలిపోయాయా?

నటించిన వాళ్లందరితోనూ మరోసారి నటించాలని వుంది. ఇప్పుడు కల్యాణ్ రామ్‌తో చేసినట్టు..

మీ తొలి కథానాయకుడు కల్యాణ్‌రామ్. 'లక్ష్మీ కల్యాణం' నుంచి 'ఎం.ఎల్.ఎ' వరకూ ఆయనలో ఏమైనా మార్పులు కనిపించాయా?

'లక్ష్మీ కల్యాణం' సమయంలో నాకు సినిమా గురించి ఎలాంటి అవగాహన లేదు. సెట్లో ఎలా ఉండాలో, కెమెరా ముందు ఎలా నిలబడాలో కూడా అర్థమయ్యేది కాదు. ఆ సమయంలో కల్యాణ్ రామ్ సలహాలు ఇచ్చేవారు. ఇప్పుడు మాత్రం ఇద్దరం చర్చించుకుని మరీ సన్నివేశంలో నటించాం. ఇప్పటికీ ఆయన నాకు విలువైన సలహాలు ఇస్తున్నారు. ఈ ప్రయాణంలో ఇద్దరం మారాం. ఎన్నో విషయాలు నేర్చుకున్నాం. నా తొలి కథానాయకుడిగా కల్యాణ్‌రామ్‌కి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఇస్తాను. 'ఎం.ఎల్.ఎ' సెట్లో తొలిరోజు ఆయన్ని చూసినప్పుడు పాత స్నేహితుడ్ని కలుసుకున్న అనుభూతి కలిగింది.

'ఎం.ఎల్.ఎ'లో మీ పాత్ర ఎలా ఉండబోతోంది?

కథానాయిక పాత్రలకు ప్రాధాన్యం ఉన్న కథలు చాలా తక్కువ వస్తున్నాయి. అలాంటి కథల్లో 'ఎం.ఎల్.ఎ' కూడా ఉంటుంది. కథలో కీలకమైన పాత్ర నాది. ఓ మంచి సందేశం కథలో మిళితమై సాగుతుంది. సందేశం అంటే... బలవంతంగా ఏదో రుద్దుతున్నట్టు ఉండదు. దాన్నీ వినోద భరితంగా చెప్పే ప్రయత్నం చేశారు.

కథానాయికగా ఇంత అనుభవం వచ్చింది కదా, ఇక ముందు కథల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోబోతున్నారు?

కథల విషయంలో ముందు నుంచీ నేను జాగ్రత్తగానే ఉంటున్నాను. అయితే ఇక మీదట మరింత ఆచి తూచి అడుగులేయాలి. అయితే ఒక్కటి మాత్రం చెప్పగలను. అన్ని సినిమాలూ కథలు నచ్చే ఒప్పుకోం. కొన్ని కొన్ని ప్రత్యేక కారణాలుంటాయి. ప్రతీసారీ మంచి కథలు, మంచి పాత్రలూ రావు. డబ్బుల కోసం కూడా కొన్ని సినిమాలు చేయాలి.

యాభై చిత్రాల్లో కథానాయిక ప్రాధాన్యం ఉన్న సినిమా ఒక్కటీ కనిపించ లేదు. అనుష్క, నయనతారలా లేడీ సూపర్‌స్టార్ ఇమేజ్ కోరుకోవడం లేదా?


ఎవరినో చూసి, నేనూ అలానే ఉండాలి అనుకోవడం నాకు ఇష్టం ఉండదు. నా ప్రయాణం నాది. కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలు నాకూ వచ్చాయి. అప్పట్లో కాల్షీట్లు సర్దుబాటు చేయడం కుదరక కొన్ని వదులుకున్నా. అయితే కథానాయిక ప్రాధాన్యం ఉన్న కథలంటే.. హారర్, థ్రిల్లర్ లేదంటే ఓ సమస్య కోసం పోరాటం చేసే స్త్రీ పాత్రలే అనుకోవడం తప్పు. మంచి ప్రేమకథలూ చేయొచ్చు. వ్యాపార విలువలు ఉన్న సినిమాలూ చేయొచ్చు. అలాంటి పాత్రలు వస్తే తప్పకుండా చేస్తా.

ఆర్.ఆర్.ఆర్... ఆరంభం


రాజమౌళి


ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా ఓ చిత్రం తెరకెక్కబోతోందని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమాకి సంబంధించి రాజమౌళి నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. మరో వైపు ప్రీ పొడక్షన్ పనులు మాత్రం జరిగిపోతున్నాయి. ఇప్పుడు చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చేసింది. దాన్ని ఓ టీజర్ రూపంలో విడుదల చేసింది చిత్ర బృందం. 'ఆర్.ఆర్.ఆర్' అంటూ ఆంగ్లంలో మూడు 'ఆర్'లను టీజర్‌లో చూపిస్తూ (అంటే రాజమౌళి, రామ్‌చరణ్, రామారావు అన్నమాట) అధికారిక ప్రకటన విడుదల చేసింది. దానిపై రాజమౌళి ముద్ర కూడా పడిపోయింది. ఈ చిత్రాన్ని డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. రాజమౌళి నుంచి ప్రకటన వచ్చేసింది కదా? ఇక సినిమాకి క్లాప్ కొట్టడమే ఆలస్యం. మరి దానికి ముహూర్తం ఎప్పుడు నిర్ణయించారో..?

పవన్ అతిథిగా...


పవన్ కల్యాణ్

'ఇష్క్' పాటల వేడుకకు పవన్ కల్యాణ్ అతిథిగా విచ్చేశాడు. ఆ చిత్రం విజయవంతమైంది. అప్పటి నుంచీ నితిన్ సినిమా వేడుకలకు పవన్ అతిథిగా రావడం ఓ సెంటిమెంట్‌లా మారింది. నితిన్ 'ఛల్ మోహన రంగ' విడుదలకు సిద్ధమైంది. ఈనెల 25న హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ అతిథిగా పాల్గొనబోతున్నాడు. ఈ విషయాన్ని నితిన్ ట్విట్టర్ ద్వారా ధ్రువీకరించాడు.

జూ.చిట్టిబాబు సన్నాఫ్ అల్లు అర్జున్





రామ్‌చరణ్ కాస్తా చిట్టిబాబు అయిపోయాడు. 'రంగస్థలం' కోసం. గెడ్డం పెంచి, లుంగీ కట్టి, కండువా వేసుకుని... మాస్ మాస్‌గా కనిపిస్తున్నాడు. ఆ గెటప్పు ఓ బుడతడికి కూడా నచ్చేసింది. అందుకే లుంగీ, పూల చొక్కా, కండువా... సేమ్ టూ సేమ్ దింపేసి ఫొటోకి పోజు ఇచ్చాడు. ఆ బుడ్డోడు, జూ.చిట్టిబాబు ఎవరో కాదు. అల్లు అర్జున్ తనయుడు అయాన్. సోషల్ మీడియాలో అయాన్ స్టిల్ చక్కర్లు కొడుతోంది. చరణ్, అయాన్ ఫొటోలు పక్క పక్కన పెట్టుకుని మురిసిపోతున్నారు అభిమానులు. చూస్తుంటే అయాన్ త్వరలోనే తెరంగేట్రం చేసేసేటట్టే కనిపిస్తున్నాడు.

'రంగస్థలం'లో ఆ రిస్కీ షాట్...

రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకుడు. ఈనెల 30న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. 1985 ప్రాంతంలో సాగే కథ ఇది. పల్లెటూరి నేపథ్యంలో జరుగుతుంది. ఆ వాతావరణం సృష్టించడానికి చిత్రబృందం చాలా కష్టపడింది. చరణ్ తన లుక్‌ని సైతం మార్చుకున్నాడు. సంభాషణలు పలికే విధానంలోనూ మార్పు చూపించాడు. ప్రతికూల పరిస్థితుల మధ్య షూటింగ్ సాగింది. చిత్రీకరణ సమయంలో ఓ చిన్న ప్రమాదం నుంచి బయటపడ్డాడు కూడా. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని గోదావరి తీరంలో ఓ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించారు. బోట్ లోంచి నదిలోకి దూకి ఫైట్ చేసే సన్నివేశం అది. నదిలో ఈత కొడుతున్నప్పుడు అనుకోకుండా.. చరణ్ బోటు అడుగుభాగాన ఉన్న మోటారు వరకూ వెళ్లిపోయాడట. అక్కడ ఫ్యానులాంటి పరికరం ఉంటుంది. కాస్తలో చరణ్‌కి గాయమయ్యేదే. ఇలాంటి రిస్కీ షాట్లు... ఈ సినిమా కోసం చరణ్ చాలా చేశాడని చిత్రబృందం చెబుతోంది.


దేవీప్రసాద్, కృష్ణవిజయ్, నారా రోహిత్, సురేష్ బొబ్బిలి, శర్వానంద్, శ్రీవిష్ణు, వేణు

నలుగురు మాట్లాడుకున్నా చాలు

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. వేణు ఊడుగుల దర్శకుడు. సాట్నా టైటస్ కథానాయిక. కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు నిర్మాతలు. శుక్రవారం విడుదల అవుతోంది. హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ "ఓ మంచి కథని నమ్మి సినిమా తీసిన మిత్రుడు శ్రీవిష్ణుని అభినందిస్తున్నా. ఈ సినిమా చూస్తున్నప్పుడు నా ఇంటర్మీడియట్ రోజులు గుర్తొచ్చాయి. నా స్నేహితుడొకడు బాస్కెట్‌బాల్ జాతీయ జట్టుకి ఎంపికైనా కూడా.. ఇంట్లో వాళ్ల ఒత్తిడి వల్ల ఆటని మధ్యలోనే వదిలేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయ్యాడు. అలాంటివాళ్ల జీవితాల్ని తెరపై చూపించే చిత్రమిద"న్నారు. "ప్రచార చిత్రం చూసి శ్రీవిష్ణు అభిమానిగా మారిపోయా. ఈ సినిమా కొనుక్కుందాం అనుకున్నా. కానీ అప్పటికే ఈ సినిమా బిజినెస్ పూర్తయ్యింది. ఓ మంచి సినిమాని మిస్ చేసుకున్నా అనిపించింద"న్నారు శర్వానంద్. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన దర్శకుడు దేవి ప్రసాద్ మాట్లాడుతూ "నన్ను చాలామంది నటించమని అడిగారు. కానీ ఒప్పుకోలేదు. వేణు ఈ కథ చెప్పగానే నచ్చేసింది. ఇలాంటి చిత్రం నిర్మించడానికి ఎంతో తెగువ కావాల"న్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ "నా కథ నాకు గుర్తొచ్చి ఈ సినిమా చేయడానికి ఒప్పుకున్నా. సినిమా ఫలితం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. ఈ సినిమా చూసి నలుగురు మాట్లాడుకున్నా చాలు. తల్లిదండ్రుల ప్రోత్సాహం పిల్లలకు చాలా ముఖ్యం. వాళ్లే నమ్మకపోతే.. మనల్ని ఇంకెవరు నమ్ముతారు? మన జీవితాలకు దగ్గరగా ఉండే కథతో ఈ సినిమా చేశామ"న్నారు. కార్యక్రమంలో రాజ్ కందుకూరి, జి.నాగేశ్వరరెడ్డి, సురేష్ బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.

అలా... 'మహానటి' అయిపోయింది


కీర్తి సురేష్

సినిమా అనేది వ్యాపారమే కావొచ్చు. అదో ఉద్వేగభరితమైన ప్రయాణం కూడా. ఓ టీమ్ అంతా.. ఒకే లక్ష్యంతో దాదాపు యేడాది పాటు కష్టపడతారు. కలిసి పనిచేస్తారు, అనుభవాలు పంచుకుంటారు. ఎన్నో ఆనందకరమైన క్షణాల్ని దాటుకుంటూ వస్తారు. అలాంటి వాళ్లంతా 'గుమ్మడికాయ' కొట్టే రోజు భారంగా వీడ్కోలు తీసుకుని వెళ్లిపోతారు. షూటింగ్‌కి ఆఖరి రోజంటే కాలేజీకి ఫేర్‌వెల్ డే లాంటిదే. 'మహానటి' సెట్లోనూ అలాంటి ఉద్వేగం కనిపించింది. చిత్రీకరణకు 'శుభం'కార్డు పడిన రోజున చిత్ర బృందమంతా భారమైన హృదయాలతో వీడ్కోలు చెప్పుకున్నారు. కీర్తి సురేష్ అయితే కన్నీరు పెట్టుకొంది. సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రమిది. ఆ పాత్రలో కీర్తి సురేష్ కనిపించనుంది. నాగ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా తెరకెక్కించాయి. ప్రియాంక దత్ నిర్మాత. బుధవారంతో చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "చివరి రోజు భారంగా గడిచింది. సావిత్రి చిత్రపటం దగ్గర కీర్తి సురేష్ కన్నీరు పెట్టుకోవడం అందరినీ కదిలించింది. దాదాపుగా అందరిదీ ఇదే పరిస్థితి. కీర్తి, సమంత, దుల్కర్ సల్మాన్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్ ఇలా చాలామందితో పనిచేశాం. వాళ్లంతా మాకు అండగా నిలిచారు. ఏఎన్నార్ పాత్ర చేయడానికి ముందుకు వచ్చిన నాగచైతన్యకు మేం రుణపడ్డాం. మే 9న విడుదల అవుతున్న ఈ చిత్రం తెలుగువాళ్లందరికీ ఓ మర్చిపోలేని అనుభూతి పంచుతుందన్న నమ్మకం ఉంద"న్నారు.

గళం కాదు.. సంకల్ప బలం ముఖ్యం!


'హిచ్కీ'లో రాణీ ముఖర్జీ

బాలీవుడ్‌లో నాయికా ప్రాధాన్య చిత్రాలతో సత్తా చాటుతున్న కథానాయికల్లో రాణీ ముఖర్జీ ఒకరు. నో ఒన్ కిల్డ్ జెస్సికా, మర్దానీ లాంటి చిత్రాల్లో ఆమె శక్తిమంతమైన పాత్రల్లో నటించి మెప్పించింది. 'మర్దానీ' తర్వాత తల్లిగా మారిన రాణి నాలుగేళ్లు విరామం తీసుకుంది. ఇప్పుడు మళ్లీ మరో నాయికా ప్రాధాన్య చిత్రంలో ఓ విభిన్నమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానుంది. 'హిచ్కీ' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రంలో టౌరెట్ సిండ్రోమ్ అనే అరుదైన వ్యాధితో బాధపడే మహిళగా నటించింది రాణి. సిద్ధార్థ్ పి.మల్హోత్రా తెరకెక్కించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న నేపథ్యంలో ఆ సినిమా విశేషాలివీ.

విడుదలకు సిద్ధం

మతిమరుపు, మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్ లాంటి జబ్బుల బారిన పడిన పాత్రలు వెండితెరకు కొత్తేం కాదు. కానీ టౌరెట్ సిండ్రోమ్ అనే జబ్బుతో బాధపడే పాత్ర మాత్రం ఇంతవరకూ బాలీవుడ్ తెరపై కనిపించలేదు. 'హిచ్కీ'లో అలాంటి అరుదైన పాత్రను చేయడానికి సాహసించింది రాణీ ముఖర్జీ. టౌరెట్ సిండ్రోమ్ ఉన్న వారికి మెదడులో నరాలు పట్టు కోల్పోయి తమ ప్రమేయం లేకుండానే తరచుగా నోటి నుంచి వింత శబ్దాలు చేస్తుంటారు. ఈ చిత్రంలోనూ రాణి మాట్లాడినప్పుడల్లా మధ్యలో హిచ్కీ.. హిచ్కీ.. అంటూ శబ్దాలు చేస్తుంటుంది. ఆ జబ్బు ఉన్నా టీచర్ కావాలన్న తన కలను నెరవేర్చుకోవడానికి ఎలాంటి సవాళ్లను ఎదుర్కొందన్నది ఈ చిత్ర కథ. టౌరెట్ సిండ్రోమ్ బారిన పడినప్పటికీ సంకల్ప బలంతో టీచర్‌గా, వక్తగా, రచయితగా ఎదిగిన అమెరికా దేశస్థుడు బ్రాడ్ కొహెన్ రాసిన 'ఫ్రంట్ ఆఫ్ ది క్లాస్: హౌ టౌరెట్ సిండ్రోమ్ మేడ్ మి ది టీచర్ ఐ నెవర్ హ్యాడ్' అనే పుస్తకం ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఇప్పటికే ఈ పుస్తకం ఆధారంగా ఇంగ్లిష్‌లో 'ఫ్రంట్ ఆఫ్ ది క్లాస్' అనే బుల్లితెర చిత్రం కూడా వచ్చింది.

కథేంటి : నైనా మాథుర్(రాణీ ముఖర్జీ)కి చిన్నప్పట్నుంచీ టీచర్ కావాలని కోరిక. కానీ తనకేమో టౌరెట్ సిండ్రోమ్ జబ్బు ఉంటుంది. నోరు తెరిచి ఏం మాట్లాడినా మాటిమాటికి వింత శబ్దాలు చేస్తుంటుంది. దీంతో ఆమెకు టీచర్ ఉద్యోగం ఇవ్వడానికి ఎవరూ ముందుకు రారు. అయితే పట్టు విడవకుండా ప్రయత్నిస్తున్న ఆమెను టీచర్‌గా తీసుకోవడానికి ఓ స్కూల్ యాజమాన్యం ముందుకొస్తుంది. కానీ ఆ తర్వాతే ఆమెకు అసలైన సవాళ్లు ఎదురవుతాయి. మురికివాడల నుంచి వచ్చిన 14 మంది పిల్లలకు పాఠాలు చెప్పే బాధ్యతను నైనాకు అప్పగిస్తారు. ఆ పిల్లలకేమో చదువు పట్ల ఆసక్తి, టీచర్లంటే గౌరవమూ ఏ కోశానా ఉండవు. పాఠం చెప్పేటప్పుడు ఆమె చేసే శబ్దాలు చూసి వారు గేలి చేస్తుంటారు. 'చెడ్డ విద్యార్థులంటూ ఎవరూ ఉండరు. విద్యార్థులు అలా ఉండటానికి కారణమైన టీచర్లే చెడ్డవార'ని నమ్మే నైనా వారిని మార్చడానికి ఎలాంటి ప్రయత్నాలు చేసింది? టీచర్ ఉద్యోగానికి కావాల్సిన అర్హత గళం కాదు సంకల్ప బలం అని ఎలా నిరూపించిందన్నది 'హిచ్కీ' కథ.

బాంధవ్యాలకు విలువిచ్చేలా..


జితన్ రమేష్, శృతి యుగల్

ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ కథానాయకుడిగా ఎం.వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఒకటే లైఫ్'. హ్యాండిల్ విత్ కేర్.. అనేది ఉపశీర్షిక. నారాయణ్ రామ్ నిర్మాత. శృతి యుగల్ కథానాయిక. ఫస్ట్‌లుక్‌ను హైదరాబాద్‌లో నటుడు జీవా విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "సాంకేతిక పరిజ్ఞానం వెంట పరుగులు పెడుతున్న నేటి తరం.. మానవ సంబంధాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న అంశంతో తెరకెక్కుతున్న చిత్రమిద"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మా బృందానికి మంచి పేరు తీసుకువచ్చే చిత్రంగా నిలుస్తుంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తామ"న్నారు. సుమన్ ప్రధాన పాత్రలో కనిపిస్తారు. నల్ల వేణు, జబర్దస్త్ రామ్, బాబి, దిశ తదితరులు నటిస్తున్నారు. సంగీతం: అమ్రీష్, కూర్పు: నందమూరి హరి, ఛాయాగ్రహణం: వై.గిరి.

అందుకే రీమేక్ చేయలేదు


గురురాజ్

"కాలేజీ జ్ఞాపకాలు మధురమైనవి. ఎన్నేళ్లయినా అవి మనసు పొరల్లో పచ్చగా ఉంటాయి. వాటిని మరో సారి గుర్తు చేసే చిత్రం 'ఆనందం'" అన్నారు గురురాజ్. మలయాళంలో విజయవంతమైన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో తెలుగులోకి తీసుకొచ్చారాయన. గణేష్ రాజ్ దర్శకుడు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా గురురాజ్ గురువారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. "మలయాళం చిత్రాన్ని రీమేక్ చేద్దామని చాలామంది నిర్మాతలు ప్రయత్నించారు. అయితే రీమేక్ చేస్తే ఆ ఫీల్ మళ్లీ తీసుకురాలేం. అందుకే.. అనువదించాం. కాలేజీ విద్యార్థులు చేసే విహార యాత్ర నేపథ్యంలో సాగే చిత్రమిది. సచిన్ వారియర్ అందించిన పాటలకు మంచి స్పందన వచ్చింద"న్నారు.

పంచ్ డైలాగ్

తల్లిదండ్రులు ఎంత ఆస్తిపరులైనా, అందులో చిల్లిగవ్వ కూడా తాకకుండా తను కష్టపడి సంపాదించి, వాళ్లకెవడైతే తిండిపెడతాడో వాడే అసలైన మగాడు.

- చిత్రం : అరుణాచలం

పంపినవారు : జ్యోతిరాజా, మురారి, తూ.గో.జిల్లా

విందులూ... వినోదాల వేళ చమక్కున మెరవాలంటే చక్కగా తయారవ్వాల్సిందే! అలాంటి వారికోసమే అదరహో అనిపించే ఈ అనార్కలీ వస్త్రశ్రేణి. భిన్న రంగుల్లో ఆకట్టుకునే డిజైన్లలో సందడి చేస్తోన్న ఈ దుస్తులు మెచ్చని మగువలుండరు. ఎంచుకోవడమే ఆలస్యం.

ఆహా అనార్కలీ!

ఫ్యాషన్ ఫ్యాషన్









నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
✆ 0891-2577905
విశాఖపట్నం.

కోరా సిల్కు అనార్కలీకి కళ తెచ్చే గులాబీ మోటిఫులు... మెడ దగ్గర ఆకట్టుకునే ఎంబ్రాయిడరీ సొగసులు.

వెండి వర్ణంలో డిజిటల్ పూల ప్రింట్లు పరచుకున్న అనార్కలీని ఎంత వర్ణించినా తక్కువే.

పసుపు వర్ణంలో అందంగా.. హుందాగా రూపొందిన కోరా సిల్కు అనార్కలీపై ఫుల్కారీ పనితనం.

ఆకట్టుకునే అనార్కలీకి ఎంబ్రాయిడరీ హంగులూ.. మోటిఫ్ మెరుపులు ప్రత్యేకం.

మోడల్: అమిక్షా పవార్
ఫొటోలు: పాతూరి పద్మావతి

పౌడర్ కదాని వాడుతుంటే...!



● నేను టాల్కంపౌడర్ ఎక్కువగా వాడుతుంటాను. ఏడాది వయసున్న మా పాపకి కూడా బాగానే రాస్తుంటా. చెమట పట్టే భాగాల్లోనూ రాసుకుంటూ ఉంటా. ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదని నా స్నేహితురాలు చెప్పింది. పౌడర్‌కి ప్రత్యామ్నాయం ఏదయినా ఉంటుందా?

- కృష్ణశ్రీ, ఖమ్మం

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

పౌడర్ అంటే ప్రాసెస్డ్ చేసిన సాఫ్ట్ మినరల్. ఇది మెగ్నీషియం, సిలికాన్, ఆక్సిజన్ నుంచి తయారవుతుంది. దీన్ని సరిగా ఉపయోగించాలి. లేదంటే చాలా సమస్యలు వస్తాయి. కళ్ల వెంట నీరు కారడం, ఊపిరితిత్తుల సమస్యలూ బాధిస్తాయి. పౌడర్ రాసుకునేటప్పుడు తెలియకుండానే పీలుస్తాం. ఆ సమయంలో అందులో ఉండే టాల్క్ ఊపిరితిత్తుల్లోకి వెళుతుంది. ఫలితంగా శ్వాసకోశ సమస్యలూ, దగ్గూ, వాంతులూ, విరేచనాలు వంటివి రావచ్చు. పౌడర్‌ని మరీ ఎక్కువగా వాడే వారికైతే ఊపిరితిత్తుల క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదముంది. మరికొందరు మామూలు టాల్కం పౌడర్‌ని న్యాపీ దద్దుర్లు వచ్చిన చోటా, మీరన్నట్టు చెమట పట్టే భాగాల్లో వాడుతుంటారు. అయితే ఎలా పడితే అలా వాడుకోవడం సరికాదు. చెమటా, ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో ఇబ్బంది పడుతోంటే వైద్యుల్ని సంప్రదించి చికిత్సలు తీసుకోవాలి కానీ పౌడర్‌తో సొంత ప్రయోగాలు చేయకూడదు. ముఖానికి రాసుకునే టాల్కంపౌడర్ షవర్‌జెల్, లోషన్లూ, లిప్‌స్టిక్, ఐషాడో, డియోడరంట్, ఫౌండేషన్, టూత్‌పేస్ట్ వంటి వాటిలోనూ ఉంటుంది. అందుకే సౌందర్యోత్పత్తులు కొనేటప్పుడు వాటిమీద కాస్మెటిక్ టాల్క్ ఫ్రీ అని రాసి ఉంటేనే ఎంచుకోవాలి. వీలుంటే ఇంట్లోనే పౌడర్ తయారు చేసుకోవాలి. చెంచా చొప్పున కొబ్బరినూనె, మైనం, షి బటర్ తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని పౌడర్‌కి బదులు వాడుకోవచ్చు. న్యాపీ దద్దుర్లు తగ్గించడానికీ వాడొచ్చు. చెమటపట్టే భాగాల్లో ఇన్‌ఫెక్షన్, దురదా వంటివి బాధిస్తుంటే చెంచా చొప్పున మొక్కజొన్న పిండీ, వంటసోడా కలిపి రాసుకోవాలి. వెంటనే ఆ ప్రాంతం పొడి బారుతుంది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

నిర్ణయం మాట్లాడాకే



కళాశాల చదువు పూర్తి చేశాక ఇష్టమైన రంగంలోకి ప్రవేశించాలనుకుంటాం. దాన్ని చేరుకోవాలంటే... ముందుగానే కాస్త సాధన అవసరం. మరికొన్ని అంశాలపై అవగాహన పెంచుకోవడమూ తప్పనిసరే.

ప్రస్తుతం యువత ఎక్కువ సమయం గడిపేది సామాజిక మాధ్యమాలతోనే. అయితే స్నేహితుల సంఖ్యను పెంచుకోవడానికే పరిమితమైతే... ఉపయోగం ఉండదు. అందుకే ఎంచుకోబోయే రంగానికి ఉపయోగపడేలా సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలి.

◆ మీలో ఉండే శక్తి సామర్థ్యాలను గుర్తించాలి. ఏ రంగంలో అయితే మీకు ఆసక్తి ఉందో గమనించి, అందులో అడుగుపెట్టడానికి ప్రయత్నించాలి. అలాగే సందేహాలుంటే... ఆ రంగంలోని నిపుణులతో మాట్లాడాలి. మీకు ఇంకాస్త స్పష్టత వస్తుంది. అవకాశాల గురించీ కొంత తెలుసుకోగలుగుతారు. ఆ తరువాత నిర్ణయం తీసుకోవచ్చు.

◆ ఇంట్లోవాళ్లకే కాదు, స్నేహితులకు కూడా మీ ఆలోచనలూ, ఆశయాలు వివరిస్తే... వారిచ్చే సలహాలు ఉపయోగపడటమే కాదు, సహకారం కూడా అందుతుంది.

◆ మీరు ఎంచుకోబోయే రంగంలో ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు అప్‌డేట్ చేసుకుంటే... ఎంతవరకూ సాధించగలరో లేదో అనేది మీకే అర్థమవుతుంది.

నజరానా

అగరొత్తులు కాలాక కింద పడిన మసితో ఇత్తడి వస్తువులు తోమి చూడండి. అవి శుభ్రపడతాయి.

బంగారం-వెండి

22 న ముగింపు-క్రితం

హైదరాబాద్	ముగింపు	క్రితం
బంగారం (24క్యా)	31,600	31,310
ఆర్నమెంట్	29,530	29,240
వెండి (కిలో)	39,500	39,025
విజయవాడ		
బంగారం (24క్యా)	31,300	31,350
ఆర్నమెంట్	29,000	29,100
వెండి (కిలో)	39,500	39,500
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,350	31,250
ఆర్నమెంట్	29,070	28,940
వెండి (కిలో)	39,600	39,100
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	30,690	30,440
ఆర్నమెంట్	29,230	28,980
వెండి (కిలో)	41,600	41,000
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,370	31,110
ఆర్నమెంట్	29,180	28,920
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,923	2,899
వెండి (గ్రా)	41.60	41.10

(రూ. లలో)

కొలెస్ట్రాల్ పెరగకుండా



రక్తంలో కొలెస్ట్రాల్ ఉందని డాక్టర్లు చెబితే భయపడతాం. వ్యాయామం మొదలు ఎన్నో చేస్తాం. వాటన్నింటిలో ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలూ తప్పనిసరే. అప్పుడే ఆ సమస్యను వీలైనంతవరకూ అదుపులో ఉంచుకోవచ్చు. అదెలాగంటే...

రొట్టెలు తినడం మీకు అలవాటు అయితే... గోధుమపిండిలో కొద్దిగా ఓట్స్ పిండి కూడా కలపండి. శరీరానికి పీచు అందుతుంది.



▶▶ సాధారణ బ్రెడ్ కన్నా... బ్రౌన్ బ్రెడ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. కొలెస్ట్రాల్ సమస్య అదుపులోకి వచ్చేవరకూ కొన్నాళ్లు దంపుడు బియ్యాన్నే ఎంచుకోవడం మంచిది. అలాగే చక్కెరను పూర్తిగా తగ్గించి బదులుగా తేనె, బెల్లం వాడాలి.

▶▶ మంసాహారులైతే మటన్ కన్నా చికెన్, చేపల్ని ఎక్కువగా తీసుకోవచ్చు. చేపల్లో ఉండే ఒమెగా త్రీ ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి మేలు చేయడమే కాదు, కొలెస్ట్రాల్‌ని కూడా తగ్గిస్తాయి.



▶▶ చిరుతిళ్లలో బిస్కెట్లు తినడం మీకు అలవాటా... బదులుగా పెసలమొలకలూ, పండ్లూ, ఉడికించిన గింజల్ని తినడం అలవాటు చేసుకోవాలి.

▶▶ కొలెస్ట్రాల్ పెరగకుండా ఉండాలంటే గుడ్లు తినడం మానేయాలని లేదు. కొన్నాళ్లపాటు గుడ్డులోని తెల్లసొనను మాత్రమే ఎంచుకోవాలి.



▶▶ వెన్న తీసిన పాలనే వాడాలి. పొద్దుటిపూట టీ, కాఫీ తాగేవాళ్లు వాటికి బదులు గ్రీన్‌టీని ఎంచుకుంటే కొలెస్ట్రాల్ సమస్య చాలా తక్కువ సమయంలో అదుపులోకి వచ్చేస్తుంది.

'ఆడది గుండు చేయడం ఏంటన్నారు!'

అది పవిత్ర గోదావరి... భద్రాద్రి పుణ్యక్షేత్రం కొలువైన ప్రదేశం. తలనీలాలు సమర్పించే అక్కడి కల్యాణకట్ట ఎప్పుడూ భక్తులతో హడావుడిగా ఉంటుంది. అక్కడ ఓ ముగ్గురు మహిళలు తలనీలాలు తీస్తూ కనిపిస్తారు. మగవారు మాత్రమే ఎక్కువగా కనిపించే అలాంటి చోట పనిచేస్తోన్న లక్ష్మీ, రమాదేవీ, సైదమ్మ కులవృత్తి అని ఇటు రాలేదు. సంసార నావను సాఫీగా సాగించడానికే కత్తి చేతపట్టామంటున్నారు.



కొల్లిపాక సైదమ్మ



జూపాటి రమాదేవి

భద్రాచలంలోని పవిత్ర గోదావరి ఒడ్డున కల్యాణకట్టలో పద్దెనిమిది మంది తలనీలాలు తీస్తుంటారు. వారిలో ఉన్న ముగ్గురు మహిళలే లక్ష్మీ, రమాదేవీ, సైదమ్మ. కల్యాణకట్టలో టికెట్ కొన్నప్పుడు.. ఆ డబ్బులో సగం గుడికీ, మిగతావి తలనీలాలు తీసినవారికి వెళతాయి. ఇలా వచ్చే ఆదాయం అంతమాత్రమే అయినా ఈ మహిళలకు ఆ డబ్బే జీవనాధారం. సైదమ్మ భర్త మద్యానికి బానిసై పదమూడేళ్ల క్రితం అనారోగ్యం పాలయ్యాడు. అప్పటి వరకూ క్షౌరవృత్తి ద్వారా అతను సంపాదించేదే ఇంటికి ఆధారం. కొన్నాళ్లు మంచాన పడ్డాక అతను కన్నుమూశాడు. అప్పటికే ఆమె ముగ్గురు పిల్లల తల్లి. భర్త దూరమయ్యాక కుటుంబభారమంతా ఆమె మీదే పడింది. ఏం చేయాలో దిక్కుతోచని స్థితి. పిల్లల జీవితం ఏమవుతుందోననే ఆందోళన. ఇలాంటి పరిస్థితుల్లో భర్త చేసిన క్షౌరవృత్తి గుర్తొచ్చింది. అలాగని తనకి ఎలా చేయాలో కూడా తెలియదు. కానీ ఆ పని చేయడానికే సిద్ధమైంది. చుట్టుపక్కల వారిని చూసి.. వారి దగ్గర సలహాలు తీసుకుంటూ పనిచేయడం మొదలుపెట్టింది. మొదట్లో చాలామంది ఆమెను వింతగా చూసేవారు. 'ఆడది గుండు గీయడం ఏంటి' అని కొందరు మాట్లాడితే.. మరికొందరు 'ఈమె వద్ద నేను గుండు చేయించుకోను' అనేవారు. పలు అవమానాలూ ఛీత్కారాలు ఎదురైనా కుటుంబం కోసమే అన్నీ భరించింది. అలా రూపాయి రూపాయి కూడబెట్టి ముగ్గురు పిల్లల పెళ్లిళ్లు చేసింది. అప్పుల బాధలున్నా.. ఆర్థిక సమస్యలు ఇబ్బంది పెట్టినా ఆమె అన్నింటినీ తట్టుకుని ఈ పని చేస్తోంది.

పుట్టింటి సాయం తీసుకోలేక... మరో మహిళ కొల్లిపాక లక్ష్మిదీ దీనగాథే. ఈమె భర్త చనిపోవడంతో కుటుంబం రోడ్డుపాలైంది. ఏడాదిపాటు పుట్టింటికే పరిమితమైంది లక్ష్మి. ఎన్నాళ్లని వారికి భారం అవుతుంది. అందుకే తన కొడుకుని సోదరుల వద్ద ఉంచి ఆమె ఒంటరిగా భర్త స్వస్థలమైన భద్రాద్రికి వచ్చింది. ఎక్కడా పని దొరక్కపోవడంతో తన భర్త ఎక్కడైతే పనిచేశాడో అక్కడికే వెళ్లింది. తానూ కల్యాణకట్టలోనే తలనీలాలు తీయడం మొదలుపెట్టింది. 'మొదట్లో చేతులు వణికేవి. కన్నీళ్లు వచ్చేవి. ఏంటి నాకీ పరిస్థితి అని బాధేసేది. కానీ నా కొడుకుని ఉన్నతంగా పెంచాలంటే ఈ పని తప్పదని అలానే ముందుకు వెళ్లా' అనే లక్ష్మి తన బిడ్డని పెద్ద చదువు చదివిస్తోంది. రమాదేవిదీ ఇంచుమించు ఇలాంటి కథే. ఆమె భర్త మరణించే సమయానికి పెద్ద కూతురు ఇంటర్ పరీక్షలు రాస్తోంది. అంత బాధలోనూ కూతుర్ని చదువుకోమని ప్రోత్సహించి పరీక్షా కేంద్రానికి పంపింది. అలా పరీక్షలు రాసిన రమాదేవి కూతురు మంచి మార్కులతో పాసైంది. ఆమె ప్రతిభకు ఓ కళాశాల యాజమాన్యం డిగ్రీ ఉచితంగా చదివించడానికి ముందుకొచ్చింది. అవమానాలూ, ఛీత్కారాలు ఎదుర్కొన్నా వారి కోసం ఆ వృత్తిని మానలేదు.



కొల్లిపాక లక్ష్మి

– నాగేశ్వరరావు, న్యూస్‌టుడే భద్రాచలం



పర్యాటకటకటకట

ప్రపంచ పర్యాటక రంగానికి 2018 సంవత్సరం కొత్త సవాళ్లు విసురుతోంది. కిటకిటలాడుతున్న యాత్రికులతో పర్యాటక కేంద్రాలకు కటకటలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే.. పర్యాటకులను ఆకర్షించడంలో ముందువరుసలో ఉన్న శీతల దేశాలు.. విదేశీ యాత్రికులకు మర్యాదలు చేయలేక సతమతమవుతున్నాయి. ఏడాది పొడుగునా వస్తున్న అతిథులతో ఉపాధి అవకాశాలు మెరుగుపడినా.. అదే సమయంలో పర్యావరణం నాశనమవుతుండం ఆందోళన కలిగిస్తోంది. యాత్రికుల ధోరణి కూడా భారీగా మారిందని పర్యాటక నిపుణులు చెబుతున్నారు. విహార సమయాల్లో భద్రతకు అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విలాసయాత్రలకు కేరాఫ్‌గా నిలుస్తున్న యూరప్... దేశవిదేశాల నుంచి ఊడి పడుతున్న పర్యాటకులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సముద్ర తీరాల్లో లక్షల మంది సేదతీరుతుండటంతో.. వినోదం మాట అటుంచితే.. ప్రశాంతత దొరకడం లేదని కొందరి వాదన. ఫిన్‌లాండ్, గ్రీన్‌లాండ్, అంటార్కిటికా, నార్వే, స్కాట్‌లాండ్, ఐస్‌లాండ్ వంటి దేశాలకు యాత్రికులు లక్షల్లో వస్తున్నారు. ఐస్‌లాండ్ జనాభా సుమారు మూడున్నర లక్షలు. కానీ, గతేడాది ఆ దేశాన్ని సందర్శించిన వారి సంఖ్య 25 లక్షల పైమాటే. పర్యాటకుల రాకతో ఉపాధి, రాబడి బాగానే ఉన్నా.. ఎన్నో ప్రత్యేకతలున్న ప్రదేశాలు మునుపటి సౌందర్యాన్ని కోల్పోతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యాటక విధానంలో వస్తున్న మార్పులు ఇబ్బందులను కలిగించకుండా ఉండాలంటే.. పర్యావరణహిత పద్ధతులను పాటించాలని కోరుతున్నారు.

తస్మాత్ జాగ్రత్త

ట్రెక్కింగ్‌కు వెళ్తున్నారా!

సాహస యాత్రలకు సై అంటున్న యువతీయువకులు వారాంతాల్లో ఎకో టూరిజం పేరుతో బృందాలుగా అడవుల్లోకి వెళ్లిపోతున్నారు. ట్రెక్కింగ్, ర్యాపెలింగ్, రాక్ క్లైంబింగ్ వంటి విన్యాసాలతో ఆటవిడుపు పొందుతున్నారు. సాహస క్రీడల్లో అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. ప్రమాదాలు ఎదురవుతాయి. ఇటీవల తమిళనాడులోని తేని జిల్లాలో చోటుచేసుకున్న కార్చిచ్చు ఘటనే ఇందుకు ఉదాహరణ. వనవిహారం భద్రంగా జరగాలంటే ఈ సూచనలు పాటించండి.

- చాలామంది బృందాలుగా అడవుల్లోకి వెళ్లిపోయి ట్రెక్కింగ్ (పర్వతారోహణ)లో పాల్గొంటూ ఉంటారు. కొన్ని సంస్థలు కూడా ట్రెక్కింగ్‌లు ఏర్పాటు చేస్తూ ఉంటాయి. అయితే ట్రెక్కింగ్ నిర్వహించాలంటే అటవీ శాఖ నుంచి అనుమతి తప్పకుండా తీసుకోవాలి. అనుమతి లభించిన తర్వాతే యాత్రికులను ఆహ్వానించాలి.
- ట్రెక్కింగ్ వెళ్తున్న బృందానికి సారథ్యం వహిస్తున్న వ్యక్తికి తాము వెళ్తున్న ప్రదేశం గురించి అవగాహన ఉండాలి.



- బృందంలో సభ్యుల సంఖ్య చాలా పరిమితంగా ఉండాలి. సభ్యుల సంఖ్య పెరిగే కొద్దీ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశమూ పెరుగుతుంది.
- ట్రెక్కింగ్ మొదలయ్యే ముందు.. అడవిలో వెళ్తున్న దారి, ఎక్కడ ఎలాంటి పరిస్థితులు ఉంటాయి, ఎంత సమయంలో ఎక్కడికి చేరుకోవాలి, ఆహారం, నీటి వసతి వీటన్నిటి గురించి తెలియజేయాలి.
- వైద్య సేవలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త వహించాలి. అత్యవసర పరిస్థితుల్లో వాహనం అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. ప్రాథమిక చికిత్స కిట్ అందరి దగ్గరా ఉండాలి.
- నిర్దేశించుకున్న మార్గంలోనే ట్రెక్కింగ్ కొనసాగించాలి. అంతేకానీ, ముందుగా వెళ్లిపోయిన వారిని అందుకోవాలని అడ్డదారుల్లో ప్రయాణిస్తే ఊహించని పరిణామాలు ఎదురవ్వొచ్చు.
- అడవిలో మంటతో చెలగాటం ఆడటం ఒక్కోసారి తీవ్ర పరిణామాలకు దారి తీస్తుంది. పొగ తాగి.. సిగరెట్ పీకలను ఆర్పేయకుండా పాడేయటం చాలా ప్రమాదకరం. వంట చేసుకున్నా, చలిమంట వేసుకున్నా.. మైదాన ప్రాంతంలోనే చేయాలి. చెట్ల మధ్యలో ఇలాంటి పనులు చేస్తే ఇబ్బందులపాలు కావొచ్చు.


కొత్తగా

నీరంటని సాక్సులు

అడ్వెంచర్ టూరిజం ప్రియులకు సాక్సులతో చిక్కులు తప్పవు. నీళ్లను తాకడంతోనే సాక్సులు తడిచిపోతాయి. ఆ సాక్సులు ఎక్కువ సేపు ధరిస్తే పాదాలు పాడైపోతాయి. ఈ సమస్యకు చెక్ పెడుతూ డెక్స్‌షెల్ సంస్థ వాటర్ ప్రూఫ్ సాక్సులను డిజైన్ చేసింది. మూడు పొరలతో ఉండే ఈ సాక్సులతో నీళ్లల్లో నడిచినా.. పాదాలకు తడి అంటదు. మధ్య పొరలో ఉపయోగించిన ఫ్లెక్సిబుల్ పాలీఅర్థేన్ వాటర్ ప్రూఫ్‌గా పనిచేస్తుంది. వీటి ధర ఐదువేల పైమాటే!



హ్యాపీ హనీమూన్



అమృత రాత్రులు.. అద్భుత యాత్రలు..

వసంత సంతసం..



హనీమూన్‌కు పశ్చిమ బంగలో అనువైన చోటేది అని అడిగితే టక్కున చెప్పే పేరు డార్జిలింగ్. ఇక్కడికి యాభై కిలోమీటర్ల దూరంలో మరో అందమైన ప్రాంతం ఉంది. దాని పేరు కాలింపాంగ్. ఎత్తయిన కొండలు.. వాటిపై బౌద్ధారామాలు.. ప్రశాంతతకు చిరునామాగా ఉంటుందీ ఊరు. ఆమని రాకతో పర్వతాలన్నీ పచ్చటి దుప్పటి కప్పుకొని పసందుగా కనిపిస్తాయి. అరవిరిసిన ఆర్చిడ్ పూలు వసంతగాలికి వలపులు నేర్పిస్తాయి. తీస్తా నది తీరంలో విహారం, కొండల్లో లోయల్లో ప్రయాణం.. కాలింపాంగ్‌కు వెళ్లిన నూతన వధూవరులకు మధురమైన అనుభూతినిస్తాయి. పనిలో పనిగా పక్కనే ఉన్న డార్జిలింగ్‌నూ సందర్శించి రావొచ్చు.

ఎలా వెళ్లాలి

విమాన యానం: కాలింపాంగ్‌కు సమీపంలో ఉన్న విమానాశ్రయం బాగ్‌డోగ్రా. కోల్‌కతా, దిల్లీ నుంచి విమాన సర్వీసులు ఉన్నాయి. బాగ్‌డోగ్రా నుంచి కాలింపాంగ్‌కు 78 కిలోమీటర్లు. ట్యాక్సీలు, బస్సుల్లో వెళ్లొచ్చు.

రైలు మార్గం: కాలింపాంగ్‌కు సుమారు 75 కిలోమీటర్ల దూరంలో జల్పాయ్‌గురి రైల్వేస్టేషన్ ఉంటుంది. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి గువాహటి వెళ్లే రైళ్లు జల్పాయ్‌గురి మీదుగా వెళ్తాయి. అక్కడి నుంచి బస్సులు, ట్యాక్సీలో కాలింపాంగ్‌కు చేరుకోవచ్చు.

విడిది: హనీమూన్ జంటల కోసం కాటేజీలుంటాయి. భారీ హోటళ్లు బోలెడున్నాయి. సిక్కిం వంటకాలు, టిబెటిన్ రుచులు, ఉత్తరాది పదార్థాలు ఆస్వాదించవచ్చు.

అనుకూల సమయం: వర్షాకాలం మినహా ఎప్పుడైనా వెళ్లొచ్చు. వసంత రుతువులో గిరులన్నీ విరులతో విశేషంగా అలరిస్తాయి.

పగడపు దీవుల్లో..

ఎంత హనీమూన్‌కొచ్చినా.. ఆలుమగలిద్దరూ ఒకరినొకరు చూస్తూ ఎంతసేపు కూర్చుంటారు. పిల్లగాలితో అల్లరి చేయొద్దా! చల్లని సముద్ర గర్భంలో దాగిన అందాలు చూడొద్దా! ఇన్ని చేయాలంటే లక్షద్వీప్ వెళ్లాలి! ఈ పగడపు దీవుల్లోని ప్రకృతి సౌందర్యం బాలమిత్ర కథల్లో వర్ణించిన దానికన్నా గొప్పగా ఉంటుంది. అరేబియా సముద్రంలో చెల్లాచెదురుగా ఉన్న ఈ ద్వీపాలకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. మండువేసవిలోనూ గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు దాటదు. సాయంకాలం.. సాగర తీరంలో.. శీతల పవనాలు వీస్తుంటాయి. లక్షదీప్ 36 దీవుల సమూహం. ఇందులో 10 ద్వీపాల్లో మాత్రమే జనాలున్నారు. వీటిలో బంగారం, కడమట్, అగట్టి ద్వీపాలు చాలా బాగుంటాయి. ఒక ద్వీపం నుంచి మరో ద్వీపానికి వెళ్లడానికి ఫెర్రీలు ఉంటాయి. కయాకింగ్, వాటర్ స్కీయింగ్, విండ్ సర్ఫింగ్, స్కూబా డైవింగ్ వంటి సాహసక్రీడలకు వేదికలు ఈ ద్వీపాలు.

విడిది: భారీ రిసార్టులు, కాటేజీలు, రెస్టారెంట్లు, బడ్జెట్ హోటళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి.

అనుకూల సమయం: జూన్-సెప్టెంబర్ మినహా ఏడాదంతా వెళ్లొచ్చు.

ఎలావెళ్లాలి:

విమానయానం: లక్షద్వీప్ చేరుకోవాలంటే ముందుగా కొచ్చిన్ వెళ్లాలి. అక్కడి నుంచి అగట్టి ద్వీపానికి విమాన సర్వీసులు ఉన్నాయి. అగట్టి నుంచి బంగారం ద్వీపానికి స్పీడు బోట్‌లో వెళ్లాలి.

నౌకా విహారం: కొచ్చిన్ నుంచి లక్షద్వీప్ ప్రధాన దీవులకు నౌకలో వెళ్లొచ్చు. అక్కడ విహారం, బస, బోటింగ్ అన్ని కలిపి ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తుంటారు నౌకల నిర్వాహకులు. వీటి ధర రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు (జంటకు) ఉంటుంది.

గూటి పడవలో..

'అలల ఊపులో తీయని తలపులు చెలరేగుతాయ'ని ఓ సినీకవి సెలవిచ్చారు. అలాంటి మధురమైన భావన ఎక్కడ పడితే అక్కడ కలగదు. కొలనులో నీరు నిద్దురోయినట్టే ఉండాలి. కొత్త పెళ్లి కూతురు కుదురుగా కూర్చోవడానికి గూటి పడవ కావాలి. మంచుకౌగిట వణుకుతున్న కొండల ప్రతిరూపాలు.. నీలి నీటిలో తేలాడుతుండాలి. ఇవన్నీ ఉన్నాయంటే అది శ్రీనగర్‌లోని దాల్ సరస్సు అయి ఉంటుంది. మనదేశంలో ఎవర్‌గ్రీన్ హనీమూన్ స్పాట్ శ్రీనగర్.. కొత్త దంపతులకు ఇది ప్రేమ్‌నగర్. మదిని పరవశింపజేసే దాల్ సరస్సు.. ఆ పక్కనే ఊసులు పంచుకోవడానికి షాలీమర్ తోట.. దాని చెంతనే హౌస్‌బోట్లతో నగీన్ సరస్సు.. ఈ ఉత్సాహం నుంచి తేరుకోకముందే తులిప్ తోట.. స్వర్గమిక్కడే అంటుంది. కొత్తకాపురాన్ని దిద్దుకుంటున్న ఆలుమగలకు ఇంతకన్నా అనువైన చోటు ఎక్కడ దొరుకుతుంది చెప్పండి. అందుకే హనీమూన్ అనగానే టూరిస్ట్ ఆపరేటర్లు, ట్రావెల్ సంస్థలు కూడా ముందుగా కశ్మీర్ పేరే చెబుతారు. అందునా శ్రీనగర్ సౌందర్యం ప్రత్యేకమైనది. వేసవి ముహూర్తాల్లో ఒక్కటైన వారు.. మరింత దగ్గరవ్వడానికి ఇంతకన్నా మంచి ప్రదేశం మరొకటి ఉండదు.

ఎలా వెళ్లాలి?

విమాన యానం: హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం నుంచి సింగిల్ స్టాప్, టూస్టాప్ విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

రైలు మార్గం: సికింద్రాబాద్, విజయవాడ, వరంగల్, నెల్లూరు, ఒంగోలు నుంచి జమ్మూ వెళ్లే రైళ్లు (వీక్లీ) అందుబాటులో ఉన్నాయి. జమ్మూ నుంచి శ్రీనగర్‌కు సుమారు 266 కిలోమీటర్లు. బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. ఈ ప్రయాణం భలే పసందుగా ఉంటుంది.

విడిది: శ్రీనగర్‌లో భారీ రెస్టారెంట్లు ఎన్నో. అద్దెకు హౌస్‌బోట్లు లభిస్తాయి. దేశీవిదేశీ వంటకాలు, కశ్మీరీ రుచులు కావాల్సిన రుచులన్నీ లభిస్తాయి.


అనుకూల సమయం: వానాకాలం మినహా ఏడాదంతా వెళ్లొచ్చు.



ఇంకా ఎన్నెన్నో..

హనీమూన్ కేంద్రాలుగా కేరళ నుంచి ఉత్తరాఖండ్ వరకు ప్రసిద్ధ ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. కేరళ బ్యాక్‌వాటర్స్, మున్నార్, కర్ణాటకలో కూర్గ్, మంగళూరు, ఆంధ్రప్రదేశ్‌లో అరకులోయ, మధ్యప్రదేశ్‌లో ఖజురహో, పచ్‌మడీ, రాజస్థాన్‌లో జైసల్మేర్, గోవా, హిమాచల్‌ప్రదేశ్‌లో సిమ్లా, కులు-మనాలి, నైనిటాల్, డల్హౌసి, ఉత్తరాఖండ్‌లో డెహ్రాడూన్, ముస్సోరి ఇలా ఎన్నో పర్యాటక ప్రదేశాలు కొత్త దంపతులకు స్వాగతం పలుకుతున్నాయి.

బంధంలో బందీల్లా..



కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులకు అండమాన్-నికోబార్ దీవులు అద్భుతమైన హనీమూన్ స్పాట్. అందమైన వాతావరణం, రకరకాల మనుషులు, కాస్త హడావుడి.. ఇంకాస్త కలివిడితనం కలగలసిన దీవులివి. బడ్జెట్ లెక్కలు చూసుకునే వారు, డబ్బును మంచినీళ్లలా ఖర్చు చేసే వారు.. ఎవరైనా అండమాన్‌లో జాలీగా గడిపేయొచ్చు. సాహస క్రీడలకు అండమాన్ కేరాఫ్. అండమాన్ రాజధాని పోర్ట్‌బ్లెయర్‌లో దర్శనీయ స్థలాలు ఎన్నో ఉన్నాయి. స్వతంత్ర సమరయోధులను అప్పట్లో బందీలుగా ఉంచిన కాలాపాని జైలును ఇప్పుడు మ్యూజియంగా మార్చారు. రోజూ సాయంత్రం స్వాతంత్ర్య సంగ్రామంపై లేజర్ ప్రదర్శన నిర్వహిస్తారు. పోర్ట్‌బ్లెయర్‌కు 35 కిలోమీటర్ల దూరంలోని హావెలాక్ బీచ్ చాలా అందంగా ఉంటుంది.

ఎలా వెళ్లాలి?

విమాన యానం: హైదరాబాద్, విశాఖపట్టణం నుంచి పోర్ట్‌బ్లెయర్‌కు సింగిల్‌స్టాప్ విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

నౌకా విహారం: విశాఖపట్టణం, చెన్నై నుంచి పోర్ట్‌బ్లెయర్‌కు క్రూయిజ్‌లు కూడా నిర్వహిస్తారు. సుమారు రెండున్నర గంటలు సాగే సాగరయానం మరుపురాని అనుభూతిని కలిగిస్తుంది

విడిది: బడ్జెట్ హోటళ్లు, భారీ రెస్టారెంట్లు, రిసార్టులు ఉన్నాయి. రకరకాల రుచులు లభిస్తాయి. అండమాన్‌లో తెలుగువారు చాలామంది ఉన్నారు. అన్నపూర్ణ మెస్, ఆంధ్రాభోజనం వంటి బోర్డులు చాలానే కనిపిస్తాయి.

అనుకూల సమయం: వేసవిలో కాస్త ఉక్కపోత ఉన్నా.. సాయంత్రాలు మనోహరంగా ఉంటాయి. రుతుపవనాల వేళ అందంగా ఉంటుంది. శీతాకాలంలో అద్భుతంగా ఉంటుంది.

స్మార్ట్ జర్నీ



విహారం మరింత స్మార్ట్ అవుతోంది. ఇండియన్ డిజిటల్ ట్రావెలర్ పరిశోధన ప్రకారం.. విజ్ఞాన, విహార, తీర్థయాత్రలకు వెళ్తున్న వారిలో 71 శాతం మంది స్మార్ట్ ఫోన్ సేవలు వినియోగిస్తున్నారు! వీరిలో తాము వెళ్లాల్సిన ప్రదేశాల గురించి ఆరాతీస్తున్న వాళ్లు కొందరైతే, టికెట్లు బుక్ చేసుకుంటున్న వాళ్లు ఇంకొందరు. 82 శాతం మంది పర్యాటకులు స్మార్ట్‌ఫోన్ సేవలను కొనియాడుతున్నారట. పదిలో తొమ్మిది మంది రివ్యూలు, రేటింగ్‌లు చూసి పర్యాటక స్థలాలను ఎంపిక చేసుకుంటున్నారట.

చుక్‌చుక్ రైల్లో.. భారత్ దర్శన్

సెలవుల్లో జ్యోతిర్లింగ యాత్రకు వెళ్లాలనుకుంటున్నారా? దక్షిణభారత దేశయాత్ర చేయాలనుకుంటున్నారా? భారతీయ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ 'భారత్ దర్శన్' రైలు ఎక్కేస్తే సరి. చుక్ చుక్ రైల్లో వెళ్తూ కావాల్సిన ప్రదేశాలన్నీ చుట్టేసి రావొచ్చు. రైల్వే శాఖ మూడు తాజాగా మూడు ప్యాకేజీలు ప్రకటించింది. ఆ వివరాలు మీ కోసం..

నవ జ్యోతిర్లింగ యాత్ర

10 రాత్రులు, 11 పగళ్లు సాగే ఈ యాత్ర ప్రముఖ శైవక్షేత్రాల మీదుగా సాగుతుంది.

ప్రదేశాలు: భీమశంకర్ (పుణె దగ్గర), నాగేశ్వర్ (ద్వారక దగ్గర), సోమనాథ్, ఉజ్జయిని, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, విఘ్నేశ్వర్ (ఔరంగాబాద్ దగ్గర), ఔంధనాగ్‌నాథ్, పర్లి వైద్యనాథ్

ఎప్పుడు: ఏప్రిల్ 3 నుంచి 14 వరకు

ఎక్కడ ఎక్కాలి: రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఖమ్మం, వరంగల్, సికింద్రాబాద్

ధర: స్లీపర్-రూ.13,020 (ఒక్కరికి), ఏసీ 3 టయిర్- 15,540 (ఒక్కరికి)



గంగ-యమున యాత్ర

11 రాత్రులు 12 పగళ్లు నిర్వహిస్తున్న ఈ యాత్రలో గంగ, యమున నదుల పరీవాహక ప్రాంతాలు చుట్టిరావొచ్చు.

ప్రదేశాలు: ఆగ్ర, మథుర, కొత్తదిల్లీ, హరిద్వార్, అయోధ్య, ప్రయాగ, కాశి, గయ

ఎప్పుడు: ఏప్రిల్ 18 నుంచి 28 వరకు

ఎక్కడ ఎక్కాలి: రేణిగుంట, కడప, యర్రగుంట్ల, గుత్తి, కర్నూలు, మహబూబ్‌నగర్, కాచిగూడ, కాజీపేట, రామగుండం

ధర: స్లీపర్- రూ.11,340 (ఒక్కరికి), ఏసీ 3 టయిర్- రూ.13,860 (ఒక్కరికి)

☛ ప్యాకేజీలో భాగంగా భోజన సదుపాయం, పర్యాటక ప్రదేశాలలో ప్రయాణానికి నాన్ ఏసీ వాహనాలు అందుబాటులో ఉంటాయి. ధర్మశాలలు, డార్మెటరీలో బస ఏర్పాట్లు ఉంటాయి. ప్రయాణికులకు రక్షణ ఇస్తారు. పర్యాటక బీమా సదుపాయం కూడా ఉంటుంది.

మరిన్ని వివరాలకు www.irctctourism.com చూడండి.



దక్షిణ భారత యాత్ర

ఈ యాత్ర 8 రాత్రులు/ 9 పగళ్లు కొనసాగుతుంది. దక్షిణ భారతంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించవచ్చు.

ప్రదేశాలు: తిరుచిరాపల్లి, బృహదేశ్వరాలయం, రామేశ్వరం, మదురై, కన్యాకుమారి, త్రివేండ్రం, గురువాయూర్, శ్రీపురం, తిరుపతి, శ్రీకాళహస్తి

ఎప్పుడు: మే 4 నుంచి 12 వరకు

ఎక్కడ ఎక్కాలి: సికింద్రాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట

ధర: స్లీపర్- రూ. 8,505 (ఒక్కరికి), ఏసీ త్రీ టయిర్- 10,395